ఈనాడు
తూర్పుగోదావరి
గురువారం 4 జనవరి 2018 .. 16 పేజీలు


కోరంగి క్రైస్ట్ కళాశాల, కోరంగి క్రైస్ట్ పీజీ కళాశాల జట్ల మధ్య తుది పోరు

ఆడారు.. అదరగొట్టారు

'ఈనాడు' జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో సీనియర్స్‌లో క్రైస్ట్, జూనియర్స్‌లో శ్రీచైతన్య జట్ల విజయం

-వివరాలు 13లో


రంపచోడవరం ఏఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అజితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బదిలీపై వెళ్తున్న ఏఎస్పీ నయీమ్‌అస్మీ -8లో



'కోడిపందేలు నిర్వహించి తీరుతామని ప్రజాప్రతినిధులు బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు.. వారికి కోర్టు ఉత్తర్వులంటే గౌరవం లేకుండా పోయింది.. కోడి పందేల వల్ల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి.. కోడి పందేలు ఓ జబ్బు.. వాటిపై అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉండదు.. చట్టాన్ని అమలు చేయలేని నిస్సహాయతను కోర్టు దృష్టికి తీసుకొస్తే సమర్థుడైన అధికారిని నియమించమని ప్రభుత్వాన్ని ఆదేశిస్తాం..'

-కోడిపందేలపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై మంగళవారం విచారణ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ధర్మాసనం వ్యక్తం చేసిన ఆగ్రహమిది..

పందెంకోడికి పగ్గాలు పడేనా..?

- జిల్లాలో భారీ ఎత్తున కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు
- అధునాతన హంగులతో కొత్తపుంతలు తొక్కిస్తున్న ప్రజాప్రతినిధులు
- హైకోర్టు ఆదేశాలతో యంత్రాంగం స్పందనపై సర్వత్రా ఉత్కంఠ



న్యూస్‌టుడే, అమలాపురం, ఐ.పోలవరం

జిల్లాలో ఏటా సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణ యథేచ్ఛగా సాగుతున్నా దీనిని అడ్డుకోవడంలో యంత్రాంగం విఫలమవుతోంది. కోడిపందేలపై కఠిన చర్యలు చేపడతామని ఉన్నతాధికారులు **(మిగతా 7లో)**

డీజిల్‌లోనూ కల్తీ దందా

- జిల్లాలో పలు పెట్రోలు బంకుల్లో విక్రయాలు
- నిఘా కొరవడడంతో అక్రమార్కుల ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, రంగంపేట, పెదపూడి

జిల్లాలో ఇంధన కల్తీ యథేచ్ఛగా సాగుతోంది. గతంలో చౌకదుకాణాల ద్వారా సరఫరా చేసే నీలికిరోసిన్‌ను డీజిల్‌లో కల్తీ చేసేవారు. రాయితీ కిరోసిన్ సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో లైట్ డీజిల్ ఆయిల్‌ను ప్రస్తుతం **(మిగతా 7లో)**



CLASSIFIEDS

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

శ్రీ సూర్య ఆయుర్వేద నిలయం, పిఠాపురం. సుప్రసిద్ధ ఆయుర్వేద & పేటెంట్‌మందులకు, కీళ్ళనొప్పుల నివార ణకు, మహాతైలము ప్రాంతాల వారీగా ఏజెన్సీలు ఇవ్వబడును. ✆ 08869-251260.

ప్రముఖ బెలిమార్కెటింగ్ కొరకు డీలర్స్ డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Franchise కొరకు సంప్రదించండి. 8142657223, 040 38163916.

BUSINESS OFFER

R.K.లక్ష్మీబాలజీ పేపర్ ప్రొడక్ట్స్, J.K.K. రాజు మా వద్ద పేపర్ ప్లేట్స్, టేబుల్ రోల్స్, బఫే ప్లేట్స్, డిస్పోజబుల్ ఐటమ్స్, రా మెటీరియల్, మిషనరీ లభించును. 92467 48697, 08821-224631.

తక్కువ పెట్టుబడితో ఇంటివద్ద పుండి అగరబత్తుల కర్పూరం తయారు చేయుటకు మిషిన్లు కలవు బైబ్యాక్ అగ్రిమెంట్‌కలదు. శ్రీవిజయసాయి ఉటర్ పరిశ్రమ లోన్ సౌకర్యం కలదు. సెల్: 7993759171.

హోల్‌సేల్ వస్త్రవ్యాపారులకు మావద్ద ఆల్ శారీస్, డ్రెస్‌మెటీరియల్స్, షూటింగ్ షర్టింగ్స్ మ్యానిఫ్యాక్చరింగ్ కాస్ట్‌కు లభించును. Hyd: 7095930991/ 9121017798/ E/G ద్వారపూడి: 7337530469

సువర్ణావకాశం!! కోడిపాటి పెట్టుబడితో ఎటువంటి రిస్క్ లేకుండా, అతితక్కువ సమయంలో మంచి ఆదాయ అవకాశం. సంప్రదించండి సెల్: 87907 52331.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్ అగరబత్తి తయారీ మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నెల 20 వేలు ఆ౹ బై బ్యాక్ అగ్రిమెంట్, (నో చార్జెస్). సైల ఇంజినీరింగ్, వైజాగ్ - 77940 62711.

గోల్డ్ బిజినెస్ ఆఫర్: చాయ్‌బాబు చాయ్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్స్ & టీ స్టాల్స్ కొరకు సంప్రదించండి. ★ అమలాపురం మరియు విశాఖపట్నం. Contact: 90141 42345.

EDUCATION

శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫైర్ & సేఫ్టీ, ల్యాండ్ సర్వే, JCB, ప్రొక్లెయిన్, క్రేన్, ఫోర్క్ లిఫ్ట్, వెల్డింగ్, A/C మెకానిక్, ఆపరేటర్ ట్రైనింగ్, కోర్సు తర్వాత జాబ్ లభించును. హాస్టల్, ఫుడ్ కలదు. రైల్వేస్టేషన్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ ATM పైన రాజమండ్రి. ✆ 99668 41177.

Hotel Management కోర్సు Training తదుపరి Full/Part Time Placements అవకాశం. MJS College, NAD, Vizag. Ph: 9701834288

HEALTH CARE

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యంలేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర 79953 92747, 96030 55647.

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరగడానికి, తగ్గడానికి, జాయింట్ పెయిన్స్‌కు. రాజమండ్రి- మెట్రోలాడ్జి, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతినెల 3, 17 తేదీల్లో & కాకినాడ:- శ్రీరామ్‌ప్యాలెస్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతినెల 4, 18 తేదీల్లో.

AYURVEDIC

పిఠాపురం శ్రీ సూర్య ఆయుర్వేద నిలయం, Dr. P.సీతారామయ్య, G.C.I.M (ఆయుర్వేద), M.B.B.S. ఆధునిక ఆయుర్వేద వైద్య నిపుణులు, 60 సం౹౹ అపూర్వ అనుభవం, కీళ్ళ వ్యాధులు, అస్థిరోగాల వ్యాధుల నివారణకు. ✆ 08869-251260.

MARRIAGE SERVICES

"కాపు" వివాహ సంబంధములు మా ప్రత్యేకత (ప్రథమ, ద్వితీయ, ఆలస్య). సంప్ర: అమరావతి మ్యారేజ్ లైన్స్, Rjy, Kkd, Eluru, ✆ 93985 35141 & 95814 96425.

PEOPLE CARE

OLD AGE HOME

విజయ్ ఓల్డేజ్ హోం & హోంకేర్ సర్వీస్. వృద్ధులు, మంచాన ఉన్నవారికి 24 గం౹౹ సేవలు చేయుటకు ఆయా/ అటెండర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 99121 73322, 99124 53322.

REAL ESTATE

రాజమండ్రి రూరల్, కవలగొయ్యి, లాలాచెరువు, పోలీస్ క్వార్టర్స్ వెనుక స్థలములు కొనబడును, అమ్మబడును. Contact Cell: 98664 82997, 91107 24678.

FLAT FOR SALE

రాజమహేంద్రవరంలో అందరికీ అందుబాటు ధరలో 2 BHK & 3 BHK ఫ్లాట్స్, విల్లాస్ ఇప్పుడు ఎ.వి.అప్పారావు రోడ్ అతి చేరువలో నిర్మిస్తున్నాం. Sft. కేవలం రూ.2,000/- మాత్రమే. సంప్ర 98482 16123.

రాజమండ్రి రాజా థియేటర్ వద్ద P&T కాలనీనందు అపార్ట్‌మెంట్‌లో 2B/R ఫ్లాట్ అమ్మకం. (నో బ్రోకర్స్) సంప్ర: ✆ 94939 67927 & 92466 57576.

28 లక్షలకే 2 BHK & 3 BHK S/F & N/F Flats కాకినాడ, గోకుల గుడి వెనుక, వివేకానంద స్కూల్ రోడ్ కల్వర్ట్ దగ్గరలో అన్నివసతులతో గృహప్రవేశానికి రెడీగా ఉన్నవి అమ్మకమునకు కలవు. ✆ 92474 61155, 94942 56858.

HOUSE FOR SALE

At Vizag House with VUDA LP No. Construction Cost Per Sft. Rs. 1499/- Plots Avl 90, 167, 180, 200, 267 Sq.Yds. (1) Near Vizag City at "Y" Jn., Near IIM Dorathota Bheemili Road (2) Atchutapuram (3) Pendurthi in Gated Community. 65% Bank Loan. Venugopal, Director, Diamond Home Projects. 7995881655.

PLOT FOR SALE

కాకినాడ, నడకుదురులో అతితక్కువ ధరకే 2 BHK ఇండ్లు మరియు ఇండ్లస్థలములు కలవు. Contact Cell: 99129 81129, 95058 47756.

కాకినాడ, చీడిగలో అతితక్కువ ధరకే ఇండ్లు, ఇండ్లస్థలములు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంక్ లోన్. Contact Cell: 83414 14646, 89277 79999, 98484 53752.

కాకినాడ NH-216 రోడ్ ఆనుకుని మట్లపాలెం మహాలక్ష్మి నగర్ గేటెడ్ కమ్యూనిటీ DTCP మెగా లేఅవుట్ నందు తక్కువ రేట్లకే ఇండ్ల స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సౌకర్యం. శ్రీతేజ హౌసింగ్, కాకినాడ. సెల్: 92466 90817, 98669 78040.

కాకినాడ జగన్నాథపురం MSN చార్టీస్ దగ్గరలో NH-216 రోడ్ ఆనుకుని మరియు కరప పోలీస్‌స్టేషన్ వెనుక DTCP ఇండ్లస్థలములు తక్కువ రేట్లకే అమ్మకం. బ్యాంక్ లోన్ సౌకర్యం. శ్రీతేజ హౌసింగ్, కాకినాడ. సెల్: 98669 78040, 92466 90817.

రాజమండ్రి-కవలగొయ్యినందు 435 చ౹౹గ౹౹ (E&W) రెండు రోడ్లు కలిగి ఉన్న స్థలం. విడిగా గాని, మొత్తంగా గాని అమ్మకం. (నో బ్రోకర్స్). సంప్ర: 94408 51377 & 81436 24444.

ఫ్లాష్.. ఫ్లాష్.. సంక్రాంతి సందర్భంగా తెలుగువారికి ALTURIMA Ramrise వారి మరో నూతన వెంచర్ Opening సందర్భంగా 20,000లకే Open Plots Bookingతో 90% Bank Loan సదుపాయం, అన్ని ఫెసింగ్స్ కలవు (Near నన్నయ యూనివర్సిటీ). Rjy, ✆ 73829 28298, 76748 69519, 76809 67850.

గోదావరి గార్డెన్స్ 30 ఎకరాల లేఅవుట్‌నందు 120 చ౹౹గ౹౹ ఇంటిస్థలం చ౹౹గ౹౹ 1కి రూ.3,800/- లకే పూర్తి డెవలప్‌మెంట్‌తో ఎయిర్‌పోర్ట్‌కి అతి చేరువలో కేవలం 2,50,000లకే స్పాట్ రిజిస్ట్రేషన్. ఆపై E.M.I. పద్ధతిలో చెల్లించవచ్చు. 6 సం౹౹లు ఫ్రీ మెయింటెనెన్స్ ద్వారా తిరిగి ఆదాయం పొందే అవకాశం. ✆ 92466 44806, 77940 16946.

రాజమహేంద్రవరంలో అల్లూరిమా ఇన్‌ఫ్రా వారి నూతన DTCP వెంచర్ నేషనల్ హైవేకు దగ్గరలో GIET, నన్నయ యూనివర్శిటీకి అనుకుని Open Plots, 90% బ్యాంక్‌లోన్, దివాన్‌చెరువు నేషనల్ హైవేకు దగ్గరలో DTCP హౌసింగ్ ప్రాజెక్ట్‌లో అన్ని వసతులతో Independent & Duplex ఇళ్లు (IT Returns లేకపోయినా Loan), ఫ్రీ విజిట్. సెల్: 84639 95599.

కాకినాడ, కలెక్టర్ ఆఫీస్ నుండి 5 Km దూరంలో రామేశ్వరం వయా A.P.త్రయం, ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా 14 ఎ౹౹ DTCP అప్రూవ్డ్ లే-అవుట్‌లో ఇంటి స్థలాలు మరియు గృహప్రవేశానికి రెడీగా ఉన్న 2 బెడ్‌రూమ్ ఇండ్ల కొరకు 1 Lakhతో బుకింగ్, బ్యాంక్ లోన్. ✆ స్వర్ణభూమి రియల్ ఎస్టేట్స్, 70136 94484.

రాజమండ్రిలో వేమగిరి దగ్గర కొండపైన 600 చ౹౹గ౹౹ స్థలం (Plot) అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్ సంప్ర 95423 73962, 9985225064.

JOBS

Wanted Male Marketing Incharge Salary 15000/- pm Two Wheeler Must and Male Class Incharge and Female Telecallers. Cell. 92487 33370.

Req Civil Eng(JR/SR) with 2 to 15 yrs Exp To work in Railway BGLINE Project. ✆ 82973 13335. E-mail: irpinfratech@yahoo.in.

Excellent Career Opportunities for Denties in Gadam Dental. Eligible candidates will get Good Remuneration, Accommodation preference for Couple. Dentists. ✆ 9490399902.

Job Supported Meidcal Coding & CPC Training @ Joshi Medicode, Visakhapatnam, Ph: 9032795333, www.joshimedicode.com.

Hotel SVN Grand, Wanted Receptionist, Sr. Stewards, Captains, Order Taker, Security Guards, Supervisors, Cooks. ✆ 96663 01303, Email: hrkkd@svnhotels.in

RJY-కేశవరం త్రిశక్తి పీఠమునందు జరిగే నిత్య కార్యక్రమాలకు సహాయకులుగా ఉండుటకు 10th చదివిన స్త్రీ, భోజనం + జీతం: 4,000/- & ఆఫీస్ బాయ్ కావలెను. సంప్ర 86399 09797.

DTP ఆపరేటర్, టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు (అనుభవం ఉన్నవారు) కావలెను. రాజమండ్రి, కోటిపల్లి బస్టాండ్‌నందుగల ప్రముఖ విద్యా సంస్థకు. ✆ 73968 15883, 86391 55740.

సరైన ఉద్యోగం కోసం సమయం మరియు డబ్బు వృధా చేస్తూ అలసిపోయారా? కేవలం మూడు నెలల్లో ప్రముఖ కంపెనీలలో ఐచ్చితంగా ఉద్యోగం పొందేందుకు Grow శిక్షణలో జాయిన్ అవ్వండి. లేదా www.grow.org.inలో మీ పేరు నమోదు చేసుకోండి. Rjy: 91777 54681, 84999 03308.

చెన్నైలోని- ఆంధ్రాఫుడ్ డెలివరి స్టోర్‌లో పనిచేయుటకు మేనేజర్స్, హెల్పర్స్, డెలివరి బాయ్స్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వయస్సు: 18-35, జీతం: 9000 - 12000/-. ఫ్రీ భోజనం + వసతి. ✆ 098401 66389, 099400 49814.

రాజమండ్రి, కొలబైరవ గురుసంస్థాన్ మఠంనందు పనిచేయుటకు టెలికాలర్స్ (F), కార్ డ్రైవర్ (M) కావలెను. Contact Cell: 99855 51029.

హర్ష హాస్పిటల్స్, ప్రకాష్‌నగర్, Rjyలో పనిచేయుటకు అకౌంటెంట్, నర్సులు ANM/ GNM, కాంపౌండర్, వాచ్‌మెన్‌లు కావలెను. ✆ 0883-2469403, 2422864.

RJY, ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 88861 55554, 95538 12444.

కార్లో సర్వీస్‌సెంటర్‌లో పనిచేయుటకు లోడర్స్, టెల్లర్స్, ప్యాకింగ్ బాయిస్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (స్త్రీ/పు) కావలెను. జీతం: రూ. 14000 - 19000/- Age: 18-35 లోపు. ✆ 95423 27384.

జాబ్ For Male in MNC, Age: 18 to 26 సం౹౹ (No Fees), Direct జాబ్, సంపాదన 10,000/- with ఫ్రీ హాస్టల్. ✆ 90104 42100.

అమలాపురంలో గల నర్సింగ్ హోంలో పనిచేయుటకు A.O.గా (Male) పనిచేయుటకు వివాహమై, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన లోకల్ అభ్యర్థులు మాత్రమే కావలెను. సెల్: 99080 74343.

సెక్యూరిటీ మార్కెటింగ్‌లో 2సం౹౹ల అనుభవం, కాకినాడలో పనిచేయాలి. ఏదైనా డిగ్రీ, స్వంత వాహనం, మంచి జీతం, అలవెన్సులు, మొబైల్ సౌకర్యం, ఇన్సెంటివ్‌లు పొందవచ్చు. సురభి సెక్యూరిటీ సర్వీసెస్, కాకినాడ ✆ 7995599940

ఉద్యోగం: పవర్ ప్లాంట్, రెడ్డి ల్యాబ్స్, కాల్‌డ్రింక్స్, నికోమెట్, టైల్స్, టెక్స్‌టైల్స్, పేపర్‌మిల్ కంపెనీల్లో - రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, B.Sc. కెమిస్ట్స్, I.T.I. డిప్లొమా, సూపర్వైజర్స్ & సూ౹౹, హెల్పర్స్, జీ౹౹ 16-26 వేలు, భో౹౹రూం ఫ్రీ. ✆ 79935 62898 & 96182 18582.

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఆహ్వానం. బి.పి.రాజు గారి సారథ్యంలో జగదీశ్వరి పామ్ ల్యాండ్ పేరిట శ్రీగంధం వృక్ష సంపదను అందిస్తున్న రాఘవ గ్రూప్ మొదటి వెంచర్ ద్వారకాతిరుమల మండలం జిల్లా, 2వ వెంచర్ తూ౹౹గో౹౹ జిల్లా అన్నవరం దగ్గర నెల్లిపూడిలో పూర్తిచేసి, 3వ వెంచర్‌గా తుని దగ్గర హంసవరం మెయిన్‌రోడ్‌లో అందించబోతున్నాము. ఇందుకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఆహ్వానం. B.P.రాజు, M.D., ఉమానగర్, 12 పంపుల సెంటర్, ఏలూరు. ✆ 77022 29427.

హైదరాబాద్‌లోని ఇళ్ళల్లో 24 గం౹౹లు వృద్ధులకు సేవచేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడ/మగవారు కావలెను. జీతం:10 వేలు. భోజనం+వసతి ఫ్రీ. ✆ 7032025222

రాజమండ్రిలో గల ప్రముఖ సంస్థనందు పనిచేయుటకు "లేడీ టెలికాలర్స్" కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ కలవు. సంప్రదించండి సెల్: 87902 65989.

PROలు కావలెను. రాజమండ్రి పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. విష్ణుప్రియ టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్, Govt. హాస్పటల్ ఎదురుగా, తణుకు. ✆ 99480 47777.

రాజమండ్రి హోమ్‌కేర్ సర్వీస్. వృద్ధులకు, మంచాన ఉన్నవారికి సేవలు చేయుటకు 45 సం౹౹లోపు వర్కర్స్ (M/F) కావలెను. జీతం: 10,000 + వసతి + భోజనం. ✆ 90002 30525.

టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు ఆఫీసు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. స్పాట్ జాయినింగ్. ఫాస్ట్ ట్రాక్ సర్వీసెస్. సంప్రదించండి. ✆ 8520064222.

You Broad Band కంపెనీలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. జీ: 12K Qlf: 10+ Inc ✆ 9502766112, 7386968148.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ అర్జంట్‌గా కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఉచిత వసతి కల్పించబడును. కాకినాడ, Ph: 0884-2388877, Cell: 98850 38504.

రాజమండ్రి, హాస్పిటల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (Male), 12 Hrs మరియు హౌస్‌కీపింగ్ లేడీస్ 6 Hrs డ్యూటీ కావలెను. ✆ 89777 74118, 77028 01786.

కాకినాడలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు హౌస్‌కీపింగ్ కావలెను. PF + ESI సదుపాయం కలదు. Contact: 83338 71236, 70134 06589.

రాజమండ్రిలో ప్రముఖ బ్యాంకు ATMలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Qua: 10th to డిగ్రీ, Age: 25 to 45. Cont: 81793 22381.

MARKETING / SALES

Urgent Openings for Leading Telecom Company in Rajahmundry, Retention Executive (Field/ Office) ✆ 9581586836.

SECURITY GUARDS

సెక్యూరిటీ సిబ్బంది కావలెను. భోజనం+ వసతి కలదు. సంప్ర 8332970550, 9642930025, 9030320007, 9248064121

నెల్లూరు జిల్లాలో రొయ్యలగుంటల నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్‌లు మరియు కావలెను. ఫ్రీరూం, ఫ్రీ భోజనంతో పాటు ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 94948 33654.

TOURS & TRAVELS

18 రో౹౹ అమర్‌నాథ్ & పంచకైలాస యాత్ర అమృత్‌సర్, వైష్ణవిదేవి జమ్ము, నైనాదేవి, చింతపూర్ణి, కాంగ్రా వజ్రేశ్వరి, జ్వాలాముఖి, చాముండా, ధర్మశాల రైల్ యాత్ర తేది: 27-07-18 అన్ని ఖర్చులతో మనిషి ఒక్కరికి 22,999/- Shree Rajesh Travels Vizag. 9347559136, 9963186928.

గోవా కర్ణాటక 20 క్షేత్రాలు జనవరి 19న, శిరిడి+ 5 జ్యోతిర్లింగాలతో 21 క్షేత్రముల యాత్ర జనవరి 29న, శివరాత్రికి రామేశ్వరం 30 క్షే౹౹ ఫిబ్రవరి 7న. ✆ 98662 46466.

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ తూర్పుగోదావరి జోన్ రైతు ధర రూ. 3-85 పై౹౹

★ గోదావరి జోన్ రైతు ధర రూ. 3-85 పై౹౹

శివసదన్‌కు రూ.10 లక్షల విరాళం

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో సత్యగిరిపై నిర్మించనున్న 138 గదుల వసతిగృహ సముదాయం(శివసదన్)కు విరాళాలు ఇచ్చేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే అనేక మంది ఒక్కొక్క వసతి గదికి రూ.9 నుంచి 10 లక్షల వరకు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రాగా విశాఖపట్నంకు చెందిన శ్రీవల్లీ షిప్పింగ్ కంపెనీ అధినేత పోలిన బాబూరావు బుధవారం రూ.10 లక్షలు డీడీని ఈవో జితేంద్రకు అందించారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు. వసతిగదులకు విరాళాలు ఇవ్వడానికి ఇప్పటికే 10 మంది సుమారు రూ.కోటి అందించేందుకు అంగీకారం తెలిపి విరాళాలు అందిస్తున్నారు. మరికొంత మంది దాతల సహకారంతో ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని వసతి సముదాయం నిర్మాణం త్వరలోనే ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నామని ఈవో తెలిపారు.



దాత బాబూరావుతో అన్నవరం దేవస్థానం ఈవో జితేంద్ర తదితరులు

అంధ ఉద్యోగులకు వెసులుబాటు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలోని సర్వశిక్షాభియాన్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించనున్న లూయి బ్రెయిలీ జయంతి వేడుకలో పాల్గొనడానికి జిల్లాలోని అంధ ఉద్యోగులకు వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. ఈ వేడుకలో పాల్గొనే వారికి ఆన్‌డ్యూటీగా ఉన్నట్లు పరిగణించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ అంధుల సమాఖ్య విజ్ఞప్తి మేరకు ఈ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.



మంత్రి యనమలను కలిసిన ఏపీఎన్జీవో సంఘం నాయకులు

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

కాకినాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఎన్జీవోలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి పీఆర్సీ బకాయిలను చెల్లించాలని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుని కోరినట్లు, ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం తెలిపారు. బుధవారం కాకినాడ గ్రామీణ మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉన్న మంత్రి యనమలను బూరిగ ఆశీర్వాదం, ఇతర నాయకులు కలిశారు. పీఆర్సీ బకాయిలతోపాటు కాకినాడలోని ఎన్జీవో భవనంపై అంతస్తు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి జియాఉద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, కాకినాడ నగర అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, కార్యదర్శి పి. మూర్తిబాబు, ఉపాధ్యక్షుడు పి.వి. కృష్ణ, ఎస్. చంద్రరావు, ఎం. వర్మ తదితరులు పాల్గొన్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరిమార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ౹౹లలో)
కొత్తకొబ్బరి	13,800
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ:	
గండేరా	13,000
గటగట	9,000
కొత్తకాయ:	
గండేరా	12,000
గటగట	9,000
నీటికాయ(వెయ్యింటికి):	
పాత(ముక్కుడు)కాయ	12000-13,000
కొత్త(పచ్చి)కాయ	12,000-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలకు	3600
1 కిలోకు	260

రావులపాలెం అరటి మార్కెట్

గెల ఒక్కింటికి

రకం	గరిష్ఠ రూ.	కనిష్ఠ రూ.
కర్పూర	250	100
చక్రకేళి (తెలుపు)	300	120
చక్రకేళి (ఎరుపు)	350	150
అమృతపాణి	300	150
బుషావళి	280	150
దేశవాళీ (కూరఅరటి)	300	150

చికెన్ ధర

కిలోకు రూ౹౹లో (వెన్‌కాబ్)

ఫారంరేటు	84-00
రిటైల్ లైవ్	106-00
డ్రెస్ట్	154-00
స్కిన్‌లెస్	175-00

రొయ్యల ధరలు - అమలాపురం



వనామీ ప్రాన్ (కిలో ఒక్కింటికి రూ.లలో)

కౌంట్	ధర	కౌంట్	ధర	కౌంట్	ధర
20 కౌంట్	660	46-47 కౌంట్	350	73-80 కౌంట్	270
22 కౌంట్	600/560	48-50 కౌంట్	340	82 కౌంట్	260
25 కౌంట్	500	52 కౌంట్	320	83-90 కౌంట్	250
26-30 కౌంట్	440	53-60 కౌంట్	310	92 కౌంట్	240
32 కౌంట్	420	62 కౌంట్	300	93-100 కౌంట్	230
33-40 కౌంట్	370	63-70 కౌంట్	290		
42-45 కౌంట్	360	72 కౌంట్	280		



సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారాలను అందుకొంటున్న మేడిచర్లపాలెం యూపీ పాఠశాల ఉపాధ్యాయిని జి.అరుణకుమారి, వడ్డి శ్రీదేవి (తుని జడ్పీ ఉన్నత పాఠశాల), మద్దుల రాజేశ్వరి (కె.జి.వి.బి. ప్రత్యేకాధికారిణి, తుని), లక్ష్మీ కనకదుర్గ (కె.జి.వి.బి. ఒప్పంద ఉపాధ్యాయిని, తొండంగి), ఎ.వరలక్ష్మీదేవి (హెచ్.ఎం., వేములపల్లి), చిట్టూరి అనురాధా సరస్వతి (సాలిపేట నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, కాకినాడ)

రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీ

ఆనంద్‌నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని రైల్వేస్టేషన్‌ను విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు ఆర్.ధనుంజయులు బుధవారం తనిఖీ చేశారు. ఈనెల 5న రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ జిల్లాకు రానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో బాగంగా ట్రయల్‌రన్‌గా ఈ తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లో క్రూలాబీ, పీడబ్ల్యూఐ కార్యాలయం, ప్లాట్‌ఫాం, బుకింగ్ కౌంటర్లు, రైల్వే క్వార్టర్సు, హెల్త్‌యూనిట్, స్కూలు, నూతనంగా నిర్మిస్తున్న పార్కు, ప్రయాణికుల విశ్రాంతి గదుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. జరుగుతున్న పనులు గురువారం సాయంత్రంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు తదితర విషయాలు నమోదు చేసుకుని సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ఈనెల 5న జిల్లాకు రానున్న జీఎం రాజమహేంద్రవరం, కాకినాడ, సామర్లకోట, అనపర్తి స్టేషన్లను పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజరు చైతన్య, డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్, సీనియర్ డీసీఎం చంద్రశేకర్, ఏడీఈ ఎన్.హరికృష్ణారెడ్డి, స్టేషన్ మేనేజరు ప్రభాకరరావు, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టరు కేశవభట్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో మెకానికల్ విభాగాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎం ధనుంజయులు

దీక్షా శిబిరం ధ్వంసంపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక ఇందిరా సత్యనగర్ వాసులు ఇళ్లకోసం 22 రోజులుగా చేస్తున్న దీక్షా శిబిరాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడం వివాదానికి దారితీసింది. ఇందిరా సత్యనగర్‌లో ఇళ్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ ప్రాంత వాసులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈ శిబిరానికి సంబంధించిన టెంటు, ఫ్లెక్సీలను చించేశారు. స్థానికులు అడ్డుకోవడంతో ఆ వ్యక్తులు పరారయ్యారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగ కార్యదర్శి కొల్లివెలసి హారిక, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.వి.శ్రీనివాసు, లోక్‌సత్తా పార్టీ నాయకుడు ఎం.వి.రాజ్‌గోపాల్, సామాజిక వేత్త దేశిరెడ్డి బలరామనాయుడు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో కలిసి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.



దీక్షా శిబిరం ధ్వంసంపై ఫిర్యాదు చేస్తున్న ఇందిరా సత్యనగర్ పుంత వాసులు

12న ఓడలరేవులో బీచ్ బాడీ బిల్డింగ్ పోటీలు

అమలాపురం, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద, యువజనోత్సవాలను పురస్కరించుకుని ఓడలరేవు సముద్ర బీచ్ రిసార్ట్స్‌లో ఈ నెల కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న సాయంత్రం 4 గంటల నుంచి బీచ్ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. అసోసియేషన్, సముద్ర రిసార్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆరు విభాగాల్లో ఉంటాయని చెప్పారు. ఇందులో విజేతలకు మిస్టర్ కోనసీమ విజేత పేరున నగదు బహుమతి అందివ్వనున్నట్లు వెల్లడించారు.

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలో జనవరి 2 విజేతలు

1. సి.హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మధిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా స్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి.హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్ళారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.



కుటుంబ సమేతంగా సత్యదేవుని దర్శనానికి వచ్చిన రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాంబశివరావు కుటుంబ సభ్యులు, చిత్రంలో అన్నవరం ఈవో జితేంద్ర ఉన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న సాంబశివరావు

అన్నవరం: రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాంబశివరావు బుధవారం కుటుంబ సమేతంగా సత్యదేవుని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వ్రతం ఆచరించిన అనంతరం స్వామి వారిని దర్శించుకోగా వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఈవో జితేంద్ర ఆయనకు ప్రసాదం అందజేశారు.

జన్మభూమిపై దూరదృశ్య సమావేశం

కాకినాడ కలెక్టరేట్: జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి సంబంధించి బుధవారం రాత్రి కలెక్టరేట్ నుంచి సంయుక్త కలెక్టర్-2 రాధాకృష్ణమూర్తి మండల అధికారులతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాలపై ఆరా తీశారు. గురువారం నిర్వహించాల్సిన జన్మభూమిపై పలు సూచనలు చేశారు. వినతులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

జిల్లాలో చేపట్టిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా కాకినాడ రాజాట్యాంకు పార్కులో బుధవారం రాత్రి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లా సాంస్కృతిక శాఖ, సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన జన్మభూమి స్ఫూర్తి కేంద్రంలో ఈనెల 11 వరకూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా బుధవారం పలు ప్రదర్శనలు నిర్వహించారు. రావులపాలేనికి చెందిన వై.నాగలక్ష్మి జానపద గేయాలు ఆలపించారు. లోకేశ్‌శర్మ నృత్య ప్రదర్శన చేశారు. కాకినాడకు చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఇక్కడ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించానున్నారు.



విద్యార్థినుల కూచిపూడి నృత్య ప్రదర్శన



మెల్లగా తెల్లారిందో ఇలా...

రాజానగరం నుంచి రంగంపేట వెళ్లే మార్గంలో బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో కనిపించిన చిత్రమిది. ఓవైపు మంచుకురుస్తుంటే... మరోవైపు భానుడి లేలేత కిరణాలు చెట్లను చీల్చుకుంటూ దివి నుంచి భువికి ప్రసరించాయి. అల్లంత దూరంలో వాహనాలు దగ్గరికొచ్చేవరకూ కనిపించని పరిస్థితి నెలకొంది.

-ఈనాడు, కాకినాడ

పేకాట శిబిరంపై దాడి

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం పోలీసుస్టేషన్ పరిధిలోని తొర్రేడులో పేకాట శిబిరంపై దాడి చేసి 21 మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఏజీఎస్ పార్టీ, రాజానగరం పోలీసులు బుధవారం పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా 10 ద్విచక్రవాహనాలు, రూ.30 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పొగాకు రైతులకు సూచనలు

మిర్తిపాడు(సీతానగరం), న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అనుసరించి యాజమాన్య పద్ధతులను అవలంబించాలని తొర్రేడు పొగాకు వేలం నిర్వహణాధికారి వై.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సీతానగరం మండలంలోని మిర్తిపాడులో బుధవారం పొగాకు రైతులతో ఆయన సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు మొక్కల మధ్య సన్నని నాగలితో దుక్కి చేసుకుంటే గాలిపోసుకుని కొత్తవేరు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సురేంద్రకుమార్, రంగానేతాజీ, వెంకయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోడువారుతున్న మొక్కజొన్న

✦ దిగువకు చేరని సాగునీరు
✦ కొనుగోలు చేసి తడులిస్తున్న రైతులు

న్యూస్‌టుడే, సీతానగరం

రబీ సాగులో మొక్కజొన్న పంటకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. శివారు భూములకు చుక్క నీరు చేరడం లేదు. పంట దెబ్బతినకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. 15 రోజుల కిందట ఎత్తిపోతల నుంచి సాగునీరు వదిలినా ఆ నీరు ఆయకట్టుకు సక్రమంగా చేరక రైతులు తల్లడిల్లుతున్నారు. రబీలో ఆరుతడి పంటలకు సాగునీరు అందించి ఆదుకుంటామనే నేతల మాట నీటి మీద రాతగా మిగిలిపోతోందని రైతులు వాపోతున్నారు.

తొర్రిగడ్డ ఎత్తిపోతలే ఆధారం

సీతానగరం మండలంలోని తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే సాగునీటిపై ఆధారపడి సుమారు 20 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో మొదటి, రెండో తడిపెట్టే సమయం వచ్చింది. ఎత్తిపోతల నుంచి సాగునీరు సక్రమంగా వస్తుందనే ఆశతో రైతులు మొక్కజొన్న పంటను గతేడాది కంటే 15 శాతం



సీతానగరం ప్రధానకాలువలో కనీసం పశువుల కాళ్లు కూడా మునగకుండా వదిలిన నీరు

పెంచి వేశారు. మొదటి తడి సమయంలోనే తొర్రిగెడ్డ నుంచి సాగునీరు నిర్దేశించిన సమయంలో వదలకపోవడంతో చినకొండేపూడి, చీపురపల్లి, పెదకొండేపూడి తదితర ప్రాంతాల్లో ప్రైవేటు బోర్ల నుంచి ఎకరాకు రూ.500 పైబడి చెల్లించి నీటిని కొనుగోలు చేసుకుని పంటను కాపాడుకున్నారు. ఆ తరువాత పంటకాలువలు వదలడంతో సాగునీటి ఇబ్బందులు తప్పాయని అంతా మురిసిపోయారు. పథకం నుంచి వదిలే నీరు కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో దిగువ ప్రాంతాల రైతులు రెండో తడికి ఇబ్బంది పడక తప్పడం లేదు.

ఎకరా పంటకు రూ.3,500

తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకం నుంచి కేవలం ఒక పంపు ద్వారా 120 క్యూసెక్కుల నీటిని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే వదిలి పథకం నిలిపివేస్తున్నారు. దీంతో నీరు ఎగువ ప్రాంతాల్లో రైతులు లూజ్‌మోటార్ల ద్వారా తోడేసుకుంటున్నారు. దిగువకు వచ్చేసరికి పంట కాలువల్లో కనీసం కాలు కూడా మునగడం లేదు. రాపాక, రఘుదేవపురం, ముగ్గళ్ల ప్రాంతాలకు కూడా సాగునీరు సక్రమంగా చేరడం లేదు. ముగ్గళ్లలో రత్నమ్మ చెరువును బోర్లు కలిగిన రైతులు నీటితో నింపడంతో మిగిలిన వారు ఆ నీటిని కొనుగోలు చేసుకుని మొక్కజొన్న పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ఎకరాకు రూ.3,500 వంతున చెల్లిస్తే మొత్తం తడులు పూర్తి అవుతాయని రైతు రుద్రం శ్రీనివాసరావు తెలిపారు. రెండేళ్ల నుంచి తొర్రిగెడ్డ పథకం నుంచి సాగునీరు సక్రమంగా రావడం లేదన్నారు.

పంట బోదెల పూడిక తీత లేదు

తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకం పరిధిలో పురుషోత్తపట్నం, మునికూడలి, రఘుదేవపురం, చినకొండేపూడి నీటి వినియోగదారుల సంఘాలున్నాయి. ఖరీఫ్, రబీ సాగుకు ముందే పంటకాలువలు ఎక్కడ పూడిక తీయాలనే పనులపై ఈ సంఘాలు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి జలవనరులశాఖకు అందించాల్సి ఉన్నా ఆ దిశగా పనులు చేయలేని పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఎత్తిపోతల పథకం నిర్వహణ జలవనరులశాఖకు అప్పగించినప్పటి నుంచి పరిస్థితులు మరింత దిగజారాయంటున్నారు. అంతకు ముందు నీటి సంఘాల సభ్యులు రైతులకు సమాధానం చెప్పేవారని ప్రస్తుతం జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోకవడం లేదని వాపోతున్నారు. దిగువ ఆయకట్టు పరిధిలోని రఘుదేవపురం, ముగ్గళ్ల పంట కాలువల పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉందని, ముగ్గళ్ల నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఓబులునేని కృష్ణచైతన్య అంగీకరించారు. నాలుగు రోజుల వ్యవధిలో పూడిక తీత పనులు పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించేలా పనిచేస్తామన్నారు.



ముగ్గళ్లలో చెరువులోకి చేరిన నీటిని తోడుకునేందుకు ఏర్పాటు చేసిన ఇంజిన్లు

సమస్య నా దృష్టికి వచ్చింది

తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకం నుంచి సాగు నీరు అన్ని ప్రాంతాలకు సక్రమంగా చేరని విషయాన్ని రైతులు నా దృష్టికి తీసుకొచ్చారు. 24 గంటలపాటు పథకం నుంచి పంపులు తిరిగేలా జలవనరులశాఖకు ఆదేశాలు ఇస్తాను. ఒక వేళ నీరు ఎక్కువైతే వారానికి మూడురోజులు పూర్తిస్థాయిలో నీటిని రైతులకు అందించే చర్యలు తీసుకుంటాను. సాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల నుంచి రైతులే నాకు నేరుగా ఫోన్ చేసి పరిస్థితి వివరించొచ్చు. కొంత మంది రైతులు స్పందించి నీటి సమస్యను ఏకరవు పెట్టారు. ఒకటి, రెండు రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తాం.

-పెందుర్తి వెంకటేష్, శాసనసభ్యుడు, రాజానగరం

అభ్యసన సామర్థ్య పరీక్షలు వాయిదా

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నుంచి నిర్వహించాల్సిన అభ్యసన సామర్థ్య పరీక్షలు(స్లాస్) వాయిదా పడినట్లు ఎంఈవో కె.స్వామినాయక్ తెలిపారు. సీతానగరం మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఉదయం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమాల గురించి ఈ పరీక్షలు వాయిదా పడ్డాయన్నారు. 4, 6, 9 తరగతుల విద్యార్థులకు ఎంపిక చేసిన పాఠశాలల్లో బుధవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు జరగాల్సిన అన్ని పరీక్షలు వాయిదాపడ్డాయన్నారు. పరీక్షల తదుపరి తేదీని జిల్లా విద్యాశాఖ ప్రకటిస్తుందన్నారు.



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్ష

దివాన్‌చెరువు(రాజానగరం), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని మంద కృష్ణ మాదిగ తలపెట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతుగా బుధవారం దివాన్‌చెరువు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు ములపర్తి ఏసుమాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు పైడిమళ్ల వనసయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కొడమంచలి వెంకట్రావు, మండల యువజన శాఖ అధ్యక్షుడు ఎం.పల్లి రాజు మాదిగ, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, శివ, విజయ్, వేమగిరి బాలు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోనగూడెం(కోరుకొండ): మండలంలోని పశ్చిమగోనగూడెంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రారంభించిన నిరాహార దీక్షకు మద్దతుగా నాయకులు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మండల శాఖ అధ్యక్షుడు ఖండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి దారా డేవిడ్‌రాజు పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దాల చంటిబాబు, బంటుపల్లి ఏసు, కుమ్మునూరి వీరబాబు, ఖండల్లి గాంధీ, కొల్లి సుబ్బారావు, ఖండవల్లి ప్రకాశం, ఖండవల్లి పంతులు, ఖండవల్లి జీవరత్నం, ఖండవల్లి మహాలక్ష్మి, పి.సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సీతానగరం మండలంలోని రఘుదేవపురంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షలు చేపట్టారు. దీనిపై ఉప సర్పంచి కాండ్రు శ్రీనివాసరావుకు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు సనమండ్ర లాజరు బాబు, చిడిపి స్టాలిన్, కొల్లి రాజు తదితరులు వినతిపత్రం అందించారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

రాజానగరం, న్యూస్‌టుడే: గైట్ పాలిటెక్నిక్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పి.పవన్‌యశ్వంత్, ఎ.వెంకటసాయితేజ, జాతీయ స్థాయి పాలిటెక్నిక్ పోటీలకు టేబుల్ టెన్నిస్ క్రీడల్లో ఎంపికయ్యారని గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.శ్రీనివాసన్ తెలిపారు. కళాశాలలో బుధవారం విజేతలైన విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసన్ మాట్లాడుతూ ఇటీవల ఒంగోలులో జరిగిన 22వ రాష్ట్రస్థాయి అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ క్రీడలో బాలుర విభాగంలో యశ్వంత్, సాయితేజ మంచి ప్రతిభను కనబరిచి రోలింగ్ షీల్డు సాధించారన్నారు. త్వరలో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.



పోటీల్లో రోలింగ్ షీల్డ్ సాధించిన యశ్వంత్, సాయితేజను అభినందిస్తున్న సీఈవో, జీఎం తదితరులు

మందకొడిగా పింఛన్లు

సీతానగరం, న్యూస్‌టుడే: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ నియోజకవర్గంలో మందకొడిగా సాగుతోంది. జన్మభూమి కార్యక్రమాల్లో ఉద్యోగులందరూ పాల్గొనడం, దిగువ సిబ్బంది వారికి సహకరించే పనులు చేయడంతో పింఛన్ల పంపిణీ గందరగోళంగా మారింది. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల సొమ్ము అందుకునేవారంతా మూడు రోజులు గడిచినా అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. బుధవారం నాటికి నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాలు జిల్లాలో పింఛన్ల పంపిణీలో 13వ స్థానంలో ఉన్నాయి.

డ్వాక్రా మహిళల సహకారంతో రైతు గ్రూపులు

సీతానగరం, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నుంచి రైతు గ్రూపులను ప్రోత్సహించే దిశగా తొలుత జిల్లాలో 11 మండలాలను ఎంపిక చేశామని డీఆర్‌డీఏ ఏజీఎం ఎం.ధర్మేంద్ర తెలిపారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని ఏడు మండలాలతోపాటు చింతూరు, కాట్రేనికోన, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో 127 గ్రూపులను ఎంపిక చేశామన్నారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళల ప్రోత్సాహంతో ఆయా కుటుంబాల్లో మగవారితో ఈ రైతు గ్రూపులు ఉంటాయన్నారు. సీతానగరం స్త్రీశక్తి కార్యాలయంలో రుణాల తీరు, చెల్లింపుల విధానాన్ని పరిశీలించేందుకు బుధవారం ఉదయం డీఆర్‌డీఏ నుంచి ముగ్గురు సభ్యుల బృందం విచ్చేసింది. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ డెయిరీ నుంచి ఒక పాడి పశువును తీసుకున్న రైతులకు మరో పాడి పశువును స్త్రీనిధి నుంచి అందిస్తామన్నారు. జిల్లాలో 12 వేల కుటుంబాలకు రూ.100 కోట్ల రుణాలు అందించే లక్ష్యంలో ఇప్పటి వరకు రూ.46.50 కోట్లు ఇచ్చామన్నారు. స్త్రీనిధి జిల్లా మేనేజరు ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ 87,895 మంది సభ్యులు సుమారు రూ.198 కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం స్త్రీశక్తి కార్యాలయంలో ప్రతి రికార్డును పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీ రామోజీ, వెలుగు ఏపీఎం పి.బాబూరావు, జయరాజ్, బాపనమ్మ, ఆశాదేవి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



స్త్రీశక్తి కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

రాజానగరం

ఆర్టీవో ఆన్‌లైన్ సేవా కేంద్రం ప్రారంభం

దివాన్‌చెరువు(రాజానగరం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, అందులో భాగంగానే రవాణా శాఖకు సంబంధించిన సేవలు స్థానికంగా పొందేందుకు వీలుగా ఆర్టీవో ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని దివాన్‌చెరువులో ఏర్పాటు చేశామని శాసనసభ్యుడు పెందుర్తి వెంకటేష్ అన్నారు. దివాన్‌చెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్టీఏ ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని బుధవారం ఆర్టీవో సిరిఆనంద్‌తో కలిసి శాసనసభ్యుడు పెందుర్తి వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కేంద్ర నిర్వాహకులు ప్రజలకు అందించే సేవల విషయమై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తన నియోజకవర్గ పరిధిలోని సీతానగరం, కోరుకొండ మండలాల్లో కూడా ఇటువంటి సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ఆర్టీవో సిరిఆనంద్ మాట్లాడుతూ ఆర్టీవో కార్యాలయంలో పొందే సేవలను దివాన్‌చెరువులో ఏర్పాటు చేసిన ఆర్టీఏ ఆన్‌లైన్ సేవా కేంద్రం ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కొల్లం రత్నం, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు వంక మల్లిబాబు, మండల టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్లు ఐ.సాయినాథ్, ఆర్.ప్రవీణ్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఏ ఆన్‌లైన్ సేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిత్రం



ఫరిజల్లిపేట సభలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు పెందుర్తి వెంకటేష్



విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించి బహుమతులు అందజేస్తున్న సబ్‌కలెక్టర్



దోసకాయలపల్లిలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టరు శ్రీరామచంద్రమూర్తి

సంక్షేమ ఫలాల సద్వినియోగానికే జన్మభూమి

సబ్‌కలెక్టర్ సాయికాంత్ వర్మ

రాజానగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు చేరేందుకే జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రామహేంద్రవరం సబ్ కలెక్టర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మండలంలోని కానవరంలో బుధవారం జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ వికాసాన్ని పొందాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అందిస్తే వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి అధికారులు పరిష్కారం చూపిస్తారన్నారు.

గోదావరి జలాలు అందిస్తాం

పరిజల్లిపేట సర్పంచి ఉండమట్ల రాజబాబు అధ్యక్షతన ఆ గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో శాసనసభ్యుడు పెందుర్తి వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ గ్రామానికి త్వరలోనే చక్రద్వారబంధం నుంచి పైపులైన్ వేసి గోదావరి జలాలను అందిస్తామన్నారు. గ్రామంలో ప్రతి సమస్యను పరిష్కరించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల అమలులో రాజీ పడడం లేదన్నారు. అనంతరం చంద్రన్న కానుకలు, నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో బాలికలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి సబ్‌కలెక్టర్, శాసనసభ్యుడి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

✦ మండలంలోని చక్రద్వారబంధం, పలకడియం గ్రామాల్లో బుధవారం జన్మభూమి - మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బృందం ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించింది. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు కొల్లం రత్నం, తహసీల్దారు అనంతలక్ష్మీసత్యవతీదేవి, డిప్యూటీ తహసీల్దారు రామకృష్ణ వివిధ శాఖల మండల తెదేపా నేతలు తోటకూర నాగేశ్వరరావు, నూనె వెంకన్న, బత్తుల త్రిమూర్తులు, సంగిత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 4 పంచాయతీల్లో...

సీతానగరం: జన్మభూమి కార్యక్రమాలు మండలంలోని నాగంపల్లి, సీతానగరం, రఘుదేవపురం, కూనవరం పంచాయతీల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని ఎంపీడీవో దబ్బాడ శ్రీనివాసరావు తెలిపారు. జన్మభూమి ప్రత్యేకాధికారి శ్రీరామచంద్రమూర్తి, శాసనసభ్యుడు పెందుర్తి వెంకటేష్ ఈ కార్యక్రమాలకు హాజరవుతారన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

నిడిగట్ల(కోరుకొండ): పేద ప్రజల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయమని శాసనసభ్యుడు పెందుర్తి వెంకటేష్ అన్నారు. మండలంలోని నిడిగట్లలో బుధవారం జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోసకాయలపల్లిలో సర్పంచి కర్రి సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు శ్రీరామచంద్రమూర్తి పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యంపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతికి కోడిపందేలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పీఆర్ భగవాన్, కర్రి సత్యవతి, మార్ని రాము, మింగి లక్ష్మీనారాయణ, తెలగంశెట్టి శ్రీను, మాతా సీతారాముడు తదితరులు పాల్గొన్నారు. అలాగే జంబూపట్నంలో సర్పంచి నాగా సత్యనారాయణ అధ్యక్షతన, నరసాపురంలో నొక్కి అప్పారావు అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తనకాల నాగేశ్వరరావు పాల్గొని ప్రభుత్వ పథకాలను అర్హులైనవారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామసభల్లో తహసీల్దారు రియాజ్ హుస్సేన్, మల్ల అప్పలనరసారావు, బుద్ధా బాపూజీ, నాగా రమేష్, రాయపాటి సత్యనారాయణ, కట్టా సత్తిబాబు, కృష్ణ, చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.



స్త్రీశక్తి కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్త

వీరికే లేదు.. ఊరికట

సీతానగరం, న్యూస్‌టుడే: జన్మభూమి మా ఊరు కార్యక్రమాల్లో డ్వాక్రా మహిళలను, విద్యార్థులను భాగస్వాములను చేసి స్వచ్ఛతపై ఇంటింటా ప్రచారం చేయిస్తున్నారు. వీరి అవగాహన ప్రచారం ఎలా ఉందంటే ఇంటిని సరిచేసుకోలేనివాడు ఊరంతా పెత్తనం అన్నట్లు ఉందంటున్నారు. సీతానగరం మండలంలో పలు చోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లోనే పరిశుభ్ర వాతావరణ లేదు. డ్వాక్రా సభ్యులు పరిశుభ్రతపై ప్రచారం చేస్తున్నారు. మరోవైపు వారు విధులు నిర్వహించే స్త్రీశక్తి కార్యాలయం వద్దనే ఇరుగుపొరుగు వారంతా చెత్త తీసుకొచ్చి పోసేస్తున్నారు. విపరీతమైన దుర్గంధం ఆ ప్రాంతంలో నెలకొంది. విద్యార్థుల పరిస్థితి అదే మాదిరిగా ఉంది. రాపాక పాఠశాల ప్రహరీ గోడను ఆనుకుని మురుగుకాలువ పూడికతీయకపోవడంతో మధ్యాహ్న భోజనం కూడా తినలేని పరిస్థితులు ఉన్నాయంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులంతా ఇంటింటా మరుగుదొడ్డి ఆవశ్యకతను వివరిస్తున్నారు. అయితే ఇలా ప్రచారం నిర్వహించే విద్యార్థులకు వారి కళాశాలలోనే మరుగుదొడ్లు లేవు. మరోవైపు జన్మభూమి కార్యక్రమాల్లో విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు పెట్టారు. క్రీడామైదానాల అభివృద్ధి పేరుతో ఉపాధి నిధులు రూ.లక్షలు ఇచ్చి ఉన్న మైదానాలను చెడగొట్టారు.



రాపాక పాఠశాల వద్ద మురుగుకాలువ

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

సీతానగరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో కూలీల భాగస్వామ్యం పెంచి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో దబ్బాడ శ్రీనివాసరావు ఆదేశించారు. సీతానగరం మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఉదయం ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో సుమారు 7,500కు పైగా వేతనదారులుంటే కేవలం 177 మంది మాత్రమే రావడం శోచనీయమన్నారు. మెటీరియల్ వాడకానికి వచ్చేసరికి 40 శాతం దాటిపోయిందన్నారు. ఆడిట్ పూర్తికాకపోవడం వల్ల కొన్ని పనులు చేసేందుకు వీలులేకుండా పోయిందని ఆ పథకం ఏపీఎం వందే సురేష్‌కుమార్ అన్నారు. బయట పనులకు అధిక కూలీ రావడంతో ఉపాధి పథకం వైపు తగ్గారన్నారు. మార్చిలోపు 1.72 లక్షల పనిదినాలను పూర్తిచేయాల్సి ఉందని నిర్దేశించిన పనిదినాలు పూర్తిచేశామని అయితే సీసీ రహదారులకు మెటీరియల్ వాడకం ఉండడంతో పనిదినాలు పెంచాల్సి వస్తోందన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

రాజానగరం గ్రామీణం, న్యూస్‌టుడే: డిసెంబర్ 31వ తేదీ తెల్లవారు జామున రాజానగరం వైఎస్ఆర్ జంక్షన్‌లో అల్లరిమూకలు నివాసాలకు నిప్పుపెట్టడంతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు బుధవారం వైకాపా రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి ఒక్కో బియ్యం బస్తా, వంట, కిరాణా సామగ్రి, దుప్పట్లు, బిందెలు అందించారు. బొడ్డు బూరమ్మ, నెల్లూరి వెంకటలక్ష్మి, జామి వరలక్ష్మి కుటుంబాలకు ఈ సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మందారపు వీర్రాజు, దూలం పెద్ద, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, సంగీత ప్రసాద్, పిడుగు శ్రీను, ఆకుల శ్రీను, ఆచంట రాజా, కాకర్ల వీర్రాజుచౌదరి, సంగీత సత్తిబాబు, జి.అన్నవరం, ఎమ్.అమ్మిరాజు, వెంకట్, సూరిబాబు, కె.శ్రీను, అచ్చిబాబు మహేష్, మార్గాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా

జన్మభూమిలో సాంస్కృతిక క్రీడలు నిర్వహించాలి

రాజానగరం గ్రామీణం: ప్రభుత్వ ఆదేశాల మేరకు జన్మభూమి మా ఊరు కార్యక్రమాల్లో సాంస్కృతిక క్రీడలు నిర్వహించాలని జిల్లా క్రీడా విభాగ అధికారి సయ్యద్ సాహెబ్ పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమాల్లో నిర్వహిస్తున్న క్రీడలను సమీక్షించడానికి ఆయన బుధవారం రాజానగరం ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ సంప్రదాయ ఆటలైన త్రోబాల్, తొక్కుడు బిళ్ల, కోతి కొమ్మచ్చి, గోలీబిల్ల, ఖోఖో తదితర ఆటలను ప్రవేశపెట్టాలన్నారు. ఇప్పటికే చెస్ బోర్డులు తదితర సామగ్రి అందుబాటులోకి వచ్చాయన్నారు. మండలానికి మంజూరైన క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో జిల్లా క్రీడా విభాగ అధికారి సాహెబ్

కాకినాడ నగరం

చలనచిత్రాలు **తిరుమల** - జుమాంజీ, **వీర్‌కమల్‌**- 2 కంట్రీస్‌, **ఆనంద్‌**- 2 కంట్రీస్‌, **అంజని** - ప్రాజెక్ట్‌ జెడ్‌, **సంగీత్‌**- ఒక్కక్షణం, **గీత్‌**- జుమాంజీ(మార్నింగ్‌ షో, మ్యాట్నీ), టైగర్‌ జిందాహై(ఫస్ట్‌ షో, సెకండ్‌ షో), **దేవీస్క్రీన్‌ 1**- ఎంసీఏ, **దేవీస్క్రీన్‌ 2**- ఒక్కక్షణం, **దేవీస్క్రీన్‌ 3**- 2 కంట్రీస్‌, **శ్రీప్రియ**- ఎంసీఏ, **పద్మప్రియ** - హలో, **సిఅండ్‌సి 1**- ఎంసీఏ, **సిఅండ్‌సి 2**- హలో, **లక్ష్మి** - ఒక్కక్షణం, **సత్యగౌరి** - గృహం.

నిన్నటి మార్కెట్‌ ధరలు (కిలో 1కి ధర రూ.లలో)

టమోటా-26, వంకాయలు-22, బెండకాయలు-22, బీరకాయలు-34, దొండకాయలు-28, కాకరకాయలు-24, పచ్చిమిరప-24, 30, క్యాబేజీ-40, క్యారెట్‌-46, కాలీఫ్లవర్‌-10, బీట్‌రూట్‌-40, చిక్కుడు-28, గోరుచిక్కుడు-24, దోసకాయ-12, ఆనపకాయ-8, 12, ఉల్లి-39, 44, బంగాళాదుంపలు-12, అల్లం-48.



వేడుకల్లో పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు

సావిత్రిబాయిపూలే జయంతి

న్యూస్‌టుడే, జగన్నాథపురం: ఎం.ఎస్‌.ఎన్‌ పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ జి.రాజకుమారి, ఐద్వా నాయకులు పి.వేణి అధ్యక్షత వహించారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు భవానీ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే మొట్టమొదటి మహిళ టీచరుగా స్ఫూర్తిదాయక సేవలు అందించారు. ప్రభుత్వం మహిళలకు మరిన్ని ప్రోత్సాహకాలు అందివ్వాలన్నారు.
కాకినాడ కలెక్టరేట్‌: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతిని బుధవారం ర.భ.శాఖ అతిథి గృహంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ ఐకాస రాష్ట్ర కన్వీనర్‌ చొల్లంగి వేణుగోపాల్‌ మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి విద్య ఒక్కటే మార్గమని జ్యోతిరావు పూలే నమ్మారన్నారు. అందుకు తన సతీమణి సావిత్రిబాయిపూలేను విద్యావంతురాలు చేసి, తను స్థాపించిన పాఠశాలలో మహిళలకు విద్యాబోధన చేయటానికి ఆమెను నియమించారన్నారు. కార్యక్రమంలో వాసంశెట్టి రాజేశ్వరరావు, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి భాస్కరగణేశ్‌బాబు, ఇరుసుమళ్ల విష్ణు, కడలి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిజర్వేషన్‌ వివరాలు



న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్‌: జిల్లా మీదుగా బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల్లో రిజర్వేషన్‌ చేసుకోవడానికి సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్‌ పి.భాస్కరరావు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌, అడ్వాన్స్‌ బుకింగ్‌, సంబంధిత రిజర్వేషన్‌ కౌంటర్లలో టికెట్లు తీసుకోవచ్చని సూచించారు.

రూటు	4వతేదీ	5వతేదీ	6వతేదీ	7వతేదీ
బెంగళూరు ఏసీ	63	74	66	46
హైదరాబాద్‌ ఏసీ	72	68	75	64
హైదరాబాద్‌ నాన్‌ ఏసీ	170	180	180	180

✦ అర్బన్‌ సీడీపీవో కార్యాలయ పరిధిలో 160 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి

✦ ఈ కేంద్రాల్లో 300 మందికి పైగా కార్యకర్తలు, ఆయాలు పనిచేస్తున్నారు. వీరికి సీడీపీవో, ఇతర సిబ్బంది అదనం.

✦ నాలుగు వేల మంది వరకూ బాలింతులు, గర్భిణులకు ఈ కేంద్రాల్లో సేవలు అందిస్తున్నారు

✦ 6,400 మంది వరకూ 0-5 ఏళ్లలోపు పిల్లలు ఈ కార్యాలయ పరిధిలో విద్య అభ్యసిస్తున్నారు.

ఎట్టకేలకు సొంత భవనం

✦ నిర్మాణం పూర్తయిన సీడీపీవో కార్యాలయం

✦ త్వరలోనే ప్రారంభోత్సవం

ఐసీడీఎస్‌ అర్బన్‌ సీడీపీవో కార్యాలయానికి సొంత భవనం సమకూరింది. మూడు దశాబ్దాలుగా ఈ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. చాలీచాలని వసతుల్లోనే అటు అధికారులు, ఇటు సిబ్బంది విధులను నిర్వర్తిస్తూ వచ్చారు. వేరే భవనంలోకి మారుదామంటే అద్దెలు ఎక్కువగా ఉండటం.. ప్రభుత్వం చెల్లించే అద్దెలకు అనుగుణమైన భవనం దొరకపోవటం వంటి కారణాలతో అలాగే నెట్టుకొచ్చారు. ఎట్టకేలకు సొంత భవనం సమకూరటంతో సిబ్బందిలో ఆనందం వ్యక్తమవుతోంది.



డెయిరీ ఫారంలో నిర్మించిన అర్బన్‌ సీడీపీవో కార్యాలయ భవనం

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

కాకినాడలో అర్బన్‌ సీడీపీవో కార్యాలయం 1987లో ఏర్పాటైంది. అప్పటి నుంచీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇప్పటికి రెండు భవనాల్లోకి కార్యాలయం మారింది. ప్రస్తుతం ప్రతాప్‌నగర్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న భవనం అరకొర వసతులతో ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందికి, కార్యాలయ నిర్వహణకు ఇది చాలడం లేదు. అయితే కార్యాలయానికి సొంత భవనం లేకపోవటంతో విధులు నిర్వహించేందుకు సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు ఇబ్బందిపడేవారు. అద్దెభవనం కావడం, సరిపడా గదులు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పైగా గోదాముకు కూడా వసతి లేకపోవడంతో పిల్లలకు సరఫరా ఆహార పదార్థాలను భద్రపరిచేందుకు అదనంగా మరొక గదిని తీసుకోవాల్సి వచ్చేది. గతంలో సొంత భవన ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే గృహకల్పకాలనీలో భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. భవన నిర్మాణానికి రూ.40లక్షలు నిధులు కూడా మంజూరు చేశారు. దాంతో గతేడాది సెప్టెంబరు 14న భవన నిర్మాణానికి భూమి పూజచేశారు. ప్రస్తుతం పనులు పూర్తయ్యాయి. కార్యాలయ భవనంతోపాటు, దానికి అనుసంధానంగా సరకులు నిల్వచేసుకునేందుకు గోదామును కూడా నిర్మించారు. భవన అంతస్తుపై సమావేశానికి హాలు నిర్మించారు. త్వరలోనే మహిళా శిశు, సంక్షేమ శాఖా మంత్రిని తీసుకొచ్చి భవనాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు.

ఆనందంగా ఉంది...



అర్బన్‌ సీడీపీవో కార్యాలయ భవనానికి సొంత భవనం సమకూరడం ఆనందంగా ఉంది. ఇంతకాలం అరకొర వసతులతో ఇబ్బంది పడ్డాం. అందరికీ అందుబాటులో ఉన్న ప్రాంతంలో భవనాన్ని నిర్మించడం సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే కృషితో కార్యాలయం సమకూరింది. కార్యాలయానికి ప్రహరీ సదుపాయం, అంతస్తుపై సమావేశాలు నిర్వహించుకునేలా ఫ్లోరింగు, ఇతర సదుపాయాలు అందుబాటులోకి వస్తే మరింత ప్రయోజనం కలుగుతుంది. కల్పించాలి. ఆ దిశగా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

- పంతం సావిత్రి, సీడీపీవో, కాకినాడ

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

గాంధీనగర్‌, న్యూస్‌టుడే: విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, దశల వారీగా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, లేకుంటే ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్‌ విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం లంచ్‌ అవర్‌లో డివిజనల్‌ ఇంజినీర్‌ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డీఈ జి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ సమితి కాకినాడ డివిజన్‌ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌, కార్యదర్శి వి.శ్రీనివాస్‌, టి.శ్రీనివాస్‌, పి.సతీష్‌, శివరామకృష్ణలు మాట్లాడుతూ విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న కార్మికులందరినీ విద్యుత్‌ సంస్థలో విలీనం చేసుకుని నేరుగా జీతాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పునుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని దశల వారీగా విద్యుత్‌ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకుంటే ఈనెల 20 నుంచి కలెక్టరేట్‌ వద్ద రిలే నిరాహార దీక్షలు, 27వ నుంచి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు ఆకుల దొరబాబు, టి.తులసి, ఎస్‌.బసవేశ్వరరావు, ఎన్‌.రాహుల్‌, భాస్కర్‌, శివకృష్ణ, వీరనాగు, కుమార్‌, బాలకృష్ణ, సతీష్‌, కంప్యూటర్‌ ఆపరేటర్లు, షిఫ్ట్‌ ఆపరేటర్లు, పీక్‌ లోడ్‌ స్టాఫ్‌, బిల్‌ రీడర్లు పాల్గొన్నారు.



డీఈ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యుత్తు ఒప్పంద ఉద్యోగులు

బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలని నగరపాలక సంస్థ భాజపా ఫ్లోర్‌ లీడర్‌ సాలిగ్రామ లక్ష్మీప్రసన్న కోరారు. ఇందుకు బ్రాహ్మణ కార్పొరేషన్‌ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. బ్రాహ్మణ కారొరేషన్‌ నుంచి రుణం పొందిన పసుమర్తి సత్యనారాయణ కాకినాడలో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గృహోపకరణాలు, సాంప్రదాయ వంటకాలకు సంబంధించిన ఆ స్టాల్‌ను బుధవారం లక్ష్మీప్రసన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రాహ్మణులు వ్యాపారం రంగంలో కూడా రాణించాలని కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ అందించే ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకుని పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సోమసుందరం తదితరులున్నారు.

ఏపీఎస్పీ సిబ్బందికి ఎస్‌డీఆర్‌ఎఫ్‌ శిక్షణ

సర్పవరంజంక్షన్‌, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి సహాయం అందించడానికి 3వ ఏపీఎస్పీ సిబ్బందికి ఎస్‌డీఆర్‌ఎఫ్‌ శిక్షణ ఇస్తున్నామని కమాండెంట్‌ జె.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం కాకినాడలో జిల్లా కలెక్టర్‌ కార్తికేయ మిశ్రాను కమాండెంట్‌ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమాండెంట్‌ మాట్లాడుతూ ఏపీఎస్పీ సిబ్బందిలో 100 మందికి శిక్షణ ఇచ్చామని, జిల్లా అవసరాలకు వీరిసేవలు వినియోగించుకోవాలని కలెక్టర్‌కు తెలిపామన్నారు.



పెద్దమార్కెట్‌ కూడలిలో రక్షణకంచె లేని నియంత్రిక

భయపెడుతున్నాయ్‌....

నిత్యం రద్దీగా ఉండే కాకినాడ కూడళ్లలో ఉన్న విద్యుత్తు నియంత్రికలకు రక్షణ కంచెలు లేవు. విద్యుత్తు తీగల నుంచి మంటలు వస్తుండడంతో స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదాలు జరగకముందే వీటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కొన్నిచోట్ల విద్యుత్తు ఫీజు బాక్సులు ప్రమాదాలు ఆహ్వానిస్తున్నాయి.

- ఈనాడు, కాకినాడ



జగన్నాథపురం వంతెన నడకదారిలో



జ్యోతుల మార్కెట్‌ వద్ద మంటలు వ్యాపిస్తున్న విద్యుత్‌ నియంత్రిక

కాకినాడ నగరం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేళంగి(కరప): కరప మండలంలోని వేళంగి గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. జి.భావవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళుతూ ఆర్టీసీ బస్సును ఢీకొని గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఫణీశ్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ద.మ. రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా జిల్లా, కాకినాడ ప్రయాణికుల సంఘం కార్యదర్శి అడ్డూరి ఫణీశ్ నియమితులైనట్లుగా సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పదవిలో ఫణీశ్ రెండేళ్లపాటు కొనసాగుతారన్నారు. ఈయన నియామకం పట్ల వైడీ రామారావు, సభ్యులు అభినందనలు తెలిపారు.

జన్మభూమితో ప్రజలకు మేలు: ఎమ్మెల్యే



గర్భిణులకు చీర, సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే వనమాడి, మేయర్ పావని, కమిషనర్ శివపార్వతి

న్యూస్‌టుడే, కాకినాడ నగరం: ప్రజలకు మేలు చేసేందుకే ప్రభుత్వం 'జన్మభూమి మా ఊరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తొమ్మిదో డివిజన్ పరిధి గోడారిగుంట రామాలయం వద్ద బుధవారం జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. కమిషనర్ కె.శివపార్వతి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వనమాడితోపాటు మేయర్ సుంకర పావని, స్థానిక కార్పొరేటర్ కంపర రమేష్ హాజరయ్యారు. తొలుత కార్పొరేటర్ రమేష్ మాట్లాడుతూ జన్మభూమి పేరిట ప్రజలవద్దకు రావటం మంచిదేనన్నారు. అయితే చాలామందికి పింఛన్లు, రేషను కార్డులేవని గుర్తుచేశారు. గతంలో ఇళ్లకోసం డబ్బులు కట్టించుకున్నారని, ఇంత వరకూ గృహాలు మంజూరు చేయలేదని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చేందుకే జన్మభూమి పేరిట ప్రజలవద్దకు వస్తున్నామని తెలిపారు. గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీల మేరకు ప్రస్తుతం పింఛన్లు, రేషను కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు వచ్చిన అర్జీలను కూడా వచ్చే జన్మభూమి నాటికి పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా పలు స్థలాలు కబ్జాలకు గురయ్యాయని, వాటిలో పేదలకు ఇళ్లు కట్టిద్దామని అందుకు కార్పొరేటర్ రమేష్ సహకరించాలని కోరారు. జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ ప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం కోసం నగరానికి 5 వేల గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. యూనిట్ వ్యయం రూ. 3.50 లక్షలన్నారు. సొంత స్థలం ఉన్న తెల్లకార్డుదారులు గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రసాద్ కోరారు.



ఉన్నత పాఠశాల కావాలంటూ ప్లకార్డులతో విన్నవిస్తున్న దుమ్ములపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

ఉన్నత పాఠశాల కోరుతూ విద్యార్థుల నిరసన

పదో డివిజన్‌కు సంబంధించి దుమ్ములపేట నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించాలని ప్లకార్డులతో ఎమ్మెల్యేను కోరారు. పాఠశాలలో 450 మంది విద్యార్థులం చదువుకుంటున్నామని, అయిదో తరగతి తరువాత ఉన్నత పాఠశాలకు దూరాన గల ఆనందభారతి, సాలిపేట ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందని విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఉన్నత పాఠశాల మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



గోడారిగుంట జన్మభూమి కార్యక్రమంలో విద్యార్థులకు ఆటల పోటీలు

✦ సంజయ్‌నగర్ నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలో 12వ డివిజన్ జన్మభూమి గ్రామసభలో ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావుతోకలిసి ఎమ్మెల్యే వనమాడి, మేయర్ పావని పాల్గొన్నారు. అక్కడ రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలను పంపిణీ చేశారు.

✦ 11, 13వ డివిజన్లలో జన్మభూమి గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మేయర్ పావని, డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, అర్బన్ తహసిల్దార్ బాలసుబ్రహ్మణ్యం, అదనపు కమిషనర్ వై. శ్రీనివాసరావు, సీడీపీవో సావిత్రి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మోసా దానమ్మ, గద్దేపల్లి దానమ్మ, తుమ్మల సునీత, వమ్మిబాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మ రక్షణ శిక్షణ అవసరం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ అవసరమని జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి పీవీ కృష్ణారావు అన్నారు. జగన్నాథపురం అన్నవరం సత్యదేవి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. అందులో భాగంగా బాలికలకు ఆత్మరక్షణ శిక్షణపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా కృష్ణారావు హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ వంటి ఆత్మరక్షణ శిక్షణలు అవసరమన్నారు. దేహదారుఢ్య శిక్షణ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఆయన వ్యాఖ్యానించారు. కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ బాలికల కళాశాలల్లో చదివే విద్యార్థినులకు ఇటువంటి శిక్షణలు అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జయనిర్మల, సంధ్యాకుమారి మాట్లాడారు. అనంతరం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారిణి కాంచన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణారావు





పడితే పాతాళమే

నేటి చిత్రం

కాకినాడ జగన్నాథపురం వంతెన పక్కన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ స్వాగతద్వారం వద్ద కేబుల్‌లైన్ల కోసం గోతులు తవ్వి వదిలేశారు. పనులు పూర్తయిన వెంటనే గోతులు పూడ్చకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

\- ఈనాడు, కాకినాడ

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో ఈనెల 5 నుంచి 7 వరకు జరిగే మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు బుధవారం బయలుదేరి వెళ్లిందని సంఘ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి బాపిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా నుంచి స్త్రీ, పురుష అభ్యర్థులు 40 మంది ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 26 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సంఘ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి దర్శిని

అన్నవరం: ◗ గురువారం దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నారు. ఈవో జితేంద్ర, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో హుండీలను తెరచి లెక్కిస్తారు. ◗ దేవస్థానంలో బుధవారం పెద్దగా రద్దీ లేదు. కేవలం 395 వ్రతాలు మాత్రమే జరిగాయి. ◗ నిత్యాన్నదానానికి పలువురు భక్తులు రూ.98 వేల విరాళాలు అందించారు. దివ్య దర్శనంలో భాగంగా శ్రీకాకుళం మండలం అవిటి మండలానికి చెందిన భక్తులు బుధవారం రాత్రి సత్యదేవుని దర్శించుకున్నారు.

7న జిల్లా స్థాయి ఓపెన్ చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం నగరం: జిల్లాస్థాయి శేషమ్మ మెమోరియల్ చదరంగం పోటీలను కాకినాడలో ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు జిల్లా చదరంగం పోటీల సంఘాధ్యక్షుడు వై.వి.రామారావు బుధవారం రాజమహేంద్రవరంలో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలోని గాంధీభవన్‌లో జరిగే ఈ పోటీల్లో విజేతలకు నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలు అందిస్తామన్నారు. క్రీడాకారులు మరిన్ని వివరాలకు జిల్లా చదరంగం సంఘ కార్యదర్శి జి.వి.కుమార్ ను 8328343570 చరవాణి ద్వారా సంప్రదించాలని కోరారు.

నేడు కలెక్టరేట్ వద్ద మత్స్యకారుల నిరసన

గాంధీనగర్(కాకినాడ): మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో జరుగుతున్న నిరసనలు, రిలేనిరాహార దీక్షల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా, నిరసన తెలియజేయనున్నట్లు జాతీయ మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు కొల్లు శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్స్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్–2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం
11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం
12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే..పూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగ్గై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఝూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బఠానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^{0}, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360^{0}, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^{0}, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360^{0}, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^{0}, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

SVBC (TTD): **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV: **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు, 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

జీ తెలుగు: **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటీ చాలెంజ్ ఇంటర్నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటీ ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

GEMINI: **ఉదయం:** 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

HBO: ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, మధ్యాహ్నం:12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, సాయంత్రం: 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ రాత్రి: 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

రైతేరాజు

మిరపలో తెగుళ్ల నివారణ

వాణిజ్య పంటలలో ప్రధానమైనది మిరప. ఈ పంటను ఎక్కువగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలో పండిస్తారు. నష్టమైనా, లాభమైనా ఏటా ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తారు. అలాంటి మిరపకు కొన్నేళ్లుగా చీడపీడలు అధికమయ్యాయి. పెట్టుబడి ఎక్కువగా పెట్టే ఈ పంట సాగులో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. ప్రస్తుతం మిరప పూత, పిందె, కాయ దశలో ఉంది. ఈ ఏడాది బొబ్బర తెగులు (వైరస్) సోకి చాలా మంది రైతులు నష్టపోయారు. మిరపలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను పిడుగురాళ్ల ఉద్యానశాఖ అధికారి మోహన్ వివరించారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకొని ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ట్రైజోఫాస్ 1.25 మి.లీ. లేదా పిప్రోనిల్ 2 మి.లీ. వేపనూనె 5 మి.లీ. జిగురు 1.5 మి.లీ. (గమ్)తోకలిపి పిచికారి చేయాలి.

కింది ముడత: ఇది నల్లి వల్ల వస్తుంది. నల్లి ఆశించిన ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఇంకా ముదిరితే ఆకు పసుపు రంగులోకి మారి పూత, పిందె రావటం తగ్గిపోయి, వచ్చినవి రాలిపోతాయి. దీని నివారణకు ఫాసలోన్ 3 మి.లీ. డైకోపాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. దీనికి వేపనూనె, జిగురు కలపాలి. పైముడత, కింది ముడత రెండూ ఉన్నట్లయితే పెగాసిస్ లీటరు నీటికి 2 గ్రా. చొప్పున పైరుపై చల్లుకుని బొబ్బర తెగులు ఆశించకుండా చూసుకోవచ్చు.



పైముడత తెగులు

పేనుబంక: చిన్న పురుగులు గుంపులు గుంపులుగా చేరి లేత కొమ్మలు, ఆకుల కాండంపై చేరి రసం పీల్చడం వల్ల నల్లగా మారి వైరస్‌ను వ్యాప్తి చెందిస్తాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక పేనుబంక, తెల్లదోమను ముందుగానే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి, బొబ్బర తెగులు రాకుండా అరికట్టవచ్చు.

ఆకుమచ్చ: సర్కోస్పోర తెగులు వల్ల ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు బ్లైటాక్స్ 3 గ్రా. గానీ డైథేన్-ఎం-45 2.5 గ్రా./లీటరు నీటికి చొప్పున కలిపి, దానికి + స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

బూడిద తెగులు: బూడిద తెగులు సోకిన ఆకులపై తెలుపురంగులో బూడిదలా కనిపించే మచ్చలు ఏర్పడతాయి. తెగులు మరింత ఉధృతమైనప్పుడు ఆకులు పుసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. దీని వల్ల పూత, పిందె నిలబడకుండా రాలిపోతాయి. దీని నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఎండు తెగులు భూమిలోని శిలీంద్రం వల్ల వస్తుంది. దీని వల్ల మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడర్మావిరిడీ శిలీంద్రాన్ని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి పైరులో చల్లుకోవాలి. పంటకు నీటి తడులు అందించినప్పుడు ఈ శిలీంద్రం వ్యాప్తి చెంది తెగులు పెరగకుండా ఆపుతుంది. అంతేగాక బైటాక్స్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై చల్లాలి.

పూత రావటానికి : పూత బాగా రావటానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక వచ్చిన పూత పిందెగా మారి రాలుతుంటే ప్లానోఫిక్స్ 4 మి.లీ., 5 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మపోషకాల లోపం తలెత్తినప్పుడు ఫార్ములా-4, 5 గ్రా. + బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, మాచవరం (గుంటూరు జిల్లా)

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టే సేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి, నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్' ఏర్పాటుచేయాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి రబ్బర్‌మ్యాట్లను పరచాలి.. తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

లేట్లు.. ఈ చేపలు మహా రుచి!

కోరంగి అభయారణ్యంలోని మడ అడవులలో చేప జాతులు అనేకం పెరుగుతుంటాయి. వాటిలో లేట్లు అని పిలిచే జలపుష్పాలు ప్రత్యేకం. ఇవి మడ అడవుల్లోని నీటిలో చిన్న గుంతల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని పెరుగుతాయి. గోదావరిలో పోటు సమయంలో నీటిలో తేలుతాయి. పాటు సమయంలో నేలపై ఉంటాయి. మే నుంచి జనవరి వరకు ఇవి మత్స్యకారుల వలలకు ఎక్కువగా చిక్కుతాయి. ఇవి చిన్నవిగా ఉన్నా.. వాటి రుచి మాత్రం గొప్పగా ఉంటుందని భోజన ప్రియులు చెబుతారు. వంకాయలతో వీటిని ఇగురు చేసుకుంటే రుచి అమోఘమని అంటారు. చింతకాయలతో పులుసు పెట్టుకుంటే లొట్టలేసుకుంటూ తినాల్సిందేనంటున్నారు. తాళ్లరేవు మండలంలోని తాళ్లరేవు, ఐ.పోలవరం మండలం భైరవపాలెం, యానాం ప్రాంతాల్లో ఇవి కనిపిస్తాయి. జనవరిలో తెల్లవారు జామునే మడ అడవుల్లోని గోదావరి పాయలైన పిల్లారాయ, వాడలనాళి, గొల్లకాలువల్లో వీటిని వేటాడతారు. పట్టిన చేపలను తాటాకు గుడికి గుచ్చి అమ్ముతారు. ఈ కాలంలో వచ్చే చేపలను ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు. అంతేకాదు దూర ప్రాంతాల్లోని తమ బంధువులకు సైతం పంపుతారు.



గిన్నెలో పోసిన లేటు చేప

– న్యూస్‌టుడే, తాళ్లరేవు

రేపు నన్నయలో ప్రత్యేక ఉద్యోగమేళా

రాజానగరం: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా జిల్లాలో ఈ నెల 5, 6 తేదీల్లో ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ వి.నాన్‌రాజు, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఎన్.రావు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్, వికాస సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు. 5వ తేదీన నన్నయ విశ్వవిద్యాలయంలో, 6వ తేదీన అమలాపురం సమీపంలోని అనాతవరం గ్రామంలో ప్రసిద్ధ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఉద్యోగ మేళాలు జరుగుతాయన్నారు. ఒక్కొక్క ఉద్యోగ మేళాలో సుమారు 40 కంపెనీలు వస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు తొలిసారి ప్రత్యేక ఉద్యోగమేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళాను ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ప్రారంభిస్తారన్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా విస్సాకోడేరులో ద్విచక్రవాహనంపైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. పాలకోడేరు ఎస్సై వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా మలికిపురానికి చెందిన పి.రాము(40) భీమవరంలోని ఓ ఆసుపత్రికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. విస్సాకోడేరు సమీపంలో ఉన్నట్టుండి వాహనంపైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు.



పెదపూడిలో నకిలీ ఇంధనం నింపిన డ్రమ్ములను పట్టుకున్న పోలీసులు (దాచిన చిత్రం)

పందెంకోడికి పగ్గాలు పడేనా..?

(మొదటి పేజీ తరువాయి) చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కానరావడం లేదు. కోడిపందేల మాటున రూ.కోట్లు చేతులు మారుతుండగా పందేల ముసుగులోనే సహ జూదాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దీనికి రాజకీయ అండదండలు పుష్కలంగా లభిస్తుండడమే ప్రధాన కారణం. వీటి ఫలితంగా పలు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతుండగా వేలాది కోళ్ల రక్తమోడుతున్నాయి.

జిల్లాలో కోనసీమ కేంద్రంగా కోడిపందేలు ఏటా జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా ముమ్మిడివరం నియోజకవర్గంలోని ఐ.పోలవరం మండలం మురమళ్ల కోడిపందేలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఇక్కడ అధునాతన సాంకేతిక వ్యవస్థను సైతం వినియోగిస్తూ పందేలు నిర్వహిస్తుండడం మామూలైపోయింది. ఐ.పోలవరంతో పాటు ముమ్మిడివరం, తాళ్లరేవు మండలాల్లో చిన్న బరులు ఎక్కువే. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని అల్లవరం మండలం గోడి గ్రామం కేంద్రంగా కూడా పెద్ద ఎత్తున కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే మండలంలోని గుండెపూడి, అల్లవరం, అమలాపురం గ్రామీణ మండలంలోని ఇందుపల్లి, మరో రెండు గ్రామాలతో పాటు ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో కూడా ఓ స్థాయిలో వీటి నిర్వహణ కొనసాగుతోంది. రాజోలు నియోజకవర్గంలోని వీవీ మెరక, కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేల హడావుడి కనిపిస్తోంది. ఇక జిల్లాలో మెట్ట ప్రాంతంలో కూడా వీటి జోరు తీవ్రంగానే ఉంది. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండల పరిధిలోని వేట్లపాలెంలో గత ఏడాది పందేలు జోరుగా సాగాయి. ప్రస్తుతం భారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. తుని నియోజకవర్గంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల పరిధిలో కోడిపందేలు జోరు తీవ్రంగా ఉంటోంది. కేవో తేటగుంటలో పెద్దబరి నిర్వహిస్తుండగా మిగిలిన ప్రాంతాల్లోనూ నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. గత ఏడాది జగ్గంపేట, రాజానగరం, అనపర్తి, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల పెద్దఎత్తున పందేలు జరిగాయి. ఇదే తరహాలో ప్రస్తుతం కూడా వీటి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పంతం.. ప్రతిష్ఠాత్మకం

కోడిపందేల నిర్వాహణపై జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు పంతాలకు పోతున్నట్లు తెలుస్తోంది. మురమళ్లలో ఓ మోస్తారుగా జరిగే కోడిపందేలు ఓ ప్రజాప్రతినిధి పంతంతో ఏకంగా అక్కడ కొత్తపుంతలు తొక్కినట్లయ్యింది. గత రెండేళ్లుగా ఇక్కడ మినీ స్టేడియం తరహాలో హంగులు సృష్టించి ఎల్ఈడీ తెరలు, రాత్రిపూట నిర్వాహణకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పందేలను వీక్షించేందుకు వీవీపీ, వీవీఐపీ గ్యాలరీలు, ప్రారంభ వేదికలు, డ్రోన్ కెమెరాల వినియోగం, క్రికెట్ తరహాలో పందేల చిత్రీకరణ, ఆపై ప్లే.. రీ ప్లే.. కేబుల్ టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం.. ఇలా ఒకటేమిటి.. కోడిపందేలను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఈసారి కూడా గతం కంటే రెట్టింపు స్థాయిలో వీటిని నిర్వహించాలన్న ఆలోచనలతో ఇక్కడ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇదే అదనుగా 'అక్కడ జరుగుతున్నాయి.. మరి మా ప్రాంతంలో నిర్వహించకపోతే ఎలా..?' అంటూ మరికొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు పంతాలకు పోతున్నారు.

పోలీసులు ఏమి చేస్తున్నట్లో..?

గ్రామాల్లో ఇప్పటికే పోలీసుల ప్రచార ఆర్భాటం మొదలైంది.. పందేలు నిర్వహించినా.. ఆడినా కఠిన చర్యలు తప్పవు అన్న హెచ్చరికలు పోలీసుల నుంచి జారీ అవుతున్నా నిర్వహణ సమయంలో మాత్రం వీరు చేతులెత్తేస్తున్నారు. కోడిపందేల నిర్వహణకు వీలులేదంటూ జిల్లాలో సుమారు 200 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. కొన్ని కోళ్లకు కట్టే కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీవో కోర్టుల్లో హాజరు పరచి వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా పందేల నిర్వాహకులు ఎవరన్నది తెలిసినా వారిపై మాత్రం ఒక్క కేసూ నమోదు చేయడం లేదు.



మురమళ్లలో భారీగా నిర్వహించిన కోడిపందేలు (దాచిన చిత్రం)

హైకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తాం



సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహించకుండా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తాం. ఇందుకోసం గట్టి చర్యలు చేపడతాం. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

– కార్తికేయమిశ్రా, కలెక్టర్

సహజూదాల జోరు.. జీవితాలు చిత్తు

కోడిపందేల సంగతి అటుంచితే వీటి చెంతనే సహజూదాలు, మద్యం విక్రయాలు సామాన్యుల జీవితాలను చిత్తు చేస్తున్నాయి. అంత గుండీల గారడీతో కనికట్టుచేసి గుండాటలతో దోచేస్తున్నారు. ఒక్కో గుండాట నిర్వాహణ కోసం పందేల నిర్వాహకులకు రూ.లక్షల్లో ముట్టజెప్పుతున్నారంటే వీరి దోపిడీ ఏ స్థాయిలో ఉంటుందో వెల్లడవుతోంది. ఇక కోడిపందేల చెంతనే అనధికారికంగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది అసలు పట్టించుకోవడం లేదు.

చేతులు మారుతున్న రూ.కోట్లు

కోడిపందేలు రూ.కోట్లతో ముడిపడిన వ్యవహారంగా మారడంతో నల్లధనం ఎక్కువగా చేతులు మారుతోంది. పెద్దబరుల్లో పాల్గొనేది ఎక్కువగా ప్రముఖులే కావడంతో ఒక్కో పందెం రూ.లక్షల్లో సాగుతుంది. కోళ్లకు కత్తులు కట్టడం ద్వారా పందెం కేవలం కొన్ని నిముషాల వ్యవధిలో పూర్తికాగా రోజుకు ఒక్కో బరిలో పదుల కొద్దీ పందేలు జరుగుతాయి. ప్రధాన పందెం రాయుళ్లతో పాటు ఇతరులు పందేలు కాయడంతో రోజుకు రూ.కోట్లు చేతులు మారుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారులు జిల్లాకు తరలిరానుండడంతో కాకినాడ, యానాం, అమలాపురం, మలికిపురం, రాజోలు, తుని, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో లాడ్జీలు, రిసార్టులు ముందస్తుగానే కేటాయింపులు జరిగిపోయాయి. ఈ పరిస్థితిలో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో కోడిపందేలను కట్టడి చేయడంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారన్నది వేచి చూడాల్సి ఉంది.

డీజిల్‌లోనూ కల్తీ దందా

(మొదటి పేజీ తరువాయి) కల్తీకి వినియోగిస్తున్నారు. పరిసర జిల్లాల నుంచి నకిలీ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్న కొందరు తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీని ఫలితంగా వాయుకాలుష్యం ఏర్పడడంతో పాటు వాహనాల ఇంజిన్లు దెబ్బతింటున్నాయి. పెయింటింగ్‌లో వినియోగించే నకిలీ డీజిల్ లీటరు రూ.35 నుంచి రూ.40కే దొరుకుతుండగా అసలు డీజిల్ ధర ప్రస్తుతం లీటరు రూ.65కు చేరువలో ఉంది. అసలైన డీజిల్‌ను విక్రయిస్తే సంబంధిత కంపెనీ లీటరుకు రూపాయి వరకు కమిషన్ ఇస్తుండగా, నకిలీ డీజిల్ విక్రయిస్తే లీటరుకు రూ.25 వరకు అక్రమార్కులకు మిగులుతోంది. జిల్లాలోని కొన్ని పెట్రోలు బంకుల్లో నకిలీ డీజిల్ విక్రయాలు సాగుతున్నాయి. పెదపూడిలోని ఓ బంకులో డీజిల్‌ను పోలిన లెక్కల్లో చూపని ఇంధనం పట్టుబడడంతో గతంలో బంకును సీజ్ చేశారు. రెండు నెలల కిందట కాకినాడలో నకిలీ డీజిల్‌ను డ్రమ్ముల్లో నింపి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏడీబీ రోడ్డులోని కోటపాడు, పెదరాయవరం పరిసరాల్లో నకిలీ ఆయిల్‌ను పెద్దఎత్తున నిల్వ చేస్తున్నా అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. పెయింటింగ్‌లో వినియోగించే లైట్ డీజిల్ ఆయిల్‌ను వాహనాల్లో ఇంధనంగా వాడడం వల్ల ఇంజిన్లు దెబ్బతింటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రతీర ప్రాంతంలో వేలాది మంది మత్స్యకారులు అత్యధికంగా చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లే బోట్లకు కూడా నకిలీ డీజిల్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. నకిలీని గుర్తించే అవకాశం లేకపోవడంతో పాటు ఇక్కడకు తనిఖీల కోసం కూడా అధికారులు రాకపోవడం అక్రమార్కులకు వరంలా మారింది. పెయింటింగ్‌లో వినియోగించే లైట్ డీజిల్ నిత్యం పెద్ద పరిమాణంలో జిల్లాకు దిగుమతి అవుతోంది. విశాఖ పరిసర ప్రాంతాల నుంచి ఇది సరఫరా అవుతోంది. పెట్రోలు బంకులపై నిఘా కొరవడడంతో కొందరు నిర్వాహకులు ఇదే అదనుగా లైట్ డీజిల్ విక్రయాలకు పాల్పడుతున్నారు. పెట్రోలు బంకుల్లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తే పలు చోట్ల ఈ అక్రమ వ్యవహారం వెలుగుచూసే అవకాశముంది.

ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందిస్తాం

లైట్ డీజిల్ ఆయిల్(ఎల్‌డీఓ) అనేది డీజిల్‌ను పోలి ఉండడంతో పాటు ఇది కేవలం వాహనాలకు వినియోగించే ఇంధనం (డీజిల్)లో మాత్రమే కలుస్తుంది. ఈ నకిలీని క్షుణ్ణంగా పరిశీలిస్తేనే కాని గుర్తించడం కష్టం. ఈ ఆయిల్‌ను ఎక్కడ విక్రయిస్తున్నా వెంటనే మాకు సమాచారం అందిస్తే తప్పనిసరిగా స్పందిస్తాం. సిబ్బంది కొరత ఉన్నా ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు ప్రాధాన్యమిస్తాం.

–ఎ.కృష్ణారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి (ఇన్‌ఛార్జి)



రైలు బండి...

పరుగుల రైలు.. ప్రహరీపై వాలి...

సందేశాలు మోసుకొచ్చిందండి






ఆకర్షణీయ నగరాభివృద్ధిలో భాగంగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌ను ఇలా అభివృద్ధి చేశారు. స్వచ్ఛ సంకల్పం నెరవేరాలని... నీరు, మొక్కలను కాపాడుకోవాలని అవగాహన కల్పిస్తూ చక్కని చిత్రాలతో తీర్చిదిద్దారు. పరిసరాలను ఇలా అందమైన చిత్రాలతో తీర్చిదిద్దారు.

–ఈనాడు, కాకినాడ



స్వచ్ఛ బాట పడదాం



మలేషియా తీరంలో ఓడపై నుంచి మనోహర్ రాజు

కలలు కనండి... వాటిని సాకారం చేసుకునేందుకు కఠిన ప్రయత్నాలు చేయండి... గెలుపు మీ ముంగిట్లో నిలుస్తుంది.. ఈ స్ఫూర్తిదాయక మాటలను మదినిండా నింపుకొన్నాడా యువకుడు. కఠినమైన కలను సాకారం చేసుకున్నాడు. ఎన్‌సీసీలో నావల్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. మధ్య తరగతి కుర్రాడి విజయానికి యువత ఉప్పొంగగా....అంతలోనే విదేశాలకు వెళ్లే మరో అవకాశం అందివచ్చింది. గగన వీధిలో ప్రయాణం చేశాడు.. సముద్ర యానం చేశాడు.. పలు దేశాలను చుట్టొచ్చాడు. ఇదీ కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థి వాడ్రేవు మనోహర్ రాజు విజయ గీతిక. భవిష్యత్తులో తాను దేశానికి సేవచేసే సైనికుడినవుతానంటూ వినమ్రంగా చెబుతున్నాడు ఈ కుర్రాడు.

సామాన్య కుర్రాడు.. సాధించుకొచ్చాడు

- ✦ ఎన్‌సీసీ నావికా విభాగంలో జాతీయస్థాయిలో స్వర్ణపతకం
- ✦ విదేశీ అవకాశంతో అంతర్జాతీయస్థాయిలో వికసించిన ప్రతిభ

న్యూస్‌టుడే, గాంధీనగర్ (కాకినాడ)

మనోహర్ రాజు తండ్రి కాకినాడ మెయిన్‌రోడ్డులోని మందుల దుకాణంలో రోజువారీ కూలీకి పనిచేస్తున్నారు. తల్లి ధనలక్ష్మి ఓ చిన్న హోటల్‌ను నిర్వహించడం ద్వారా ఆర్థికంగా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. పదోతరగతిని అన్నమ్మఘాటీ సెంటర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ ఐడియల్ కళాశాలలో పూర్తి చేశాడు రాజు. ఇంటర్‌లో వచ్చిన మార్కుల శాతంతో డిగ్రీలో పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ పెట్రోకెమికల్స్‌లో సీటు సాధించాడు.

కష్టమైనా... ఇష్టంగా....

చదువొక్కటే చాలదు... ఉద్యోగం పొందేందుకు ఎన్‌సీసీ శిక్షణ, ధ్రువపత్రం అండగా ఉంటుందని స్నేహితుల ద్వారా తెలుసుకున్న ఈయువకుడి ఎన్సీసీ నావికా విభాగంలో చేరేందుకు ప్రయత్నించాడు. మూడొందల మందితో పోటీ పడ్డాడు. ప్రతి రోజూ నిర్వహించే పలు రకాల పరీక్షల్లో 50 మంది మాత్రమే మిగిలారు. అందులో రాజు ఉన్నాడు. నావెల్ విభాగంలో చేరి ఫైరింగ్, డ్రిల్ విభాగాల్లో ప్రతిభతో కెప్టెన్‌ను ఆకర్షించగలిగాడు. ఐజేసీ పేరుతో విశాఖపట్నంలో 2016 ఆగస్టులో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపికయ్యాడు. ఫైరింగ్, డ్రిల్, చదువు, నావికా నైపుణ్యం, బోట్‌పూలింగ్ తదితర 30 విభాగాల్లో రాజు ఉన్న విభాగానికి నాలుగో స్థానం వచ్చింది. అలా జాతీయస్థాయికి ఎంపికైన మనోహర్ రాజు కర్ణాటకలోని కార్వార్ నావెల్ బేస్‌లో 2016 సెప్టెంబర్‌లో జరిగిన అఖిల భారత నవ సైనిక్ శిబిరానికి ఎంపికై అక్కడా తన ప్రతిభచూపి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

అంతర్జాతీయంగానూ అతడే 'మనోహరు'డు...

జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని గెలుచుకోవడంతో అంతర్జాతీయ నావెల్ క్రూజ్ శిబిరాలకు ఎంపికయ్యాడు. ఆర్థికంగా ఖర్చులకు డబ్బు లేకపోవడంతో వెనకాడిన రాజును మిత్రులు, బంధువులు ప్రోత్సహించి ఆసరాగా నిలిచారు. అలా ఈ కుర్రాడు చెన్నైలో విమానం ఎక్కి అండమాన్‌లో దిగాడు. అక్కడ నావెల్ బేస్ నుంచి గత ఏడాది అక్టోబర్‌లో ఓడలో మలేషియాకు బయలుదేరి వెళ్లాడు. రాజుతోపాటు మనదేశం నుంచి పదిమంది యువకులు ఈ పర్యటనకు ఎంపికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రాజు ఒక్కడే ఎంపికయ్యాడు. ఆ దేశంలో ఎన్సీసీ క్యాడెట్‌లతో కలిసి వారి సంస్కృతి, నావికా సంపత్తి గురించి స్వయంగా తెలుసుకున్నాడు. అక్కడ్నుంచి ఇండోనేషియాకు బయలుదేరిన ఈ బృందం అక్కడి పరిస్థితులు, ప్రజలు, సంస్కృతులు, సామాజిక స్థితిగతులపై అవగాహన పెంచుకున్నాడు. అక్కడ్నుంచి బయలుదేరిన ఓడ శ్రీలంకకు చేరుకుంది. అక్కడ మన భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పండుగలు, అక్కడి నావికా నైపుణ్యంపై అధ్యయనం చేశారు. ఈ పర్యటనలో నావికా క్రాస్‌లైన్ కార్యక్రమంలో కూడా మనోహర్ రాజు తన ప్రతిభతో సర్టిఫికెట్‌ను సాధించిన ఏకైక యువకుడిగా చెప్పవచ్చు.



విదేశీ పర్యటనల్లో భాగంగా ఓడను ఎలా నడపాలి... సముద్రంలోని ఇతర ఓడలు దూరాన్ని, ఏదిశగా వస్తున్నాయో పరిశీలిస్తున్న మనోహర్ రాజు

నావికాదళంలో చేరాలన్నదే తపన

నావికాదళంలో చేరి సైనికుడిగా, అధికారిగా దేశానికి సేవ చేయాలనేది నా తపన. అలాగైనా మా కుటుంబానికి ఆర్థికంగా కొంత వరకూ ఆసరాగా నిలవగలననే ఆశ. ఓడల పనితీరు, అందులో నైపుణ్య విభాగంలో సర్వీసు సబ్జెక్టులో బంగారు పతకాన్ని సాధించిన నేను ఆ విభాగంలో కొత్తగా నైపుణ్యాలను నేర్చుకోవాలనుకుంటున్నాను. **-మనోహర్ రాజు**

చిరుప్రాయం.. చిరుత వేగం



స్కేటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఎంతో క్లిష్టమైన క్రీడ.. కాళ్లకు చక్రాలు కట్టుకుని రై.. రై.. మని చక్కర్లు కొడుతూ దూసుకుపోవాలి... ఇందులో చిరుప్రాయంలోనే ప్రావీణ్యాన్ని కనబరుస్తున్నారు. అమలాపురం బాలయోగి క్రీడా మైదానంలో స్కేటింగ్ సాధన చేస్తున్న చిన్నారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. కోనసీమ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కేటింగ్‌లో గ్రామీణ ప్రాంతాలతో పాటు అమలాపురం పట్టణానికి చెందిన చిన్నారులు సైతం ఆసక్తి చూపుతున్నారు. బాలయోగి స్టేడియం నిర్మాణంలో భాగంగా స్కేటింగ్ కోర్టును గతంలో ఏర్పాటు చేశారు. తరువాత కోనసీమ రోలర్ స్కేటింగ్ ఆసోసియేషన్‌ను గతేడాది వేసవిలో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇక్కడ ఉదయం, సాయంత్రం సందడి మొదలైంది. ఎల్‌కేజీ మొదలుకుని వివిధ తరగతులు చదువుతున్న విద్యార్థులు స్కేటింగ్‌ను నేర్చుకునేందుకు అమితంగా అసక్తి కనబరుస్తున్నారు. తమ వెలుసుబాటును చూసుకుని ఉదయం ఆరు గంటల నుంచి మొదలుకుని ఎనిమిది గంటల వరకూ చిన్నారులు స్కేటింగ్ సాధన చేస్తున్నారు. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు అలుపెరగకుండా నేర్చుకుంటున్నారు.

అదరగొడుతున్నారు...

స్కేటింగ్ విద్యలో బుడతలు భళా అనిపిస్తున్నారు. మొత్తం 70 మంది విద్యార్థులతో శిబిరం ప్రారంభమవ్వగా, ప్రస్తుతం నలభై మంది నిత్యం సాధన చేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉభయగోదావరి జిల్లాల పోటీల్లో 36 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో పాటు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఈదరపల్లి గ్రామానికి చెందిన అయినవిల్లి కౌశిక్‌గౌడ్, అయినవిల్లి గౌతమ్‌గౌడ్, బూరగాయల కార్తీక్, బూరగాయల విశ్వజిత్, నల్లా దినేష్‌వెంకటనాయుడు, నల్లా రామ్‌చరణ్, నల్లా ఎస్.ఎస్. శౌరేష్‌లు పాల్గొని బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించారు.

ఎంతో ఇష్టం...



స్కేటింగ్ అంటే చాలా క్లిష్టమైన క్రీడ. ఇటువంటి క్రీడను నేర్చుకోవాలని ఎప్పటి నుంచో కోరిక. మా తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో ఆయనకు చెప్పగానే ఒప్పుకొన్నారు. రోజూ మా తండ్రి నల్లా రామకృష్ణ దగ్గరుండి మరీ మెలకువలను అందిపుచ్చుకునే విధంగా శిక్షకుడితో కలిసి తర్ఫీదు ఇస్తున్నారు. ఇటీవల గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో మొత్తం ఏడుగురు విద్యార్థులు పాల్గొని మంచి విజయాన్ని సాధించాం.

-నల్లా దినేష్‌వెంకటనాయుడు, అయిదో తరగతి విద్యార్థి, అమలాపురం

బాగా నేర్పిస్తున్నారు...



స్కేటింగ్ క్రీడను చాలా బాగా నేర్పిస్తున్నారు. ముఖ్యంగా కోనసీమ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులు ఎప్పటికప్పుడు ప్రత్యేక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటువంటి క్రీడను నేర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో కూడా పాల్గొనే అవకాశం కోసం ఎదురు చూస్తున్నా.

-బూరగాయల సూర్యవిశ్వజిత్, అయిదో తరగతి విద్యార్థి, అమలాపురం



పోలీసులంటే భయం పోగొడతా..

మన్యంలో స్టేషన్ల కంప్యూటరీకరణకు చర్యలు: ఏఎస్పీ అజిత

పోలీసులంటే భయం పోగొట్టి.. జనాలకు దగ్గరయ్యేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని రంపచోడవరం తొలి మహిళా ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అజిత అన్నారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు. తూర్పు ఏజెన్సీలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని ఆమె పేర్కొన్నారు. వివరాలు ఆమె మాటల్లోనే..

✦ స్వస్థలం తెనాలి.. పెరిగింది హైదరాబాద్

మా స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. తల్లిదండ్రులు హైదరాబాదులో స్థిరపడటంతో ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే సాగింది.

✦ ఉన్నత చదువులు.. కార్పొరేట్ ఉద్యోగం..

చెన్నై ఐఐటీలో బి.టెక్, అనంతరం అమెరికాలో ఎంఎస్ పూర్తి చేశా. చెన్నైలోని పలు కార్పొరేట్ సంస్థల్లో ఆర్థికలావాదేవీల విభాగంలో కొన్నాళ్లు పర్యవేక్షకురాలిగా విధులు నిర్వహించా. అదే సమయంలో సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి హైదరాబాద్ వచ్చేశా. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ స్కాలర్‌గా చేరా. అప్పటి నుంచే సివిల్స్ లక్ష్యంగా సాధన చేశా.

✦ 2015లో ఐపీఎస్‌కు ఎంపిక

చిన్నప్పటి నుంచి కష్టపడి చదివా. ఉన్నత చదువులు చదివి, మంచి కార్పొరేట్ ఉద్యోగం సాధించినా.. సివిల్స్‌పై ఆసక్తి ఏర్పడి అటు వైపు దృష్టి సారించి గట్టిగా కృషి చేయడంతో విజయం సాధించా. 2015లో ఐపీఎస్ సాధించా. గ్రేహౌండ్స్ విభాగంలో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. రంపచోడవరం ఏఎస్పీగా బదిలీపై వచ్చా.

✦ పోలీస్ స్టేషన్లకు సాంకేతిక సొబగులు

ఏజెన్సీలో ఉన్న పోలీసు స్టేషన్లను సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ఇందులో భాగంగా కంప్యూటరీకరణ చేస్తామన్నాం. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం.

✦ ప్రజలకు దగ్గరవుతా..

ప్రజలకు దగ్గరయ్యేందుకు కృషి చేస్తాం. పోలీసులంటే భయం పోగొట్టేలా చర్యలు చేపడతాం. గిరిజనుల్లో చైతన్యం కలిగించి వారితో పోలీసులు సోదరభావంతో మెలిగేలా చేస్తాం.

✦ సామాజిక సేవ.. గంజాయిపై ఉక్కుపాదం

ఏజెన్సీలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. యువత చెడు ప్రభావానికి గురికాకుండా 'సామాజిక పోలీసు'లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తాం. మహిళల రక్షణకు ప్రత్యేకించి చర్యలు చేపడతాం.

– న్యూస్‌టుడే, రంపచోడవరం





పుస్తకాలు మంచి స్నేహితులతో సమానం... వాటి ద్వారా మనలో విజ్ఞానం వచ్చి.. అజ్ఞానం బయటకు పోతుంది.

–ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

భాష... చరిత్ర... సంస్కృతిని కాపాడుకునేందుకు పుస్తక మహోత్సవాలు ఎంతగానో దోహదపడతాయి.

–ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



పుస్తకాలు నిజమైన నేస్తాలని.. మార్గదర్శకాలని విజయవాడలో పుస్తక మహోత్సవం ప్రారంభంలో వీరిద్దరూ పేర్కొన్నారు.

పుస్తకం.. మనో నేస్తం!

◆ జిల్లాలో బహుమతులుగా అందిస్తున్న పలువురు ◆ సత్కారాలూ వాటితోనే చేస్తున్న 'ఆదర్శం'

న్యూస్‌టుడే, అన్నవరం

పుస్తకం.. దాంతో ప్రతి ఒక్కరి జీవితానికి ఓ చెరగని బంధంగా అనిపిస్తుంది. విద్యాభ్యాసం దగ్గర్నుంచి జీవితంలో ఏ స్థానానికి ఎదిగినా, చివరకు వృద్ధాప్యంలోనూ ప్రత్యేక అనుబంధంగా ఉంటుంది.

వినియోగం ఎంతో మేలు...

జిల్లా జనాభాలో 15-24 ఏళ్ల వయస్సున్నవారు 19 శాతం మంది ఉండగా, వీరిలో 90 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇందులో 10-15 శాతం మంది మాత్రమే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గుతుండగా కేవలం పత్రికలు, మ్యాగజైన్లు చదవడానికి మాత్రమే అధికశాతం వస్తున్నారని గ్రంథాలయాల సిబ్బంది చెబుతున్నారు. పోటీ పరీక్షలకు, ఇతరాలకు ఉపయోగపడే అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటున్నా తక్కువమంది మాత్రమే సద్వినియోగం చేసుకోగలుగుతున్నారు. చరవాణులు, అంతర్జాలం వినియోగం పెరిగిన తర్వాత ఈ పరిస్థితులు రాగా, వీటి ద్వారానే పోటీ పరీక్షలకు, ఇతర వాటికి ముందుకు వెళ్తున్నారు. ఇక కళాశాల విద్యలో తప్ప యువతలో మంచి పుస్తకాలు చదివే అలవాటు తగ్గుతోంది. గ్రంథాలయాల్లో విద్యార్థులు, రైతులకు ఉపయోగపడేవే కాకుండా పురాణాలు, ఇతిహాసాలకు సంబంధించినవి, పోటీ పరీక్షలకు ఉపయోగపడేవి కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

జిల్లాలో పుస్తక నిలయాలు

✦ జిల్లాలో శాఖా గ్రంథాలయాలు	:	99
✦ గ్రామీణ గ్రంథాలయాలు	:	22
✦ పుస్తక నిక్షిప్త కేంద్రాలు సుమారు	:	148
✦ గ్రంథాలయాల్లో సభ్యులుగా ఉన్న పాఠకులు (సుమారు)	:	97 వేలు

(ఇది కాక నిత్యం వేలాది మంది గ్రంథాలయాలకు వెళ్లి చదువుతున్నారు)

పుస్తకాభిషేకం..

వెలకట్టలేని సన్మానమిది. నా జీవితంలో ఎన్నో సత్కారాలను అందుకున్నా. గజమాలలు, స్వర్ణ పుష్పాలతో సన్మానం పొందా. కానీ ఇక్కడ వినూత్నంగా చేసిన కార్యక్రమం నేను జీవితంలో మర్చిపోలేను. శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గతంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి అన్నమాటలివి. ఈ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం జరిగినా అతిథులకు పూలదండలకు బదులుగా వివిధ రకాల విలువైన గ్రంథాలను ఇస్తూ పుస్తకాభిషేకం చేస్తున్నారు. నేటి తరానికి పుస్తకాల ప్రాముఖ్యతను వివరించేందుకు పలు పోటీల్లో విజేతలైనా... కార్యక్రమానికి హాజరైన అతిథులైనా... ప్రముఖులైనా... ఓ పుస్తకాన్ని వారికిచ్చి ప్రత్యేకత చాటుతున్నారు.

- తొండంగి మండలంలోని శృంగవృక్షం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు మనబడి బృందంగా ఏర్పడి ప్రత్యేకంగా గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి పలు పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో విద్యార్థులు నిత్యం పుస్తక పఠనం చేస్తున్నారు.
- తునిలోని ఓ పోలీస్ అధికారితోపాటు, స్థానికులు, పూర్వ విద్యార్థులు వీరవరపుపేటలో గ్రంథాలయానికి పుస్తకాలందించారు.

అవగాహన కల్పిస్తున్నాం...

గ్రంథాలయాల్లో అనేక పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నాం. పఠనం చేసేవారి సంఖ్య తగ్గుతుండటంతో దీనిపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రంథాలయంలో అందుబాటులో ఉండి విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేసి పాఠశాలలకు, కళాశాలలకు తెలియజేసేలా, రైతులకు ఉపయోగపడే పుస్తకాల జాబితాను వ్యవసాయశాఖ ద్వారా, పురాణాలు, ఇతిహాసాలు తదితరాల జాబితాను ఆలయాలకు వచ్చే భక్తులకు తెలియజేసి ఇవన్నీ గ్రంథాలయాల్లో ఉన్నాయని, వినియోగించుకోవాలని తెలిపే యత్నం చేస్తున్నాం.

-ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



సిరివెన్నెల సీతారామశాస్త్రికి పుస్తకాలతో సత్కారం (దాచిన చిత్రం)

జ్ఞాన నేత్రం తెరిచారు...



→ నేడు లూయిస్ బ్రెయిలీ జయంత్యుత్సవం
→ ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

న్యూస్‌టుడే, మామిడికుదురు

కళ్లతో చూడలేకపోవచ్చు.. మనసుతో చక్కగా ఆస్వాదించవచ్చు. చూసి నేర్చుకోలేకపోవచ్చు.. స్పర్శతో చక్కగా చదివేయవచ్చు. అన్నింటిలోనూ అందరిలా పోటీ పడలేకపోవచ్చు.. అందరికన్నా మిన్నగా దేనిలోనైనా రాణించవచ్చు. బాల్యంలోనే అంధకారం అలముకుందని ఎక్కడా బాధ పడని ఓ వ్యక్తి అసాధారణ శక్తిగా ఎదిగాడు. ఏకంగా ఓ లిపినే కనిపెట్టి విశ్వవ్యాప్తంగా అందించాడు. ఆయనే లూయిస్ బ్రెయిలీ. శక్తి వంచన లేకుండా శోధించి సాధించిన ఆవిష్కరణ బ్రెయిలీ లిపిగా చిరస్థాయిగా నిలిచింది. ఆ లిపి అంధకారాన్ని పారదోలి జ్ఞాన నేత్రాన్ని దేదీప్యమానంగా తెరిచి నిత్యనూతనంగా వెలుగొందేలా చేసింది. నేడు ఆ మహనీయుడి 210వ జయంత్యుత్సవాన్ని సర్వశిక్షా అభియాన్ జిల్లాలో నిర్వహించనుంది.



సంగీత వాయిద్యాలతో అలరిస్తున్న అంధ విద్యార్థులు

చక్కని ఫలితాలు..



సహిత విద్యలో చదువుకుంటున్న అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపికి సంబంధించిన పుస్తకాలు, సామగ్రి అందజేశాం. వీరికి ప్రత్యేకంగా బోధనాభ్యసన సామగ్రిని కూడా అందజేశాం. లూయిస్ బ్రెయిలీ జయంత్యుత్సవం సందర్భంగా కాకినాడలోని ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎస్ఎస్ఏ పీవో ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం గురువారం ఏర్పాటుకానుంది. అన్ని పాఠశాలలు, కళాశాలల్లోని ఆయా విద్యార్థులను సంబంధిత ఉపాధ్యాయులు కార్యక్రమానికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

-ఎస్.విజయలక్ష్మి, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

సహిత విద్య ద్వారా కృషి...

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు సర్వశిక్షాభియాన్ సహిత విద్యా కార్యక్రమాల ద్వారా కార్యాచరణ చేస్తోంది. వారికి అవసరమైన విద్యను అందివ్వడంతోపాటు ఉపకరణాలను సమకూర్చుతోంది. జిల్లాలోని భవిత, ఉప భవిత కేంద్రాల్లో 74 మంది అంధులైన విద్యార్థులకు బ్రెయిలీ లిపి ద్వారా విద్యాబోధన జరుగుతోంది. వీరికి బ్రెయిలీ పుస్తకాలు, పలకలు అందివ్వడంతోపాటు మ్యూజిక్ థెరపీ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. సహిత క్లబ్ ద్వారా నిర్వహించే ఆటల పోటీల్లో వీరు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తమదైన ప్రతిభా నైపుణ్యంతో విభిన్న సంగీత వాద్యాలను చక్కగా వాయిస్తూ ఆత్మవిశ్వాసంతో అందర్నీ అలరిస్తున్నారు. వీరికి ప్రత్యేకంగా రూపొందించిన బోధనాభ్యసన సామగ్రి ద్వారా విజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. వీరి విద్యాభ్యాసానికిగాను ప్రభుత్వం రవాణా, రక్షణ భత్యాలను అందిస్తోంది. వారు చదువుకునేందుకు బ్రెయిలీ లిపిలో పలు పాఠ్యపుస్తకాలను ముద్రించి అందజేస్తోంది. అంధులకు విద్యాదానం చేసిన బ్రెయిలీ స్ఫూర్తితో, ఆ మహనీయుడు అందించిన లిపితో ఆయా విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు ఎస్ఎస్ఏ చేస్తున్న కార్యక్రమాలు ఉపకరిస్తున్నాయి.

హాయ్! బుజ్జీ!!



**రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?**

పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

తయారీ ఎలా?



1

◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



2

◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



3

◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



4

◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.


పుట్టింది ఎప్పుడంట?

● 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
● జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
● ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

● ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.





దారి కనుక్కోండి!


సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [   ] with our (nose)
2. We [   ] with our (eyes)
3. We [   ] with our (ear)
4. We [   ] with our (tongue)
5. We [   ] with our (hands)

జవాబులు: స్కూల్ సవాల్: 1.1857 2.పోర్చుగల్ 3.రాయ్‌పూర్
కవలలేవి: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See
3.Listen 4.Taste 5.Touch

బింబా & బబ్లూ — అండమాన్‌లో సాహసాలు 1



ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడిగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?





- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు


- మదర్ థెరిసా

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్

కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



వసతి గృహాల్లో ఆర్థిక కష్టాలు

- ఆరేళ్లనాటి ధరల ప్రామాణికంగా కాస్మొటిక్ ఛార్జీలు
- ఏమాత్రం సరిపోకపోవడంతో విద్యార్థుల అవస్థలు
- ప్రతినెలా తల్లిదండ్రులపై భారం



న్యూస్‌టుడే – తుని పట్టణం

వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ప్రభుత్వం ప్రతి నెల అందజేసే కాస్మొటిక్ ఛార్జీలు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో పిల్లలను వసతి గృహాల్లో ఉంచి చదివించుకుంటున్న తల్లిదండ్రులకు ఈ పరిస్థితి ఆర్థిక భారంగా మారింది. రోజురోజుకు విద్యార్థుల అవసరాలకు వ్యయం పెరుగుతుంటే సుమారు ఆరేళ్లుగా కాస్మొటిక్ ఛార్జీలు ఏమాత్రం పెంచకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 45 ఉండగా బాలురకు 26, బాలికలకు 19 ఉన్నాయి. ఆయా వసతి గృహాల్లో సుమారు 6,500 మంది చదువుతున్నారు. బీసీ వసతిగృహాలు 82 ఉండగా ఇందులో సుమారు 8,600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు స్నానపు సబ్బులు, దుస్తుల సబ్బు, కొబ్బరి నూనె, పేస్ట్, బ్రష్, పౌడర్, విద్యార్థినులకు అవసరమైన వాటికోసం కాస్మొటిక్ ఛార్జీలుగా 3 నుంచి 10వ తరగతి వరకు బాలురకు నెలకు రూ. 62, 3 నుంచి 7వ తరగతి వరకు బాలికలకు రూ. 55, 8 నుంచి 10వ తరగతుల బాలికలకు రూ. 75 చొప్పున అందజేస్తున్నారు. ఈ మొత్తం ఏ మూలకు చాలడం లేదు. వీటికి నెలకు సుమారు రూ. 150 నుంచి 200పైగా వ్యయం అవుతుండగా తల్లిదండ్రుల నుంచి అదనంగా తీసుకోవాల్సి వస్తుంది. ఉదాహరణకు బాలుర క్షవరానికి నెలకు రూ. 30-40 వ్యయం అవుతుండగా ప్రభుత్వం ఇస్తున్నది రూ. 12 మాత్రమే. విద్యార్థులు వినియోగించే దుప్పట్లను కనీసం వారానికో, రెండు వారాలో ఒకసారి ఉతుక్కోవాలి. దీంతో పాటు దుస్తులు నిత్యం శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. అదే ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు అయితే ఈ విభాగ ప్రత్యేక దుస్తులు కూడా ఉంటాయి. వీటిని ఉతికేందుకు సబ్బులకు ప్రభుత్వం ఇచ్చే చార్జీలు సరిపోతున్నాయని విద్యార్థులు అంటున్నారు. దుస్తులు ఉతుక్కోకపోతే చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇక బాలికలకైతే శానిటరీ నాప్‌కిన్స్, రిబ్బన్లు, రబ్బర్ బ్యాండ్లు తదితర ఇతర అవసరాలు కూడా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ఇబ్బంది ఎదురవుతుందని వాపోతున్నారు.

భోజన సదుపాయానికి ఇచ్చేది చాలక...

వసతి గృహాల్లోని విద్యార్థులకు భోజన సదుపాయానికి ఇచ్చే సొమ్ము కూడా సరిపడడం లేదు. ఉదయం అల్పాహారం, పాలు, సాయంత్రం భోజనం, వారంలో ఆరు రోజులు గుడ్డు, ఒకరోజు తీపిపదార్థం, సాయంత్రం సమయంలో స్నాక్స్, రాత్రి సమయాల్లో మజ్జిగ, అంతేకాకుండా పలు రకాల పండ్లు ఇవ్వాల్సి ఉంటుంది. మధ్యాహ్నం పాఠశాలల్లోనే భోజనం పెడుతున్నా సెలవు రోజుల్లో వసతి గృహాల్లోనే పెట్టాల్సి ఉంటుంది. ఇందుకు 3 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు ఒకొక్కరికి నెలకు రూ. 750 (రోజుకు రూ. 25) , 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారికి నెలకు రూ. 850 (రోజుకు రూ. 28) చొప్పున ఇస్తున్నారు. అయితే ఈ సొమ్ము చాలక నిర్వాహణ చేయలేక కొన్ని చోట్ల విద్యార్థులకు నాణ్యమైన, పూర్తిస్థాయిలో భోజనం కూడా అందడం లేదు.



తల్లిదండ్రులిచ్చే సొమ్ము నుంచే..

ప్రతీనెల మాకు ఇచ్చే కాస్మొటిక్ ఛార్జీలు చాలడం లేదు. దీనివల్ల తల్లిదండ్రులు ఇచ్చే డబ్బుల్లో నుంచే ఖర్చుపెట్టుకుంటున్నాం. కొన్ని సందర్భాల్లో అదీ చాలడం లేదు. బహిరంగ మార్కెట్లో ధరలు పెరిగిన పరిస్థితులు ఈ సొమ్ము కొంత పెంచాలి

– దుర్గాభవానీదేవి, వసతి గృహ విద్యార్థిని

ప్రతిపాదన ఉంది

వసతి గృహాల్లో విద్యార్థులకు ఇచ్చే కాస్మొటిక్, మెస్ చార్జీలు పెంచే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉంది. దీనిపై ఇటీవల జరిగిన సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మేము కూడా వివరాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే పెంచుతారని భావిస్తున్నాం.

–శోభారాణీ, హరిప్రసాద్, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ

5, 6 తేదీల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగ మేళా

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల్లో నిరుద్యోగ యువతకు ఈనెల 5, 6వ తేదీల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, 6న అమలాపురంలోని ప్రసిద్ధ ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగ మేళాలు ఉంటాయన్నారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన ఉభయ గోదావరి జిల్లాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికాస జిల్లా డైరెక్టర్ వి.ఎన్.రావు మాట్లాడుతూ 5, 6వ తేదీల్లో ఎంపికలకు 40 కార్పొరేట్ సంస్థలు హాజరు కానున్నాయన్నారు. ఆయా సంస్థల ద్వారా మొత్తం 2 వేల మందికి ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందన్నారు. అభ్యర్థులు కుల ధ్రువీకరణ, బయోడేటా, ఫొటోలతో హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గుడా కొత్త మాస్టర్ ప్లాన్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్వరలో గుడా పరిధిలో ప్రాంతాలను కలుపుకొని కొత్త మాస్టర్‌ప్లాన్‌ను ప్రకటించనున్నట్లు గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ పేర్కొన్నారు. గుడా జోనల్ కార్యాలయాన్ని రాజమహేంద్రవరంలోని నగరపాలక సంస్థ పాత కార్యాలయంలో ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రాజమహేంద్రవరానికి కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లో ఉండగా, కాకినాడ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉందన్నారు. మిగిలిన ప్రాంతాలను కలుపుకొని కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామన్నారు. తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో అర్బన్ ప్రాంత మౌలిక సదుపాయాలు కల్పించడమే అర్బన్ డవలప్‌మెంట్ ఉద్దేశమన్నారు. గుడా ఏర్పాటైన తర్వాత కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి భవనాల అనుమతులు వేగవంతం చేస్తామన్నారు. గ్రామాలు, అర్బన్ ప్రాంతాల్లో పరిమితికి లోబడి అనుమతులు ఇచ్చే విధంగా ఏర్పాటు చేశామని, పరిమితి మించితేనే గుడాలో అనుమతులు పొందే విధంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు గుడాకు రూ.1.40 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. భవన నిర్మాణాలు, లే-అవుట్లు, పరిశ్రమల ఏర్పాటుకు గుడా ద్వారా అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ప్రజల సౌలభ్యం కోసం జోనల్ కార్యాలయాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేశామని, కాకినాడలో ప్రధాన కార్యాలయం యథావిధిగా కొనసాగుతుందన్నారు. జోనల్ కార్యాలయంలో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మేయర్ పంతం రజనీశేషసాయి, కమిషనర్ విజయ్‌రామరాజు తదితరులు గన్ని కృష్ణను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో గుడా సభ్యులు రవికుమార్, సత్యనారాయణ, గుడా ఇన్‌ఛార్జి కార్యదర్శి సాయిబాబు, ప్లానింగ్ అధికారి సంజయ్, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి శాంతిలత, జూనియర్ ప్లానింగ్ అధికారి ప్రసాద్, డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గుడా జోనల్ కార్యాలయంలో మాట్లాడుతున్న గన్ని కృష్ణ

బక్కచిక్కిన బకింగ్‌హాం



కాకినాడలోని బకింగ్‌హాం కాలువ



జగన్నాథపురం నుంచి కొవ్వూరు వెళ్లే మార్గంలో కాలువను ఆనుకుని నిర్మించిన ఇళ్లు



జగన్నాథపురం వంతెనను ఆనుకుని కాలువలో నిర్మాణాలు

నేషనల్ వాటర్ వే 4 కింద కేంద్ర ప్రభుత్వం బకింగ్‌హాం కాలువను తిరిగి పునరుద్ధరించాలని ప్రయత్నిస్తోంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. కాకినాడ నుంచి ప్రారంభమవుతున్న ఈ కాలువ ఆక్రమణలతో కుదించుకపోయింది. ఇళ్ల నిర్మాణం, గట్టును పూడ్చి వేయడం, వ్యర్థాలను కాలువలోనే పడేయడంతో ప్రస్తుతం రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పుడు నావిగేషన్ కాలువగా ఉన్న బకింగ్‌హాం పరిస్థితి నేడు మురికి కూపాన్ని తలపిస్తోంది.

– ఈనాడు, కాకినాడ



కాకినాడ నుంచి కొవ్వూరు వెళ్లే మార్గంలో కాలువ పొడవునా ఆక్రమణలే..

విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ

దేవీచౌక్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రికి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన, శాశ్వతంగా వికలాంగులైన కాంట్రాక్టు కార్మిక కుటుంబంలోని ఒకరికి అర్హతగల ఉద్యోగం ఇవ్వడంతోపాటు రూ.10 లక్షల ప్రమాద బీమా చెల్లించేందుకు అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఒకే పరిశ్రమ ఒకే గుర్తింపు సంఘం అనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈపీడీసీఎల్ సీఎండీ హెచ్.వై.దొర మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో ఎండీ రంగనాథ్ మాట్లాడుతూ విద్యుత్తు సంస్థల ప్రైవేటీకరణపై ఉద్యోగులు, కార్మికులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ప్రభుత్వానికి ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం లేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థలో అన్నింటికంటే కార్మికుల భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యూనియన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ 2007 నుంచి ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పనిభారం పెరిగిందన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పంతం రజనీ శేషసాయి, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, సర్కిల్ ఎస్ఈ వై.ఎస్.ఎన్.ప్రసాద్, యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్.కె.గణపతి, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



రాచపల్లి అడ్డురోడ్డు కూడలిలో ప్రమాద దృశ్యం (అంతరచిత్రం) మృతుడు సత్యనారాయణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం రాచపల్లి గ్రామానికి చెందిన బూతుకూరి సత్యనారాయణ(50) మందుల కోసం సైకిలుపై ప్రత్తిపాడు వస్తున్నాడు. అడ్డరోడ్డు కూడలి దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రామీణ ప్రజలకు సులభంగా వంటగ్యాస్ సరఫరా

సంయుక్త కలెక్టర్ మల్లికార్జున

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎల్‌పీజీ వంటగ్యాస్‌ను సులభతరంగా పొంద''నికి కొత్తగా 15 గ్యాస్ ఏజెన్సీలు అందుబాటులోకి రానున్నాయని సంయుక్త కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో గ్యాస్ ఏజెన్సీల కేటాయింపునకు సంబంధించిన వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆన్‌లైన్‌లో డ్రా విధానంలో ఎంపిక చేసే ప్రక్రియను బుధవారం ఆయన ప్రారంభించారు. హెచ్‌పీసీ, బీపీసీ, ఐవోసీ కంపెనీలకు చెందిన గ్యాస్ ఏజెన్సీలను ఈ విధానం ద్వారా కేటాయింపులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 72 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయని, కొత్తగా ఇప్పుడు మరో 15 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు కూడా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కొత్తగా కోటనందూరు, పెనుకూరు, అడ్డతీగల, జడ్డంగి, గోకవరం, ఉప్పలగుప్తం, గంగవరం, అంతర్వేది, రౌతులపూడి, చింతూరు, కత్తిపూడి, రంగపేట, పెదమల్లాపురం, నెల్లిపూడి, వరరామచంద్రపురంలో గ్యాస్ ఏజెన్సీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు ఎ.కృష్ణారావు, ఎన్ఐసీ అధికారులు ఉస్మాన్, సుబ్బారావు, హెచ్‌పీసీఎల్ డీజీఎం ఎన్.శ్రీనివాసరావు, ఐవోసీ డీజీఎం ఏకే నాయక్, హెచ్‌పీసీఎల్ ఏరియా మేనేజరు రవికుమార్, బీపీసీ టెరిటరీ మేనేజరు బి.రమేశ్, సేల్స్ ఆఫీసర్ నితిన్‌థాంసన్, హెచ్‌పీసీఎల్ డిప్యూటీ మేనేజరు శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ఏజెన్సీల ఎంపికను ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తున్న జేసీ మల్లికార్జున



ఫల,పుష్ప ప్రదర్శన ముఖద్వారం



బాలయోగి స్టేడియంకు రంగులు వేస్తున్న కార్మికులు

ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనకు సన్నాహాలు

యానాం, న్యూస్‌టుడే: యానాంలో నిర్వహించనున్న 19వ ఫల, పుష్ప ప్రదర్శన, 16వ ప్రజాఉత్సవాల కోసం ఇక్కడి జీఎంసీ బాలయోగి స్టేడియం ముస్తాబవుతోంది. పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి.నారాయణసామి చేతుల మీదుగా ఈనెల 6న ప్రారంభం కానున్న ఉత్సవాలు పూల ప్రేమికులకు, కళాప్రియులను మరోమారు మధురానుభూతులు అందించనున్నాయి. యానాం కళాకారుల ప్రదర్శనలతో మొదలయ్యే ఉత్సవాల్లో ప్రముఖ భరత నాట్యం కళాకారిణి ఘంటశాల పార్వతీ రవి శిష్య బృందం భరతనాట్యం ప్రదర్శనలు, ఒడిశా కళాకారుల శాస్త్రీయ నృత్యం, ఏషియన్ విన్నర్ అక్తర్ 'మ్యాజిక్ షో', షాడో డాన్స్, విశాఖపట్నం హాట్ స్టెప్పర్స్ డాన్స్, ఆఫ్రికన్ సఫారీ కోబ్రా డాన్స్‌లు ఉంటాయి. 7న నృత్యపోటీల విజేతల ప్రదర్శన, కోల్‌కతా కళాకారుల డ్యాన్స్, సినీ కళాకారుల ఫిల్మీ డ్యాన్స్, విశాఖపట్నం పల్లవి బృందం నృత్యం, కోల్‌కతా కళాకారుల ఫ్యాషన్‌షో, నేషనల్ విన్నర్స్ ముంబై టీం బృందం, యానాం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యుల ప్రదర్శనలు ఉంటాయి. 8న ముగింపు వేడుకల్లో ఎం.ఎం.శ్రీలేఖ, గీతామాధురి, శ్రీకృష్ణ, మాళవిక, కృష్ణచైతన్య, హనుమాన్ తదితరుల స్వరాంజలి, టీవీ కళాకారుల కామెడీ పేరడీ, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ మ్యాజిక్ షోలను హైదరాబాద్ మేజిక్ అవర్ ఈవెంట్స్, వైజాగ్ విక్టరీ ఈవెంట్ మేకర్స్ ప్రదర్శించనున్నాయి. రూ.60 లక్షల వ్యయంతో జరిగే మూడు రోజుల ఉత్సవాల కోసం పుదుచ్చేరి ఆరోగ్య, పర్యాటక శాఖల మంత్రి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షణలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. బాలయోగి స్టేడియంలో రేయింబవళ్లు ఇందుకోసం పనులు నిర్వహిస్తున్నారు.

ఆడారు... అదరగొట్టారు

■ ఫైనల్‌లో కైట్, శ్రీచైతన్య జట్ల విజయం ■ ముగిసిన 'ఈనాడు క్రికెట్ ఛాంపియన్‌షిప్' జిల్లాస్థాయి పోటీలు



రాజమహేంద్రవరం శ్రీచైతన్య జూనియర్ కళాశాల, కోరంగి కైట్ డిప్లమో కళాశాల జట్ల మధ్య జరిగిన ఫైనల్స్ పోటీ

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: వరుస విజయాలతో దూసుకెళ్లిన జట్టు ఫైనల్స్‌లో చతికిలపడింది.. తుది పోరులో తప్పక విజయం సాధిస్తామనుకొని దీమాగా ఆడిన జట్టు అనుకోకుండా ఓటమి చవిచూసింది. 'ఈనాడు-ఈతరం' క్లబ్ ఆధ్వర్యంలో నారాయణ విద్యాసంస్థల సహకారంతో కొనసాగిన స్రైట్ ఈసీసీ కప్-2017 జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. కాకినాడ రంగరాయ వైద్యకళాశాల క్రీడామైదానం వేదికగా జరిగిన ఫైనల్స్‌లో సీనియర్స్ విభాగంలో కైట్ ఇంజినీరింగ్ కళాశాల, జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల(రాజమహేంద్రవరం) జట్లు విజేతలుగా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంయుక్త కలెక్టర్ ఎ.మల్లికార్జున, తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు, నారాయణ విద్యాసంస్థల కాకినాడ డీన్ కృష్ణ, రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మహాలక్ష్మి, పీడీ డాక్టర్ కె.స్పర్జన్‌రాజు, 'ఈనాడు' తూర్పుగోదావరి జిల్లా యూనిట్ మేనేజరు ఎ.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో క్రీడా మైదానాలు కరవవుతున్న నేపథ్యంలో ఈనాడు రెండు వేలమంది క్రీడాకారులను ఒకచోట చేర్చి ఇటువంటి భారీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ ఆటలు జీవితంలో భాగం కావాలని, ఆటలే జీవితం కారాదన్నారు. కోట్లాదిమంది క్రికెట్ ఆడుతున్నప్పటికీ కేవలం 11 మంది భారతజట్టు తరపున ఆడుతుంటారని, అలాకాకుండా ప్రతి ఒక్కరూ ఏదొక క్రీడాంశాన్ని ఎంచుకొని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. నారాయణ విద్యాసంస్థల కాకినాడ డీన్ కృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు చేయాల్సిన పనిని 'ఈనాడు' బాధ్యతగా చేపట్టి వేలాదిమంది క్రీడాకారుల ప్రతిభను వెలికితీసుకొచ్చేలా టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మహాలక్ష్మి మాట్లాడుతూ క్రికెట్ క్రీడకు చాలా ఆదరణ ఉందని, పిల్లల దగ్గర్నుంచి పెద్దల వరకు క్రికెట్ ఆట ఆడుతున్నారన్నారు. పీడీ కె.స్పర్జన్‌రాజు మాట్లాడుతూ ఒక టోర్నమెంట్‌ను జిల్లాస్థాయిలో వేలాదిమంది క్రీడాకారులతో ఇంత పక్కాగా నిర్వహించటం అభినందనీయమన్నారు. పౌష్టికాహారం దగ్గర్నుంచి వారికి రక్షణ, ప్రథమ చికిత్స వరకు అన్నింటా నాణ్యమైన నిర్ణయాలతో టోర్నమెంట్‌ను అద్భుతంగా నిర్వహించారన్నారు. విజేతలకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. విజేతలుగా నిలిచిన శ్రీచైతన్య జట్టు కేకును తేగా జేసీ దాని కోసి క్రీడాకారులందరికీ పంచిపెట్టారు.



ప్రసంగిస్తున్న తిరుమల విద్యా సంస్థల అధినేత తిరుమలరావు

పొదుపుగా పరుగులిచ్చి విజయ తీరానికి చేర్చారు

సీనియర్స్ విభాగంలో కైట్ పీజీ, కైట్ ఇంజినీరింగ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వార్ వన్‌సైడ్ అయ్యింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఇరుజట్లు ఫైనల్స్‌లో తలపడటంతో ప్రతి ఒక్కరిలో ఉత్కంఠత నెలకొంది. మొదట బ్యాటింగ్ చేసిన కైట్ ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది. ఈ జట్టులో సాయికిరణ్ 21బంతుల్లో 31, బాబి 12 బంతుల్లో 18 పరుగులు చేశారు. తొలుత మూడు పరుగులకే హిట్టర్ రాజా ఔటవ్వటంతో కైట్ పీజీ జట్టు సంబరాల్లో తేలింది. తర్వాత వచ్చిన సాయికిరణ్, బాబి క్రీజులో నెమ్మదిగా నిలదొక్కుకొని అవసరమైన పరుగులు రాబట్టాడు. దీంతో 83పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ప్రత్యర్థిజట్టు ముందుంచింది. ప్రతి మ్యాచ్‌లోనూ 100పరుగులు తక్కువకాకుండా చేస్తూ వచ్చిన కైట్ పీజీ జట్టుకు ఇది ఏమాత్రం పెద్దస్కోరు కాదు. క్రీజులోకి దిగిన కైట్ పీజీ జట్టుకు మొదటి ఓవరు మూడోబంతికే దుర్గాపవన్ ఎల్బీగా వెనుదిరిగాడు. కెప్టెన్ వీరూ కూడా కేవలం 7 పరుగులకే వికెట్ కోల్పోయాడు. వీరిద్దరూ మంగళవారం జరిగిన సెమీఫైనల్స్‌లో 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో కైట్ పీజీ జట్టుకు కోలుకోలేని దెబ్బతగిలింది. ఇక జట్టులో ఒకింత నిరూత్సాహం వచ్చి వచ్చిన క్రీడాకారుడు వచ్చినట్లే పెవిలియన్ బాట పట్టారు. ఈ జట్టులో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయకపోవటం గమనార్హం. కైట్ ఇంజినీరింగ్ జట్టులోని రాజ్‌కుమార్ రెండు ఓవర్లకు ఒక పరుగు ఇచ్చి 2 వికెట్లు, అవినాష్ 6 పరుగులిచ్చి ఒక వికెట్ తీసి పొదుపుగా బౌలింగ్ చేయడంతో కైట్ పీజీ జట్టు 6 వికెట్ల నష్టానికి 58 పరుగులు మాత్రమే చేసింది.

వికెట్లు తీసి విజయం సాధించి...

జూనియర్స్ విభాగంలో కైట్ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీచైతన్య జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 67 పరుగులు సాధించింది. ఈ జట్టులో పి.సుధీర్ 5 బంతుల్లో 15 పరుగులు చేశాడు. ఒక సిక్స్, 5 ఫోర్లు కొట్టి మంచి ఊపుమీదున్న సమయంలో తోటి క్రీడాకారుడు అనవసరమైన రెండో రన్‌కు పరుగెట్టి ఔటయ్యాడు. ప్రమోద్ 10 బంతుల్లో 9, జి.విజయ్ 13 బంతుల్లో 8 పరుగులు చేయడంతో 67పరుగులు వచ్చాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కైట్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు మొదట్నుంచి ధీమాతో ఆడింది. అనవసరమైన షాట్లు కొట్టబోయి మొదటి మూడు ఓవర్లకే మూడువికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్లు పరుగులు సాధించాలనే తొందరలో వికెట్లును కోల్పోయారు. దీంతో 9.1 ఓవర్లకు 46 పరుగులకే ఆలౌటయ్యారు. దీంతో శ్రీచైతన్యజట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ జట్టులోని పి.సుధీర్ రెండు ఓవర్లకు కేవలం 7 పరుగులిచ్చి 4 వికెట్లు, ప్రమోద్ 13 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు.





విజేతలు కోరంగి కైట్ కళాశాల (సీనియర్స్), రాజమహేంద్రవరం శ్రీచైతన్య జూనియర్ కళాశాల (జూనియర్స్) క్రీడాకారులకు ట్రోఫీ, ప్రశంసా పత్రాలను అందిస్తున్న జేసీ మల్లికార్జున, పక్కన తిరుమల విద్యాసంస్థల అధినేత తిరుమలరావు, ఈనాడు యూనిట్ ఇన్‌ఛార్జి ఎ.వెంకటేశ్వరరావు, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మహాలక్ష్మి, కాకినాడ నారాయణ విద్యాసంస్థల డీన్ కృష్ణ, రంగరాయ వైద్య కళాశాల పీడీ స్పర్జన్‌రాజు

జీజీహెచ్‌లో నేటి ఓపీ సేవలు

బాలాజీ చెరువు(కాకినాడ): కాకినాడ ప్రభుత్వ సామాన్యాసుపత్రి(జీజీహెచ్)లో గురువారం అందుబాటులో ఉండనున్న ఓపీ సేవల వివరాలివి.

ఓపీ విభాగం	సేవలందించే రూం.నం	ఓపీ విభాగం	సేవలందించే రూం.నం
నరాల వ్యాధులు	3	చర్మ, సుఖ వ్యాధులు	14
మెడికల్	4	చిన్నపిల్లలు	15
న్యూరో సర్జరీ	5	చెవి, ముక్కు, గొంతు	16
ప్లాస్టిక్ సర్జరీ	5	దంత సంబంధ సమస్యలు	17
ఛాతి, టీబీ	5ఎ	నేత్ర సంబంధ సమస్యలు	18
ఎముకలు	9	క్యాన్సర్	64
జనరల్ సర్జరీ	10	ఫిజియోథెరపి	65
సైకియాట్రి	10ఎ	నొప్పి నివారణ చికిత్స	66
గర్భిణులు	11ఎ	ఏఆర్‌టీ ప్రసూతి	67
స్త్రీ వ్యాధులు	11బి		

జీజీహెచ్‌లో వివిధ వైద్య సేవల మార్గ నిర్దేశానికి పర్యవేక్షణాధికారి భవంతి కింది అంతస్తులో సహాయ విభాగం ఉంది. రోగుల సహాయకులకు నామమాత్రపు ధరతో మధ్యాహ్న భోజన వసతి సుభోజనం పేరిట సర్జికల్ విభాగం వద్ద అందుబాటులో ఉంది. వార్డులు, ఇతర వైద్య సేవలందించే ప్రదేశాలలో అక్కడి సిబ్బంది లంచం కోరడం, ఇతర సమస్యలను నేరుగా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు 0884-2302003, 0884-2302158, 0884-2302002 నంబర్లలో సంప్రదించవచ్చు. అమర్‌నాథ్ యాత్రికుల కోసం ఇచ్చే వైద్య ధ్రువీకరణ పత్రాలను సోమవారం నుంచి శనివారం మధ్య కార్యాలయ పనివేళల్లో మంజూరు చేస్తారు.

పోలవరం పరిహారం పంపిణీకి సిద్ధం

➠ సమస్యలు తీరడంతో తగ్గిన అర్జీలు ➠ ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప

చింతూరు: పోలవరం నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. చింతూరులో ఏర్పాటు చేసిన ఎంవీఐ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చింతూరు ఐటీడీఏలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విలీన మండలాల్లోని నిర్వాసితులకు ఎటపాక మండలంలో నాలుగుచోట్ల, కూనవరం మండలంలో ఒక దగ్గర నిర్వాసిత కాలనీల నిర్మించనున్నట్లు చెప్పారు. దీని కోసం చింతూరు కేంద్రంగా ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధే మంత్రంగా పనిచేస్తూ.. ప్రధానమైన విద్యుత్తు, రహదారులు, గృహాలు, కమ్యూనికేషన్, తాగునీటి సదుపాయాలపై దృష్టి సారించిందన్నారు. గతంలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించడంతో ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంలో అర్జీలు తగ్గాయని వివరించారు. అటవీ అభ్యంతరాలతో నిలిచిపోయిన రహదారులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



వాహనదారుడికి లెర్నింగ్ లైసెన్సు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి

ఎంవీఐ కార్యాలయం ప్రారంభం

చింతూరు కేంద్రంగా ప్రభుత్వ మంజూరు చేసిన ఎంవీఐ కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర విభజన తరువాత విలీన మండలాల్లో వాహనదారుల ఇబ్బందులు తొలగించేందుకు ఎంవీఐ కార్యాలయాన్ని ప్రభుత్వ మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 50 ఆన్‌లైన్ సేవల్లో దాదాపు 40 వరకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్తికేయమిశ్ర, రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషిక్త్‌కిషోర్, డీటీసీ వెంకటేశ్వరరావు, ఆర్టీవో సిరిఆనంద్, ఎంవీఐలు ప్రవీణ్, రాంబాబు, డీఎఫ్‌వో నందని సలారియా, చింతూరు ఓఎస్డీ అంబురాజన్, కాకినాడ వోఎస్డీ రవిశంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, బాబూరమేష్, విలీన మండలాల తెదేపా ఇన్‌ఛార్జి కొమరం ఫణీశ్వరమ్మ పాల్గొన్నారు.

యాంకరేజ్ పోర్టులో స్తంభించిన కార్యకలాపాలు

సమ్మెకు దిగిన 1600 మంది కార్మికులు

కాకినాడ నగరం: యాంకరేజ్ పోర్టులో బార్జి యజమానుల సమ్మె కారణంగా నెలకొన్న ప్రతిష్టంభన మరింత ముదిరి పాకానపడింది. బార్జి యజమానులను సమ్మె విరమింపచేసేందుకు పోర్టు అధికారులు చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. ఇంతలోనే కార్మికులు సమ్మెలోకి వెళ్లటంతో పోర్టులో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. గత రెండు రోజులుగా బార్జి యజమానులు సమ్మెకు దిగారు. దాంతో యాంకరేజ్ పోర్టులో కార్యకలాపాలు మందగించాయి. పోర్టు అధికారులు రంగంలోకి దిగారు. బార్జి యజమానులతో దఫదఫాలుగా సంప్రదింపులు జరిపారు. ఎట్టకేలకు వారు దిగిరావటంతో పోర్టు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ లోపు తాము సమ్మెలోకి వెళుతున్నట్లు పోర్టు కార్మికులు అకస్మాత్తుగా ప్రకటించారు. ఒకేసారి 1600 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. బార్జి యజమానుల తీరుపై అసంతృప్తితోనే వారు సమ్మెలోకి వెళ్లినట్లు సమాచారం. పోర్టులో మొత్తం ఎగుమతి, దిగుమతులు, ఇతర కార్యకలాపాలు పూర్తిగా స్తంభించాయి. వీరంతా రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెల్సింది. వీరంతా స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు నివాసానికి చేరుకుని రాత్రిపొద్దుపోయేవరకూ తమ వాదనలు వినిపిస్తున్నట్లు సమాచారం. దాంతో ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుదోనని అటు కార్మిక, బార్జి యజమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రతిభ



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.

ఆహారానికి ఏదీ భద్రత...?

జనరల్ స్టడీస్

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.

✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.

✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> *అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.

✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.

✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.

✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.

✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

> *ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:

డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

ఏపీ టెట్

చరిత్ర

- సుమారు 100 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది.
- భూమిపై ఆవిర్భవించిన తొలి జీవ పదార్థం లార్వా.
- ప్లాజిల్లేటాను ప్రాథమిక జీవరాశిగా పేర్కొంటారు.
- ఏప్స్ అనే తోకలేని కోతి నుంచి మానవుడు ఆవిర్భవించాడు.
- మానవుడు నివసించిన తొలి ఖండం ఆఫ్రికా. ఆఫ్రికాలోని ఆదిమానవుడిని ఆస్ట్రలో పిథికస్ అంటారు.

ప్రతిభ

భారత్‌లో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం..?

ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు

ఆదిమానవుడు

- భారతదేశంలో నివసించిన ఆదిమానవుడిని రామా పిథికస్ అంటారు.
- ఐరోపాలో నివసించిన ఆదిమానవుడిని నియాండెర్తల్ నరుడు అంటారు.
- మొదటి మేధావి మానవుడిగా హోమో ఎరక్టస్‌ను పేర్కొంటారు.
- ఆధునిక మానవుడి శాస్త్రీయ నామం హోమో సెపియన్
- మానవుడి అభివృద్ధి మొత్తం 5 దశల్లో జరిగింది.
- ఆదిమానవుడి కాలాన్ని మూడు యుగాలుగా విభజించారు. అవి: 1. ప్రాచీన శిలాయుగం, 2. మధ్య శిలాయుగం, 3. నవీన శిలాయుగం
- ప్రాచీన, మధ్య శిలాయుగాల్లో మానవుడు వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని సంచార జీవితాన్ని గడిపేవాడు. ఈ యుగాల్లో మానవుడు ఆహార సేకరణ/ ఆహార అన్వేషణ దశలో ఉండేవాడు.
- ప్రాచీన శిలాయుగంలో మానవుడు పెద్ద పెద్ద బండరాళ్లను పెచ్చులుగా కొట్టి ఆయుధాలుగా ఉపయోగించేవాడు. వాటినే ఛేదకాలు, దరకాలు, చేతి గొడ్డళ్లు అనేవారు.
- మానవుడు చేతి గొడ్డలిని వాడిన కాలం ప్రాచీన శిలాయుగం.
- మధ్య శిలాయుగంలో అతిచిన్న రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించాడు. కాబట్టి ఈ యుగాన్ని సూక్ష్మ శిలాయుగం అంటారు.
- సూక్ష్మ శిలాయుగంలో మానవుడు నిప్పును కనుక్కున్నాడు. జంతువులను మచ్చిక చేసుకున్నాడు.
- నవీన శిలాయుగంలో మానవుడు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా మార్చుకుని, స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుగంలో రాతి గొడ్డలి, రాతి కొడవలి, రాతి పారలను ఆయుధాలుగా ఉపయోగించాడు.
- మధ్యప్రదేశ్‌లోని నంద్రా గ్రామంలో రాతి పనిముట్లు లభించాయి.
- జమ్మూ కశ్మీర్‌లో రాతితో చెక్కిన పరికరాలు లభించాయి.
- ఝార్ఖండ్‌లో పురాతన రాతి పనిముట్లు లభించాయి.
- తమిళనాడులోని గుడియం గుహల నుంచి సూక్ష్మరాతి పరికరాలను వెలికితీశారు.
- మహారాష్ట్రలోని నెవాస ప్రాంతంలో నవీన శిలాయుగపు పనిముట్లు లభించాయి.
- ఆదిమానవుడు ఉపయోగించిన రాతి గొడ్డలి ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కామకూర్‌లో లభించింది.
- కర్నూలు జిల్లాలోని బెలూమ్ గుహలు, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో ఆదిమానవుడి ఆనవాళ్లను కనుక్కున్నారు.
- ఎముకలతో చేసిన పనిముట్లు కర్నూలు జిల్లాలోని ముచ్చర్ల చింతమానులో లభించాయి (ఇవి భారత ఉపఖండంలో ఇంకెక్కడా దొరకలేదు).
- ఆదిమానవుడు గుహల్లో చిత్రాలను గీసేవాడు.
- వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదిమానవుడి పది రాతి చిత్రకళా స్థావరాలు లభించాయి.
- చింతకుంట రాతి చిత్రకళా స్థావరాల్లో మొత్తం 200 చిత్రాలున్నాయి. వీటిలో 10 తెలుపు రంగులో ఉండగా మిగిలినవి ఎరుపు రంగులో ఉన్నాయి.
- ఎరుపు రంగు చిత్రాల్లో ఒకే గుహలోని మూపురం ఉన్న ఎద్దు చిత్రం ప్రసిద్ధి చెందింది. ఈ గుహను స్థానికంగా ఎద్దుల, ఆవుల గుండు అని పిలుస్తారు.

ఆంధ్రదేశంలో ఉన్న ఇతర రాతి చిత్ర కళా స్థావరాలు

- బొల్లారం, కాలువబుగ్గ, కేతవరం, ఆధోని - కర్నూలు జిల్లా.
  - శ్రీకాళహస్తి, రేణిగుంట, వెంబ ఖండ్రిగ - చిత్తూరు
  - నాయుడుపల్లె, సింగరాయకొండ - ప్రకాశం
  - వెల్పుమడుగు, భోగదవి తెనగల్ - అనంతపురం
  - చింతకుంట, దాపల్లి - కడప
  - కావలి, నందిపాడు - నెల్లూరు
  - వినుకొండ - గుంటూరు
- 12000 సంవత్సరాల నుంచి మానవులు వ్యవసాయం చేసి, పంటలు పండించడం ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు.



రచయిత
బొత్స నాగరాజు
విషయ నిపుణులు

- **భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్లు లభించిన ప్రాంతాలు**
  బెలూచిస్థాన్ - 9000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  కశ్మీర్ - 5000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  బిహార్ - 4000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 5000 సంవత్సరాల కిందటి బూడిద దిబ్బలు బయటపడ్డాయి.
- అనంతపురం జిల్లాలోని పొత్పాయిలో బూడిద దిబ్బలు/ మసి దిబ్బలు వెలుగు చూశాయి.
- ఆదిమానవులు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు.
- మన రాష్ట్రంలో నేటికీ యానాదులు, చెంచులు సంచార జీవితాన్ని గడుపుతున్నారు.
- ఆదిమానవులు పురుషులు, స్త్రీలు, పిల్లలు అంతా కలిసి గుంపులు, గుంపులుగా వేటకు వెళ్లేవారు.
- వేట బాగా జరగాలని జంతువులు, వృక్షాలు, నదులు, పర్వతాలను పూజించేవారు.
- ఆదిమానవుడు తన ఆహార పదార్థాలను మట్టి పాత్రలు/ కుండల్లో దాచుకునేవాడు.
- చనిపోయిన వారికి రాక్షసగుళ్ల పేరుతో సమాధులు నిర్మించేవారు.

సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం

- 2700 సంవత్సరాల కిందట ప్రజలు గంగా, యమునా పరీవాహక ప్రాంతాల్లో స్థిరపడ్డారు.
- సంస్కృత భాషలో జన అంటే తెగ, పదం అంటే స్థిరపడిన ప్రాంతం.
- మహా జనపదాల కాలంలో దిల్లీ, ఆత్రంజిఖేర, కౌశాంబి, పట్నా, అయోధ్య, రాజగిర్ లాంటి నగరాలు అభివృద్ధి చెందాయి. (రెండో నగరీకరణ).
- గమనిక: సింధు నాగరికత కాలాన్ని తొలి నగరీకరణగా పేర్కొంటారు.
- 16 మహాజనపదాల్లో 14 జనపదాలు రాచరిక వ్యవస్థను, 2 జనపదాలు గణతంత్రాలను కలిగి ఉండేవి.
- వజ్జి, మల్ల నాటి రెండు గణతంత్రాలు.
- ఎన్నికైన రాజ్యాధినేత ఉన్న రాజ్యాలను గణతంత్రాలుగా పేర్కొంటారు.
- భారతదేశంలో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం మగధ సామ్రాజ్యం.
- వజ్జి గణరాజ్యం మగధకు ఉత్తర దిక్కులో ఉండేది.
- మహిళలు, బానిసలు, సేవకులకు గణరాజ్య సభల్లో పాల్గొనే హక్కు లేదు.
- బుద్ధుడు, మహావీరుడు గణ రాజ్యాలకు చెందినవారే.
- **మగధ తొలి సామ్రాజ్యంగా ఆవిర్భవించడానికి దోహదపడిన అంశాలు:**
  - శక్తిమంతమైన రాజులు, వంశాల పాలన
  - ఇనుప గనులు విస్తారంగా ఉండటం
  - సారవంతమైన నదీ తీరప్రాంతాలు ఉండటం.
- మగధ రాజ్యం గంగానదికి రెండు వైపులా విస్తరించి ఉంది.
- మగధ దక్షిణ భాగంలో ఇనుప గనులు విస్తారంగా ఉన్నాయి.
- హర్యంక వంశానికి చెందిన బింబిసారుడు, అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు.
- మహాపద్మనందుడి కాలంలో మగధ వాయవ్యం నుంచి ఒడిశా వరకు విస్తరించింది.
- మహాజనపదాల కాలంలో భూయజమానులను గృహపతి/ గాహపతి అనేవారు.
- వ్యవసాయ కూలీలను భర్తుకా అని, బానిసలను దాసులు అని పిలిచేవారు.
- యుద్ధంలో ఓడిపోయిన సైనికులను దాసులుగా మార్చేవారు.
- రాజులు సిరిసంపదలతో ఉండటానికి పన్నులు అధికంగా వసూలు చేయడంతోపాటు నిత్యం ఇతర రాజ్యాలపై దండయాత్రలు చేసేవారు.
- పట్టణాల్లో ఉండే వృత్తిపనివారు ఒకరోజు రాజు పొలంలో ఉచితంగా పని చేయడం ద్వారా వృత్తి పన్ను చెల్లించేవారు.
- రైతులు రాజుకు చెల్లించే భూమి శిస్తును 'భాగ' అనేవారు. ఇది పంటలో 1/6 వంతు.
- గేందుల గ్రామపెద్ద పట్టాను పోలి ఉండేవాడు.
- గ్రామంలో అధిక ధనవంతుడైన వ్యక్తిని గ్రామపెద్దగా నియమించేవారు.
- గ్రామపెద్ద పాలనా, న్యాయ, పోలీస్ విధులు నిర్వహించేవాడు.
- నాణేల ముద్రణ, ఉపయోగం మహాజనపదాల కాలంలోనే ప్రారంభమైంది.

మొదటి సామ్రాజ్యాలు

- మౌర్య వంశ, మౌర్య రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. గొప్పవాడు అశోకుడు.
- మౌర్యుల పాలనకు ఆధారాలు: అశోకుడి శాసనాలు, అర్థశాస్త్రం, ఇండికా.
- కౌటిల్యుడు సంస్కృత భాషలో రచించిన అర్థశాస్త్రం ఒక పాలనాశాస్త్రం.
- గ్రీకు రాయబారి మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో ఇండికా గ్రంథాన్ని గ్రీకుభాషలో రాశాడు.
- మౌర్యుల కాలంలో రాజ్యం నేటి అఫ్గనిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.
- మౌర్యుల రాజధాని పాటలీపుత్రం.
- పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం చక్రవర్తి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది.
- అధికారుల పనితీరును వేగుల ద్వారా రాజులు తెలుసుకునేవారు. దూతల ద్వారా రాజు తన సందేశాలను అధికారులకు పంపేవాడు.
- తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి, తోశాలి లాంటి ప్రాదేశిక రాజధానులను రాజకుమారులు పరిపాలించేవారు. వారిని గవర్నర్లు/ కుమారామాత్యులుగా పిలిచేవారు.
- మౌర్యుల కాలంలో సువర్ణగిరి బంగారు గనులకు ఎంతో ప్రసిద్ధి చెందింది.
- తక్షశిలలో విదేశీ వస్తువులు విరివిగా దొరికేవి.
- భారతదేశంలో తొలి శాసనాలు వేయించింది అశోకుడు. అతడి శాసనాలు ఎక్కువగా ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.
- 'నేను చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు కళింగయుద్ధం (క్రీ.పూ. 261) చేశాను' అని అశోకుడు తన 13 వ శిలాశాసనంలో (ధౌళి/ జౌగాడ శాసనం) పేర్కొన్నాడు.
- కళింగ యుద్ధంలో లక్షమందికి పైగా మరణించడంతో అశోకుడు హృదయ పరివర్తన చెంది, యుద్ధాన్ని త్యజించాడు.
- ఉపగుప్తుడి సలహాతో అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.
- ధమ్మ/ ధర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి ధర్మ మహామాత్రులు అనే ఉద్యోగులను నియమించాడు.
- ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ అనేది సంస్కృత పదం.
- సిరియా, ఈజిప్ట్, గ్రీస్, శ్రీలంక దేశాల్లో ధర్మాన్ని ప్రచారం చేయడానికి రాయబారులను పంపాడు.
- మనుషులకే కాకుండా జంతువులకు కూడా వైద్య సదుపాయాలు కల్పించిన తొలి భారతీయ చక్రవర్తిగా అశోకుడు పేరొందాడు.
- మౌర్యులకు సామంతులుగా ఉన్న శాతవాహనులు దక్కన్‌లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు.
- శాతవాహనుల రాజధాని ధాన్యకటకం (అమరావతి).
- గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీ పుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి రాజులు గొప్పవారు.
- అమరావతి, భట్టిప్రోలు, వడ్డమానుకొండ లాంటి ప్రాంతాల్లో బౌద్ధ ఆలయాలు, స్తూపాలను నిర్మించారు.
- రోమ్, బెంగాల్‌తో సముద్ర వ్యాపారం చేశారు.
- రోమన్ నాణేలు, రోమ్ శైలి కుండలు వీరి రాజ్య భాగాల్లో లభించాయి.
- పులోమావి పాలనాకాలం నాటి మ్యాకదోని శాసనం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో దొరికింది.
- పులోమావి 8 వ పాలనా సంవత్సరంలో మ్యాకదోని శాసనం వేశారు.
- పులోమావి మహాసేనాపతి స్కందనాగుని శాతవాహన ఆహారంలో కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగ నాయకుడు సమ్మ ఒక చెరువును తవ్వించినట్టు మ్యాకదోని శాసనం పేర్కొంటోంది.
- వేపుర గ్రామాధిపతి - కుమారదత్త. కాంత తెగ నాయకుడు - సమ్మ
- శాతవాహనులను ఓడించి క్షాంతమూలుడు ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించాడు.
- ఇక్ష్వాకుల రాజధాని విజయపురి (కృష్ణానది తీరం, నాగార్జున కొండ ప్రాంతం)
- వీరు రాముడి వంశానికి చెందినవారుగా చెప్పుకున్నారు.
- క్షాంతమూలుడు, వీరపురుషదత్తుడు లాంటి రాజులు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశారు.
- నాగార్జున కొండవద్ద అతిపెద్ద ఆరామం, స్తూపం నిర్మించారు. (స్తూపం, చైత్యం, విహారం ఈ మూడూ ఉన్న ప్రాంతాన్ని ఆరామం అంటారు.)

భారత ఉపఖండంలో కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు

కుషాణులు

- కుషాణులు రెండువేల సంవత్సరాలకు పూర్వమే చైనా ప్రాంతం నుంచి వలస వచ్చి అఫ్గనిస్థాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- కుషాణుల్లో గొప్పవాడు కనిష్కుడు.
- కనిష్కుడు క్రీ.శ. 78 లో సింహాసనాన్ని అధిష్ఠించి, శక యుగాన్ని ప్రారంభించాడు.
- శక యుగాన్నే శాలివాహన శకం లేదా శతాబ్దంగా పేర్కొంటున్నారు.
- భారతదేశం శక క్యాలెండర్‌ను అనుసరిస్తోంది. శక యుగం సాధారణ యుగానికి 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.
- భారత్‌లో కుషాణుల కాలంలో ఇరాన్, చైనా, రోమ్ దేశాలతో వ్యాపారం బాగా జరిగేది.

గుప్తులు

- గుప్తులు బిహార్‌లోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- గుప్త వంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. (క్రీ.శ. 320 లో శ్రీగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినట్టు చెబుతారు)
- గుప్త రాజ్య స్థాపకుడు మొదటి చంద్రగుప్తుడు.
- గుప్త రాజుల్లో గొప్పవాడు రెండో చంద్రగుప్తుడు. ఇతడి బిరుదు విక్రమార్కుడు.
- రెండో చంద్రగుప్తుడి కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులు ఉండేవారు. నవరత్నాల్లో కాళిదాసు గొప్పకవి.
- **ముఖ్యమైన గుప్తరాజులు:** మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కందగుప్తుడు.

చిన్నారుల కళ్లలో పండుగ వెలుగులు

➢ డ్వాక్రా మహిళల పిల్లలకు ఉపకార వేతనాలు మంజూరు

➢ జిల్లాలో 1,69,937 మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ

న్యూస్‌టుడే, సీతానగరం

స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక పరిపుష్టితోపాటు వారి కుటుంబాల్లో చదువుకునే పిల్లలకు ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఆమ్‌ఆద్మీ, అభయహస్తం, జనశ్రీబీమా, స్వావలంబన, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల యోజన పేరుతో ఉపకార వేతనాలు ఇస్తున్నారు. ప్రధాన మంత్రి - చంద్రన్నబీమా పథకం వచ్చిన తర్వాత కొన్ని పథకాలను దానిలోకి విలీనం చేశారు. గతంలో వేలల్లో ఉపకార వేతనాలు అందుకునే విద్యార్థులు ఉంటే జిల్లాలో చంద్రన్న బీమా నమోదు 28.30 లక్షలకు పెరగడంతో ఉపకార వేతనాలు అందుకునే వారి సంఖ్య లక్షలకు పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకు రూ.కోట్ల సొమ్ము రావాల్సి ఉన్నా సాంకేతిక కారణాలతో గతేడాది పంపిణీలో జాప్యం అయింది. ఎట్టకేలకు జన్మభూమి కార్యక్రమాల్లో విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పత్రాలను అందిస్తూ వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవడంతో సంక్రాంతి పండుగ కానుక పేద విద్యార్థులకు వరంగా మారింది.

చిన్నారుల అవసరాలు తీరుతున్నాయి

స్వయం సహాయక సంఘాల కుటుంబాల్లో 9, 10 తరగతులతోపాటు ఇంటర్ లేదా ఐటీఐ సాంకేతిక కోర్సుల్లో ఉండే విద్యార్థులకు ఏటా రూ.1,200 వంతున వరుసగా నాలుగేళ్లపాటు రూ.4,800 ఉపకార వేతనాలు ఇస్తారు. విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఉపకార వేతనాలు వస్తుండడంతో దుస్తులు, పుస్తకాలు, ఇతరత్రా అవసరాలు తీరుతున్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే స్వయం సహాయక సంఘాల మహిళల పిల్లలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలను వెలుగు కార్యాలయాల ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చేరవేస్తున్నారు. ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున వెలుగు ఆధ్వర్యంలో విద్యార్థులకు చెక్కుల రూపేణ అందించేవారు. ఈ ఏడాది ఉపకారవేతనాలు తీసుకునే విద్యార్థుల సంఖ్య జిల్లాలో గణనీయంగా పెరిగింది.



వంగలపూడి పాఠశాలలో విద్యార్థులకు వెలుగు ఆధ్వర్యంలో మంజూరు పత్రాలు అందిస్తున్న చిత్రం

అయిదేళ్లుగా పరిస్థితి..

సంవత్సరం	ఆమ్‌ఆద్మీ	అభయహస్తం	మొత్తం నిధులు (రూ.కోట్లలో)
2012–13	17,395	40,371	రూ.6.93
2013–14	16,729	47,774	రూ.7.74
2014–15	15,039	48,265	రూ.7.59
2015–16	13,147	45,108	రూ.7.35

2016-17 ఈ ఏడాది ఆమ్ ఆద్మీ 25,750, అభయ హస్తం 26,662తో పాటు కొత్తగా చంద్రన్న బీమాలో 1,40,819 మంది విద్యార్థులు పెరిగారు. మొత్తం జిల్లాకు 1,93,231 మందికిగాను సుమారు రూ.23.18 కోట్ల సొమ్ము రావాల్సి ఉంది. ఉపకార వేతనాలు తీసుకోవాల్సిన విధానాల్లో చేసిన మార్పులతో వీరిలో 23,294 మంది విద్యార్థులకు సాంకేతిక సమస్యలు వచ్చాయి. దీంతో మొత్తం విద్యార్థులకు ఉపకార వేతనాలు నిలిచిపోయాయి. గతంలో మండల కార్యాలయాల్లో ఉండే వెలుగుకు ఈ నిధులు వచ్చేవి. వాటిని విద్యార్థులకు స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేసేవారు. ఇలా పంపిణీ చేసే సమయంలో పలు చోట్ల చేతివాటం తప్పేది కాదు. దీనిని గుర్తించిన పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాకే ఉపకార వేతనాలు జమ అయ్యేలా నూతన విధానాన్ని తీసుకొచ్చింది. దీనికి విద్యార్థికి బ్యాంకు ఖాతాతోపాటు ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంది. ప్రతి విద్యార్థికి ఇవి తప్పనిసరిగా ఉండేలా మండల సమాఖ్యలకు, వెలుగు సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. సాంకేతిక సమస్యలు వచ్చిన విద్యార్థులను మినహాయించి మిగతా వారందరికీ ఎట్టకేలకు ఉపకార వేతనాలు వచ్చాయి. సాంకేతిక సమస్యలను పరిష్కరించి మిగతావారికి కూడా పేదరిక నిర్మూలన సంస్థ నేరుగా నిధులు పడేలా పనిచేస్తోంది.



ఉపకార వేతనాలు రావడంతో విద్యార్థుల కోలాహలం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల సంఖ్య

అమలాపురం	8,473	పిఠాపురం	10,240
అనపర్తి	8,885	ప్రత్తిపాడు	8,650
జగ్గంపేట	8,933	రాజామహేంద్రవరం నగరం	8,332
కాకినాడ గ్రామీణం	7,939	రాజమహేంద్రవరం గ్రామీణం	8,384
కాకినాడ నగరం	8,776	రాజానగరం	8,680
కొత్తపేట	10,334	రామచంద్రపురం	8,555
మండపేట	9,321	రంపచోడవరం	6,217
ముమ్మిడివరం	9,194	రాజోలు	7,114
పి.గన్నవరం	9,658	తుని	10,125
పెద్దాపురం	8,638	చింతూరు డివిజన్	3,525

సంక్షిప్త సందేశాలతో సరి

జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఆధార్ అనుసంధానం, బ్యాంకు ఖాతాలు సవ్యంగా ఉన్న వారికి వారిచ్చిన చరవాణి నంబర్లకు ఉపకార వేతనాలపై ప్రస్తుతం సంక్షిప్త సందేశాలను చేరవేస్తున్నారు. కొన్ని చోట్ల విద్యార్థులు ఇచ్చిన చరవాణి సంఖ్యలను మార్చేసుకోవడంతో అటువంటి వారికి సంక్షిప్త సందేశాలు వచ్చే పరిస్థితులు తెలియకుండాపోయాయి. దీంతో అందరికీ మంజూరు ఉత్తర్వులను అందించేలా జన్మభూమిని వేదికగా మార్చుకున్నారు. సాధికార సర్వే నివేదికల ఆధారంగా రూపొందించిన హామీ పత్రాలను ప్రస్తుతం జన్మభూమి గ్రామసభల్లో పంపిణీ చేస్తున్నారు. 2016-17వ సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 1,69,937 మంది విద్యార్థులకు రూ.20 కోట్ల 39 లక్షల 24 వేల 400లు మంజూరు చేశారు.

బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించుకోవాలి



జిల్లాలో ఆధార్, బ్యాంకు ఖాతాలు సవ్యంగా లేని విద్యార్థులుంటే గ్రామ సమాఖ్యల ద్వారా వాటిని పునరుద్ధరిస్తున్నాం. వాటిని సరి చేసేలా వెలుగు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. చంద్రన్న బీమా పథకం తర్వాత పరిహారం పెరగడంతోపాటు ఆయా కుటుంబాల్లో పిల్లలకు ఉపకార వేతనాలు గణనీయంగా పెరిగాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నుంచి నేరుగా విద్యార్థుల ఖాతాలకే సొమ్ములు పడిపోతాయి. పూర్తి పారదర్శకతతో వీటిని అందించేలా సాంకేతిక పరిజ్ఞానం తీసుకొచ్చాం. ఇక నుంచి ఆమ్ ఆద్మీ, అభయహస్తం పథకాలు చంద్రన్న బీమాలో కలిసిపోతాయి. జన్మభూమి కార్యక్రమాల్లో హామీ పత్రాలను అందుకోలేని విద్యార్థులు కంగారుపడనవసరం లేదు. వారి బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అవుతుంది.

—ఎ.కేశవరావు, డీపీఎం, సామాజిక భద్రత(వెలుగు), కాకినాడ

రాజమహేంద్రవరంలో సిరి మదుపరుల అవగాహన సదస్సు ఈ నెల 6న

ఈనాడు సిరి ఇన్వెస్టర్స్ క్లబ్ - హెచ్.డి.ఎఫ్.సి. మ్యూచువల్ ఫండ్ మరియు జియోజిత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సు ఈ నెల 6న రాజమహేంద్రవరంలో జరగనుంది. ఈ సదస్సులో ప్రముఖ స్టాక్ మార్కెట్ నిపుణులు పాల్గొని "ఈక్విటీ మార్కెట్‌లు - పెట్టుబడి అవకాశాలు మరియు మ్యూచువల్ ఫండ్స్" పై అవగాహన కల్పిస్తారు. ఈ సదస్సు లా హాస్పిన్ హోటల్, పుష్కర్ ఘాట్ దగ్గర, రాజమహేంద్రవరం నందు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. హాజరు కాదలచిన వారు ఉచిత సభ్యత్వ నమోదు కోసం 8008376262 నంబరులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు. SMS ద్వారా రిజిస్ట్రేషన్‌కు SIRIRJY<space>NAME To 9246190909. ప్రవేశం ఉచితం.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ: రాజమహేంద్రవరంలో గురు, శుక్రవారాల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి టి. అరుణ్ బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు కోటిపల్లి బస్టాండ్ నుంచి భారీ ప్రదర్శన బయలుదేరి, మెయిన్‌రోడ్డు, పుష్కరఘాట్ మీదుగా సుబ్రహ్మణ్యమైదానానికి చేరుకుంటుందన్నారు. ఈ ప్రదర్శనలో కొమ్ముడోళ్ల నృత్యం, రేల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన వెల్లడించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సుబ్రహ్మణ్య మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. సభలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకుంటారని తెలిపారు.

అమలాపురం

చలనచిత్రాలు అమలాపురం: **శ్రీ వెంకటరమణ (ఏసీ):** 2 కంట్రీస్, **వెంకటరామా(ఏసీ):** జుమాంజి, **వెంకట పద్మావతి సినీప్లెక్స్ (వి.పి.సి): స్క్రీన్: I** ఎంసీఏ, **స్క్రీన్:2** జవాన్ **శేఖర్ (ఏసీ) స్క్రీన్: I** హలో, **స్క్రీన్:2** ప్రోజెక్ట్-2, **రమా(ఏసీ):** ఒక్కక్షణం, **శ్రీ గణపతి:** ఆక్సిజన్.

నిన్నటి రైతుబజారు ధరలు (కిలో ఒక్కంటికి)

కె.అగ్రహారం: రైతుబజారు ఎస్టేటు అధికారి సి. హెచ్. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రైతుబజారు ధరలిలా ఉన్నాయి. టమోటా 14, వంకాయలు 24, బెండకాయలు 36, పచ్చిమిర్చి 28, బీరకాయలు 40, దొండకాయలు 28, బంగాళాదుంపలు 14, క్యారెట్ 55, ఉల్లిపాయలు 35, 40 కంద 30, క్యాబేజీ 25, అల్లం 50, ఆనబకాయ 18, దోసకాయ 28, చిలకడదుంపలు 35, బీట్‌రూట్ 35, క్యాలీఫ్లవర్ 15, చిక్కుడుకాయలు 30

హామీలు నెరవేర్చాలని డిమాండ్

అల్లవరం, న్యూస్‌టుడే: ఓడలరేవులోని వశిష్ట నిర్మాణ క్షేత్రం వద్ద గత కొన్ని రోజులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు బుధవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఓడలరేవు గ్రామాభివృద్ధి కోసం 18 రకాల డిమాండ్లపై లోగడ ఓఎన్జీసీ ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వాటిలో రెండు పనులకు సంబంధించి టెండర్లు పూర్తిచేశామని చెపుతున్న అధికారులు వెంటనే పనులు చేపట్టి అమలు చేయాలన్నారు. లేకుంటే త్వరలోనే వశిష్ట నిర్మాణ క్షేత్రంలో పనులను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. ఈనిరసనలో ఏఎంసీ వైస్‌ఛైర్మన్ కొల్లు సత్యనారాయణమూర్తి, అవనిగడ్డ శేషగిరిరావు, కొల్లు త్రిమూర్తులు, మల్లాడి ఉమామహేశ్వరరావు, నాతి లెనిన్‌బాబు, పెమ్మాని వెంకటరామారావు, పెచ్చేట్టి నరసింహరావు, అవనిగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● ఓడలరేవులోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామానికి చెందిన పలువురు చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 15వ రోజుకు చేరుకున్నాయి. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని విరమించే ప్రశక్తిలేదన్నారు. దీక్షాశిబిరాన్ని కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం, బీసీ సెల్ అధ్యక్షుడు చింతా రామకృష్ణ, కోనసీమ అగ్నికుల క్షత్రియ గౌరవ అధ్యక్షుడు కర్రి రామస్వామినాథ్, కారాడి శ్రీధర్, స్వామి తదితరులు సందర్శించారు.

విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఈదరపల్లి(అమలాపురం గ్రామీణం): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్తు కార్మికులు డిమాండ్ చేశారు. ఈదరపల్లిలోని డివిజనల్ ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఒప్పంద కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, ఆ జీతంతో బతకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. తదుపరి డివిజనల్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు పి.వి.ఆర్.నాయుడు, ఉపాధ్యక్షుడు ఎమ్.వి.బ్రహ్మం, సంయుక్త కార్యదర్శి ఎస్.కె.మునవీర్, ఎ.వి.వి.దుర్గాప్రసాద్, కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బండారులంకలో విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు



సన్నవిల్లిలో గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న దృశ్యం



దేవగుప్తంలో చంద్రన్న కానుకలు అందజేస్తున్న ఐఏఎస్ అధికారి పాండాదాస్, ఎమ్మెల్యే ఆనందరావు

పారదర్శక పాలనకు పెద్దపీట

◆ ఎమ్మెల్యే ఆనందరావు
◆ రెండో రోజు కొనసాగిన జన్మభూమి

అమలాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పారదర్శక పాలనకు తెదేపా పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్థానిక 7, 8 వార్డుల్లో బుధవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని హామీఇచ్చారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లోనూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. జన్మభూమి పరిశీలనాధికారి జీఎస్ పాండాదాస్, పురపాలక అధ్యక్షుడు చిక్కాల వినాయకరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ మెట్ల రమణబాబు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పెచ్చేట్టి చంద్రమౌళి, పురపాలక ఉపాధ్యక్షురాలు పెచ్చేట్టి విజయలక్ష్మి, కమిషనర్ సీహెచ్‌వీవీ బాపిరాజు, తెదేపా పట్టణాధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

✦ అల్లవరం మండలంలోని దేవగుప్తం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామసభలు జరిగాయి. సర్పంచులు బూలా వెంకటరమణి, చెదళ్ల రామకృష్ణ సుధాకర్, చింతా నాగమణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆనందరావు, పరిశీలనాధికారి జీఎస్ పాండాదాస్ హాజరయ్యారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు జన్మభూమి ప్రతిజ్ఞచేశారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఎంపీపీ చింతా ఝాన్సీ లక్ష్మీగౌరి, జడ్పీటీసీ సభ్యురాలు వేగిరాజు వెంకటసత్యప్రవీణ, తహసీల్దార్ వి.సత్యవతి, ఎంపీడీవో వి.శాంతామణి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గునిశెట్టి చినబాబు, తెదేపా మండలాధ్యక్షుడు దాట్ల గోపీరాజు, ఎంపీటీసీ సభ్యులు సాధనాల మాణిక్యం, కొపనాతి లక్ష్మి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

✦ సామంతకుర్రులో జన్మభూమిని బహిష్కరిస్తున్నట్లు సర్పంచి చెదళ్ల రామకృష్ణ సుధాకర్‌తోపాటు మరికొందరు ప్రకటించారు. ముందస్తుగా గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు ప్రొటోకాల్ పాటించడం లేదని సర్పంచి ఆరోపించారు. సభ ప్రారంభానికి ముందు నాయకులు సర్పంచిని బుజ్జగించడంతో జన్మభూమి సజావుగా సాగింది.

అమలాపురం గ్రామీణం: గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గ్రామీణ మండలంలోని ఇందుపల్లి, బండారులంక గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. జన్మభూమి పరిశీలనాధికారి పాండాదాస్, ఆర్డీవో బి.వి.రమణ, జడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి అడబాల విశ్వేశ్వరరావు, ఎంపీడీవో అంబటి శారారాణి, తహసీల్దార్ బేబీజ్ఞానాంబ, సర్పంచులు బొంతు విజయకుమారి, బడుగు సత్యనారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం(గడియారస్తంభం): మహిళాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలంలోని నంగవరంలో బుధవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. సన్నవిల్లిలో జరిగిన గ్రామసభలో ఏఎంసీ ఛైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆర్డీవో వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసులు, డీసీ ఛైర్మన్ నిమ్మకాయల చెల్లయనాయుడు, జున్నూరి నాని, తహసీల్దారు సలాది సుబ్బారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జేఎల్ఎన్ దీక్షితులు, సర్పంచులు జున్నూరి వెంకటేశ్వరరావు, బొక్కా నాగమణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

✦ పెదగాడవిల్లిలో గురువారం జరగనున్న జన్మభూమి గ్రామసభకు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప హాజరవుతున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఏడీ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చేసి మధ్యాహ్నం జరగాల్సిన పెదగాడవిల్లి గ్రామసభను ఉదయం నిర్వహించనున్నట్లు చెప్పారు.

సమస్యను పరిష్కరించండి...

ఉప్పలగుప్తం(గడియారస్తంభం): రోడ్డు నిర్మాణ పనులకు ఏర్పాటు చేసిన తూరలతో ఎదురవుతున్న సాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలంటూ పలువురు రైతులు ఎమ్మెల్యే ఆనందరావు, ఆర్డీవో వెంకటరమణలకు బుధవారం జరిగిన జన్మభూమి గ్రామసభలో వినతిపత్రాలను అందజేశారు. సంబంధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం సిరిపల్లి-మునిపల్లి ప్రధాన రహదారి నుంచి నంగవరానికి వెళ్లే పీఆర్ రోడ్డును సీసీ రోడ్డుగా ఆధునీకరించేందుకు గోకరకొండ పంటబోదె వద్ద వంతెన నిర్మాణ నిమిత్తం తూరలను రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా సంబంధిత అధికారులు నీటి ప్రవాహానికి 2 అడుగుల ఎత్తులో తూరలను గతంలో ఏర్పాటు చేశారు. దీంతో సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి సాగునీటి ఎద్దడి, ముంపు నీటి సమస్య తలెత్తుందని పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరక్టరు ఆకుల సత్యనారాయణ, జున్నూరి ప్రసాద్, ఆకుల పుల్లయనాయుడు, గుండుమోగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించండి: ఎంపీ

అమలాపురం, న్యూస్‌టుడే: దేశంలో బాలకార్మిక వ్యవస్థ తీవ్రంగా ఉందని, దీనిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎంపీ డాక్టర్ పండుల రవీంద్రబాబు కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం ఎంపీ రవీంద్రబాబు పలు అంశాలను పార్లమెంటు దృష్టికి తీసుకువచ్చారు. ఆవిషయాలను ఓ ప్రకటనలో ఎంపీ వెల్లడించారు. దేశంలో బాలకార్మిక వ్యవస్థ ఎలా అమలవుతోంది.. ఎంతమందికి పునారావాసం కల్పించారని ప్రశ్నించారు. బాల కార్మికుల కోసం ఏ సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయో తెలపాలని కోరారు. దీనిపై కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ కుమార్ గాంగ్వర్ సమాధానమిస్తూ పేదరికం, వెనుకబాటుతనం, నిర్లక్ష్యం వలన ఇంకా ఉందని, భారత జనాభా లెక్కల ప్రకారం దేశంలో 5 నుంచి 14 ఏళ్ల లోపు బాలలు 43.53లక్షల మంది ఉన్నారని, బాల కార్మికులుగా మగ్గిపోతున్న వారికి విముక్తి కలిగించేందుకు వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. వివిధ పథకాల ద్వారా 21 రాష్ట్రాల్లో 280 జిల్లాల్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం ద్వారా వారి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పినట్లు ఎంపీ రవీంద్రబాబు వెల్లడించారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

ఉప్పలగుప్తం(గడియారస్తంభం): నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఉప్పలగుప్తం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న సైక్లిస్టును సీతారామపురం వద్ద మంగళవారం రాత్రి ఢీకొన్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలు

ఉప్పలగుప్తం (గడియారస్తంభం): ఉప్పలగుప్తం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ పరిధి గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ అంతర్జాల, టెలిఫోన్ సేవలకు అంతరాయం ఏర్పడటంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా మండల కేంద్రం ఉప్పలగుప్తంలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. వానపల్లిపాలెంలో ఏర్పడిన కేబుల్ సమస్యకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడంతో కొంతమేర సేవలు అందాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అమలాపురం

క్యాలెండర్ ఆవిష్కరణ

గడియారస్తంభం: కోనసీమ సెంట్రల్ డెల్టా ఫిష్ మర్చంట్స్ వర్తక సంక్షేమ సంఘానికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్మాడి చినపెదుకొండలు, కొప్పిశెట్టి వెంకటరమణ, మల్లాడి శ్రీను, ఒలేటి పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కె.అగ్రహారం: డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు జయంతి సందర్భంగా గురువారం ఆయన స్వగ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గిడ్డంగుల శాఖ డైరెక్టర్ మెట్ల రమణబాబు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. వ్యాధులకు సేవలు అందించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

భీమవరం: ఒకటో పట్టణ పరిధి చినపేటకు చెందిన కె.భవాని(20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం సమీపంలోని పాలగుమ్మికి చెందిన కె.దొరబాబును ప్రేమ వివాహం చేసుకుని భీమవరంలో స్థిరపడ్డారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి గంట తర్వాత తిరిగొచ్చేసరికి తలుపులు మూసి ఉన్నాయి. తలుపులు పగలగొట్టి చూసేసరికి గదిలోని గాలి పంకాకు చీరతో ఉరివేసుకుని మృతి చెంది ఉంది. ప్రస్తుతం ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నామని, మృతురాలి తల్లిదండ్రులు వస్తున్నట్లు సమాచారం ఇచ్చారని సీఐ చెప్పారు.

సావిత్రిబాయిపూలే సేవలు ఎనలేనివి

గడియారస్తంభం, న్యూస్‌టుడే: బాలికా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే విశిష్ట సేవలు అందించారని విద్యానిధి సంస్థల ఛైర్మన్ ఏబీ నాయుడు అన్నారు. స్థానిక విద్యానిధి పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కరస్పాండెంట్లు శ్యామలామహాలక్ష్మి, నాగమాధవి, విద్యార్థులు పాల్గొన్నారు. సూర్యనగర్‌లోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జయంత్యుత్సవానికి హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎ.బుచ్చిమహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి మైలవరపు రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయుడు కోట రామ్మోహనరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ కృపానందం, పి.వాసు తదితరులు పాల్గొన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో వడ్డిగూడెం బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నాగవరలక్ష్మి, వెంకటలక్ష్మి, ప్రశాంతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

కె.అగ్రహారం: అమలాపురం కొండిన్యనగర్ పార్కులో 15వ వార్డు కౌన్సిలర్ మట్టపర్తి రజనీకుమారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కోసి మహిళలకు మిఠాయిలు పంచిపెట్టారు. అప్పారి చంటి, దుర్గ, మట్టపర్తి రత్నం, దుర్గ, సత్యవతి తదితరులు ఉన్నారు.

అమలాపురం గ్రామీణం: గ్రామీణ మండలంలోని ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, ఉప సర్పంచి బొంతు గోవిందశెట్టి, ప్రధానోపాధ్యాయుడు గుత్తుల శ్రీరామ్‌ప్రసాద్, స్టాఫ్ కార్యదర్శి ఇళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. జనుపల్లె మన్నాకాలనీ ప్రభుత్వ పాఠశాలలో దళితసేన ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు. సర్పంచి చుట్టుగుళ్ల జ్యోతిసత్తిబాబు, ఎంపీటీసీ ఈత కోట సత్యవతి తదితరులు హాజరయ్యారు.

అల్లవరం: సమాజంలో స్త్రీవిద్యను ప్రోత్సహించి అసమానతలను రూపుమాపేందుకు కృషి చేసిన ఆదర్శ వనిత సావిత్రిబాయి పూలే అని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు అన్నారు. అల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె జయంతిని అల్లవరం మండల శాఖ ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి యాళ్ల జ్యోతికుమార్, ఉపాధ్యాయులు బత్తుల నకులరాజు, శెట్టిబత్తుల సత్యనారాయణ, తోట బాలకృష్ణ, కడలి నాగగణేష్, కడలి శ్రీమూర్తులు, ఉప్పే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● అమలాపురం ప్రభుత్వ మహిళా కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుక దళిత బహుజన మహిళాశక్తి, పీడీఎస్‌యూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి విచ్చేసి మాట్లాడారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కె.కోటిలింగం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, డివిజన్ కార్యదర్శి కె.రవి, అధ్యాపకులు ఎ.పెద్దిరాజు, సీహెచ్ సూర్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విట్స్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయినులు



అల్లవరంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

అల్లవరం: గోడిలంక పీహెచ్‌సీ సమీపంలో ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుపై ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి దుర్మరణం పాలైనట్లుగా స్థానికులు చెబుతున్నారు. మృతుడు గోడితిప్పకు చెందిన కాశీ సుబ్బారావు(35)గా గుర్తించారు. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోడిలంక పీహెచ్‌సీ సమీపంలో ఓ ఆటో, మృతదేహం పడి ఉందని అటువైపుగా వస్తున్నవారు మొగళ్లమూరు కూడలి వద్దనున్న కొందరికి చెప్పారు. వారంతా అక్కడికి వెళ్లి పరిశీలించగా అటువైపుగా వస్తున్నవారు ఆటోడ్రైవరు కాశీ సుబ్బారావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మొగళ్లమూరులోని గోగివారి పేటలో క్రిస్మస్ వేడుకకు కాశీ సుబ్బారావు తన సొంత ఆటోలో బుధవారం రాత్రి వచ్చాడు. సుమారు 10.30 గంటల సమయంలో వేడుకలు ముగిసిన నేపథ్యంలో ఆటోలో ఒక్కడు గోడితిప్పలోని తన ఇంటికి బయలుదేరాడు. ఘటనా స్థలం వద్ద ఆటో ముందు భాగం స్వల్పంగా ధ్వంసం కాగా ఆటో రోడ్డుకడ్డంగా తిరిగిపోయి కనిపిస్తోంది. పక్కనే తలకు తీవ్రగాయంతో మృతదేహం పడిఉంది. సమాచారాన్ని అల్లవరం పోలీసులకు స్థానికులు అందించారు.

ఫిబ్రవరి 13 నుంచి వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం(గడియారస్తంభం): మహా శివరాత్రిని పురస్కరించుకుని గొల్లవిల్లిలో నిర్వహించే నిమ్మకాయల వెంకటరంగయ్య జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను ఫిబ్రవరి 13 నుంచి 17వరకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎన్‌వీఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మకాయల జగయ్యనాయుడు అన్నారు. ఈ టోర్నీకి సంబంధించి వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టోర్నమెంట్‌కు సంబంధించి జారీ చేసే అనుమతి పత్రాలను వాలీబాల్ రాష్ట్ర కార్యదర్శి రమణారావు అందించారని తెలిపారు.

వైభవంగా మహిషాసుర మర్దని ఊరేగింపు

ఉప్పలగుప్తం(గడియారస్తంభం): చలపల్లి గ్రామదేవతల సంక్రాంతి మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామదేవత శ్రీ మహిషాసుర మర్దని అమ్మవారిని మెట్టింటి(గ్రామ పోలిమేర) నుంచి పుట్టింటికి(దేవాలయానికి) తీసుకొచ్చే కార్యక్రమంతో ఏటా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మెట్టింటి నుంచి అమ్మవారి చల్లఘటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామంలోని పురవీధుల గుండా బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి గరగలను ఊరేగిస్తూ అనంతరం అమ్మవారి గరగను దేవాలయంలో ఏర్పాటు చేస్తారు. తొలుత అన్నసమారాధన చేసి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఛైర్మన్ నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, దంగేటి రవీంద్రనాథ్, గొలకోటి ప్రకాష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ గొలకోటి చంటి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరం

భట్లపాలెం (అమలాపురం గ్రామీణం): ఓ పక్క సంప్రదాయ వస్త్రధారణతో దర్శనమిచ్చిన విద్యార్థులు... మరోపక్క రంగురంగుల హరివిల్లులు... ఇంకోపక్క సంక్రాంతి సందడి. ఇదంతా భట్లపాలెంలోని బోణం వెంకటచలమయ్య ఇంజినీరింగ్ కళాశాలలో చోటు చేసుకున్న సందడి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎం.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఇక్కడ సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంప్రదాయ వంటకాల పోటీలు నిర్వహించారు. తరువాత జరిపిన సంప్రదాయ వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు లంగాఓణీలతో హోయలొలికిస్తే.. విద్యార్థులు పంచెకట్టుతో కనిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఇక గంగిరెద్దుల విన్యాసాలు, కోడిపందేలను కోలాహలంగా నిర్వహించారు. మెహందీ, గాలిపటాల పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బోణం కనకయ్య, ఛైర్మన్ బోణం వెంకటరాజేష్, వైస్ ఛైర్మన్ బోణం కృష్ణసతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎం.వి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.సి.ఎస్.మదన్, ఏవో జె.వి.కృష్ణారావు, సాహిత్య, సాంస్కృతిక విభాగాల కోఆర్డినేటర్ ఎ.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న యువతులు

అనపర్తి

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అనపర్తి, న్యూస్‌టుడే : అనపర్తిలో రైలు ఢీకొన్న ప్రమాదంలో పడాల శ్రీనివాసరెడ్డి (43) మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం అనపర్తి గ్రామానికి చెందిన పడాల శ్రీనివాసరెడ్డి పొలంలో పనిచేస్తున్న తన తండ్రికి భోజనం ఇచ్చి రైలు గేటు దాటుతుండగా బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ అనపర్తి, ద్వారపూడికి మధ్యలో ఉన్న గేటు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మోటారు సైకిల్ చోరీ

బిక్కవోలు: బొమ్మూరు గ్రామానికి చెందిన కేతా బాల యేసు ప్రశాంత్ కుమార్ మోటారు సైకిల్‌ను బుధవారం చోరీకి గురయింది. ఈయన బిక్కవోలు వచ్చి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం వద్ద మోటారు సైకిల్ పార్కు చేసి, దేవాలయం లోపలికి వెళ్లి వచ్చేసరికి మాయమయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు.

రంగంపేట మండల అధికారుల ఫోన్ నంబర్లు

అధికారి	ఫోన్ నంబరు
తహసీల్దారు	9849903882
ఎంపీడీవో	9652077299
ఎస్సై	9440904854
విద్యుత్తు పంపిణీ సంస్థ ఏఈ	9440812672
ఉపాధి పథకం ఏపీవో	7997713881
గృహ నిర్మాణ సంస్థ జేఈ	7093930488
వ్యవసాయాధికారిణి	8886613604
వైద్యాధికారిణి	9494211366
ఇంజినీరింగ్ అధికారి	8897388899
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	9100121152

న్యూస్‌టుడే, రంగంపేట

పెదపూడి మండల అధికారుల ఫోన్ నంబర్లు

తహసీల్దారు	8008803207
ఎంపీడీవో	7702073162
ఇంద్రపాలెం పరిధి సీఐ	9440796521
ఎస్సై	9440904840
వ్యవసాయాధికారి	8886613548
వెలుగు ఏపీఎం	9652304153
విద్యాశాఖాధికారి	9989577595
డ్రైనేజీల శాఖ డీఈ	9491058030
పశువైద్యాధికారి	8790996800
పంచాయతీరాజ్ డీఈ	8985113888
గృహ నిర్మాణ సంస్థ జేఈ	7093990487
ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ	9440818534
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	9100121150
ఉపాధి హామీ పథకం ఏపీవో	7997713829
జలవనరుల శాఖ ఏఈ	9585431117

న్యూస్‌టుడే, పెదపూడి

సమస్యను సచిత్రంగా పంపండి

మీ ప్రాంతంలో రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయా... మురుగునీరు సక్రమంగా పారడం లేదా... అపరిశుభ్రత ఎక్కువగా ఉందా... తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారా... ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారా... సమస్యలపై మీరూ స్పందించండి. అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తు ంది. మీరు చేయాల్సిందల్లా సమస్య ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

వాట్సాప్ నంబరు: 91000 20947

చలనచిత్రాలు

అనపర్తి: **సత్యగౌరి:** 2 కంట్రీస్, **సూర్యశ్రీ** - ఎం.సి.ఎ, రంగంపేట: **జానకీరామ:** ఒక్కక్షణం, మండపేట: **సప్తగిరి:** ఒక్కక్షణం, **సప్తగిరి మినీ:** సప్తగిరి ఎల్ఎల్‌బి, **అంబిక:** ఎం.సి.ఎ, **సత్యశ్రీ:** 2 కంట్రీస్, **విజయ:** 2 కంట్రీస్, **రాజరత్న:** హలో, **రాజరత్న మినీ:** జూమాంజీ.

మెట్టలో విద్య, వైద్య వసతుల మెరుగు : ఎమ్మెల్యే

రంగంపేట, న్యూస్‌టుడే : మెట్ట మండలం రంగంపేటలో విద్య, వైద్య వసతుల మెరుగుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రంగంపేట మండలం కోటపాడులో గ్రామ సర్పంచి బత్తిన వీరమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన 'జన్మభూమి-మా ఊరు' గ్రామసభలో ఆయన మాట్లాడారు. రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొత్త భవనాల నిర్మాణానికి రూ.5 కోట్లు వరకు నిధులు విడుదల కానున్నాయని చెప్పారు. ఈ మండలానికి మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండలంలో రూ.23 కోట్లతో వివిధ రహదారులను అభివృద్ధి చేశామన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు వేసిన ముగ్గులు, బొమ్మలతో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, జడ్పీ ఉపాధ్యక్షుడు పెండ్యాల నళినీకాంత్, ఎంపీపీ నీలపాల వీరవేణి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నీలపాల త్రిమూర్తులు ముగ్గులను పరిశీలించి వారికి ప్రోత్సాహకాలను అందించారు. గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేయడంతో అక్కడ మరింత సందడి నెలకొంది. ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని కోరుతూ ఛైర్మన్ ఆచంట సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాసమూర్తి, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు ఫైబర్‌గ్రిడ్‌ను ఉచితంగా అందజేసిన గంగాధర్‌ను, ఆదర్శంగా పాఠశాలను అభివృద్ధి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మద్దిపూడి వెంకటరావును వారు అభినందించారు. వెంకటాపురంలో సర్పంచి వాసంశెట్టి సత్యవతి ఆధ్వర్యంలో జన్మభూమి గ్రామసభ జరిగింది.



కోటపాడులో విద్యార్థినికి ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆరోగ్యం అందించడమే లక్ష్యం

అనపర్తి: ప్రతి ఒక్కరికి ఆరోగ్యం అందించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కొప్పవరం గ్రామంలో జరిగిన అయిదో విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. దేశంలోనే ఎక్కువ మందికి పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం మనదేనని అన్నారు. పాదయాత్ర సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలో భాగంగా రైతుల రుణమాఫీని అయిదు విడతలుగా రూ. 24 వేల కోట్లను, డ్వాక్రా రుణ మాఫీని మూడు విడతలుగా రూ. 9 వేల కోట్లు చేస్తున్నామన్నారు. అసంఘటిత కార్మికుల కోసం అమలు చేసిన చంద్రన్న బీమా కుటుంబాలను ఆదుకుంటుందని, రూ.15 ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తే ఎన్టీఆర్ ఆరోగ్య సేవ పరిధిలో లేని వ్యాధులతో బాధపడుతున్న పేదలను ముఖ్యమంత్రి ఆర్థిక సాయం ద్వారా ఆదుకుంటున్నామని సూచించారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వైకాపా ఎంపీలు అసత్య ప్రచారం చేసి కేంద్రం నుంచి ఉపాధి హామీ పథకం నిధులు రాకుండా చేశారని ఆయన మండిపడ్డారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు వచ్చేలా కృషి చేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న బీమా, ఈ పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బుధవారం లక్ష్మీనరసాపురం, కొప్పవరం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు జరిగాయి. రామవరం హోమియో ఆసుపత్రి వైద్య అధికారిణి డాక్టర్ అంజమ్మ ఆధ్వర్యంలో హోమియో శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి అధికారిణి సీతామహాలక్ష్మి, ఎంపీపీ ఉమా మహేశ్వరి, తెదేపా నాయకులు దేవదానరెడ్డి, నాగేశ్వరరావు, వెంకట రామారెడ్డి, ఉప సర్పంచి తాడి సూరారెడ్డి, ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, ఎంపీడీవో మాలతి, తహసీల్దార్ ఆదినారాయణ పాల్గొన్నారు.



ముగ్గులు పోటీలో పాల్గొన్న విద్యార్థినిలు

ఆరికిరేవుల గ్రామస్థుల ఆగ్రహం

ఆరికిరేవుల (బిక్కవోలు): ఆరికిరేవులలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ సమస్యలు పరిష్కరించడం లేదని, అసలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారు ఆందోళనకు దిగారు. మెళ్లూరు - చోడవరం రోడ్డు అధ్వానంగా ఉన్నా, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. తాగునీటి ప్రమాణాలు పడిపోయాయని, డ్రెయినేజీ నీళ్లు కలిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఎన్టీఆర్ సుజల స్రవంతి నీరు విడుదలవుతున్నా, ఫిల్టర్లు పనిచేయక అందులో నుంచి కూడా కలుషిత నీరే వస్తోందని ఇదేమి చోద్యమని ప్రశ్నించారు. ఇక పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సమావేశాన్ని సజావుగా నిర్వహించాల్సిన అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఎవరు ఏమి మాట్లాడుతున్నారో, ఏమి చేస్తున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. మాజీ సర్పంచి తొండాపు వీర్రాఘవరెడ్డి జోక్యం చేసుకుని గ్రామస్థులను శాంతింపజేశారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

మెళ్లూరు (బిక్కవోలు): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జన్మభూమి - మాఊరు కార్యక్రమం ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారని, అధికారులంతా ఈ గ్రామ ముంగిట్లోనే సమస్యల పరిష్కారానికి వచ్చారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మెళ్లూరులో నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఆర్థికలోటు పెరుగుతున్నా ముఖ్యమంత్రి ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి రెండూ సమానంగా చేస్తున్నారన్నారు. అర్హులందరికీ పింఛను అందుతుందని, జాప్యం జరుగుతోందని ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ రుణమాఫీ కార్యక్రమంపై అపోహలు వద్దని సూచించారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకే కొంత జాప్యం జరుగుతోందని, దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. సంక్రాంతిలోపు ఆ రైతులకు బ్యాంకుకు జమ అవుతుందని అన్నారు. సమావేశంలో ఎంపీపీ బేరా వేణమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

అచ్యుతాపురత్రయం (పెదపూడి): పేదరిక నిర్మూలనే తెదేపా ప్రభుత్వ ధ్యేయమని అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పెదపూడి మండలం అచ్యుతాపురత్రయం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల సంక్షేమానికి సుమారు 103 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందిస్తుందన్నారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా ప్రజలకు అందేలా స్థానిక నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్న పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించి చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు మార్ని వెంకటరామారావు, జడ్పీటీసీ సభ్యుడు చిర్రా వరప్రసాద్, సర్పంచి గుండా దేవికారాణి, ఎంపీటీసీ ఆరుమిల్లి అన్నపూర్ణ సత్యభారితి ప్రసాద్, తహసీల్దారు ఎం. వెంకటేశ్వరరావు, మడల తెదేపా అధ్యక్షుడు జుత్తుక కృష్ణ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

● జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ప్రజల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి అన్నారు. బుధవారం పెదపూడి మండలం రామేశ్వరం గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొటికలపూడి సూర్యప్రభ, ఎంపీపీ చప్పిడి నాగేశ్వరరావు, ఎంపీడీవో పి.చక్రధరరావు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కొటికలపూడి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి

దుప్పలపూడి (అనపర్తి), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం అలవర్చుకోవాలని డీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. దుప్పలపూడి గ్రామంలో జీబీఆర్ బీఈడీ, డీఎడ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం రెండో రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద మొక్కలను నాటారు. మొక్కలు నాటడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను, మొక్కలు లేకపోవడం వల్ల కలిగే దుష్ ప్రయోజనాలను గ్రామస్థులకు వివరించారు. దీనిపై స్పందించిన పలువురు గ్రామస్థులు వారి ఇంటి వద్ద మొక్కలను నాటేందుకు తీసుకెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీబీఆర్ డైరెక్టర్లు రత్నారెడ్డి, హరినాథ్ రెడ్డి, బీఈడీ ప్రిన్సిపల్ కోటయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.



నాటేందుకు సిద్ధం చేసిన మొక్కలతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నేడు రెండు గ్రామాల్లో జన్మభూమి

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.చక్రధరరావు తెలిపారు. మండలంలో కరకుదరు, దోమాడ గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

అనపర్తి

27 నుంచి విద్యుత్తు ఒప్పంద ఉద్యోగుల నిరసన

రంగంపేట, న్యూస్‌టుడే : న్యాయపరమైన తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 27వ తేదీ నుంచి భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టనున్నట్లు విద్యుత్తు ఒప్పంద ఉద్యోగుల సంఘం తెలిపింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ విధంగా నిరసనలు చేపడతామని తెలుపుతూ విద్యుత్తు పంపిణీ సంస్థ ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందజేసినట్లు ఈ సంఘం డివిజన్ కార్యదర్శి గొరపాటి నరేష్, కోశాధికారి సూర్యనారాయణ తెలిపారు. ఒప్పంద పద్ధతిపై తమను విద్యుత్తు పంపిణీ సంస్థలో విలీనం చేసి వేతనాలను తమకు నేరుగా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఎస్టీయూ బిక్కవోలు మండల శాఖ సమావేశం బుధవారం రాత్రి స్థానిక ఆంగ్లమాధ్యమ పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా మహాలక్ష్మి, అధ్యక్షుడిగా సబ్బారపు రమేష్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వి.వి.సుబ్బారెడ్డి, టి.వి.బి.ఎన్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జె.ఎస్. ప్రసాద్ ఎన్నికయ్యారు.

దైనందినిల పంపిణీ

పెదపూడి: మండల ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సమాచారవాణి, దైనందినిలు బుధవారం పంపిణీ చేశామని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించిన అందరి ఫోన్ నంబర్లు, ఇతర వివరాలతో కూడిన సమాచారవాణి, ఉపాధ్యాయుల జీతాల వివరాలు తెలిపే దైనందినిలు పంపిణీ చేసినట్లు చెప్పారు.

పాఠశాలకు మ్యాగజైన్ తయారీపై ప్రశంసలు

మెళ్లూరు (బిక్కవోలు): మెళ్లూరు పాఠశాల విద్యార్థులు మ్యాగజైన్ తయారు చేస్తుండటంపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాఠశాల విద్యార్థుల్ని, ఉపాధ్యాయుల్ని ప్రశంసించారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీఎల్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో తయారవుతున్న మ్యాగజైన్‌ను చూపించారు. దీన్ని ఇంకా ఆవిష్కరించలేదని, ప్రతి మూడు నెలలకు ఒక పుస్తకం విడుదల చేస్తామని ఎమ్మెల్యేకు వివరించారు.



పెదపూడిలో పనులను పరిశీలిస్తున్న జేఈ మంగాలక్ష్మి

క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఉపాధి నిధులు

పెదపూడి, న్యూస్‌టుడే: క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఉపాధి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని ఉపాధి హామీ పథకం జేఈ మంగాలక్ష్మి అన్నారు. బుధవారం పెదపూడిలో గాంధీస్మారకోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులతో క్రీడా ప్రాంగణాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, నడకదారి వంటి పనులు చేపడుతున్నామన్నారు. మండలంలో మూడు క్రీడా ప్రాంగణాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. ప్రస్తుతం రామేశ్వరం జిల్లా పరిషత్తు పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశామని, పెదపూడి, సంపర గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఈమె వెంట ఉప సర్పంచి కాకర ఆంజనేయులు, జన్మభూమి కమిటీ సభ్యుడు చంద్ర శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, టీపీ సత్తిరాజు ఉన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనపర్తి, న్యూస్‌టుడే : అనపర్తి శ్రీశారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాల్లో రెండో రోజైన బుధవారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన నృత్యరంజని, ఆకెళ్ల పద్మావతి శిష్య బృందం చేసిన శాస్త్రీయ కూచిపూడి, జానపద నృత్యాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని రామచంద్రపురానికి చెందిన లక్ష్మీదేవి తన భర్త శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. విద్యార్థులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థులు బిందెలతో చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 22 మంది విద్యార్థులు ఆ నృత్య రూపకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణలీలలు, అన్నమాచార్యుల కీర్తనలు, బంజారా నృత్యం, దశావతరాలు వంటి వాటిని చిన్నారులు నృత్యం చేశారు. ముందుగా కర్రి సత్యనారాయణరెడ్డి, ఇతర ప్రముఖులు జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళా సమితి సభ్యులు చిన ఆదిరెడ్డి, మురళీ మోహన్, బాలకృష్ణారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వీర్రాజు, రామారెడ్డి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో లోహితాదేవికి పసిడి పతకం



రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఒంగోలులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జీఆర్జీసీ జూనియర్ కళాశాల విద్యార్థిని తణుకు లోహితాదేవి బంగారు పతకం సాధించిందని జీఆర్జీ మోడరన్ విద్యా సంస్థల అధినేత జి.వి.రావు తెలిపారు. గ్రీన్‌బెల్టు వ్యక్తిగత విభాగం స్పారింగ్‌లో ప్రతిభ చాటిందన్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థిని లోహితాదేవి, కరాటే మాస్టర్ ప్రసాద్‌ను జి.వి.రావు, ప్రిన్సిపల్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్ అభినందించారు.

రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఫణీశ్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ద.మ. రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా జిల్లా, కాకినాడ ప్రయాణికుల సంఘం కార్యదర్శి అడ్డూరి ఫణీశ్ నియమితులైనట్లు ఆ సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పదవిలో ఫణీశ్ రెండేళ్లపాటు కొనసాగుతారన్నారు.

ఏపీఎస్పీ సిబ్బందికి ఎన్‌డీఆర్ఎఫ్ శిక్షణ

సర్పవరంజంక్షన్, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి సహాయం అందించడానికి 3వ ఏపీఎస్పీ సిబ్బందికి ఎన్‌డీఆర్ఎఫ్ శిక్షణ ఇస్తున్నామని కమాండెంట్ జె.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రాను కమాండెంట్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఏపీఎస్పీ సిబ్బందిలో 100 మందికి శిక్షణ ఇచ్చామని, జిల్లా అవసరాలకు వీరిసేవలు వినియోగించుకోవాలని కలెక్టర్‌కు తెలిపామన్నారు.

పాఠశాలల్లో క్రీడా పోటీలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: జన్మభూమిని పురస్కరించుకుని ఉన్నత పాఠశాలల్లో సందడి నెలకొంది. వివిధ ఉన్నత పాఠశాలల్లో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. కొంకుదురు, కాపవరం, బలభద్రపురం, బిక్కవోలు, ఇల్లపల్లి గ్రామాల్లో బాలురు, బాలికలకు ప్రత్యేకించి కబడ్డీ పోటీలు నిర్వహించాలని ఎంఈవో శివరామకృష్ణయ్య సూచించారు. ఆరోగ్యం అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శం

మహేంద్రవాడ (అనపర్తి), న్యూస్‌టుడే : సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహేంద్రవాడ ఎంపీపీ యూపీ పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శనీయురాలన్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను నిర్మల, గాయత్రిదేవి, ఆదిలక్ష్మిలను సహోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, వీర్రాఘవరెడ్డి, ఈశ్వరరెడ్డి, గోవిందరాజులు పాల్గొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాల్లో పనిచేస్తున్న సుమారు 92 మంది ఉపాధ్యాయినులకు చిరు కానుకలు అందజేశారు.

బలభద్రపురం (బిక్కవోలు): తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని బలభద్రపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె.చెల్లారావు మాట్లాడుతూ 200 ఏళ్ల క్రితమే ఆమె ఉపాధ్యాయినిగా పనిచేశారన్నారు. ఆ రోజుల్లో మహిళలు బయటకు రావడానికే సమాజం అంగీకరించని రోజుల్లో ఉపాధ్యాయినిగా సమాజాన్ని తీర్చిదిద్దారని అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు మెహరలీలా, బి.జ్యోతి, బి.ఇందిరమ్మ, రాధ, భారతి, వరలక్ష్మి, నాగమణిలను ఆయన సత్కరించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయినులు పూలమాల వేసి నివాళులర్పించారు.



బలభద్రపురంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయినులు

బాలికలకు ఆత్మ రక్షణ శిక్షణ అవసరం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ అవసరమని జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి పీవీ కృష్ణారావు అన్నారు. జగన్నాథపురం అన్నవరం సత్యదేవి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. అందులో భాగంగా బాలికలకు ఆత్మరక్షణ శిక్షణపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ వంటి ఆత్మరక్షణ శిక్షణలు అవసరమన్నారు. దేహదారుఢ్య శిక్షణ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఆయన వ్యాఖ్యానించారు. కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ బాలికల కళాశాలల్లో చదివే విద్యార్థినులకు ఇటువంటి శిక్షణలు అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జయనిర్మల, సంధ్యాకుమారి మాట్లాడారు. అనంతరం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.



అనపర్తి, ద్వారపూడి రైల్వేస్టేషన్లలో బయలుదేరు రైళ్ల వివరాలు

నెంబరు	నుంచి-వరకు	సమయం (అనపర్తి)	సమయం (ద్వారపూడి)
	విజయవాడ వైపు		
	ఎక్స్‌ప్రెస్‌ల సమాచారం		
నెంబరు	రైలు పేరు	రాక	రాక
17479	పూరీ-తిరుపతి(బుధ, ఆది కాకుండా)	02.26	02.32
17481	బిలాస్‌పూర్-తిరుపతి(బుధ, ఆది)	02.26	02.32
18645	హౌరా-హైదరాబాద్ (ఈస్ట్‌కోస్ట్)	--	07.04
17240	విశాఖపట్నం-గుంటూరు(సింహాద్రి)	09.55	10.02
13351	ధనబాద్-అలెప్పీ(బొకారో)	13.15	13.22
12717	విశాఖపట్నం-విజయవాడ(రత్నాచల్)	15.09	--
17644	కాకినాడ-చెన్నైఎగ్మోర్(సర్కార్)	15.30	15.36
17488	విశాఖపట్నం-తిరుపతి(తిరుమల)	16.42	16.47
12727	విశాఖపట్నం-హైదరాబాద్ (గోదావరి)	20.06	--
12737	కాకినాడ-సికింద్రాబాద్(గౌతమి)	--	21.11
	ప్యాసింజర్ రైళ్లు		
57232	కాకినాడ-విజయవాడ	05.36	5.42
57458	కాకినాడ-తిరుపతి	08.12	8.19
57226	విశాఖపట్నం-విజయవాడ	12.54	13.00
57296	విశాఖపట్నం-రాజమండ్రి	22.00	22.04
57230	విశాఖపట్నం-మచిలీపట్నం	22.55	23.17
57272	రాయగడ-విజయవాడ	00.20	00.28
	సామర్లకోట వైపు		
	ఎక్స్‌ప్రెస్ రైళ్లు		
17480	తిరుపతి-పూరి(సోమ, శుక్రకాకుండా)	00.49	00.42
17482	తిరుపతి-బిలాస్‌పూర్(సోమ, శుక్ర)	00.49	00.43
12728	హైదరాబాద్-విశాఖపట్నం(గోదావరి)	02.02	-
12738	సికింద్రాబాద్-కాకినాడ(గౌతమి)	--	06.02
17487	తిరుపతి- విశాఖపట్నం(తిరుమల)	06.34	6.27
17643	చెన్నైఎగ్మోర్-కాకినాడ(సర్కార్)	08.34	8.28
12718	విజయవాడ-విశాఖపట్నం(రత్నాచల్)	08.39	--
13352	అలెప్పీ-టాటా(బొకారో)	10.39	10.33
17239	గుంటూరు-విశాఖపట్నం(సింహాద్రి)	13.44	13.38
18646	హౌరా-హైదరాబాద్ (ఈస్ట్‌కోస్ట్)	--	19.38
	ప్యాసింజర్ రైళ్లు		
57271	విజయవాడ-రాయగడ	01.38	1.32
57229	మచిలీపట్నం-నర్సాపూర్	03.14	03.08
57235	రాజమహేంద్రవరం-విశాఖపట్నం	11.45	11.39
57225	విజయవాడ-విశాఖపట్నం	13.10	13.04
57457	తిరుపతి-కాకినాడ పోర్టు	18.50	18.44
57231	విజయవాడ-కాకినాడపోర్టు	21.11	21.05

జగ్గంపేట

చలనచిత్రాలు జగ్గంపేట: **కృష్ణవేణి** - ఒక్క క్షణం, **జె.వి.ఆర్. సినిమాస్ స్క్రీన్ I** - ఎం.సి.ఎ., **జె.వి.ఆర్. సినిమాస్ స్క్రీన్ 2-** హలో, **నాగేశ్వర:** 2 కంట్రీస్, గోకవరం: **పద్మప్రియ** - ఎం.సి.ఎ., **శ్రీనివాస:** ఒక్క క్షణం.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

గోవిందపురం(జగ్గంపేట), న్యూస్‌టుడే: కేంద్రం, రాష్ట్రంలో భాజపా, తెదేపా ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సి.పి.ఐ(ఎం.ఎల్.) లిబరేషన్ జిల్లా నాయకుడు ఏగుపాటి అర్జునరావు అన్నారు. బుధవారం మండలంలోని గోవిందపురం గ్రామంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్‌లో దళితుడిపై దాడి చేసి హత్య చేయడం దారుణమన్నారు. ఇటువంటి ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

గండేపల్లి, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా తాళ్లూరు గ్రామంలోని జడ్పీ పాఠశాల విద్యార్థులకు బుధవారం 'ఆరోగ్యమే మహాభాగ్యం'పై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి మాట్లాడుతూ జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె కబుర్లు

రామవరం: మండలంలోని రామవరం నుంచి మర్రిపాక వెళ్లే మార్గంలో అప్రోచ్ రహదారి ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ఇర్రిపాక: మండలంలోని ఇర్రిపాక గ్రామంలో ఎస్సీ సామాజిక భవనం అసంపూర్తిగా ఉంది. దానిని పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

వెంగయమ్మపురం: మండలంలో వెంగయ్మపురం గ్రామంలో వీధులు అధ్వానంగా ఉన్నాయి. వీధులను అభివృద్ధి చేసి కాలువలను ఏర్పాటు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

జె.కొత్తూరు: గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టె నిరుపయోగంగా ఉంది. నీటి సదుపాయం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే తెదేపా ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. మండలంలోని రాజపూడి గ్రామంలో జన్మభూమి - మాఊరు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రంలో మెరుగైన పరిపాలన అందించాలన్న సంకల్పం ముఖ్యమంత్రి చంద్రబాబులో ఉందన్నారు. ఈ విషయంలో ఎక్కడా రాజీపడకుండా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. పింఛను, గృహాలు, రేషన్‌కార్డులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని జన్మభూమి కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుడేల రాణి, ఉప ఎంపీపీ మారిశెట్టి భద్రం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అప్పలరాజు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు కొత్త కొండబాబు, ప్రత్యేక అధికారి కుమార్, ఎంపీడీవో వాసుదేవరావు పాల్గొన్నారు.



రాజపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ముక్కొల్లులో పట్టా అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు వీరంరెడ్డి కాశిబాబు, ప్రత్యేక అధికారిణి రత్నప్రశాంతి

పేదల సంక్షేమానికి కృషి

గండేపల్లి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాళ్లూరు, బొర్రంపాలెం గ్రామంలో 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ అనేక పథకాలు ప్రవేశపెడుతూ వాటిని పేదలకు చేరువ చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. తాళ్లూరులో రూ.కోటితో సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తాళ్లూరులో 26 మందికి పింఛన్లు, 8 మందికి ఉపకారవేతనాలు, అయిదుగురికి రేషన్‌కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటేశ్వరరావు, విష్ణుచక్రం, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ కందుల కొండయ్యదొర, జగ్గంపేట ఏఎంసీ ఛైర్మన్ అప్పలరాజు, తెదేపా నాయకుడు బాబ్జి, ప్రత్యేక అధికారి డేవిడ్‌రాజు, ఎంపీడీవో రమేష్, తహసీల్దారు గీతాంజలి పాల్గొన్నారు.

ప్రజల వద్దకు పాలన

కిర్లంపూడి: ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు వీరంరెడ్డి కాశిబాబు పేర్కొన్నారు. కిర్లంపూడి మండలంలోని రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల్లో బుధవారం గ్రామ సభలను నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన జరిగిన ఈ సభల్లో జడ్పీటీసీ సభ్యుడు కాశిబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు కుటుంబపరమైన ఆర్థిక, అభివృద్ధి పరమైన అవసరాలను తీర్చేందుకు కూడా ప్రభుత్వ చర్యలు తీసుకుందన్నారు. ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. వెలుగు శాఖ ద్వారా చంద్రన్న బీమా చేయించుకున్న వారి పిల్లల చదువుకుగాను ముక్కొల్లు గ్రామంలో 81 మందికి, రూ.97,200, రాజుపాలెం గ్రామంలో 68 మందికి రూ.81,600 అందజేశారు. కొత్తరేషన్ కార్డులు, కౌలుదారీ ధ్రువపత్రాలను, చంద్రన్న కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేక అధికారిణి రత్నప్రశాంతి, తహసీల్దారు మహబూబ్‌ఆలీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామాచారి, రాజుపాలెం సర్పంచి గంధం గంగాభవానీ, ఎంపీటీసీ సభ్యుడు గోడే దొరబాబు, భూపాలపట్నం సర్పంచి గంధం నాగు, రామచంద్రపురం ఉపసర్పంచి కంచుమర్తి రాఘవ పాల్గొన్నారు.

గోకవరం: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తోందని జడ్పీటీసీ సభ్యుడు పాలూరి బోసుబాబు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సర్పంచి కుందేటి అప్పయమ్మ, మధ్యాహ్నం ఇటికాయలపల్లి గ్రామంలో సర్పంచి కండేపల్లి రాంబాబు ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యుడు పాలూరి బోసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇటికాయలపల్లిలో స్వచ్ఛభారత్‌పై చిన్నారులు చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. గర్భిణులకు సామూహిక సీమంతాలతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి చిట్టిబాబు, ఎంపీడీవో వెంకటరమణరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, నాయకులు జనపరెడ్డి బాబు, దొడ్డా విజయ్, ఈది అశోక్, వల్లేపల్లి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, బద్దిరెడ్డి బాబి, తుపాకుల నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో సామూహిక సీమంతాలలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు.

చెరువు చిక్కిపోతోంది

కిర్లంపూడి, న్యూస్‌టుడే: వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందించే చెరువు రోజురోజుకూ చిక్కిశల్యమై నీటి కుంటలా తయారైంది. 20 ఎకరాలు పైన ఉండే చెరువు గర్భం ఆక్రమణదారుల చెరలో చిక్కి అయిదు ఎకరాలకు చేరుకుంది. సింహాద్రిపురం గ్రామంలోని నల్లావాని చెరువు గర్భం ఏటికేడు తరిగిపోతోంది. ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. చెరువు మధ్యలో చెరకుతోట సాగుచేస్తున్నారంటే ఆక్రమణల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ చెరువుపై వెయ్యి ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. కనీసం వంద ఎకరాలకు కూడా సాగునీరు అందడంలేదు. గ్రామంలో 80 శాతం ఆయకట్టులో చెరకు పంటను సాగు చేస్తున్నారు. దీనికి సుమారు 65 బోర్లు ఏర్పాటు చేసుకుని పంటలు పండిస్తున్నారు. మిగిలిన ఆయకట్టు దారులు అష్టకష్టాలు పడి వంద ఎకరాల్లో పంటను పండిస్తున్నారు. చెరువులో ఆక్రమణలు పెరిగిపోతున్నా ఇటు గ్రామంలో ప్రజాప్రతినిధులు, అటు నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలాగే వదిలేస్తే కొంతకాలనికి ఇక్కడ చెరువు ఉండేదట అని చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నల్లావాని చెరువును ఆక్రమణల చెరనుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు. గతంలో ఆక్రమణలు తొలగించి గట్లు వేసి తిరిగి మళ్లీ ఆక్రమిస్తున్నారని దీనిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై కిర్లంపూడి తహసీల్దారు మహబూబ్ ఆలీని వివరణ కోరగా చెరువును పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. చెరువుగర్భంపై సర్వే నిర్వహించి ప్రభుత్వ చెరువు అన్యాక్రాంతమైన భాగాన్ని గుర్తించి దానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



సింహాద్రిపురంలో నల్లావాని చెరువు దుస్థితి



చెరువుగర్భాన్ని ఆక్రమించి సాగుచేసిన చెరకుతోట

మందకృష్ణ అరెస్టుకు నిరసన

మల్లిశాల(జగ్గంపేట)న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అరెస్టును నిరసిస్తూ బుధవారం ధర్నా నిర్వహించారు. మండలంలో మల్లిశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పైడిమళ్ల మల్లేష్ మాట్లాడుతూ ఎ బి సి డి వర్గీకరణ సాధన కోసం ఉద్యమం చేపడుతున్న మందకృష్ణమాదిగను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. తక్షణం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆకుమరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మల్లిశాలలో ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగ్గంపేట

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జగ్గంపేట, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. స్థానిక విశాల సహకార సంఘ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న సహకార సంఘ భవనానికి రూ.62 లక్షలు వెచ్చించి అధునాతంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించాలంటే సిబ్బంది భయపడే పరిస్థితి ఉండేదన్నారు. రైతులకు రుణాలు, విత్తనాల పంపిణీకి అనువుగా ఉంటుందన్నారు. ఈసంఘం ద్వారా రూ.13వేల కోట్ల వ్యాపారం సాగుతుందన్నారు. గురువారం ఈ భవనాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో 10 అంశాలను నిర్దేశించామన్నారు. పది రోజులు ఒక్కో రోజు ఒక్కో అంశంపై కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, ఏఎంసీ ఛైర్మన్ అప్పలరాజు, అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడు కొత్త కొండబాబు, తెదేపా నాయకులు అత్తులూరి సాయిబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, కుదప వాసు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఘనంగా మహిళా దినోత్సవం

జగ్గంపేట, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం స్వామి వివేకానంద విద్యాసంస్థల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఒమ్మిరఘురామ్ విద్యార్థులను కోరారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

గోకవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని విద్యావంతులుగా మారడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ సభ్యుడు పాలూరి బోసుబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివకుమార్ అధ్యక్షతన బుధవారం 'విద్య-సమాజంలో మార్పు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోసుబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని చదవడంతో పాటు చుట్టూ ఉన్న వారిని చదువులో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, రాణి, చైతన్య, నూకరాజు, గరగశ్రీను, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం ఆగదు

గోకవరం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు గరభారపు శ్రీను అన్నారు. స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనం ఎదుట బుధవారం పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ వరకు దీనిపై నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.రాములు, పి.శ్యామ్, బీవీ చంద్రం, సీహెచ్ శ్రీను, రమేష్, ఆరంజ్యోతి, నాగమణి, దొరబాబు పాల్గొన్నారు.

ఆశలన్నీ అడియాసే

అర్హత ఉన్నా అందని పింఛన్లు

గోకవరం, న్యూస్‌టుడే

వృద్ధాప్యంలో వృద్ధులకు ఎంతో కొంత ఆసరా కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రూ.200 ఉండే ఈ సొమ్మును రూ.1000 వరకు పెంచారు. ఇక్కడ వరకు బాగానే ఉన్న అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందక ఎందరో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ పింఛను కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఏటా నిర్వహించే జన్మభూమి కార్యక్రమాల్లో దరఖాస్తులు చేస్తున్నారు. కార్యక్రమం అనంతరం అరకొరగా పింఛన్లు కేటాయించడం, అవి కూడా రాజకీయనాయకుల అండదండలు, జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉన్నవారికి మాత్రమే అందడంతో అర్హులకు అందడం లేదు. ఒకవైపు వయసు మీదపడుతున్నా మరొక పక్క పింఛన్లు అందక వృద్ధులు విలవిలలాడిపోతున్నారు.

నియోజకవర్గంలో మొత్తం దరఖాస్తులు : 4,800
జన్మభూమి కార్యక్రమంలో పంపిణీ చేయనున్నవి : 2,000

అయిదేళ్లుగా దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు



గోకవరం గ్రామానికి చెందిన బత్తిన సూర్యారావుకు సుమారు 73 ఏళ్లు. నేటికీ వృద్ధాప్య పింఛను మాత్రం అందడం లేదు. కుమార్తెకు వివాహమై అత్తారింటికి వెళ్లిపోగా ప్రస్తుతం అతను భార్యతో కలిసి ఒక అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వృద్ధాప్యం కారణంగా ఏవిధమైన పనిచేయ లేకపోతున్నాడు. పింఛను వస్తే ఆసరాగా ఉంటుందనుకుని అయిదేళ్లుగా దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు. నేటికీ పింఛను మాత్రం అందలేదని సూర్యారావు వాపోతున్నాడు.

అనారోగ్యంతో ఇబ్బందులు



గోకవరం గ్రామానికి చెందిన గునిపల్లి సూర్య అప్పారావు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. నెలకు మందుల కొనుగోలుకే వేల సంఖ్యలో ఖర్చవుతోంది. సుమారు 68 ఏళ్ల వయసు కావడంతో వృద్ధాప్యం కారణంగా ఏ పనిచేయలేక ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. ప్రభుత్వం పింఛను ఇస్తే కొంతలో కొంత ఇబ్బందులు తీరుతాయని ఏటా దరఖాస్తు చేస్తూనే ఉన్నాడు. నేటికీ పింఛను అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

కంటిచూపు కనిపించడం లేదు



వెలమదొర గంగరాజుకు సుమారు 71 సంవత్సరాలు. ప్రస్తుతం ఒక కన్ను పూర్తిగా కనిపించడం లేదు. దీనికి తోడు నడుమునొప్పితో బాధపడుతున్నాడు. ప్రభుత్వం అందించే పింఛను వస్తే కొంత వర్కైనా అవసరాలు తీరుతాయనుకున్నాడు. అయిదేళ్లుగా పింఛను కోసం దరఖాస్తులు చేస్తూనే ఉన్నాడు. ప్రతి జన్మభూమి కార్యక్రమంలో పింఛను వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాడు. కానీ ఫలితం లేదు. ఒక వైపు వృద్ధాప్యం, మరో వైపు అంగవైకల్యంతో బాధపడుతున్నా నేటికీ అధికారులు, పాలకులు కనికరించడం లేదని వాపోతున్నాడు.

చెప్పులు అరిగేలా తిరిగినా



రేవాడ చంటబ్బాయికి 67 ఏళ్లు. గోకవరం గ్రామం. రెండేళ్లుగా వృద్ధాప్యం పింఛను కోసం దరఖాస్తులు చేస్తున్నా నేటికీ అందలేదు. జన్మభూమి కార్యక్రమంతో పాటు ప్రజావాణిలోనూ దరఖాస్తులు అందించగా తనకు పింఛను మాత్రం అందించడం లేదని వాపోతున్నాడు. వృద్ధాప్యంలోనూ వ్యవసాయపనులకు వెళుతూ గేదెలను కాస్తూ ఇబ్బందులు పడుతున్నాడు. అనేక సార్లు కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా ఎందుకు అందించడం లేదో కూడా కనీసం సమాధానం చెప్పడం లేదంటున్నాడు. ఇప్పటికైనా తనకు పింఛను అందించాలని కోరుతున్నాడు.

ఇతర జిల్లాలకు కోటి తలంబ్రాలు

గోకవరం, న్యూస్‌టుడే: గోటితో కోటి తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ధాన్యాన్ని పంపిస్తున్నట్లు కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు తెలిపారు. ఈవిధంగా ఇతర జిల్లాలకు పంపించేందుకు సిద్ధం చేసిన ధాన్యానికి బుధవారం గోకవరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామోత్సవం, విశ్వశాంతి హారతి, ప్రత్యేక పూజలతో పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం వాటిని నెల్లూరు, విజయనగరం జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఉన్న రామభక్తులకు పంపినట్లు చెప్పారు.

'ఆర్భాటాలతో పబ్బం గడుపుతున్న ప్రభుత్వం'

గండేపల్లి, న్యూస్‌టుడే: హంగులు ఆర్భాటాలతో తెదేపా ప్రభుత్వం పబ్బం గడుపుతోందని, వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని జగ్గంపేట వైకాపా కోఆర్డినేటర్ ముత్యాల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మురారి గ్రామంలో చెళగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో రచ్చబండ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని తెదేపా ప్రభుత్వం మరిచిందని, అర్హులకు పథకాలు చేరడం లేదని ఆరోపించారు. ప్రతి పేదవాడికి మేలు జరిగేలా జగన్ పాలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా నాయకుడు చెళగళ్ల దొరబాబు, వైకాపా స్టేట్ వింగ్ సెక్రటరీ పాము సూరిబాబు పాల్గొన్నారు.



రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు

అవగాహనతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెత్తనుంచి సంపద కేంద్రాలు నిర్వహించడం ద్వారా స్వచ్ఛ గ్రామాలుగా మలచుకోవచ్చని, దీనిపై గ్రామంలోని ప్రజల అవగాహనతోనే సాధ్యం అవుతుందని బూరుగుపూడి సర్పంచి, స్వచ్ఛ గ్రామాల రాష్ట్ర రిసోర్సుపర్సన్ పాటంశెట్టి సూర్యచంద్ర పేర్కొన్నారు. బూరుగుపూడి సంసద్ ఆదర్శ గ్రామంలో బుధవారం పశ్చిమగోదావరి జిల్లా ఐ.పంగిడి, బుట్టాయగూడెం, చినఅమిరం మండలాలకు చెందిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చెత్తనుంచి సంపదకేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేయడం వల్ల స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛగ్రామాల టెక్నికల్ ఫీల్డ్ కోఆర్డినేటరు గణేశ్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్తు ఒప్పంద ఉద్యోగుల సమ్మె నోటీసు

జగ్గంపేట, న్యూస్‌టుడే: కాంట్రాక్టు విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో డీఈ రమణమూర్తికి ఈసందర్భంగా వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఈనెల 28 నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

గురుకులంలో సంక్రాంతి సంబరాలు

జగ్గంపేట, న్యూస్‌టుడే: స్థానిక సాంఘిక సంక్షేమ బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ సంబరాలు చేపట్టినట్లు చెప్పారు. బాలికలు సంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



సమస్య: తిరుమలాయపాలెం గ్రామంలోని గొల్లపేటలో సరైన కాలువ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.
– స్థానికులు, తిరుమలాయపాలెం

సమాధానం: మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.
– రాజేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి.

- న్యూస్‌టుడే, గోకవరం

మీరూ... పంపండి

మీ ప్రాంతంలో రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయా... మురుగునీరు సక్రమంగా పారడం లేదా... అపరిశుభ్రత ఎక్కువగా ఉందా... తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారా... ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారా... సమస్యలపై మీరూ స్పందించండి. అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్య ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

వాట్సాప్ నంబర్లు:
జగ్గంపేట: 80085 74201
గోకవరం: 80086 22066
కిర్లంపూడి: 80085 74203
గండేపల్లి: 79950 67052

కాకినాడ గ్రామీణం

హలో ఈనాడు

సమస్య: తూరంగి ఈశ్వర్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీలేక పందులు వచ్చేస్తున్నాయి.
–శ్రీనివాస్, తూరంగి

సమాధానం: పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయిన వెంటనే ప్రహరీ నిర్మిస్తాం.
–ఎల్.గణేష్ బాబు, ఎంఈవో

సమస్య: కొవ్వాడలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. నివాస ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొని జ్వరాలు వ్యాపిస్తున్నాయి.
–విష్ణు, కొవ్వాడ

సమాధానం: కొవ్వాడలో పందుల నియంత్రణకు చర్యలు తీసుకుంటా.
–గోవిందరాజులు, కార్యదర్శి

-న్యూస్‌టుడే, తూరంగి

సమస్య: వలసపాకల పంచాయతీలోని విఘ్నేశ్వరనగర్ 3వ వీధిలో 10 రోజులుగా చెత్తాచెదారం తీయడం లేదు.
–సుధాకర్, వలసపాకల

సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి చెత్త తొలగిస్తాం.
–సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

సమస్య: నేమాం గ్రామపంచాయతీలోని మత్స్యకార కాలనీలో మురుగుకాలువలు అధ్వానంగా ఉన్నాయి. పూడిక తీయడం లేదు.
–ఎం.నాగరాజు, నేమాం

సమాధానం: సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తా.
కాటూరి కొండబాబు, సర్పంచి

-న్యూస్‌టుడే, సర్పవరంజంక్షన్

సమస్య: గొడ్డటిపాలెంలోని ఆశ్రమం వద్ద నిర్మించిన సీసీ రోడ్డుకు బెర్మలు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.
–రాజు, గ్రామస్థుడు

సమాధానం: గుత్తేదారుడితో మాట్లాడి వెంటనే సీసీ రోడ్డుకు ఇరువైపులా బెర్మలు వేయిస్తా.
– వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి మండల ఇంజినీరింగ్ అధికారి

సమస్య: వేళంగి ఏనుగుబంద కాలనీ చివరివీధిలో రెండురోజుల నుంచి వీధిదీపాలు వెలగడం లేదు.
–త్రిమూర్తులు, వేళంగి

సమాధానం: క్షేత్రస్థాయి సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తా.
–ఎస్.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

-న్యూస్‌టుడే, కరప

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
సర్పవరం జంక్షన్ - 80085 74325
కరప - 91775 05761
ఉదయం 10 - మధ్యాహ్నం 12 గం॥ల మధ్య

ప్రతి ఆడపిల్లా...పులి పిల్లే

పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ

ఇటీవల చాలాచోట్ల విద్యార్థినులు, మహిళలపై దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని కఠిన చట్టాలు తీసుకొస్తున్నా అతివలపై దాడులను అరికట్టలేకపోతున్నారు. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన అమ్మాయి క్షేమంగా ఇంటికి చేరేవరకు తల్లిదండ్రులకు ఆందోళనే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇచ్చి ఆదిపరాశక్తులుగా తీర్చిదిద్దుతున్నారు.



కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ

కరప, న్యూస్‌టుడే: కరాటే.. ప్రస్తుతం బాలికలకు కావాల్సిన ముఖ్యమైన క్రీడ. ఆపద నుంచి బయట పడేందుకు.. ధైర్యంగా కొన్ని సందర్భాలలో ఎదుటివారిని నిలువరించేందుకు దోహదం చేస్తుంది. ఆపత్కాలంలో చేతినే ఆయుధంగా మలచుకుని పోరాడేలా అమ్మాయిలకు ఆత్మ రక్షణ విద్య నేర్పిస్తున్నారు. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షాభియాన్ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిది, తొమ్మిదోతరగతి చదువుతున్న విద్యార్థినులకు కరాటే విద్యపైఆసక్తి పెంచి శిక్షణకు శ్రీకారం చుట్టారు. కాకినాడ గ్రామీణ నియోజక వర్గపరిధిలోని కరప మండలంలో వేళంగి, పెద్దాపురప్పాడు, కరప, వేములవాడ, కూరాడ, అరట్లకట్ట, నడకుదురు, గొర్రిపూడి, గురజనాపల్లి గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులు కరాటేలో శిక్షణ పొందుతున్నారు. ఆర్ఎమ్ఎస్ఏ ద్వారా బండి మార్షల్ ఆర్ట్స్ సమన్వయకర్త టి. అబ్బులు ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ ఉండ్రు లోవరాజుతో మూడు నెలల పాటు శిక్షణ అందిస్తున్నారు. వారంలో మూడురోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా సాధన చేస్తున్నారు.

ఆత్మస్థైర్యం వచ్చింది



కరాటే శిక్షణతో ఏకాగ్రత పెరిగి, మానసికోల్లాసం కలిగి చదువులో మంచి ఫలితాలు సాధించవచ్చు. నేటి సమాజంలో విద్యార్థినులు, మహిళలకు భద్రత కరవైంది. ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకుంటే మనల్ని మనం రక్షించుకోవచ్చు.
-చోడపునీడి జాహ్నవి, 9వ తరగతి విద్యార్థిని, కరప

ఆయుధంలా పనికొస్తుంది



కరాటే ఆయుధం లాంటిది. పాఠశాల స్థాయిలో నేర్చుకున్న శిక్షణ పెద్దయ్యాక ఉపకరిస్తుంది. నేటి సమాజంలో మహిళలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో చేతిలో ఆయుధం ఉన్నట్లే. ఇక్కడ చాలా చక్కగా నేర్పించారు.
-పేపకాయల సంతోషి, 9వ తరగతి

శిక్షణతో ఆరోగ్యం



కరాటే శిక్షణతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంతోపాటు ఆరోగ్యం చేకూరుతుంది. పాఠశాలలో నేర్చుకున్న విద్యతో ఆత్మరక్షణతోపాటు, ఆపద సమయాల్లో ఉన్న ఇతరులకు సాయం అందించే స్థాయికి చేరుకోవచ్చు.
-పి.విజయలక్ష్మి, వేళంగి జడ్పీ ఉన్నత పాఠశాల

ధైర్యంగా వెళ్లొచ్చు



కరాటే, తైక్వాండో లాంటి మార్షల్‌ఆర్ట్స్ నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆకతాయిల బారిన పడకుండా బయటకు ధైర్యంగా వెళ్లి క్షేమంగా ఇంటికి రావచ్చు. భవిష్యత్తులో మహిళలు, విద్యార్థినులపై దాడులు చేయడానికి ఎవరూ సాహసించరు.
-పి.విజయదుర్గ, వేళంగి పాఠశాల

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

గాంధీనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, దశల వారీగా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, లేకుంటే ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం లంచ్ అవర్‌లో డివిజినల్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డీఈ జి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ సమితి కాకినాడ డివిజన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, కార్యదర్శి వి.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, పి.సతీష్, శివరామకృష్ణలు మాట్లాడుతూ విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న కార్మికులందరినీ విద్యుత్తు సంస్థలో విలీనం చేసుకుని నేరుగా జీతాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని దశల వారీగా విద్యుత్తు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకుంటే ఈనెల 20 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు, 27 నుంచి ఉద్యమిస్తామన్నారు.



డీఈ కార్యాలయం వద్ద విద్యుత్తు ఒప్పంద ఉద్యోగుల నిరసన

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

గైగోలుపాడు: రమణయ్యపేట పంచాయతీలోని గైగోలుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రవి మాట్లాడుతూ బాలికావిద్యను ప్రోత్సహించడానికి ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులు బాలికలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేళంగి(కరప): కరప మండలంలోని వేళంగి గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. జి.భావవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళుతూ ఆర్టీసీ బస్సును ఢీకొని గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే కాకినాడ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉందని కరప పోలీసులు తెలిపారు.

ఏపీఎస్పీ సిబ్బందికి ఎస్‌డీఆర్‌ఎఫ్ శిక్షణ

సర్పవరంజంక్షన్, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి సహాయం అందించడానికి 3వ ఏపీఎస్పీ సిబ్బందికి ఎస్‌డీఆర్‌ఎఫ్ శిక్షణ ఇస్తున్నామని కమాండెంట్ జె.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రాను కమాండెంట్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఏపీఎస్పీ సిబ్బందిలో 100 మందికి శిక్షణ ఇచ్చామని, జిల్లా అవసరాలకు వీరిసేవలు వినియోగించుకోవాలని కలెక్టర్‌కు తెలిపామన్నారు.

'బహిరంగ మలవిసర్జనతో అనారోగ్యం'

పెనుగుదురు(కరప), న్యూస్‌టుడే: బహిరంగ మలవిసర్జన అనేది ఒక సాంఘిక దురాచారమని, దీన్ని రూపుమాపడంతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని సంధ్యా ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డా.ధర్మేంద్రకుమార్ సూచించారు. కరపమండలం పెనుగుదురులో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై అవగాహన, పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డా.రత్నకిరణ్, డా.ప్రతిభ, ఏవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెనుగుదురులో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

'ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదు'

ఇంద్రపాలెం, న్యూస్‌టుడే: ఇంద్రపాలెం పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, పలుసార్లు తాము ఫిర్యాదు చేసినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోలేదని గ్రామ జన్మభూమి కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో చనిపోయిన జీవాల మాంసం విక్రయిస్తున్నారని తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవలేదని వారు బుధవారం విలేకర్లకు తెలిపారు.

రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఫణీశ్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ద.మ. రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా జిల్లా, కాకినాడ ప్రయాణికుల సంఘం కార్యదర్శి అడ్డూరి ఫణీశ్ నియమితులైనట్లు సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పదవిలో ఫణీశ్ రెండేళ్ల పాటు కొనసాగుతారన్నారు. ఆయనకు వైడీ రామారావు, సభ్యులు అభినందనలు తెలిపారు.

కొత్తపేట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జొన్నాడ(ఆలమూరు): ఆలమూరు మండలం జొన్నాడ ఆంజనేయస్వామి గుడి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. భూగర్భజల శాఖకు చెందిన డి.డి. డి.ఎస్.విజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మామిడికుదురు మండలానికి ప్రత్యేకాధికారిగా నియమితులైన విజయ్‌కుమార్ జన్మభూమి గ్రామసభకు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. జాతీయ రహదారిపై వాణిజ్యపన్నుల శాఖ అధికారులు వాహనాలను తనిఖీచేస్తున్నారు. వారిని చూసి లారీ డ్రైవరు ఆకస్మికంగా బ్రేకు వేయడంతో వెనకాల వస్తున్న రెండు కార్లు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ముందు సీట్లో కూర్చున్న దుర్గాప్రసాద్ తలకు తీవ్ర గాయమైంది. డీడీకి గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్సులో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఆలమూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపేట, న్యూస్‌టుడే: ఈ నెల 25న కొత్తపేట మండలం మందపల్లి పెదవంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కేదార్లంకకు చెందిన పోలిశెట్టి శ్రీనివాసు, బాబానగర్‌కు చెందిన మెట్టి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరినీ తొలుత కొత్తపేట, తరువాత మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వీరిలో బాబానగర్‌కు చెందిన మెట్టి వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎ.గరగారావు తెలిపారు.

గ్యాస్‌లీకైన సంఘటనలో...

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం ఈతకోటలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన సంఘటనలో చికిత్స పొందుతూ మరొక వ్యక్తి మృతి చెందిన సంఘటనపై రావులపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం ఈతకోటలో డిసెంబరు 28న ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకవడంతో మంటలు వ్యాపించి 10 మంది గాయాలపాలైన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న మండా వెంకటేశ్వరరావు(38) ఈ నెల 1న మృతిచెందగా ఇదే సంఘటనలో తీవ్రగాయాలతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెనుమాక వెంకటకృష్ణారావు(52) బుధవారం మృతి చెందాడు. దీనిపై కాకినాడ నుంచి రావులపాలెం పోలీసులకు సమాచారం రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

భవిత కేంద్రాల్లో వసతులు కల్పించాలి

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్యేక ప్రతిభావంతులైన చిన్నారులు భవిత కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బంది పడకుండా అన్ని వసతులు కల్పించాలని శాసనసభ్యుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో సేవలు పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కొంతమందికి పింఛన్లు రావడం లేదని, వారికి మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట చెల్లయ్య, జడ్పీ ప్రతిపక్షనేత సాకా ప్రసన్నకుమార్, కర్రి నాగిరెడ్డి, జవ్వాది రవిబాబు, కొండేపూడి రామకృష్ణ, బొక్కా ప్రసాద్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

జన్మభూమి సభను అడ్డుకునేందుకు యత్నం

బడుగువానిలంక(ఆలమూరు): ఆలమూరు మండలం బడుగువానిలంకలో జన్మభూమి గ్రామ సభను అడ్డుకునేందుకు రైతుకూలీ సంఘం ప్రతినిధులు ప్రయత్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం జన్మభూమి సభను నిర్వహిస్తుండగా రైతుకూలీ సంఘానికి చెందినవారు ఊరేగింపుగా వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మండపేట సీఐ లక్ష్మణరెడ్డి, ఎస్ఐ దొరరాజు, తహసీల్దారు పద్మావతి వారిని నిలువరించి డిమాండ్లు ఏమిటో చెప్పాలని కోరారు. లంక భూముల సమస్య దశాబ్దాలుగా పరిష్కరించడం లేదని గతంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని ఆందోళనకారులు పేర్కొన్నారు. సమస్య పరిష్కారంపై చర్చలు తీసుకుంటున్నామని అవసరమైతే చర్చిద్దామని సభను అడ్డుకోవడం తగదని అధికారులు పేర్కొన్నారు.

రైతుబజార్లలో ధరలు (ఒక కిలో రూ.లలో)

కొత్తపేట రైతుబజారు ధరలు: టమోటాలు 33, వంకాయలు 14, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 20, బీరకాయలు 20, దొండకాయలు 16, బెండకాయలు 20, చిక్కుళ్లు 27, గోరు చిక్కుళ్లు 26, క్యాబేజీ 37, క్యారెట్ 60, బీట్‌రూట్ 40, చామదుంపలు 29, కంద 22, బంగాళా దుంపలు 12, ఉల్లిపాయలు 30, అల్లం 40, బొబ్బర్లు 22, పొట్లకాయ 10, ఆనపకాయ 7, అరటికాయ 3, ఆకాకర 60, దోసకాయ 12, కీరదోసకాయలు 24, క్యాప్సికం 64, చిలకడదుంప 20, బీన్స్ 46,

చలనచిత్రాలు

కొత్తపేట: శ్రీలక్ష్మీనారాయణ: ఎంసీఏ, శ్రీ సత్య: 2 కంట్రీస్, సత్యాచంద్ర: ఒక్క క్షణం, **రావులపాలెం:** పద్మశ్రీ: ఎంసీఏ, అక్షర స్క్రీన్1: హలో, అక్షర స్క్రీన్2: ఒక్క క్షణం, వెంకటేశ్వర: 2 కంట్రీస్

సంక్షేమ పథకాల అమలుకే జన్మభూమి

మండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం



వెదిరేశ్వరంలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఆర్ఎస్, సత్యానందరావు

నవాబుపేట(ఆలమూరు): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకే ప్రభుత్వం జన్మభూమి గ్రామ సభలు ఏర్పాటు చేస్తోందని దీనిని ప్రతిపక్షాలు రాజకీయవేదికగా మార్చడం తగదని శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆలమూరు మండలం నవాబుపేటలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. దశలవారీగా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మిగిలినవారికి త్వరలోనే కేటాయించేలా ప్రయత్నం జరుగుతోందన్నారు. పింఛన్లు, రేషను కార్డులు, రుణాల కేటాయింపు పారదర్శకంగా జరుగుతోందన్నారు. ఎక్కడైనా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తే సరిచేస్తారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరైన కొత్త రేషనుకార్డులు, చంద్రన్న కానుకలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి ఛైర్మన్ ఈదల నల్లబాబు, ఎంపీపీ ధనలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు మమత, సర్పంచి గురుచంద్ర స్వరూప్, ఉప సర్పంచి సత్తిబాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పాండురంగారావు, తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో నాతి బుజ్జి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట శాసనసభ్యుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన బుధవారం బొబ్బర్లంకలో సర్పంచి గోళ్ల తేజోష్ణ అధ్యక్షతన జరిగిన జన్మభూమి - మా ఊరు గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ వాకలపూడి వెంకటకృష్ణారావు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు, చంద్రన్న బీమా బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలు ఏకరవు పెట్టారు.



బొబ్బర్లంక గ్రామసభలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు జగ్గిరెడ్డి

ఓర్వలేక ఆరోపణలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా నాయకులు లేనిపోని ఆరోపణలకు దిగుతున్నారని నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బండారు సత్యానందరావు అన్నారు. ఆయన పేరవరం గ్రామంలో సర్పంచి బెజవాడ హిమబిందు అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులైన పేదలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుండగా ప్రతిపక్ష నాయకులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. అనంతరం రేషన్‌కార్డులు పేదలకు అందించారు. సీమంతంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొత్తపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేగేశ్న చంద్రరాజు, ఎంపీపీ వాకలపూడి వెంకటకృష్ణారావు, జడ్పీటీసీ సభ్యురాలు మద్దూరి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లమిల్లి క్రీస్తమ్మ, నేతలు ముళ్లపూడి భాస్కరరావు, గోళ్ల శ్రీహరి, బెజవాడ సతీష్, ముత్యాల బాబ్జి, ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ, తహసీల్దారు వరదా సుబ్బారావు, ఆర్.ఐ పద్మ, వ్యవసాయాధికారి కె.సునీత, ఎంఈవో పి.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం గ్రామీణం: పేదలందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తూ వారిని అన్ని రకాలుగా ఆదుకునేందుకే ప్రభుత్వం జన్మభూమి మా ఊరు గ్రామ సభలను నిర్వహిస్తోందని శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో సర్పంచి కాశీ నాగేశ్వరరావు అధ్యక్షతన జన్మభూమి మా ఊరు గ్రామసభ బుధవారం జరిగింది. ఈ గ్రామసభకు సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ మంతెన వెంకటసత్యనారాయణరాజు, మాజీ శాసనసభ్యుడు బండారు సత్యానందరావు హాజరై మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని జన్మభూమి మాఊరు గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తూ ప్రభుత్వ పథకాలను వారికి అందించేందుకు కృషి చేస్తోందన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన 12 రేషన్‌కార్డులు, 221 మందికి ఉపకార వేతనాలు, అందించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట చెల్లయ్య, జడ్పీ ప్రతిపక్షనేత సాకా ప్రసన్నకుమార్, పి.జి.వి.విజయకుమార్, డి.పాండురంగారావు, శేషగిరిరావు, ఉప ఎంపీపీ వర్మ, జనార్దనరాజు, గుత్తుల రాంబాబు, కుడుపూడి శ్రీనివాస్, ఏడుకొండలు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

గంటి(కొత్తపేట): సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో ప్రభుత్వం పరుగులు పెడుతోందని శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. గంటిలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సర్పంచి నక్కా భారతి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. శాసనమండలి సభ్యుడు ముదునూరి వెంకట సత్యనారాయణరాజు మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసేది తెదేపా ప్రభుత్వమేనన్నారు. శాసనసభ్యుడు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ మంచి పనులు చేస్తే మద్దతిస్తామని, అనర్హులకు పథకాలను పంపిణీ చేస్తూ అర్హులను విస్మరిస్తే ఖండిస్తామన్నారు. మండల పరిషత్తు అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, జడ్పీటీసీ సభ్యుడు ధరణాల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు పోలిమాటి అంజలీకుమారి, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి పేర్రాజు, నక్కా బొజ్జి, మండల ప్రత్యేకాధికారి జె.సత్యనారాయణ, మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణి పి.వీణాదేవి, తహసీల్దారు ఎన్.శ్రీధర్, మండల విద్యాశాఖాధికారి ఎం.హరిప్రసాద్, సీడీపీవో బి.అనంతలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి ఓ.వి.వి.సత్యనారాయణ, కార్యదర్శి చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, జన్మభూమి సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గంటి(కొత్తపేట), న్యూస్‌టుడే: గంటి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతికి చెందిన 35 మంది విద్యార్థులకు దాత విశ్రాంత ఉపాధ్యాయుడు వై.ఎస్.ఎన్.మూర్తి సమకూర్చిన నమూనా పేపర్లను యూటీఎఫ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు టి.విజయకృష్ణ, వై.మురళి, ఎం.రవి, పాఠశాల బాధ్య ప్రధానోపాధ్యాయుడు ఎస్.కాశి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న చిత్రం

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: దాతలు, ప్రభుత్వ సహకారంతో రావులపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు సాగుదామని డీసీఎమ్మెస్ ఛైర్మన్ కె.వి.సత్యనారాయణరెడ్డి అన్నారు. రావులపాలెంలోని కాలువ అవతల ప్రజలకు ఉపయోగపడేలా శ్రాద్ధకర్మల భవనాన్ని గ్రామానికి చెందిన గొలుగూరి సత్యనారాయణరెడ్డి ఆర్థిక సహకారంతో నిర్మించారు. ఈ భవనానికి అన్ని పనులు పూర్తికావడంతో బుధవారం భవనాన్ని కె.వి.సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచి గొలుగూరి వెంకటరెడ్డి గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కె.వి. మాట్లాడుతూ ప్రజలు కాలువల వద్ద కార్యక్రమాలు చేసుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతుంటే గ్రహించి భవన నిర్మాణానికి సత్యనారాయణరెడ్డి రూ.8 లక్షలు విరాళం ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం దాతను గ్రామస్థులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి పోతుమూడి విజయలక్ష్మి, ఉప సర్పంచి కొవ్వూరి జగన్నాధరెడ్డి, మల్లిడి కనికిరెడ్డి, కర్రి సుబ్బారెడ్డి, పోతంశెట్టి కనికిరెడ్డి, మిల్లు రామయ్య తదితరులు పాల్గొన్నారు.



రూ.8 లక్షలు విరాళం ఇచ్చిన దాతను సత్కరిస్తున్న గ్రామస్థులు

రక్తదాన శిబిరం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ క్రాస్ విభాగం వారి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపల్ సి.హెచ్.కూర్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడం సమాజానికి ఎంతో మేలు చేసే గొప్ప త్యాగమన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడం విద్యార్థులు అలవరచుకోవాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు, అధ్యాపకులు తమ రక్తాన్ని దానం చేశారు. విద్యార్థుల రక్త పరీక్షలు చేసి గ్రూపు నిర్ధారణ చేసి వారికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో రాజశేఖరరావు, సత్యమూర్తి, గాంధీ, రాజేశ్వరి, హేమలత, కరుణశ్రీ, సునీత, వెంకటస్వామి, చినబాబు, ప్రసాద్, సత్యశేషు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం కేసులో నిందితుల అరెస్టు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లి గ్రామంలో మాజీ సర్పంచి మద్దింశెట్టి వెంకన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితులను ఆత్రేయపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సంఘటనలో అదే గ్రామానికి చెందిన నల్లి సురేష్ మరో అయిదుగురిపై అనుమానం రావడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ జేమ్స్‌రత్నప్రసాద్ తెలిపారు.

సంహిత విద్యాసంస్థలో 'యువతరంగ్'

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని సంహిత విద్యాసంస్థల్లో జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు యువతరంగ్ 2018 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామన్నారు. సాంకేతిక, సుస్వర, శౌర్య, విభాగాలతో పాటు క్రీడలు, పలు రకాల ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే విద్యార్థులు ఈ నెల 5వ తేదీలోపు పేరు నమోదు చేయించుకోవాలన్నారు.

బాగుచేస్తేనే సాగు..

మేల్కొకుంటే రబీకి నీటి కష్టాలు ✦ బక్కచిక్కుతున్న పంట కాలువలు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

దాళ్వా సాగులో రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రారంభ దశలోనే ఇలా ఉంటే ముందు ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. కాలువలు సవ్యంగా లేక పోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. గుర్రపుడెక్క, చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో పాటు ఆక్రమణలతో బక్కచిక్కిపోయాయి. సాగు నీరు ముందుకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది.

ప్రయోజనం లేని పథకం..

ఉచ్చిలి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు సరఫరా చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. వస్తున్న నీరు పథకం మొగదలలో ఉన్న ఆయుకట్టుకే సరిపోతోంది. ఆత్రేయపురం, లొల్ల, వాడపల్లి ఆయకట్టు రైతులకు అందని పరిస్థితి నెలకొని ఉంది. అంకంపాలెం, ర్యాలి తదితర చోట్ల పంటకాలువల్లో గుర్రపుడెక్క అల్లుకుపోయి ప్రవాహ వేగానికి అవరోధం కలుగుతోంది. దీనివల్ల శివారు ఆయకట్టుకు నీరందడం లేదు. ముమ్మరంగా నాట్లు వేస్తున్న తరుణంలో సాగు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది.

డ్రెయిన్ల పరిస్థితి దయనీయం..

మురుగు కాలువల పరిస్థితి అదే విధంగా ఉంది. ర్యాలి వియర్ కాలువ, కట్టుంగ మధ్యతరహా డ్రెయిన్ ఉనికి కోల్పోతోంది. ఎక్కడికక్కడే ఆక్రమణలు పెరిగిపోయి కుచించుకుపోతున్నాయి. వెలిచేరు వద్ద మురుగు కాలువ కనీసం పంట బోదెలా కూడా లేదు.

చెత్త తొలగించాలి

ప్రస్తుతం ఆయా కాలువలు గుర్రపుడెక్క, చెత్తాచెదారాలు పేరుకుపోయి మూసుకుపోయి ఉన్నాయి. ఇప్పటికైనా కాలువల్లో పేరుకుపోయి ఉన్న చెత్తాచెదారాలు తొలగించి సాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని గ్రామాల రైతులు కోరుతున్నారు

సైఫన్ల వద్ద మరమ్మతులు...

కట్టుంగ తదితర ప్రాంతాల్లోని సైఫన్ల వద్ద సాగు నీరు వృథాగా పోతోంది. ఎవరికీ ఉపయోగం లేకుండా మురుగు కాలువల్లోకి వెళ్లి వృథా అవుతోంది. అక్కడ ఉన్న కట్టడాల పగుళ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి తీర్చిదిద్దితే మంచి ఫలితం కనబడుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దిగుబడులపై ప్రభావం...

ఈ తరుణంలో సాగునీటి ఎద్దడి ఏర్పడితే దిగుబడులపై ప్రభావం చూపనుంది. ఆత్రేయపురం మండలంలో ఆయా కాలువల కింద సుమారు 5వేల ఎకరాలకు పైబడి సాగు అవ్వాల్సి ఉంది. ప్రస్తుతం కాలువ అభివృద్ధికి కొద్ది మొత్తం వెచ్చిస్తే దాళ్వా పంటలు గట్టెక్కుతాయి.



వెలిచేరు వద్ద మూసుకుపోయిన మురుగు కాలువ

నామరూపాల్లేకుండా పోయింది. వర్షాకాలం పరిస్థితి దారుణంగా ఉంటోంది. మురుగునీరు ఎగపూటు ఎక్కి పంటలు దెబ్బతింటున్నాయి. .

క్రాస్‌బండ్‌లు వేస్తే ప్రయోజనకరం..

ప్రస్తుతం సాగు నీటి ఎద్దడి తరుణంలో మురుగు కాలువల్లో చెత్తాచెదారాలు తీయడంతో పాటు గత సంవత్సరం వేసినట్టుగా క్రాస్ బండ్లు వేస్తే వృథానీరు సాగు అవసరాలకు మళ్లించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇందు కోసం ముందుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు..

సాగునీటి యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల గతంలో రైతులకు ప్రయోజనం కల్గింది. ఈ పద్ధతులు పాటించడం వల్ల దిగుబడులు పెరిగినట్లు కూడా గుర్తించారు. ఇందుకోసం అధికారులు రైతులకు పొలంబడి తదితర కార్యక్రమాలు ఏర్పాటు ద్వారా అవగాహన కల్పించాలి.



వాడపల్లి వద్ద గుర్రపుడెక్కతో నిండిన పంట కాలువ

దాళ్వాకు ఇబ్బంది లేకుండా చర్యలు...

ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పంట కాలువలు, మురుగు కాలువల్లో పేరుకుపోయి ఉన్న చెత్తాచెదారాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువల్లో క్రాస్‌బండ్ల విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

-రాజమౌళి, జలవనరులశాఖ ఏఈఈ, ఆత్రేయపురం



లక్షతులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

జగన్మోహనుడికి లక్ష తులసిపూజ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివారికి బుధవారం లక్షతులసి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుడు శ్రీనివాసవెంకటాచార్యులు నేతృత్వంలో ఆలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పూర్ణాభిషేకం, హోమం, శాంతి కల్యాణం, లక్షపత్రి పూజ, సహస్ర దీపాలంకరణ, ఊంజల్‌సేవ, కుంకుమార్చన, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు రమణీయంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి పులకించారు. కార్యక్రమంలో ఈవో వై.వెంకటేశ్వరరావు, ప్రముఖులు గోగుల నాగేశ్వరరావు, నాగరాజు, పెద్దింట్లు, గంగరాజు, ఆలయ అర్చకులు వాడపల్లి రంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బాస్కరాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

చిచ్చు పెట్టేందుకే విగ్రహాల ధ్వంసం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రాజకీయ లబ్ధి కోసం కొందరు కులాల మధ్య చిచ్చు పెట్టేందుకే విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం తెదేపా కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ తెదేపాకు అన్ని వర్గాల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. 30 ఏళ్ల నాటి పరిస్థితులను పునరావృతం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. కొత్తపేట మండలం అవిడి, ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి గ్రామాల్లో విగ్రహాలు ధ్వంసం చేయడం ఇందులో భాగమే అని భావిస్తున్నానన్నారు. గ్రామాల్లో అరాచకాలకు పాల్పడే అసాంఘిక శక్తుల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

రావులపాలెం పట్టణం: ప్రతి విద్యార్థి చదువులో రాణించడంతో పాటు క్రమశిక్షణతో మెలగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ముత్యాలనాయుడు అన్నారు. రావులపాలెంలోని సత్యసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్ఎస్ఎన్ రాజు డిగ్రీ కళాశాలను ఉపకులపతి బుధవారం సందర్శించారు. డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన అభినందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చి సమాజానికి ఉపయోగపడేలా నడుచుకోవాలన్నారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక వేసుకోవాలన్నారు.



చొప్పెల్ల పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన పశువుల ప్రదర్శన

ఆకట్టుకున్న పశువుల ప్రదర్శన

చొప్పెల్ల(ఆలమూరు): ఆలమూరు మండలం చొప్పెల్లలో సంక్రాంతి సంబరాలలో భాగంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పశువుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఆవులు, గేదెలు, దూడల పోటీల్లో విజేతలైన రైతులను ఎంపిక చేశారు. కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 10వ తేదీన బహుమతులు పంపిణీ చేస్తామని సర్పంచి మెర్ల సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, కార్యదర్శి ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు నిరుపమానం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే అందించిన సేవలు నిరుపమానమని విశ్రాంత విద్యాశాఖాధికారి అయ్యగారి వెంకట్రామయ్య అన్నారు. మండలంలోని రాజవరం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు డి.వి.వి.సత్యనారాయణ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సహోపాధ్యాయిని మట్టా స్వరూపారాణిని సత్కరించారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఉచ్చిలి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.జ్యోతిబసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి మహిళా ఉపాధ్యాయినిని ఘనంగా సత్కరించారు.



ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న చిత్రం

రావులపాలెం పట్టణం: రావులపాలెంలో సావిత్రి బాయ్ పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక వైకాపా కార్యాలయంలో శాసనసభ్యుడు చిర్ల జగ్గిరెడ్డి తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఎంపీపీ కోట చెల్లయ్య, జడ్పీ ప్రతిపక్షనేత సాకా ప్రసన్నకుమార్, సర్పంచి పోతుమూడి విజయలక్ష్మి సావిత్రి బాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అమలాపురం రోడ్డులో ఉన్న పారా సంస్థలో పోతుమూడి శేషారత్నం ఆధ్వర్యంలో, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మన్ నందం సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రి బాయ్‌పూలే జయంతి వేడుకలను నిర్వహించారు.

జొన్నాడ(ఆలమూరు): ఎన్నో అవమానాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని తన ఆశయ సాధన కోసం ముందడుగు వేసి ధీశాలిగా సావిత్రి బాయి పూలే నిలిచిందని పలువురు పేర్కొన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ ఉన్నత పాఠశాలలో శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వై.ఆర్.కె.శాస్త్రి, వి.అనురాధ, శ్రమ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మండపేట

చలనచిత్రాలు మండపేట: **సప్తగిరి:** ఒక్క క్షణం, **సప్తగిరి మినీ:** సప్తగిరి ఎల్ఎల్‌బి, **అంబిక:** ఎంసీఏ, **సత్యశ్రీ:** టూ కంట్రీస్, **విజయ:** 2 కంట్రీస్, **రాజరత్న:** హలో, **రాజరత్న మినీ:** జుమాంజీ, అంగర: **శ్రీ భీమేశ్వర థియేటర్:** ఎంసీఏ, **వెంకట మాణిక్యాంబ:** 2 కంట్రీస్

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

మండపేట, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని మండపేటలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోన సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు, ముక్కా దాలియ్య, కోళ్ల ఆనంద్, రాజాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సచిత్రంగా పంపండి

మీ ప్రాంతంలో రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయా... మురుగునీరు సక్రమంగా పారడం లేదా... అపరిశుభ్రత ఎక్కువగా ఉందా... తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారా... ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారా... సమస్యలపై మీరూ స్పందించండి. అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్య ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

వాట్సాప్ నంబర్లు
80085 74183
80085 74185
80085 65533



కుంగుతున్న రహదారి

సమస్య: టేకి-నల్లూరు రహదారి రాళ్లపైకి తేలి గుంతలు, గతుకులతో అధ్వానంగా మారింది. నల్లూరు మీడియం డ్రెయిను వంతెన దిగువన పంటకాలువలోకి కుంగి ప్రమాదకరంగా మారింది. రహదారి నిర్మాణంతో పాటు ఇక్కడ పటిష్టపరచవలసిన ఆవసరం ఉంది.

-ఎన్.సత్యనారాయణమూర్తి, నల్లూరు.

వివరణ: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

-డి.వి రాఘవులు, మండల ఇంజినీరు.

న్యూస్‌టుడే, కపిలేశ్వరపురం

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల

వెదురుపాక/రాయవరం (రాయవరం), న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని వెదురుపాక, రాయవరంలో సర్పంచులు కొండిపూడి సత్యప్రభ, పాలింగి చినబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటి వరకు రూ.900 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేశారన్నారు. పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు మద్దతునివ్వాలని, మూడు మండలాల్లోని 43 గ్రామాలకు సమాన ప్రాధన్యం ఇస్తానన్నారు. రాయవరంలోని ఎస్ఆర్ రహదారిని 14 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తామని, మార్చి మాసాంతంలోగా వీటికి అనుమతులు మంజూరు చేయిస్తామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన వర్మీ కంపోస్టను రైతులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వెదురుపాక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ సత్తి హిమరాణి సావిత్రిదేవి, ఎంపీటీసీ సభ్యులు కొవ్వూరి సరోజినిదేవి, నాళం పార్వతి, ఉపసర్పంచి టి.గంగాధరరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టి.వెంకటరామారెడ్డి, మండల ప్రత్యేకాధికారి డా.రామకోటేశ్వరరావు, ఎంపీడీవో వెంకటలక్ష్మి, తహసీల్దారు సీత, ఐసీడీఎస్ పీవో వెంకట నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శులు కె.బులివీరన్న, పి.వెంకటరత్నం, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తెదేపా నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి ఆటో తాళాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే, జేసీ

సమస్యలు పరిష్కరిస్తాం: జేసీ

అర్తమూరు(మండపేట రూరల్): ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్(జేసీ) మల్లికార్జున అన్నారు. బుధవారం అర్తమూరులో నిర్వహించిన జన్మభూమి-మాఊరు సభలో జేసీ మాట్లాడుతూ గ్రామంలోని ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని అన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది లోపు నియోజకవర్గంలో నిర్దేశించుకొన్న అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ పూర్తి చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన గ్రామాల్లో మండపేట మండలం అర్తమూరు, రాయవరం మండలం పసలపూడి ముందంజలో ఉన్నాయన్నారు. మిగతా పంచాయతీలను అదే స్థాయికి తీసుకువెళతామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి మాట్లాడుతూ తాపేశ్వరం, అర్తమూరు, రామవరం రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి నుంచి హామీ పొందామన్నారు. త్వరలో జీవో రానుందని అన్నారు. ఈ సందర్భంగా జేసీ మల్లికార్జునను సన్మానించారు. అనంతరం లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను అందజేశారు. ఆంధ్రా బ్యాంకు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.2 లక్షల రుణంతో కొనుగోలు చేసిన ఆటోను లబ్ధిదారునికి జేసీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోసాలసుజాత, జడ్పీటీసీ సభ్యురాలు పిల్లిమీన, ఆర్డీవో రాజశేఖర్, మండల ప్రత్యేకాధికారి కె.బాబూరావు, గ్రామ ప్రత్యేకాధికారి బలుసురవి, తహసీల్దార్ మేకా వెంకటేశ్వర్లు, తాపేశ్వరం సొసైటీ అధ్యక్షుడు పడాల రామకృష్ణారెడ్డి, ఆత్మా కమిటీ డైరెక్టర్ పిల్లా తాతీలు, ఆంధ్రా బ్యాంకు మేనేజరు పవన్‌కుమార్, కామిశెట్టి శ్రీనివాస్, కాకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు

మండపేట: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. జన్మభూమి మాఊరు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 22,23,24,25 వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రప్రభుత్వ నిధులతో రైతు రుణమాఫీ అమలు చేశామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి పెద్ద పీట వేశామన్నారు. ప్రతి ఒక్కరూ పురపాలక సంఘానికి సహకరించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గడి సత్యవతి, కౌన్సిలర్లు చుండ్రు సుబ్బారావు చౌదరి, ధర్మవరపు విజయ, చింతల రాజేశ్వరి, ముక్కాలోవలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ , మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



రాయవరం జన్మభూమి సభలో వర్మీ కంపోస్టు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

వడ్లమూరు, నిడసనమెట్ట (అంగర): సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీపీ కాద వెంకట రాంబాబు పేర్కొన్నారు. బుధవారం వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి ఎన్.బి.వి.రెడ్డి అన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జుత్తుగ సూర్యావతి, సర్పంచులు ఆతవ సత్యవతి, నందికోళ్ల మంగరాజు, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు గజ్జరపు శ్రీహరిరావు, ఎంపీడీవో అబ్రహం లింకన్, తహసీల్దారు సాయి సత్యనారాయణ, జన్మభూమి కమిటీ సభ్యులు, గ్రామ తెదేపా అధ్యక్షుడు నందికోళ్ల కాశీవిశ్వనాథం, కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణతో నిరుద్యోగ యువతకు ఉపాధి

కపిలేశ్వరపురం: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్, ఆంగ్లంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 16 నుంచి సీడాప్ రీటైల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో వి.అబ్రహం లింకన్ బుధవారం తెలిపారు. రాజమహేంద్రవరం, సామర్లకోట, అమలాపురం శిక్షణ కేంద్రాలలో భోజన వసతులతో జరిగే శిక్షణ తరగతులకు హాజరయ్యే ఆసక్తి ఉన్న పదో తరగతి చదివిన యువతీయువకులు ఇతర వివరాలకు మండల పరిషత్తు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

చుండ్రు కుటుంబానికి పలువురి పరామర్శ

వడ్లమూరు(అంగర): వడ్లమూరు గ్రామానికి చెందిన చుండ్రు సూర్య వెంకట సత్యనారాయణమూర్తి, ఆయన సోదరుల కుటుంబ సభ్యులను బుధవారం పలువురు పరామర్శించారు. ఈ నెల ఒకటిన సత్యనారాయణమూర్తి మాతృమూర్తి భూలోకవతి(90) మృతి చెందారు. ఆమెకు అయిదుగురు కుమారులు. పెద్ద కుమారుడు సూర్య వెంకట సత్యనారాయణమూర్తి ఆలమూరు తాలూకా రైసుమిల్లర్స్ సంఘం అధ్యక్షుడు, చిన్న కుమారుడు చిట్టిబాబు జడ్పీటీసీ మాజీ సభ్యులు. చిట్టిబాబు భార్య మంగాయమ్మ ఎంపీపీగా, అల్లుడు నెక్కంటి శ్రీరామ్‌జీ వైస్ ఎంపీపీగా పనిచేశారు. బుధవారం ఎంపీపీ కాద వెంకట రాంబాబు, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు గజ్జరపు శ్రీహరిరావు, డీసీ ఎమ్మెస్ మాజీ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శించారు.



చుండ్రు భూలోకవతి

దశావతార మహోత్సవాలు ప్రారంభం

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 38వ దశావతార మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమంలో వేదపండితులు అంగర అయ్యమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వటపత్రశాయి, సాయంత్రం మత్స్యావతారంలోనూ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

రామాలయంలో ధనుర్మాస పూజలు

అంగర: అంగరలోని గుడివీధి రామాలయంలో బుధవారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని సంపర వాసుదేవాచార్యులు, అంగర పవన్ కుమార్ పర్యవేక్షణలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రామ సంకీర్తనలు పాడుతూ గ్రామోత్సవం నిర్వహించారు.



వటపత్రసాయి అవతారంలో వేంకటేశ్వరస్వామి

మండపేట విద్యార్థుల ప్రతిభ

మండపేట, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జి అసెస్మెటర్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటినట్లు శ్రీచైతన్య ఆంగ్లమాధ్యమ పాఠశాల ఆర్ఐ పి.రామిరెడ్డి తెలిపారు. వీరిలో గణిత విభాగంలో ఆరుగురు, భౌతిక శాస్త్ర విభాగంలో అయిదుగురు, రసాయన శాస్త్ర విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరిని బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.

తెదేపాలో చేరిక

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక మూడో వార్డుకు చెందిన పలువురు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సమక్షంలో బుధవారం తెదేపాలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, జెడ్‌మేడపాడు సర్పంచి కొచ్చర్లకోట నరసింహారావు, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు వి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట రైతుబజారులో నిన్నటి ధరలు

కాయగూరల ధరలు కిలోల్లో: టమాటా రూ.12, వంకాయ తెలుపు రూ.22, నలుపు రూ.20, దొమ్మేరు రూ.30, బెండకాయ రూ.34,పచ్చిమిర్చి రూ.26 కాకరకాయ రూ.28, బీరకాయ రూ.38, కాలీఫ్లవర్ రూ.15, క్యాబేజి రూ.18, కేరెట్ 48,దొండకాయ రూ.26, బంగాళదుంప రూ12, ఉల్లిపాయ రూ.42, గోరుచిక్కుడు రూ.22, దోసకాయ రూ.18, ఆనపకాయ రూ.15, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ,6, చిక్కుడు రూ.28, చేమదుంప రూ.34, ములక్కాడ రూ.8, ఆకుకూర కట్ట రూ.5, కంద రూ.24, బీట్‌రూట్ రూ.28, కీర దోసకాయ రూ.20, బీన్స్ రూ.32,అల్లం రూ.36, కేప్సికం రూ.40, బొబ్బర్లు రూ.24, పెండలం రూ.30, చిలకడ దుంప రూ.22, చింతకాయలు రూ.24, నిమ్మకాయ డజను రూ.16, బీన్స్ గింజలు రూ.68, బఠాణి రూ.54.

–న్యూస్‌టుడే, మండపేట



సమావేశంలో మాట్లాడుతున్న ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి

సేవాభావాన్ని అలవరచుకోవాలి

రాయవరం, న్యూస్‌టుడే: చదువుతో పాటు సేవా కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలని సర్పంచి పాలింగి చినబాబు విద్యార్థులకు సూచించారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్ అధ్యక్షతన జాతీయ సేవా పథకం(ఎన్.ఎస్.ఎస్.) యూనిట్ ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. అకడమిక్ డైరెక్టర్ మెర్ల సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మానసిక పరిపూర్ణత లభిస్తుందన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసే వివిధ కార్యక్రమాలను విద్యార్థులు చేపట్టనున్నారన్నారు. తొలుతగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచి టి.గంగాధరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.బులివీరన్న తదితరులు పాల్గొన్నారు.



పసలపూడి షిర్డిసాయి ఆలయంలో చిత్రీకరణ సన్నివేశం

పసలపూడిలో సినిమా చిత్రీకరణ ప్రారంభం

పసలపూడి(రాయవరం), న్యూస్‌టుడే: పసలపూడిలో సినిమా చిత్రీకరణకు ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు క్లాప్ కొట్టి ప్రారంభించారు. బుధవారం స్థానిక షిర్డి సాయి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తొలిసారి హీరోగా నటిస్తున్న అవినాష్‌పై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి డీఎస్పీ జేవీ సంతోష్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు సురేష్ మాట్లాడుతూ ప్రేమ ఇతివృత్తంగా జరిగే చిత్రాన్ని రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లోనే చిత్రీకరిస్తామని, స్థానిక కళాకారులకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పసలపూడి లాకుల వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు.

చిన్నారులకు సామూహిక అన్నప్రాసన

మండపేట, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా 24వ వార్డులో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గడి సత్యవతి, 24వ వార్డు కౌన్సిలర్ చింతల రాజేశ్వరి చిన్నారులకు పాయసంపెట్టి అన్నప్రాసన చేశారు.

లంక వారధి నిర్మించేదెప్పుడు..?

◆ కొత్తపేట, బోడిపాలెం కేదార్లంక వంతెన నిర్మాణానికి ఎదురుచూపులు ◆ నిధులు మంజూరై ఏడాదైనా నిర్మాణంలో జాప్యం

న్యూస్‌టుడే, కేదార్లంక(కపిలేశ్వరపురం)

కపిలేశ్వరపురం మండలంలోని కేదార్లంక గ్రామం గౌతమీ గోదావరి కుడిగట్టుపై కోనసీమ ముఖద్వారం కొత్తపేట, బోడిపాలెం వంతెన కూడలిని ఆనుకుని ఉంటుంది. కొత్తపేట, మండపేట నియోజకవర్గాలను విభజిస్తూ ప్రవహిస్తున్న ముక్తేశ్వరం కాలువపై ఉన్న బోడిపాలెం వంతెన బ్రిటీష్ కాలం నాటిది కావడంతో జీర్ణావస్థకు చేరుకుంది. రెండు నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో ఇప్పటి వరకు దీని నిర్మాణంపై దృష్టి సారించ లేదు. ఏడాది క్రితం రూ.4 కోట్లు మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.



జీర్ణావస్థకు చేరిన వంతెన కిందిభాగం, (అంతర చిత్రం) బీటలు వారిన వంతెన స్లాబు

ఈ వంతెన వినియోగమిదీ..?

బోడిపాలెం వంతెనగా వ్యవహరించే ఈ వంతెన మీదుగా కేదార్లంక పంచాయతీని, వీధివారి లంకని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతం ధనమ్మమర్రి, కపిలేశ్వరపురం పంచాయతీ పరిధిలోని నారాయణలంక గ్రామం చేరుకోవచ్చు. ఇక్కడ పండే ఉద్యాన పంటలు, 80కి పైగా ఉన్న ఇటుక బట్టీల ద్వారా తయారుచేసే ఇటుకలు ఈ వంతెన మీదుగానే రవాణా అవుతాయి. కేదార్లంక ఇసుకరీచ్ (ప్రస్తుతం వినియోగంలో లేదు)నుంచి జరిగే ఇసుక రవాణా సైతం ఈ వంతెన మీదుగానే జరుగుతుంది.

వంతెన తాజా స్థితి..

వంతనె నిర్మించి 150 ఏళ్లు గడస్తుండటంతో బలహీనంగా మారింది. గతంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడంతో దీనిపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నిషేధించినా పాటించడం లేదు. పెద్దపెద్ద రాళ్లు, ఇనుము వినియోగించి నిర్మించిన ఈ వంతెన ఇరువైపులా ఉన్న గోడలు పలుమార్లు పడిపోయినా తిరిగి నిర్మించారు. వంతెనకు ఇరువైపులా రక్షణగోడల స్థానంలో ఉన్న ఇనుప కమ్మెలు తుప్పుపట్టి ప్రమాదానికి హేతువుగా మారాయి. వంతెన స్లాబుకు, ఇనుప కమ్మెలకు మధ్య పగుళ్లు తీసి ఆందోళన కలిగిస్తున్నాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయాందోళన ప్రజల్లో ఉంది. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెరిగిన ట్రాఫిక్‌ను, పరిగణలోకి తీసుకోవలసిన మరికొన్ని అంశాల దృష్ట్యా, కొత్తపేట, బోడిపాలెం - కేదార్లంక కూడలి వద్ద ఉన్న వంతెన నిర్మాణ ప్రాంతం మార్చాలన్న అభిప్రాయంతో నిర్మాణంలో కొంత అనిశ్చితి ఏర్పడిన మాట వాస్తవమేనని అన్నారు. టెండర్ల ప్రక్రియ జరుగుతోందని త్వరలోనే నిర్మాణం పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.



శిథిలావస్థలో కొత్తపేట, బోడిపాలెం నుంచి కేదార్లంక చేరుకునే వంతెన

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మారేడుబాకలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

చంద్రన్న బీమా తాత్కాలిక సహాయం పంపిణీ

మాచవరం(రాయవరం), న్యూస్‌టుడే: మాచవరంలో మృతిచెందిన చంద్రన్నబీమా సభ్యుడు కట్టా భద్రరావు కుటుంబానికి చంద్రన్న బీమా తాత్కాలిక సహాయాన్ని బుధవారం పంపిణీ చేశారు. మృతుని నామినీకి రూ.5 వేలు తాత్కాలిక ప్రభుత్వ సహాయాన్ని జన్మభూమి కమిటీ సభ్యుడు కర్రి వెంకటరామకృష్ణారెడ్డి, మండ రాము, బత్తుల రామకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో బీమా మిత్ర సత్యవతి, కాదా కేదారేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ సిబ్బందికి ఎస్‌డీఆర్ఎఫ్ శిక్షణ

సర్పవరంజంక్షన్, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి సహాయం అందించడానికి 3వ ఏపీఎస్పీ సిబ్బందికి ఎస్‌డీఆర్ఎఫ్ శిక్షణ ఇస్తున్నామని కమాండెంట్ జె.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రాను కమాండెంట్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఏపీఎస్పీ సిబ్బందిలో 100 మందికి శిక్షణ ఇచ్చామని, జిల్లా అవసరాలకు వీరిసేవలు వినియోగించుకోవాలని కలెక్టర్‌కు తెలిపామన్నారు.

రైతుల ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

పసలపూడి(రాయవరం), న్యూస్‌టుడే: రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా, వ్యవసాయ రుణాలను మంజూరు చేసేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని పసలపూడి సహకార సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి(చినకాపు)అన్నారు. బుధవారం సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన మహాజన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరంలో సంఘానికి వచ్చిన లాభాలను డివిడెంట్లుగా సభ్యులకు పంపిణీ చేశారు. సంఘ ప్రగతిని సీఈవో వై.యేసుదాసు సభకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కర్రి సముద్రారెడ్డి, సంఘ సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న అంతర్జాల సేవలు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజీ పరిధిలో అంతర్జాల సేవలు తరచూ మొరాయిస్తుండటంతో నెటిజన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత సోమవారం నుంచి అంతర్జాల సేవలు అరకొరగా అందుతున్నాయి. ఇంటర్నెట్ సేవలు ఎప్పుడు లభిస్తాయో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. బీఎస్ఎన్ఎల్ నెట్ వినియోగదారులు బ్యాంకింగ్, ఇతర సేవలకు ప్రైవేటు ప్రొవైడర్ల సేవలకు పరుగులు పెడుతున్నారు. దీని ప్రభావంతో అనపర్తి మండలంలోని పెడపర్తి, కుతుకులూరు, రామవరం, మహేంద్రవాడ, కొప్పవరం, రాయవరం మండలంలోని లొల్ల, రాయవరం, వెదురుపాక, వి.సావరం, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక, కొంకుదురు గ్రామాల్లో అంతర్జాల సేవలు మొరాయించడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం అధికారులను సంప్రదించాలని స్థానిక సిబ్బంది చెబుతున్నారు. దీనిపై రాజమహేంద్రవరం ఓఎఫ్‌సీ ఎస్‌డీఈ కృష్ణమూర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రాయవరం-సోమేశ్వరం పరిధిలో కేబుల్స్ మరమ్మతులకు గురికావడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. గుర్తించిన లోపాలను సరిదిద్దుతున్నామన్నారు.



రాయవరం బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజీ కార్యాలయం



ఎస్.ఆర్. రహదారిపై ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

రాయవరం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను అక్రమంగా అరెస్టు చేశారంటూ మాదిగ యువసేన కార్యకర్తలు బుధవారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. ఎస్.ఆర్.రహదారిపై స్థానిక బస్టాండ్ కూడలిలో ఎమ్మార్పీఎస్ యువజన సేన జిల్లా అధ్యక్షుడు మల్లిపూడి శివకుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన చేశారు. రాస్తారోకోలో జిల్లా ఉపాధ్యక్షుడు యార్లగడ్డ గణేష్, కొమ్ము నారాయుడు, చంద్రమళ్ల ఉదయ్‌కుమార్, లంక జాన్, మచ్చా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ దర్శిని

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిత్యాభిషేకాలుంటాయి. ఆలయంలో వసతిగదులు అందుబాటులో లేవు. స్వామివారి నిత్యకల్యాణాలు 10 ఖాళీగా ఉన్నాయి. బుధవారం 72 మంది భక్తులు నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. ఆలయానికి రూ. 30,922 ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకానికి రూ. 1,087 ఆదాయం సమకూరింది.

టి.కొత్తపల్లిలో కోడిపందేలపై దాడి

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లిలో బుధవారం సాయంత్రం కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి పలువురిని పట్టుకున్నారు. టి.కొత్తపల్లి గ్రామంలో కోడిపందేలు వేస్తున్నారన్న సమాచారంతో ఎస్.ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడిపుంజులు, రూ.7200 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ప్రొటోకాల్‌పై వైస్ ఎంపీపీ ఆందోళన

కాట్రేనికోన: ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి-మా ఊరు సమావేశాల్లో ప్రొటోకాల్ ప్రకారం తనకు సమాచారం ఇవ్వడం లేదని వైస్ ఎంపీపీ కాశి హనుమంతరావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దొంతికుర్రు సమావేశం విషయాన్ని తనకు చెప్పకపోవడం దారుణమన్నారు. అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

పొంగల్ కిట్లు ఇస్తాం: సీఎం నారాయణసామి

యానాం: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు పిండివంటలు వండుకొనేందుకు పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చే సంక్రాంతి కిట్లను అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి వి.నారాయణసామి మీడియాకు తెలిపారు. పుదుచ్చేరిలో ఆయన మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీకి రోజువారీ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు ఏమాత్రం లేదని ధ్వజమెత్తారు. ఎల్‌జీ ఏమైనా తెలుసుకోవాలనుకుంటే కార్యదర్శుల ద్వారా సమాచారం పొందాలని, వ్యవహారశైలి సరి కాదంటూ ఇప్పటికే 15 లేఖలు రాసినట్లు చెప్పారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యం

దొంతికుర్రు(కాట్రేనికోన): ప్రపంచంలో ప్రజలంతా శాంతితో జీవించాలంటే దానికి బౌద్ధమే శరణ్యమని ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి డీబీ లోక్ అన్నారు. బుధవారం దొంతికుర్రు పంచాయతీ పరిధి కోతులచెరువులో బౌద్ధ పుష్యమి పూర్ణిమ సందర్భంగా బీఎస్ఐ మండల ప్రెసిడెంట్ గెల్లా రాజేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ బౌద్ధ మతానికి సంబంధించి అనేక విషయాలను తెలియజేశారు. బీఎస్ఐ జిల్లా సభ్యులు మట్టా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ బౌద్ధం వైపు మరలుతున్నాయన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాశి సత్యమూర్తి, గెద్దాడ మూర్తి, భగవాన్‌దాసు, ఎలిపే సత్య, నేలపాటి శ్రీరాములు, సీహెచ్ కృష్ణమూర్తి, జి.విజయ్, తరపట్ల వెంటక్, కాశి బాల, సహ పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి పంచదారకు ఎదురుచూపు

తాళ్లరేవు: మండలంలోని 17 పంచాయతీల పరిధిలో 44 చౌకధరల దుకాణాలున్నాయి. డిసెంబరు 16న డీలర్లంతా పంచదారకు సంబంధించి డీడీలు కట్టి ప్రభుత్వానికి సొమ్ములు చెల్లించారు. డిసెంబరు 3వ తేదీ అవుతున్నా.. పంచదారను ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు ప్రభుత్వం ఇస్తున్నామని చెబుతున్నా... పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై రేషన్ డీలర్లు లబోదిబోమంటున్నారు. చౌక దుకాణాల చుట్టూ ప్రజలు పంచదార కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలి

ముమ్మిడివరం: రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇవ్వాల్సిన పదో పీఆర్సీ బకాయిలకు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పి.వి.వి.సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. ముమ్మిడివరంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎం.లక్ష్మణకుమార్ అధ్యక్షతన బుధవారం సమావేశంలో సత్యనారాయణరాజు మాట్లాడారు. 2018 జులై నుంచి అమలు కావాల్సిన 11వ పీఆర్సీకి కమిషన్‌ను నియమించాలని కోరారు. ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆరోగ్య కార్డుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 7న రాజానగరంలో నిర్వహించే ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. పి.హిమబిందు, ఎం.హెచ్.అబ్బాస్, వి.కె.పళ్లంరాజు, ఎ.పార్థశ్రీనివాస్, బి.వేణుగోపాల్, వి.రవికుమార్ పాల్గొన్నారు.

ఈతలో మెరికలు

జాతీయ స్థాయిలో రాణిస్తున్న యానాం క్రీడాకారులు



యానాం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఈత కొలను, అధునాతన పద్ధతుల్లో శిక్షణ యానాంలో ఈత నేర్చుకునే విద్యార్థులకు, క్రీడాకారులకు వరంగా మారింది. భారతీయ క్రీడాప్రాధికార సంస్థ శిక్షణ శిబిరం గతేడాది జూన్‌లో జీఎంసీ బాలయోగి స్టేడియం, వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో మొదలైంది. అనంతరం నవంబరు, డిసెంబరు నెలల్లో జరిగిన మూడు జాతీయస్థాయి ఈత పోటీల్లో యానాం క్రీడాకారులు పతకాలు సాధించారు. తాజాగా స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కర్ణాటక స్విమ్మింగ్ అసోసియేషన్‌తో కలిసి ఉడిపిలోని మాల్పే బీచ్‌లో డిసెంబరు 30, 31 తేదీల్లో నిర్వహించిన జూనియర్ ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో యానాం క్రీడాకారులు ఒక స్వర్ణం, ఒక వెండి పతకం సాధించారు. బాలుర ఓపెన్ కేటగిరీ విభాగంలో ఎస్.వి.సాయిశ్రీకర్ ఒక కిలోమీటరు ఈత పోటీలో పసిడి పతకం సాధించగా, బాలికల విభాగంలో పాలెపు లక్ష్మి రెండున్నర కిలోమీటర్ల ఈత విభాగంలో వెండి పతకం సొంతం చేసుకుంది.



ప్రస్తుతం యానాం సాయ్ శిక్షణ కేంద్రంలో 18 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాది జరిగే అనేక జాతీయ పోటీల్లో పలు విభాగాలలో వీరు పతకాలు సాధించడానికి అంకితభావంతో శిక్షణ పొందుతున్నారు.

కోచ్ కావడమే లక్ష్యం...



ఈత అంటే చిన్నతనం నుంచి ఆసక్తి. నా తండ్రి పాలెపు సుబ్బారావు మత్స్యకారుడు, తల్లి వీరవేణి గృహిణి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ మేథమెటిక్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. 2012లో యానాంలో స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించిన తర్వాత కోచ్ బి.జేమ్స్ సహాయంతో ఈతలో శిక్షణ పొందా. ఉడిపిలో జరిగిన ఈత పోటీల్లో జాతీయ స్థాయిలో వెండి పతకం సాధించడం చాలా ఆనందంగా ఉంది. ఒడిశాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో 2016లో స్విమ్మింగ్ కోర్సులో కోచ్‌గా శిక్షణ పొందా. పుదుచ్చేరి ఇంటర్ కాలేజియేట్‌లో వరుసగా నాలుగు పసిడి, రెండు వెండి పతకాలు సాధించా. కోచ్‌కు సహకారంగా ఉంటు గత రెండేళ్లలో సుమారు 500 మందికి శిక్షణ ఇచ్చా. జాతీయ పోటీల్లో మరింత రాణించి ఈతలో శిక్షకురాలు అవ్వాలన్నది నా జీవిత లక్ష్యం. **- పాలెపు లక్ష్మి**

అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటా..



ఈత నేర్చుకోవడం ఎంతో ఇష్టం. అమెరికన్ స్విమ్మర్ మైఖేల్ పెల్ప్స్‌లా దేశానికి పతకాలు తేవాలని ఉంది. అందుకే పట్టుదలతో సాధన చేస్తున్నా. నా తండ్రి శ్రీనివాసరావు రైల్వే ఉద్యోగి, అమ్మ అనురాధ గృహిణి. విశాఖపట్నం రైల్వే కాలనీ మాది. ఇంటర్ మొదటి సంవత్సరం సాయి జూనియర్ కాలేజ్‌లో చదువుతూ సాయ్ శిక్షణ కేంద్రంలో సాధన చేస్తున్నా. కర్ణాటకలో జరిగిన పోటీలలో భాగంగా సముద్రంలో ఈత కొట్టడం చాలా కష్టంగా అనిపించినా పట్టుదలతో ఓపెన్ కేటగిరీలో పాల్గొని స్వర్ణ పతకం సాధించడం ఎంతో సంతోషం కల్గించింది. కడపలో జరిగిన సౌత్‌జోన్ ఈత పోటీల్లో 1500 మీటర్ల ఫ్రీస్టైల్ కేటగిరీలో వెండి పతకం, 800 మీటర్ల ఫ్రీ స్టైల్ కేటగిరీలో బ్రాంజ్ మెడల్ సాధించా. మరింత బాగా సాధన చేసి పతకాలు తేవాలన్నది ధ్యేయం. **- ఎస్.వి. సాయిశ్రీకర్**

ప్రత్యేక స్థానం వస్తుంది...



ఉన్నత ప్రమాణాలతో నిర్మించిన ఈత కొలను యానాంలో ఉండడంవల్ల ఇక్కడ ఈత నేర్చుకోవడం ఎంతో సులువు. రానున్న రోజుల్లో యానాంకు జాతీయ స్థాయిలో ఈత పోటీల్లో ప్రత్యేక స్థానం వస్తుంది. 2012నుంచి ఇక్కడ ఏటా వందలాదిమంది ఈత నేర్చుకుంటున్నారు. వేసవి సెలవుల్లో యానాం ప్రాంతానికి చెందిన అనేకమంది బంధువులు, వారి పిల్లలు వచ్చి ఉచితంగా ఈత శిక్షణ పొందుతున్నారు. యానాం ప్రాంతానికి చెందినవారే కాకుండా జిల్లాలోని పలు పట్టణాల నుంచి వచ్చి ఈత శిక్షణ పొందుతున్నారు. సాయ్ కేంద్రం రావడం వల్ల అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ లభిస్తోంది. రానున్న రోజుల్లో యానాం జాతీయ స్థాయిలో ఈత విభాగంలో మంచి పేరు సాధించడం ఖాయం. **- ఈత శిక్షకుడు, బొడ్డు జేమ్స్**

క్రమశిక్షణ ఉంటే పతకాలు సాధ్యం..



ఏ పోటీ అయినా క్రీడాకారుల్లో అంకితభావం, చక్కటి క్రమశిక్షణ ఉంటేనే ఫలితాలు సాధ్యమవుతాయి. ప్రస్తుతం సాయ్ కేంద్రం ఏర్పాటు చేసి ఆరు నెలలు గడిచింది. ఇపుడున్న విధంగానే విద్యార్థులు శిక్షణ పొందితే మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నా. పుదుచ్చేరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు వెళుతున్నారు. మాటలు చెప్పే కన్నా ఫలితాలు చూపించాలన్నది నా విధానం. **- ఉదయ్‌కుమార్, సాయ్ శిక్షకుడు, యానాం**

తూర్పు డెల్టాలో రూ. 80 కోట్లతో ఆధునికీకరణ పనులు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: జిల్లాలోని తూర్పు డెల్టాలో ఆధునికీకరణ పనులకు సంబంధించి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జలవనరుల శాఖ తూర్పు డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని మసకపల్లి, ఇంజరం, తాళ్లరేవు, మల్లంకోట ప్రాంతాల్లో చేపట్టబోయే ఆధునికీకరణ పనుల ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించారు. తూర్పు డెల్టా పరిధిలో రూ. 80 కోట్ల నిధులతో ఆధునికీకరణకు సంబంధించి 240 పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వంతెనలు, కార్యాలయాల భవనాల నిర్మాణం, సిబ్బంది వసతిగృహాలు, కాలువల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 15 నాటికి వ్యవసాయ పనులు పూర్తవుతాయని, మే, జూన్ నెలల్లో ఈ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఇప్పటికే పనులు చేసే ప్రాంతాలను పరిశీలించామన్నారు. శివారు ప్రాంతాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట జలవనరుల శాఖ శాఖ డీఈ ఆర్.పోచారావు, ఏఈ టి.కృష్ణమూర్తులు, పోలేకుర్రు నీటి సంఘం అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు, చలమయ్య తదితరులున్నారు.



పి.మల్లవరం ఓఎన్జీసీ కంపెనీ వద్ద దీక్షలు చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

వందో రోజుకు సెక్యూరిటీ గార్డుల దీక్షలు

పి.మల్లవరం(తాళ్లరేవు): మండలంలోని పి.మల్లవరం జీఎస్పీసీ కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పని చేసిన వారిని ఓఎన్జీసీ కంపెనీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక నిరహార దీక్షలు బుధవారం వందో రోజుకు చేరుకున్నాయి. ఇన్ని రోజులుగా తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని వారు వాపోతున్నారు. సెక్యూరిటీ గార్డుల దీక్ష శిబిరంను సందర్శించి వెళ్లడం తప్ప ప్రజాప్రతినిధులు ఓఎన్జీసీ కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. 100 మంది సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు పస్తులతో అలమటించిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడని వారు ఆరోపించారు. జిల్లాకు చెందిన ఎంపీలు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అప్పన్నబాబు, రామేశ్వరరావు, కృష్ణ, శంకరరావు, శ్రీనివాసరావు సాయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తాం: సీఐ

యానాం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో వాహన చోదకులకు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడానికి దశలవారీగా చర్యలు చేపడతామని యానాం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిడ్ల సత్యనారాయణ తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎస్సై వి.శివకుమార్‌తో కలిసి మాట్లాడారు. సంక్రాంతి పండుగ సమయం అని కాకుండా నియోజకవర్గంలో ఏఒక్క చోటా కోడి పందేలు, పేకాట వంటి కార్యక్రమాలు జరగనిచ్చేది లేదని, అక్రమ సారాను పూర్తిస్థాయిలో నిరోధిస్తామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా ట్రాఫిక్‌కు అవాంతరం కల్గకుండా, రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సిగ్నల్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. యానాం సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు దర్శనీయ ప్రదేశాలు ఎక్కడున్నాయన్న అంశాన్ని తెలియజేసే సమాచార బోర్డులు లేవని, వీటిని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు భద్రతా ప్రమాణాలు, పోటీ పరీక్షలు, ఇతర పలు అంశాలను గురించి తెలియజేస్తామన్నారు. నేరస్థులకు తప్ప ప్రజలందరికీ పోలీసులు మిత్రులన్న భావం కల్గేలా పనితీరులో సమూల మార్పులు తీసుకొస్తామని చెప్పారు.



సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిడ్ల సత్యనారాయణ

ముమ్మిడివరం

సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించడం ద్వారా నూతన ఆవిష్కరణలు చేయొచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు కె.వి.ఎన్.కార్తీక్ అన్నారు. అనాతవరంలోని ప్రసిద్ధ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు- వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కార్తీక్ మాట్లాడారు. విద్యార్థులు ఆలోచనా దృక్పథం ఎప్పుడూ సానుకూలంగా ఉండాలని.. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మిండగుదటి మోహన్, ప్రిన్సిపల్ మేడిద వీరభద్రరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు..

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు జనరల్ నాలెడ్జి, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు నాగాబత్తుల ప్రసాదరావు బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన కళాజాత కళాకారులు డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాబార్డు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుల సేవలను వారు వివరించారు.

బీమా కోరేగావ్ ఉత్సవాలపై దాడులు దారుణం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని పుణెలో భామా-కోరేగావ్ ఉత్సవాలపై మతోన్మాదులు దాడులకు పాల్పడటం దారుణమని.. దీనికి మహారాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరంలో ఆర్.పి.ఐ. జిల్లా కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. మొహర్లు చేసుకుంటున్న ఉత్సవాలపై మతోన్మాదశక్తులు దాడులకు పాల్పడటం ద్వారా దళితులపై దాడులకు ప్రేరేపిస్తున్నారని.. సంఘటనకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో పాము రాజేంద్రప్రసాద్, దోనిపాటి ఆంజనేయులు, మెల్లం అంబేడ్కర్, పి.వి.చక్రవర్తి, ఎం.టి.వి.ప్రసాద్, వడ్డి నాగేశ్వరరావు, దేవరపల్లి ఏడుకొండలు, వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తిరుపతిలోని నేషనల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షల్లో ముమ్మిడివరం శ్రీ బాలాజీ కాన్వెంట్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి నగదు బహుమతులను సాధించారు. ఎం.ఎల్‌ప్రతీన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రూ. నాలుగు వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. జి.దివ్యబాలాజీ, సి.హెచ్.గీతిక జిల్లా ప్రథమ స్థానం సాధించారు. ఆర్.మృదుల జిల్లా ద్వితీయ స్థానం, హిందీ పరీక్షల్లో ఎస్.సరయు, కేజీఎస్ భగవాన్‌లు జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. తెలుగు, హిందీ ప్రతిభా పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు పి.వి.ఎస్.శాస్త్రి, పి.సుజాత, పి.వి.రామరాజు, ఎస్.వి.ఎస్.ఎన్.రాజు తదితరులు అభినందించారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలోని సుక్క ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రం వద్ద సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు రెడ్డి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్, ఓఎన్జీసీ పోరాట సమితి కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య ఆవశ్యకతను పేద ప్రజలకు వివరించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో సావిత్రిబాయి పూలే చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు. సుక్కట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు దుప్పట్లు, తాగునీటి సీసాలను అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పితాని పద్మావతి, కె.విజయ్, గిడ్డి ప్రభాకరరెడ్డి, కన్నీడి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల మణికంఠస్వామి, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపాలంకరణ

నడవపల్లి(కాట్రేనికోన): పౌర్ణమిని పురస్కరించుకుని నడవపల్లి శ్రీకోదండరామస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం భక్తులు దీపాలంకరణ చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంటింటికీ రక్షిత నీటి సరఫరా: ఎమ్మెల్యే

ఉప్పంగల(తాళ్లరేవు): ప్రతి ఇంటికి కొళాయి ఇచ్చి రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మండలంలోని ఉప్పంగల, ఇంజరం గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు మట్టపర్తి ఈశ్వరి శ్రీనివాసరావు, ఆకెళ్ల లలితా సుబ్బారావుల అధ్యక్షత వహించిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.95 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అనంతరం ఉప్పంగల గ్రామ సభలో రేషన్‌కార్డులు, పింఛన్లు, బాలిక సంరక్షణ బాండ్లును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఇంజరంలో మండల పరిషత్తు అధ్యక్షురాలు టేకుమూడి అనంతలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు పొన్నమండ రామలక్ష్మి, తాళ్లరేవు ఏఎమ్‌సీ ఛైర్మన్ మందాల గంగసూర్యనారాయణలు రేషన్‌కార్డులు, సంక్రాంతి చంద్రన్న కానుకలు, పింఛన్లు పంపిణీ చేశారు. ఇంజరం పంచాయతీ పరిధిలోని పెదగోవలంక గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కొందరు యువకులు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మేడిశెట్టి వెంకటలక్ష్మి, ఉపసర్పంచి వేగేశ్న మహాలక్ష్మి, మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ వుంగరాల వెంకటేశ్వరరావు, తెదేపా సీనియర్ నాయకుడు టేకుమూడి లక్ష్మణరావు, సాగి బాబ్జీరాజు, వేగేశ్న భాస్కరరాజు, ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.



దొంతికుర్రులో చంద్రన్న కానుకలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కందికుప్ప(కాట్రేనికోన): కందికుప్ప, దొంతికుర్రు పంచాయతీల పరిధిలో సర్పంచులు మేకల వనితా మీరాసాహెబ్, పెయ్యల సత్యనారాయణల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ప్రసూన, జడ్పీటీసీ సభ్యుడు నాగిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పథకాల ప్రగతిని వివరించారు. కందికుప్పలో పశువులకు సంబంధించిన ద్వాక్రా ఇన్సురెన్సులో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని జేడీ కోటేశ్వరరావుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. అనంతరం రేషన్ కార్డులు, సంక్రాంతి కానుకలు, ఉపకార వేతనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.రమేష్, ఎంపీడీవో రాంబాబు, నడింపల్లి సుబ్బరాజు, ఏ.శ్రీను, బల్ల కుమార్, చెల్లి సురేష్ ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే జన్మభూమి-మాఊరు నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఏఎంసీ ఛైర్మన్ గొలకోటి దొరబాబు అన్నారు. రాణేలంక, కొమానపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సభల్లో దొరబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పితాని సత్యనారాయణ, ఎంపీడీఓ డి.రాంబాబు, తహసీల్దార్ ఎం.వీర్రాజు, పెన్మత్స భారతి, అర్థాని శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు శీలం సత్యనారాయణ, చిక్కాల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

✦ ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి 19, 20వ వార్డుల్లో మట్టాడిపాలెం, సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఛైర్‌పర్సన్ చెల్లి శాంతకుమారి అధ్యక్షతన జన్మభూమి-మాఊరు సభలు నిర్వహించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. ప్రపంచ జ్ఞాపకశక్తి పోటీల్లో జాతీయ స్థాయిలో నిలిచిన గురుకుల పాఠశాల విద్యార్థిని జగడం జ్యోతిని ఛైర్‌పర్సన్ శాంతకుమారి సన్మానించి రూ.2000 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ దివి మహాలక్ష్మి, దొమ్మేటి రమణకుమార్, చెల్లి అశోక్, కౌన్సిలర్లు యల్లమిల్లి సీతాలక్ష్మి, పిల్లి నాగరాజు, కమీషనర్ పి.రవివర్మ, దాట్ల బాబు, నడింపల్లి శ్రీనివాసరావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు మెండి కమల, బి.రుక్మిణి, విళ్ల వీరాస్వామినాయుడు, ములపర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ఛైర్‌పనర్సన్ చెల్లి శాంతకుమారి

ఐ.పోలవరం: సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని జడ్పీటీసీ సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవిలోని సర్పంచి అంగాడివెంకట సీతారామ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేశారు. * గోగుల్లంకలో జన్మభూమి మాఊరు గ్రామసభ బుధవారం నిర్వహించారు. సర్పంచి ఇసుకపట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి షంషీ, ఎంపీడీవో కేసీహెచ్.అప్పారావు, తహసీల్దారు చింతా శివరామకృష్ణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. తరువాత నూతనంగా మంజూరైన పథకాలను అర్హులకు అందజేశారు.

ఆదర్శప్రాయురాలు సావిత్రిబాయి పూలే

ఐ.పోలవరం: సావిత్రిబాయి పూలే జయంతిని ఐ.పోలవరం మండలంలో బుధవారం నిర్వహించారు. యూటీఎఫ్, ఎస్టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిపారు. వడ్డిచెరువులోని ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన ఆధ్యక్షతన సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో కేశనకుర్రులో జయంతి నిర్వహించారు. తొలిమహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలను ఎస్టీయూ సంఘ ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల వెంకటేశ్వరరావు, దంగుడుబియ్యం నారాయణరావు, రేవు అప్పలస్వామి, సోమలత, భూలక్ష్మి, కె.కల్పన, ఆర్.సందన తదితరులు పాల్గొన్నారు.

కందికుప్ప(కాట్రేనికోన): నేటి మహిళలకు సావిత్రీబాయి పూలే ఎంతో ఆదర్శవంతురాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు విళ్ల సుధాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని కందికుప్ప జడ్పీ పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. సావిత్రీబాయి విగ్రహానికి పూలమాలలేసి నివాళిలర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

యానాం: సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని సామాజిక భవనంలో బుధవారం ఉదయం నిర్వహించారు. అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిపినసీ కార్యక్రమంలో సావిత్రిబాయి చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. జె.వెంకటేశ్వరరావు, ఎన్.సూర్యప్రకాష్, కె.రఘు, జి.శ్రీహరి, కె.ఆదినారాయణ, ఎం.అర్జమ్మ, వివిధ సంఘాల మహిళలు పాల్గొన్నారు. అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫరంపేట సామాజిక భవనంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిపారు.

ఉల్లాసంగా పాటల పోటీలు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ప్రభుత్వం జనవరి 6 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న 16 ప్రజా ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక కళాకారులలో సంగీత ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన పాటలు పోటీలు ఉల్లాసంగా సాగాయి. స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం పాటల పోటీలను విశ్రాంత పరిపాలనాధికారి నామాడి అప్పారావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పోటీలకు చిన్నారులు, పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సినిమా పాటలు- సబ్ జూనియర్ విభాగంలో మొదటి మూడు స్థానాలు పి.దషిత, ఎన్.దేవిషాలిని, ఎ.కృష్ణతులసి, జూనియర్స్- ఎస్.లీలాకుమారి, వి.సిద్ధు, పి.సత్యదుర్గ, సీనియర్స్- పి.ప్రశాంతి, సీహెచ్ సంతోషిజ్యోతి, కె.రామ్‌జీ ప్రవీణ్, ఘంటశాల పాటలు విభాగం సబ్ జూనియర్స్- ఎ.కృష్ణతులసి, ఎన్.వరుణశ్రీసాస్థ, జూనియర్స్- ఎ.కృష్ణబినతి, జి.కుమార్ రాజా, ఎస్.లీలాకుమారి, సీనియర్స్- కె.ఎన్.ఎల్.మేఘన, కె.శంకరం, సీహెచ్ సూర్యారావు సాధించారు. న్యాయ నిర్ణేతలుగా కాకరపర్తి వెంకట సత్యనారాయణమూర్తి, నృశింహదేవర శ్రీనివాసశర్మ వ్యవహరించారు. విజేతలకు ముఖ్యమంత్రి వి.నారాయణసామి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎస్.రాజేశ్వరరావు, చెళ్లపిళ్ల కృష్ణమూర్తి(కృష్ణప్ప), టి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.



పాటల పోటీలకు హాజరైన విద్యార్థులతో ప్రముఖులు

పెద్దాపురం

చలన చిత్రాలు పెద్దాపురం: **లలిత:** 2 కంట్రీస్, **శ్రీలలిత:** ఎంసీఏ, **వీరభద్ర:** ఒక్కక్షణం, **అరుణశ్రీపిక్చర్స్ (శోభ):** హలో, సామర్లకోట: **జయలక్ష్మి కాంప్లెక్స్:** 2 కంట్రీస్, ఒక్క క్షణం, **సత్యకృష్ణ:** ఖాకి, **విఘ్నేశ్వర :** ఎంసీఏ.

రెండో రోజు 132 దరఖాస్తులు

పెద్దాపురం: జన్మభూమి -మా ఊరు కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం 9,10,11,12 వార్డుల్లో నిర్వహించిన సభల్లో 132 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి పేర్కొన్నారు. పింఛన్ల కోసం 33, రేషన్‌కార్డుల కోసం 49, అందరికీ ఇళ్లకోసం 49, పట్టాకోసం ఒక దరఖాస్తు వచ్చినట్లు ఆయన తెలిపారు. వాటిని పరిష్కారం కోసం సంబంధితశాఖాధికారులకు పంపుతామన్నారు.

మీరూ పంపండి

మీ ప్రాంతంలో రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయా... మురుగునీరు సక్రమంగా పారడం లేదా... అపరిశుభ్రత ఎక్కువగా ఉందా... తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారా... ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారా... సమస్యలపై మీరూ స్పందించండి. అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్య ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

వాట్సాప్ నంబర్లు:

పెద్దాపురం : 79950 67050
సామర్లకోట : 80085 74200
సామర్లకోట రూరల్ : 76759 19067

సొంతింటి కల సాకారమయ్యేనా..!

నిర్మాణ సామగ్రి ధర పెరుగుదలతో దడ

సామర్లకోటరూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు రుణాలను మంజూరు చేస్తుంది కదా అని ఉన్న ఇంటినే పీకేసి కొత్త ఇంటి నిర్మాణం మొదలెడుతుంటే అప్పుల పాలవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్న ఇంటి నిర్మాణం కోసం ఇచ్చే రుణం కంటే చేసే అప్పే రూ.లక్షలు దాటి పోవడంతో పలువురు పేదల పరిస్థితి ఆస్తి మూరెడు అప్పు బారెడు అన్న చందంగా తయారైంది. మొదలు పెట్టిన ఇంటిని మధ్యలో ఆపలేక దొరికిన చోటల్లా అప్పులు చేస్తుంటే వాటిని తీర్చడానికి మెడలోని పుస్తెల తాడును అమ్మినా వడ్డీలకు చాలని దుస్థితి నెలకొనగా అప్పు దొరక్క మొదలు పెట్టిన ఇంటిని మధ్యలోనే వదిలేస్తుంటే ఉన్న గూడు పోయి అద్దె కొంపలే దిక్కవుతున్నాయని మరి కొందరు వాపోతున్నారు. ఇదంతా ఎందుకు వచ్చిన గోలంటూ మరి కొందరు ఇళ్లు మంజూరైనా మొదలు పెట్టడానికే ముందుకు రావడం లేదు.

నిర్మాణ వ్యయమూ కారణమే...

ఇంటి నిర్మాణ వ్యయం గతంతో పోలిస్తే గడిచిన రెండేళ్లలో భారీగా పెరిగిపోయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం 250 చదరపు అడుగుల వైశాల్యంలో ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి ఎన్‌టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా రూ. 1.50 లక్షలు మంజూరు చేస్తారు. వాస్తవానికి అవసరమైన సామాగ్రి, కూలి, ఇతర ఖర్చులు కలిపి ఆయా ఇంటి యజమాని స్థోమతను బట్టి ఒక్క చదరపు అడుగుకు రూ.1800 నుంచి రూ. 2000 వరకు ఖర్చు అవుతోంది. అంటే చిన్నస్థాయిలో 250 చదరపు అడుగుల ఇంటి నిర్మాణానికి రూ.4,50,000 నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అంతకు మించిన విస్తీర్ణమైతే ఖర్చు మరింత అదనం. ప్రభుత్వం రూ.1.50 లక్షల రుణం మంజూరు చేస్తోంది. వీటిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 15,000, వేతనాల కింద రూ.40వేలు ఖాతాల్లో జమ చేస్తారు. మిగిలిన మొత్తం పునాది స్థాయిలో రూ.25,000, స్లాబు తరువాత రూ.55,000, ప్లాస్టింగ్ తరువాత మిగిలిన మొత్తం బ్యాంకు ఖాతాల్లో వేస్తారు. ప్రభుత్వం నుంచి వచ్చే వ్యయం సరిపోకపోవడంతో చాలా వరకు ఇళ్లు పునాది స్థాయిలోనే నిలిచిపోతున్నాయి.

ప్రారంభం కాని 800 ఇళ్లు

పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోట, పెద్దాపురం మండలాల పరిధిలో 40 గ్రామాల వరకు ఉండగా గడిచిన మూడేళ్లలో 800 ఇళ్లు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 2016-17 సంవత్సరంలో 1359 ఇళ్లకు గాను 50 శాతం ప్రారంభిచగా 15 శాతం పూర్తవ్వగా 35 శాతం ఇళ్లు ప్రారంభం కాలేదు. 2018-19లో 1100 ఇళ్లు మంజూరు కాగా గడిచిన రెండేళ్ల కాలంలో 800 వరకు ఇళ్లు ప్రారంభానికే నోచుకోలేదు.

భారీగా పెరిగిన నిర్మాణ సామగ్రి వ్యయం



గడిచిన రెండేళ్లలో ఇంటి నిర్మాణ సామగ్రి వ్యయం భారీగా పెరిగిపోవడంతో లబ్ధిదారులు సామగ్రిని కొనుగోలు చేసుకునేందుకు హడలెత్తిపోతున్నారు. ఒక్కో సిమెంటు బస్తా ఖరీదు రూ.290 నుంచి రూ.330 వరకు ఉంది. గతంలో రూ.8వేల వరకు ఉండే 5 యూనిట్ల లారీ ఇసుక నేడు 2 యూనిట్లు రూ.8వేలకు పెరిగిపోయింది. 1000 ఇటుక ధర రూ.6 వేలకు పైగా ఉండగా ఇనుము ఖరీదు టన్ను రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఒక వ్యక్తికి కూలి రోజుకు రూ.500 వరకు ఉండగా కూలీల ఖర్చే రూ.లక్షల్లో అవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం, అధికారులు గొప్పలు చెప్పుకొంటుండగా ఇసుకను మాత్రం అనధికారికంగా నిల్వ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి నిర్మాణాలకు అవసరమైన సామగ్రి ధరలను నియంత్రించడంతో పాటు నిర్మాణ వ్యయాన్ని పెంచాలని పలువురు కోరుతున్నారు.



నిర్మాణ దశలోనే నిలిచిన ఇల్లు

లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం

నియోజకవర్గంలో 800 ఇళ్లు ప్రారంభం కావాల్సి ఉంది. ముహూర్తాలు లేకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకానికి లబ్ధిదారులు సొంత నిధులను జోడించి నిర్మించుకోవాలి. ఈ విధంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నాం.

-నరసింహారావు, హౌసింగ్ డీఈఈ, సామర్లకోట

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి



యువకుడి మృతదేహం

సామర్లకోట, న్యూస్‌టుడే: రైలు ఢీకొన్న సంఘటనలో గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం సామర్లకోటలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. . స్థానిక అయిదు తూముల వద్ద సుమారు 25 సంవత్సరాల వయసుగల యువకుడు మృతి చెందాడు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని యువకుడిగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై భక్తులతో సమావేశం

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట కుమారారామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం భక్తులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో నారాయణమూర్తి తెలిపారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలపై మధ్యాహ్నం 4 గంటలకు భక్తులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు భక్తుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో రహదారిపై మురుగునీరు

రహదారి ఎక్కుతున్న మురుగు

పెద్దాపురం: సాక్షాత్తు పురపాలక సంఘ కార్యాలయం సమీపంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద కల్వర్టు పూడిపోయిన రోడ్డుపై మురుగునీరు పారుతోంది. రహదారి అడుగు భాగంలో ఉన్న ఈ కల్వర్టులో తూర చిన్నసైజు కావడంతో మురుగునీరును లాగలేకపోతోంది. తాత్కాలికంగా సమస్యను తీరుస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం వైపు ఎవరూ దృష్టిసారించడంలేదు. ఈ సమస్యకు పరిష్కార మార్గం అవ్వాలంటే కల్వర్టును ఓపెన్ చేసి పెద్ద తూరను వేస్తేనే ఈ సమస్యకు పరిష్కారమవుతుందని ఆ ప్రాంతవాసులు అంటున్నారు. అలా చేయకుండా ఊచ, కర్రలతో కొట్టి మురుగునీరు పోవడానికి ప్రయత్నిస్తే సరిపోదన్నారు.

అంతర్జాతీయ రంగోత్సవ్ పోటీల్లో ప్రసాద్‌కు ప్రథమస్థానం

సామర్లకోట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ రంగోత్సవ్ పోటీల్లో పాల్గొన్న సామర్లకోట నృత్యకారుడు అలమండ ప్రసాద్‌కు ప్రథమ స్థానం దక్కింది. డిసెంబరు 30, 31, జనవరి 1వ తేదీల్లో ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రసాద్ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానం సాధించాడు. ఉత్తరాఖండ్ యూనివర్సల్ సాంస్కృతిక్ సోధ్ నాట్య అకాడమీ మూడు రోజుల పాటు అంతర్జాతీయ పోటీలు నిర్వహించింది. పలు దేశాలు, రాష్ట్రాలకు చెందిన కళాకారులు నృత్యకారులు పోటీల్లో పాల్గొనగా ప్రథమస్థానం దక్కినట్లు ప్రసాద్ తెలిపారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

దివిలి (పెద్దాపురం రూరల్), న్యూస్‌టుడే: విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం కిట్స్ కళాశాలలో సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(ఏఈడీ) సంస్థ ఆధ్వర్యంలో వ్యాపార రంగ నైపుణ్యాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంస్థ ప్రతినిధులు డా.పి.వి. రామరాయుడు, కోఆర్డినేటర్ చంద్రకిరణ్ మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. పథకాలపై అవగాహన ఉన్న ప్రతి విద్యార్థి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సందీప్, ఈవో బెన్నిబాబు, టీపీవో రాఘవేంద్రరావు, ఏసీవో పెదకాపు పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



గ్యాంగ్ మెన్‌లతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం

సామర్లకోట, న్యూస్‌టుడే: ఈనెల 5న రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ పర్యటన సందర్భంగా విజయవాడ డీఆర్‌ఎం ధనుంజయులు సామర్లకోటలో అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. బుధవారం కాకినాడ నుంచి బయలు దేరిన డీఆర్‌ఎం వీకే రాయపురం, ఉండూరు గేటు, సామర్లకోట ఎల్.సి.గేటులను, పట్టాలను, కేబిన్‌లను పరిశీలించారు. అనంతరం పట్టాలపై నడుచుకుంటూ వచ్చి పట్టాలను, క్రాసింగ్ పాయింట్లను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. సామర్లకోట స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న కీమెన్‌లను, గ్యాంగ్‌మెన్‌లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో 1, 2, 3వ నంబర్ ప్లాట్‌ఫారాలను పరిశీలించారు. ప్లాట్‌ఫారాలపై ఏర్పాటు చేసిన సామర్లకోట జంక్షన్ బోర్డులను పరిశీలించి ప్రయాణికులకు తెలిసేలా ఆకర్షణీయంగా తీర్చి దిద్దాలని, రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండాలన్నారు. రెండో నంబర్ ప్లాట్ ఫారంపై నిరుపయోగంగా ఉన్న తోపుడు బండ్లను పెట్టడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం వాటిని తొలగించి పార్సిల్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం బుకింగ్ కౌంటర్ వద్ద అదనంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల భద్రత, పరిశుభ్రతలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకుని రాజమహేంద్రవరం వెళ్లారు. ఆయన వెంట ఏడీఆర్‌ఎం రామరాజు, సీనియర్ డీవోఎం శ్రీచైతన్య, సీనియర్ డీఎస్‌టీఇ విఠల్, సీనియర్ డీఈఎన్ రామారావు, డీసీఎం చంద్రశేఖర్, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ రాజు, ఎస్ఎస్ శాస్త్రి, టీటీఐ నూకరాజు ఉన్నారు.

నూతన కార్యవర్గఎన్నిక

పెద్దాపురం: పెద్దాపురం మండల ఫెలోషిప్ పాస్టర్స్ కమిటీ సమావేశం బుధవారం స్థానిక కొండయ్యపేటలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పలివెల జాన్, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్‌పాల్, సెక్రటరీగా జి.జోసప్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా రాజు, ట్రెజరర్‌గా దండి వెంకటపాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దొండపాటి మరియమ్మ, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దాపురం

10 నుంచి కబడ్డీ పోటీలు

పెద్దాపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 10,11,12 తేదీల్లో శ్రీవీర్రాజు ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థులతో జిల్లాస్థాయిలో పురుషులకు ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు గంగ, సప్పా కొండ రాజు, మురళి పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 10వేలు, ద్వితీయ రూ. 8వేలు, తృతీయ రూ. 6వేలు ఇస్తారన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు వాయిదా

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఈనెల 4,5 తేదీల్లో పెద్దాపురం పట్టణంలో నిర్వహించాల్సిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు పేర్కొన్నారు. ఈ మహాసభలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జె. రాము, ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొంటారన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



తన కుటుంబాన్ని చంద్రన్న బీమా ఏ విధంగా ఆదుకుందో వివరిస్తున్న మహిళ

పెద్దాపురం, న్యూస్‌టుడే: మనిషి జన్మించిన దగ్గర నుంచి మరణించేవరకు ఈ మధ్యకాలంలో ఉన్న జీవితంలో అవసరమైనవి పొందడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌ఛైర్మన్ రాజాసూరిబాబురాజు పేర్కొన్నారు. 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం బుధవారం పట్టణంలోని 9,10,11,12 వార్డుల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన రాజాసూరిబాబురాజు మాట్లాడుతూ ఉన్నత విద్యను పొందడానికి ప్రభుత్వం ఆర్థికసహాయం చేస్తుందన్నారు. పేదలకు నీడ కల్పించడానికి అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. చంద్రన్న బీమా పథకం ఎన్నో కుటుంబాలను ఆదుకుంటుందని వివరించారు. ఈ సందర్భంగా ఒక మహిళ తన భర్త మరణించగా చంద్రన్న బీమా పథకం ద్వారా రూ. 5 లక్షలు వచ్చిందని, దీని వల్ల తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కినట్లు వివరించింది. అనంతరం సంక్రాంతి కానుకలను, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ కొరిపూరి రాజు, వార్డు కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, కొయ్యనరాజు, బేదంపూడి సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, మేనేజర్ ప్రసాద్, సీవో శైలజ, రత్నం, సంయుక్తరాణి, జి. భాస్కరరావు, పట్టణ తెదేపా అధ్యక్ష, కార్యదర్శి రంధి సత్యనారాయణ, తూతిక రాజు, డీఈఈ రమేష్‌బాబు, ఏఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో....

సామర్లకోట: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జన్మభూమి - మా ఊరు సభలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మన్యం పద్మావతి కోరారు. బుధవారం సామర్లకోట పట్టణంలో సభలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 6వ వార్డుకు శారదాదేవి మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల వద్ద, 28,30 వార్డులకు సంబంధించి గణపతి నగరం వాటర్ ట్యాంకుల వద్ద సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మభూమి ప్రతిజ్ఞను, ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ పద్మావతి మాట్లాడుతూ ఇప్పటికే చాలావరకు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు వంటి అనేక పథకాలు అందించినట్లు చెప్పారు. ఇంకా ఎవరికైనా అందాల్సి ఉంటే దరఖాస్తు పెట్టుకుంటే త్వరలో ఇస్తామన్నారు. 6వ వార్డు కౌన్సిలర్ ఊబా జాన్‌మోజేష్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు బాగానే జరుగుతున్నాయని, తమ వార్డులో ఇంకా పలు సమస్యలు ఉన్నాయని వాటిని పూర్తిచేయాలన్నారు. మున్సిపల్ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బడుగు శ్రీకాంత్, కోడేల అర్జునరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అడబాల కుమారస్వామి, భీమేశ్వరాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్, నీటి సంఘం అధ్యక్షుడు బావిశెట్టి చక్రం, ఎస్సీహెచ్‌వో చంద్రరావు, వైద్యులు సిద్ధార్థ, శైలజ, సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పద్మావతి



కాపవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న విశ్వేశ్వరరావు తదితరులు

కాపవరంలో....

సామర్లకోట: ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీవో విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం 'జన్మభూమి- మాఊరు' గ్రామసభలు కాపవరం, పి.వేమవరం గ్రామాల్లో జరిగాయి. కార్యక్రమానికి వచ్చిన నియోజకవర్గ ప్రత్యేకాధికారి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. పి.వేమవరంలో జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు సాధికార మిత్రలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ గొడత మార్త మాట్లాడుతూ జన్మభూమి-మా ఊరు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సభల్లో చంద్రన్న సంక్రాంతి కానుకలు, విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శివకుమార్, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ జగ్గారావు, ఉప ఎంపీపీ ఆకునూరి సత్తిబాబు, సర్పంచులు పోలవరకు చక్రం, నూతలపాటి మాణిక్యం పాల్గొన్నారు.

పెద్దాపురం రూరల్‌లో....

పెద్దాపురం రూరల్: 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం ద్వారా ఏ శాఖకు సంబంధించిన సమస్యలనైనా పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోగుల వరహాలయ్య, ఎంపీడీవో వసంతమాధవి సూచించారు. మండలంలోని ఉలిమేశ్వరం, చదలాడ, తాటిపర్తి, చంద్రమాంపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు' కార్యక్రమాల్లో పలుశాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాటిపర్తి గ్రామంలో సర్పంచి ఎగ్గాడ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు ఖాళీ స్థలాలను గుర్తించి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఏపీఎం వేదకుమారి, ఏపీవో రాయి ప్రభాకరరావులు వెలుగు, ఉపాధిహామీ శాఖలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు నూతన రేషన్‌కార్డులు, పింఛన్లు , ఉపకార వేతనాలు, చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. చదలాడలో ఎంపీడీవో వసంతమాధవి మాట్లాడుతూ ఓడీఎఫ్ గ్రామాలపై బాధ్యతలు పెరుగుతాయన్నారు. సర్పంచులు రాగాల మాణిక్యాంబ, కొత్తెం వెంకటశ్రీనివాసరావు, మొయిళ్ల కృష్ణమూర్తి, దాసు శివబాబు, కురుమెళ్ల కల్యాణి, కోడిగుడ్డు త్రిమూర్తులు, పేకేటి దొరబాబు, కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.



చదలాడలో మాట్లాడుతున్న ఎంపీడీవో వసంతమాధవి

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సామర్లకోట, న్యూస్‌టుడే: మహిళలు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండి పండంటి శిశువుకు జన్మనిస్తారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మన్యం పద్మావతి అన్నారు. బుధవారం సామర్లకోట పట్టణం గణపతి నగరం వాటర్ ట్యాంకుల వద్ద సామర్లకోట అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు నళిని ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ఛైర్‌పర్సన్ పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, ప్రీస్కూలు విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సెక్టారు పరిధిలోని ఆరుగురు పిల్లలకు అన్నప్రాసన, గణపతి నగరం సెక్టారు పరిధిలోని ఆరుగురు గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

సామర్లకోట: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలేను నేటి యువత, మహిళలు, ఉపాధ్యాయినులు ఆదర్శంగా తీసుకోవాలని బచ్చుఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళ విద్య ద్వారా సమ సమాజస్థాపన జరుగుతుందన్నారు. సావిత్రిబాయి మహిళా ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, సామాజిక వేత్తగా అంకిత భావంతో పనిచేసి సమాజానికి ఎంతో సేవలు చేశారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఏఎల్‌వి కుమారి, అరుణ, డివి ఆర్ఎన్ వల్లి, శ్రీవల్లి, సంధ్యారాణి, శ్రీలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దాపురంలో క్రీడాపోటీలు...

పెద్దాపురం: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా యూటీఎఫ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. మ్యూజికల్ ఛైర్స్, స్లోవాకింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మహిళా విభాగం నాయకురాలు బి.రమాదేవి, బి.విజయలక్ష్మి, ఎన్.ఉషారాణి, కె.హేమలత పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

పి.గన్నవరం

అంబాజీపేట అరటి మార్కెట్

రకం	గరిష్ఠం	కనిష్ఠం
కర్పూర	190	50
చక్రకేళి	190	70
అమృతపాణి	130	40
పచ్చఅరటి	130	40
కూరఅరటి	130	50



వేడుకగా లక్ష తులసి పూజ

ఈదరాడ(మామిడికుదురు), న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో కొలువైన లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో బుధవారం లక్ష తులసి పూజ జరిగింది. అనేకమంది మహిళలు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వల్లీనాథదీక్షితులు, అంజనీకుమార్ వేదమంత్రోచ్చారణలతో విష్వక్సేనారాధన, మండపారాధన, పుణ్యాహ వచనం, హోమం ఏర్పాటయ్యాయి. తులసి దళాలతో స్వామివారికి వేదస్వస్తితో అర్చనలు చేశారు. అప్పనపల్లి బాలబాలాజీస్వామివారి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉదయం వైనతేయ నదీ జలాలతో అభిషేకం చేశారు. నివేదన, నిత్య హోమం, బలి హరణ, మంగళాశాసనం జరిగింది. తిరుప్పావై సేవాకాలం వేదస్వస్తితో ఏర్పాటైంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

పి.గన్నవరం, న్యూస్‌టుడే: క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడిని అధిగమించ వచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ డి.సునీల్‌బాబు అన్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి రెవెన్యూ క్రీడల్లో మండలంలోని రెవెన్యూ సిబ్బంది బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బుధవారం కార్యాలయంలో విజేతలకు ఆయన అభినందన సభ ఏర్పాటు చేశారు. చదరంగం, క్యారమ్స్, బాల్ బాడ్మింటన్, కబడ్డీ, బాస్కెట్‌బాల్ వంటి క్రీడల్లో విజయం సాధించిన రాజులపాలెం వి.ఆర్.ఒ. మంచికంటి సాయివెంకట్రాయుడు, ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ పి.యస్.వి.రమణమూర్తి, నరేంద్రపురం వీఆర్వో నక్కా పుష్పరాజ్ తదితరులను తహసీల్దార్ అభినందించారు. ఉప తహసీల్దార్లు .జి.వి.రత్నం, వై.రమాకుమారి, మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు దేశరాజు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతచంద్ర బోస్ కుటుంబానికి పరామర్శ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన పి.గన్నవరానికి వ్యాపారి అడ్డగళ్ల అచ్యుతచంద్రబోస్ కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, మాలమహానాడు రాష్ట్ర కోకన్వీనర్ కోట రామ్మోహనరావు తదితరులు పరామర్శించారు. జిల్లా తెదేపా అధ్యక్షుడు నామన రాంబాబు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు శేరు శ్రీనుబాబు, మద్దుల మోహన, వైకాపా రాష్ట్ర కార్యదర్శి మిండగుదటి మోహన్, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కొండేటి చిట్టిబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

యర్రంశెట్టి కుటుంబ సభ్యులకు..

యర్రంశెట్టివారిపాలేనికి చెందిన యర్రంశెట్టి సూర్యనారాయణ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను తెదేపా జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు, తదితరులు పరామర్శించారు.

స్పందించారు... పరిష్కరించారు

స్పందనకు వందనం

గుంతలు పూడ్చారు



అంబాజీపేట - అమలాపురం ప్రధాన రహదారిపై గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. కొంతమంది వాహనచోదకులు ఆ గుంతల్లోపడి గాయపడిన సందర్భాలున్నాయి. ఈ దుస్థితిపై గత ఏడాది నవంబరు 12న 'ప్రధాన రోడ్డుపై గుంతలు' శీర్షికన వాట్సాప్ చిత్రం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ర.భ.శాఖ అధికారులు గుంతల పూడ్చి రోడ్డు నిర్మించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రహదారిపై పడిన గుంతలను కూడా పూడ్చారు. రహదారి మెరుగుపడడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని ప్రయాణికులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట

మలుపులో రోడ్డు నిర్మించారు



గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ పరిధిలోని పెదపాలెం మలుపు వద్ద రోడ్డు అధ్వానంగా ఉండేది. దీనివల్ల ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ పరిస్థితిపై గత ఏడాది అక్టోబరు 29న 'అధ్వానంగా రహదారి' శీర్షికన వాట్సాప్ చిత్రం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మలుపులో రహదారిని కొత్తగా నిర్మించారు. దీనివల్ల ప్రమాదాల భయం తొలగిందని వాహనచోదకులు అంటున్నారు.

సచిత్రంగా పంపండి

మీ చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే... మీ ప్రాంతాన్ని సతాయించే సమస్యను చిత్రంగా బంధించి ఈ దిగువ ఇచ్చిన వాట్సాప్ నంబరుకు పంపండి. అధికారుల దృష్టికి 'ఈనాడు' ఈ సమస్యను తీసుకెళ్తుంది. మీరు పంపే సమస్య వ్యక్తిగతం కాకూడదు. ఫొటో దిగువన సమస్యకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా ప్రస్తావించాలి. నియోజకవర్గంలోని ఏ గ్రామం వారైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చు.

వాట్సాప్ నంబర్లు:
పి.గన్నవరం - 80085 74229
అంబాజీపేట - 80085 74178
మామిడికుదురు - 80085 74174

ప్రమాదకరంగా ఫ్యూజుపెట్టె



జి.అగ్రహారం పంచాయతీ పరిధిలోని ప్రసాద్‌నగర్ కాలనీ వద్ద గల విద్యుత్తు ఫ్యూజుపెట్టె తుప్పుపట్టి, చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. దీనిపై స్థానికులు పాత పేపర్లు, మైకా సంచులు వేసి కప్పారు. ఫ్యూజుపెట్టెను పరిశీలించి కొత్తది ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– పంపిన వారు : వి.శ్రీనివాస్, జి.అగ్రహారం

వివరణ: ప్రసాద్‌నగర్‌కాలనీలోని విద్యుత్తు ఫ్యూజుపెట్టెను పరిశీలించి, అవసరమైతే మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– వి.వి.రమణారావు, విద్యుత్తుశాఖ ఏఈ

- న్యూస్‌టుడే, అంబాజీపేట

రాకపోకలకు ఇక్కట్లు



మాచవరం పంచాయతీ పరిధిలోని మెట్లకాలనీ నుంచి కోరివారి అగ్రహారం ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి బాగా దెబ్బతింది. దీనివల్ల నడిచివెళ్లేందుకూ ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని అభివృద్ధి చేసి ఇక్కట్లు తీర్చాలి.

– పంపిన వారు: సూర్యనారాయణమూర్తి, కోరివారి అగ్రహారం

వివరణ: మెట్లకాలనీ నుంచి కోరివారి అగ్రహారం వెళ్లే రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులైతే పనులు ప్రారంభిస్తాం.

– ఎస్.బి.ఎస్.శర్మ, పంచాయతీ కార్యదర్శి

సావిత్రిబాయిపూలే సేవలు అందరికీ మార్గదర్శకం



సావిత్రిబాయి చిత్రపటం వద్ద కేకును కోస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకుడు మురళీకృష్ణ తదితరులు

మామిడికుదురు, న్యూస్‌టుడే: తొలి మహిళా ఉపాధ్యాయినిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయిపూలే విద్య, సామాజిక సేవా కార్యక్రమాలతో అందరికీ మార్గదర్శకంగా నిలిచారని బీసీ, ఎస్సీ ఉపాధ్యాయ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఆమె 187వ జయంత్యుత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత ఆశయాలతో పురోగమించాలని అభిలషించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంతా నివాళి అర్పించారు. అనంతరం కేకును కోసి అందరికీ పంచారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుబ్బల మురళీకృష్ణ, పెయ్యల వీరభద్రరావు, వాసంశెట్టి శంకర్రావు, బయ్యా మోహన్, రాయుడు నాగేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, మట్టా శ్రీధర్, వసతి గృహం సంక్షేమాధికారిణి ఉండ్రు సదాశాయి పాల్గొన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. సంఘ మండల శాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయినవిల్లి(అంబాజీపేట): తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి జయంతిని ముక్తేశ్వరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఐకాస కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత ఎంపీపీ సలాది పుల్లయ్యనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎస్.దుర్గాదేవి, గోసంగి బంగారురాజు, బి.శ్రీనివాస్, దంగుడుబియ్యం శ్రీనివాస్, హెచ్.కృష్ణకుమారి, ఎస్.వి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అంబాజీపేట: సావిత్రిబాయి పూలేను నేటి తరం వారు ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక ఉద్యమకారిణి ఏనుగుల సత్యరాయలు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా అంబాజీపేట, తొండవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బీర హనుమంతరావు, ఎం.ప్రకాష్‌లు పాల్గొన్నారు. పుల్లేటికుర్రులో నాగాబత్తుల ఉదయ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచి కాండ్రేగుల గోపాలకృష్ణ, మాజీ సర్పంచి నూకపెయ్యి చిన్న, గోడ సత్యనారాయణలు పాల్గొన్నారు. కె.పెదపూడిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దళితబహుజన మహిళశక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు సి.వి.ప్రభాకరరావు అధ్యక్షత వహించారు.

పి.గన్నవరం: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శమూర్తని యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలు ఎం.విజయ గౌరి అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. మండల శాఖ సహ అధ్యక్షురాలు కుంబా జ్యోతి అధ్యక్షత వహించారు. విజయ గౌరి ముఖ్యఅతిథిగా పాల్గొని సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ప్రతినిధులు లీలావతి, బి.అచ్యుతకుమారి, జి.యస్.పద్మావతి, జి.వరలక్ష్మి, కె.ఆనందరావు, కె.శివరామకృష్ణ, కె.సురేష్‌కుమార్, బి.చిట్టితల్లి, కె.నవ్యదుర్గ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొక్కిరి దామోదరం అధ్యక్షతన జరిగిన సభలో సావిత్రిబాయికి పలువురు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయిని డి.ఎ.యల్.కుమారిని సత్కరించారు. ఊడిమూడిలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కత్తుల ఆనందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యర్రంశెట్టి సత్యనారాయణ పాల్గొని సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయిని ఎం.రాధాకుమారిని సత్కరించారు.

14న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

అయినవిల్లి(అంబాజీపేట), న్యూస్‌టుడే: అయినవిల్లిలోని నరహరి శెట్టి వెంకట్రావు జూనియర్ కళాశాలలో 1981-2005 మధ్య విద్యనభ్యసించిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీ పేరిట సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని అప్పట్లో కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులంతా హాజరుకావాలని కుడిపూడి బాబు, విళ్ల సుభాకర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, మిండగుదటి మోహన్, గన్నవరపు శ్రీను, కాకర శ్రీను తదితరులు కోరారు.

చలన చిత్రాలు
పి.గన్నవరం: **శ్రీబాలబాలాజి** - 2 కంట్రీస్
అయినవిల్లి: **దేవిగణేష్** - ఒక్కక్షణం
అంబాజీపేట: **వీరభద్ర** - ఒక్కక్షణం
పుల్లేటికుర్రు: **కనకదుర్గ** - అదిరింది

ప్రతి అర్జీకి జవాబుదారీతనం : పులపర్తి



మొండెపులంక సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి చిత్రంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు తదితరులు

మొండెపులంక(పి.గన్నవరం), న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామ సభల్లో ప్రజల నుంచి వస్తున్న ప్రతి అర్జీకి జవాబుదారీతనం ఉంటుందని ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి స్పష్టం చేశారు. ప్రభుత్వం పక్కా ప్రణాళికతో జన్మభూమి కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఆయన అన్నారు. మొండెపులంక, లంకలగన్నవరంలలో బుధవారం నిర్వహించిన జన్మభూమి గ్రామసభలకు సర్పంచులు గుడాల వెంకటరమణ, కొపనాతి సీతారామస్వామి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే నారాయణమూర్తి, తెదేపా జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు ముఖ్య అతిథుగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి వివరించారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్ల మంజూరు ఉత్తర్వులు అందించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ సంసాని లక్ష్మీగౌరి, తహసీల్దార్ డి.సునీల్‌బాబు, ఎంపీడీవో ఎం.ప్రభాకరరావు, సాగునీటి సంఘ అధ్యక్షుడు ఆరుమిల్లి లాలాబాబు, మండల ఉపాధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కేతా వెంకటేశ్వరరావు, పైడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

అయినవిల్లి(అంబాజీపేట): జన్మభూమి గ్రామసభల ద్వారా సామాన్యుల సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి అన్నారు. పోతుకుర్రులో సర్పంచి గుమ్మళ్ల శ్రీనివాససాగర్ అధ్యక్షతన బుధవారం జరిగిన జన్మభూమి గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీపీ సలాది పుల్లయ్యనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ, ఎంపీడీవో బండారు సూరన్న, తహసీల్దారు వి.సుస్వాగతంలు మాట్లాడారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, కార్యదర్శి నేదునూరి వీర్రాజు, జిల్లా తెదేపా కోశాధికారి సయ్యపురాజు వెంకటసత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: జన్మభూమి గ్రామసభ ద్వారా ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని ఎంపీపీ దాసరి వీరవెంకటసత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు బొంతు పెదబాబు అన్నారు. మండలంలోని ఇరుసుమండ, పుల్లేటికుర్రులలో సర్పంచులు చిన్నం లక్ష్మి, కాండ్రేగుల గోపాలకృష్ణల అధ్యక్షతన బుధవారం గ్రామసభలు జరిగాయి. వీటిలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు పాల్గొని మాట్లాడుతూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి కె. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై తక్షణం స్పందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు యనమదల సోమచంద్రరావు, గణపతి వీరరాఘవులు, ఆత్మ ఛైర్మన్ పబ్బినీడి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు వాసంశెట్టి పల్లంశెట్టి, నేదునూరి వెంకటరమణబాబు, మండల తెదేపా అధ్యక్షుడు గణపతి బాబులు, తెలుగు యువత అధ్యక్షుడు రవణం రాము పాల్గొన్నారు.



ఇరుసుమండలో రేషన్‌కార్డు అందిస్తున్న ఎంపీపీ జడ్పీటీసీ సభ్యుడు, తదితరులు

సంక్షేమ పథకాలతో అందరికీ ప్రయోజనం : గొల్లపల్లి

మామిడికుదురు: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రయోజనం చేకూరుతోందని రాజోలు ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఈదరాడలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో సమర్పించిన వినతులను పరిశీలించి అర్హులైన వారందరికీ న్యాయం చేస్తానన్నారు. పెదపట్నంలో జరిగిన గ్రామసభలో పి.గన్నవరం ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి పాల్గొని అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అందరి సహకారంతో మరింత పురోభివృద్ధి సాధిస్తామన్నారు. అర్హులైన వారికి పింఛన్లు కేటాయించడం లేదని, దరఖాస్తులు చేసుకున్నా తాత్సారం చేస్తున్నారంటూ మామిడికుదురు గ్రామసభలో పలువురు ఆందోళన వ్యక్తపరిచారు. అందరికీ న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు. 2008 డీఎస్సీలో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ బి.జ్యోతి, ప్రసాద్, కిరణ్ తదితరులు ఎమ్మెల్యే గొల్లపల్లికి వినతిపత్రాన్ని అందజేశారు. కొమరాడలో జరిగిన గ్రామసభలో లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలను అందజేశారు. ఎంపీపీ మద్దాల సావిత్రి, జడ్పీటీసీ సభ్యుడు విత్తనాల మాణిక్యాలరావు, డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, తహసీల్దారు జి.చిన్నిబాబు, ఎంపీడీవో జి.రామశివాజీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ఈదరాడలో లబ్ధిదారుకు గృహ నిర్మాణ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న రాజోలు ఎమ్మెల్యే గొల్లపల్లి




పోతవరంలో దమ్ములు చేసి ఉన్న రబీ చేలను పరిశీలిస్తున్న గోదావరి మధ్య డెల్టా ఈఈ ఎం.రవిబాబు

గోదావరి మధ్య డెల్టాలో..
శివారు ఆయకట్టుపై ప్రత్యేక దృష్టి
ఈఈ రవిబాబు

పోతవరం(పి.గన్నవరం), న్యూస్‌టుడే: రబీ సాగుకు సంబంధించి గోదావరి మధ్య డెల్టాలో సాగునీరు సక్రమంగా అందని శివారు ఆయకట్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆయా కాలువల నీటి మట్టాలను పెంచుతున్నామని ఈఈ ఎం.రవిబాబు వెల్లడించారు. మధ్య డెల్టాలో 1.72 లక్షల ఎకరాలకు గాను ఇంత వరకు 50 శాతం నాట్లు పూర్తయినట్లు ఆయన చెప్పారు. కాలువల ముఖ భాగంలో ఉన్న రైతులు ఎక్కువగా నాట్లు వేశారని ప్రస్తుతం వారికి నీటి వాడకం అంతగా అవసరం ఉండదు కాబట్టి ఉన్న నీటిని కాలువల శివారు ఆయకట్టుకు తీసుకెళ్లే విధంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామన్నారు. పోతవరంలోని రబీ వరి చేలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 20 నాటికి నూరుశాతం నాట్లు పూర్తవుతాయన్నారు. వేగంగా నాట్లు పూర్తి చేయాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. సాగునీరు అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు. మరీ సాగునీరందక ఇబ్బందులున్నచోట ఆయిల్ ఇంజిన్లు పెట్టి మురుగు కాలువల వంటి ప్రత్యామ్నాయ మార్గాల్లోంచి నీటిని తోడుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకు 5 అశ్వికశక్తిగల ఆయిల్ ఇంజిన్ ద్వారా ఎకరం చేసుకు పంట మొత్తం మీద 12 తడులు పెట్టుకునే విధంగా వెసులుబాటు కల్పించామన్నారు. రైతు ఎన్ని గంటలు ఆయిల్ ఇంజిన్ వాడుకున్నదీ తమ క్షేత్ర సిబ్బంది స్వీయ పర్యవేక్షణలో లాగ్‌బుక్‌లో నమోదు చేయిస్తామన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు చేరే విధంగా ఎప్పటికపుడు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. శివారు ఆయకట్టుకు సాగునీరు వెళ్లటంలో సమస్య నెలకొందని ఇసుకపూడి సాగునీటి సంఘ అధ్యక్షుడు కొల్నాడ సత్యనారాయణరాజు ఆయనకు వివరించారు. జలవనరులశాఖ పి.గన్నవరం సబ్ డివిజన్ డీఈఈ జి.శ్రీనివాస్, పి.గన్నవరం సాగునీటి పంపిణీ కమిటి ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, రైతులు ఆయన వెంట ఉన్నారు.

అయినవిల్లి ఆలయ దర్శిని



★ సిద్ధివినాయకస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున మేలుకొలుపు, సుప్రభాత సేవలుంటాయి. ఉదయం ఆరు గంటల నుంచి లఘున్యాసాభిషేకాలు నిర్వహిస్తారు. ★ నిత్యలక్ష్మీగణపతి హోమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. దీనిలో భాగంగా ఆలయ అర్చకుడు అయినవిల్లి సురేష్ మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ★ స్వామి వారికి బుధవారం 50 ప్రత్యేకాభిషేకాలు జరిగాయి. భక్తులు 700 కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ★ సిద్ధివినాయకస్వామి ఆలయానికి రూ.56,000 ఆదాయం సమకూరింది. నిత్యలక్ష్మీగణపతి హోమంలో 23 మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. 33 మంది కొత్త వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ★ నిత్యాన్నదాన పథకం ద్వారా దూర ప్రాంతాలకు చెందిన 517 మంది భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు.

- న్యూస్‌టుడే, అయినవిల్లి(అంబాజీపేట)



అప్పనపల్లిలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అప్పనపల్లి హుండీ ఆదాయం రూ.18.29 లక్షలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: అప్పనపల్లి బాలబాలాజీస్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం జరిగింది. 47 రోజులకు గాను రూ.18.29 లక్షల ఆదాయం వచ్చింది. ఇందులో 15 గ్రాముల బంగారం, 115 గ్రాముల వెండి లభ్యమైనట్లు ప్రత్యేకాధికారిగా విచ్చేసిన కాకినాడ ఎంఎస్ఎన్ ఛారిటీస్ ఈవో బి.నీలకంఠం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పొలమూరి బాబూరావు, సర్పంచి బొంతు సూర్యభాస్కరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎన్.లక్ష్మీసరస్వతి, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన వద్ద తుప్పల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

అంబాజీపేట, న్యూస్‌టుడే: తీర్థం సందర్భంగా ప్రభలు వెళ్లేందుకున్న ఆటంకాలు తొలగాయి. ఈ నెల 16న జగ్గన్నతోట ప్రభల తీర్థం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రభలు వెళ్లే మార్గంలో తుప్పలు, డొంకలు పెరిగిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. దీనిపై 'ప్రభల తీర్థం బాటల్లో భయం..భయం' శీర్షికన గత నెల 25న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి ఇరుసుమండ పంట కాలువ వద్ద వంతెన సమీపంలో పెరిగిన తుప్పలను తొలగించారు.

పిఠాపురం

చలనచిత్రాలు **పిఠాపురం: శ్రీసత్య (ఎ.సి.):** హలో, **శివదుర్గ:** 2కంట్రీస్, **వెంకటేశ్వర:** ఒక్క క్షణం, **అన్నపూర్ణ:** ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి). **కాకినాడ: తిరుమల -** జుమాంజీ, **వీర్‌కమల్-** 2 కంట్రీస్, **ఆనంద్-** 2 కంట్రీస్, **అంజని -** ప్రాజెక్ట్ జెడ్, **సంగీత్-** ఒక్కక్షణం, **గీత్-** జుమాంజీ(మార్నింగ్ షో, మ్యాట్నీ), టైగర్ జిందాహై(ఫస్ట్ షో, సెకండ్ షో), **దేవీస్క్రీన్ 1-** ఎంసీఏ, **దేవీస్క్రీన్ 2-** ఒక్కక్షణం, **దేవీస్క్రీన్ 3-** 2 కంట్రీస్, **శ్రీప్రియ-** ఎంసీఏ, **పద్మప్రియ -** హలో, **సిఅండ్‌సి 1-** ఎంసీఏ, **సిఅండ్‌సి 2-** హలో, **లక్ష్మి -** ఒక్కక్షణం, **సత్యగౌరి -** గృహం.

ఉప్పాడ సర్పంచి సస్పెన్షన్ పొడిగింపు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ గ్రామ సర్పంచిపై ఉన్న సస్పెన్షన్‌ను పొడిగిస్తూ బుధవారం జిల్లా పంచాయతీరాజ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సర్పంచి బందన నందీశ్వరి పంచాయతీ నిధులు, 14వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగానికి పాల్పడినందుకు గతంలో మూడునెలలు సస్పెన్షన్ విధించారు. తాజాగా ఈ సస్పెన్షన్‌ను మరో మూడు నెలలు పొడిగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.



దీపోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ధనుర్మాస సహస్ర దీపాలంకరణ

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని సీతారామస్వామి ఆలయం (విష్ణాలయం)లో ధనుర్మాసం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజల అనంతరం సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. కనుల పండువగా జరిగిన దీపోత్సవాన్ని పెద్దఎత్తున భక్తులు వచ్చి తిలకించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ దంగేటి శ్రీరామకృష్ణ, ధర్మకర్తలు మాదేపల్లి వాసు, కరాసు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సప్తాహ మహోత్సవాలు

వన్నెపూడి (గొల్లప్రోలు): గొల్లప్రోలు మండలంలోని వన్నెపూడి గ్రామంలో గతనెల 29న ప్రారంభమైన ప్రథమ సప్తాహ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీర్ఘకాలంగా ధనుర్మాస ముక్కోటి ఏకాదశి రోజున ఏకాహం నిర్వహించే శ్రీరామసేవ భజన కమిటీ సభ్యులు ఈ సంవత్సరం నుంచి సప్తాహం ప్రారంభించారు. 7 రోజులపాటు నిరవధికంగా కొనసాగే భజన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 56 భజన సమాజాలు పాల్గొంటున్నాయి. ఈ మహోత్సవాలు గురువారంతో ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: మహిళాశక్తి సంఘాలు, సమాఖ్యల బలోపేతానికి రీసోర్సు పర్సన్లు కృషిచేయాలని, నిర్ణయించిన లక్ష్యాల సాధనకు సిబ్బంది చర్యలు చేపట్టాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ రత్నబాబు ఆదేశించారు. గొల్లప్రోలులోని సంస్థ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బందితో పీడీ సమీక్షించారు. సభ్యులు పొందిన బ్యాంకురుణాలు, స్త్రీనిధి రుణాలతో జీవనోపాధి యూనిట్లు ఏర్పాటుచేసుకుని ఆదాయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, ప్రతి మహిళ నెలకు రూ.10 వేల ఆదాయం పొందేలా జీవనోపాధి యూనిట్లు నెలకొల్పాలని, ఇందుకు శిక్షణ ఇచ్చి రుణం మంజూరు చేస్తామని పీడీ వివరించారు. ఈ సమావేశంలో మెప్మా టీఎంసీ కె.రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పదిమందిపై కేసు నమోదు

ఉప్పాడ(కొత్తపల్లి), న్యూస్‌టుడే: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు బుధవారం 10మందిపై కేసు నమోదుచేసినట్లు కొత్తపల్లి ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఉప్పాడ గ్రామానికి చెందిన జగదీష్, కొత్తపట్నం గ్రామానికి చెందిన అప్పలరాజు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగి కొందరు గాయపడ్డారు. దీనిపై బుధవారం ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

స్వచ్ఛసర్వేక్షణ్‌పై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

గొల్లప్రోలు : స్వచ్ఛసర్వేక్షణ్ - 2018 లో భాగంగా పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల పరిధిలో పారిశుద్ధ్యం, బహిరంగమలమూత్ర విసర్జన నిర్మూలన, చెత్తసేకరణ, రవాణా, ప్లాస్టిక్ నిషేధం అంశాలపై గురువారం నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని కమిషనర్ ఎం.రామ్మోహనరావు బుధవారం తెలిపారు. రెండు పట్టణాల పరిధిలోని ప్రజలకు ఫోన్‌చేసి వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజాభిప్రాయసేకరణలో సానుకూలంగా స్పందించి తద్వారా జాతీయ ర్యాంకు వచ్చేలా ప్రజలు సహకరించాలని కోరారు.


అడ్డు అదుపు లేని 'మత్తు'

గ్రామాల్లో విచ్చలవిడిగా సారా, బెల్టుదుకాణాలు

పేదల బతుకులను చిన్నాభిన్నం చేస్తున్న అక్రమ మద్యం, సారా విక్రయాలకు అడ్డుఅదుపు లేకుండాపోతోంది. గ్రామాల్లో బెల్టుషాపులు ఇంకా విస్తరిస్తున్నాయేగాని తగ్గడం లేదు. కిల్లీకొట్టుల్లోనూ మద్యం విక్రయించేస్తున్నారు. ఇక సారా తయారీ కేంద్రాలు, విక్రయదారులపై అధికారులు తరచూ దాడులు చేస్తున్నా ఆగడం లేదు. వ్యాపారులు కేసులకు వెరవక..పేదలు బలవుతున్నారు.

న్యూస్‌టుడే, పిఠాపురం పట్టణం

పిఠాపురం నియోజకవర్గం వ్యాప్తంగా నాటుసారా, మద్యం గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. సారా నిర్మూలనకు ఎక్సైజ్ అధికారులు గతంలో 'నవోదయం' పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించి సారా తాగితే వచ్చే అనర్థాలు వివరించారు. సారా తయారీ, విక్రయదారులపై కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించినా మార్పులేదు. ఒక గ్రామంలో సారా విక్రయాలు తగ్గిన వెంటనే దాని స్థానంలో బెల్టుషాపులు వచ్చేస్తున్నాయి. ఇలా ఒకదానికి ఒకటి పోటీపడి వ్యాపారం రోజురోజుకు పెరుగుతోంది. పేదకుటుంబాల్లో చిచ్చురేపుతున్నాయి. బెల్టుషాపులను ఎత్తేశామని ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా..క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదని గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్టుషాపులకు ప్రధాన మద్యం దుకాణాల నుంచి సరాఫరా చేస్తున్నారని అయినా అధికారులు కట్టడి చేయలేకపోతున్నట్లు, ఎక్సైజ్ శాఖ ప్రతినెలా తూతూ మంత్రంగా మచ్చుకు కొన్నికేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఈ ప్రాంతాల్లో ఎక్కువ...

నియోజకవర్గంలోని కోనపాపపేట, శొంఠివారి పాకలు, పొన్నాడ, శీలంవారిపాకలు, శ్రీరాంపురం, రమణక్కపేట గ్రామాల్లో తరచూ సారా కేసులు నమోదవుతున్నాయి. పిఠాపురం మండలంలోని జల్లూరు, సుబ్బరాయుడు పేట, గోకివాడ, జములపల్లి, రాపర్తి గ్రామాల పరిధిలో ఏలేరు కాలువ గట్టున, గొల్లప్రోలు మండలంలోని కొడవలి, చెందుర్తి, మల్లవరం గ్రామాలు, పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు, యానాదుల కాలనీ ప్రాంతాల్లో సారా వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

డిసెంబరులోనే 9 కేసులు

నియోజకవర్గం వ్యాప్తంగా గత డిసెంబరు నెలలోనే సారా, బెల్టుదుకాణాల నిర్వాహకులపై అధికారులు దాడులు చేశారు. నాటుసారా కేసులు 9 నమోదు చేసి 125లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 50,900లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. బెల్టు దుకాణాలపై 3కేసులు నమోదు చేసి 32 సీసాలు స్వాధీనం చేసుకుని 12మందిని అరెస్టు చేశారు. ఇలా ప్రతినెలా అధికారులు దాడులు చేస్తే నియంత్రణ సాధ్యమవుతుందని గ్రామీణులు సూచిస్తున్నారు.



ఇటీవల స్వాధీనం చేసుకున్న సారా, మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

తనిఖీలు చేస్తున్నాం..



సారా, బెల్టుదుకాణాల నిర్మూలనకు నిత్యం తనిఖీలు చేస్తున్నాం. నాటుసారా తయారీ, అమ్మకాలను అరికడుతున్నాం. ప్రజాచైతన్యానికి అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులకు వెనుకాడేది లేదు. కఠినంగా వ్యవహిస్తున్నాం.

-రామసురేష్, ఎక్సైజ్ సీఐ

ఒత్తిడిలేని విద్యతో ఉత్తమ ఫలితాలు

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఒత్తిడిలేని విద్యతోనే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని అమెరికాకు చెందిన మేనేజ్‌మెంట్ నిపుణురాలు శ్రీదేవి, న్యూజిలాండ్ నుంచి వచ్చిన వ్యాపారనిపుణుడు ఎల్.సంతోష్‌లు అన్నారు. పిఠాపురం మండలంలోని బి.ప్రత్తిపాడు పీఎంఆర్ విద్యామందిర్‌లో బుధవారం ఒత్తిడిలేని విద్యావిధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం నుంచి రాత్రి వరకు చదివితే ఏకాగ్రత కోల్పోయి మానసిక రుగ్మతలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పిల్లలు అల్లరి చేస్తున్నారని కొట్టడం, తిట్టడం చేయడం వల్ల ఒత్తిడికిలోనై చదవలేరని, తల్లిదండ్రుల ప్రవర్తనను పిల్లలు గమనించి అదేరకంగా తయారవుతారన్నారు. బట్టీవిధానం కాకుండా విషయాన్ని అర్థంచేసుకునే విధానంలో విద్యాభ్యాసం సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్ పాఠశాల కరస్పాండెంట్ పాలూరి నాగిని చంద్ర, ఛైర్మన్ వినీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ.2.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధిపనులు నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ శీరం మాణిక్యం తెలిపారు. పట్టణ శివారు సూరంపేటలో జరుగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను బుధవారం కమిషనర్ ఎం.రామ్మోహనరావుతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ వినతిమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరుచేసిన రూ. 5 కోట్ల ప్రత్యేక నిధులతో ఈబీసీకాలనీ, దేవీనగర్, శివాలయకాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్, తెదేపా పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నీటిసంఘం అధ్యక్షుడు కడారి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



వంటపాత్రలు అందిస్తున్న సర్పంచి సత్యవతి

అంగన్‌వాడీ కేంద్రాలకు వంటపాత్రలు

మూలపేట(కొత్తపల్లి), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారపదార్థాలు సిద్ధం చేయడానికి పాత్రలు లేక సిబ్బంది అద్దెపాత్రలు తెస్తున్నారు. దీనిపై డిసెంబరు 16న 'ఈనాడు'లో 'లక్ష్యం సరే..ఆచరణ ఏదీ' అనేశీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీల నుంచి వంట పాత్రలను అందించే చర్యలు చేపట్టారు. బుధవారం కొత్తపల్లి మండలం మూలపేట గ్రామ పరిధిలో ఉన్న 7 అంగన్‌వాడీ కేంద్రాలకు సర్పంచి యేలేటి సత్యవతి చేతుల మీదుగా వంట పాత్రలు పంపిణీ చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

ప్రభుత్వ పథకాల్లో అర్హులకు అన్యాయం: వైకాపా

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలకే ప్రభుత్వ లబ్ధి చేకూరుతోందని, అర్హులను సైతం విస్మరిస్తున్నారని వైకాపా జిల్లా నేతలు ధ్వజమెత్తారు. గొల్లప్రోలులోని కొత్తపేటవీధి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బుధవారం రాత్రి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం వైకాపా జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి సునీల్, పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ పెండెం దొరబాబు, మాజీ మంత్రి కొప్పన మోహనరావు తదితరులు మాట్లాడారు. పింఛన్లు, గృహనిర్మాణ రుణాలు, ఇతర పథకాలన్నీ పచ్చచొక్కాలకే అందిస్తున్నారని, జన్మభూమి కార్యక్రమాల్లో సమస్యలు ప్రస్తావిస్తున్నవారిని పోలీసులతో అడ్డుకుంటున్నారని, పోలీసురాజ్యంగా మార్చారని ధ్వజమెత్తారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయిస్తూ పట్టాలు అందించగా వాటిని ప్రస్తుత ఎమ్మెల్యే రద్దుచేయిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని మూలపేట, తాటిపర్తి, తిమ్మాపురం గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు మొగలి అయ్యారావు, పర్ల రాజా, దాసం లోవబాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న దొరబాబు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కన్నబాబు తదితరులు

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. పట్టణ ఎస్సై శోభన్ కుమార్, శిక్షణ ఎస్సై నాగరాజుల ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి లారీయూనియన్ ఆఫీసు వద్ద పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.18,360 నగదు స్వాధీనం చేసుకొన్నారు. బుధవారం చిత్రాడ ఈబీసీకాలనీలో పేకాడుతున్న 9మందిని అదుపులోకి తీసుకొని రూ.2,310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పిఠాపురం

రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఫణీశ్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ద.మ. రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(డీఆర్‌యూసీసీ) సభ్యుడిగా జిల్లా, కాకినాడ ప్రయాణికుల సంఘం కార్యదర్శి అడ్డూరి ఫణీశ్ నియమితులైనట్లు సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'వర్గీకరణ అంశంలో రాజకీయ జోక్యం తగదు'

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అంశంలో రాజకీయపార్టీల జోక్యం మంచిదికాదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బీఎన్‌రాజు హెచ్చరించారు. బుధవారం పట్టణంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వర్గీకరణ సాధ్యంకాదని గతంలోనే కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 22న అన్ని మండలాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

జన్మభూమి సభలో ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం రూరల్, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ప్రజలందరి సంక్షేమమే ప్రభుత్వ ఆశయమని ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం మండలంలోని కోలంక, ఎల్.ఎన్.పురం బి.కొత్తూరు, గోకివాడ గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బర్ల అప్పారావు, ఎంపీపీ విజయలత, ఉప ఎంపీపీ వెంకటరమణ, మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్మ



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీచేస్తున్న ప్రత్యేకాధికారి రఘుబాబు

పేదలకు అండగా తెదేపా

పిఠాపురం పట్టణం: పేదలకు అండగా ఉండి, వారి సంక్షేమానికి కృషి చేసే పార్టీ తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని ఎమ్మెల్యే వర్మ అన్నారు. పిఠాపురం పట్టణంలోని 12, 29, 30 వార్డుల్లో జన్మభూమి సభలు నిర్వహించారు. పేదలదరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దరిచేర్చేందుకే జన్మభూమి ద్వారా ప్రజల చెంతకు అధికారులను తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించగా, విద్యార్థులకు ఉపకారవేతనాలు, పేదలకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కరణం చిన్నారావు, వైస్‌ఛైర్మన్ పిల్లి చిన్న, పాదగయ ఛైర్మన్ కొండేపూడి ప్రకాష్, జైగణేష్ ఆలయ ఛైర్మన్ పెదబాబు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ దేవరపల్లి రామారావు, తెదేపా పట్టణ ధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సుజాత, కమిషనర్ రామ్మోహన్, ఏఈ వంశీ అభిషేక్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతో సమాజాభివృద్ధి సాధ్యం

గొల్లప్రోలు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో అంటురోగాలకు దూరంగా ఆరోగ్యంతో జీవించవచ్చునని, సంపూర్ణ ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, కాకినాడ ఆర్డీవో రఘుబాబు అన్నారు. గొల్లప్రోలు మండలంలోని ఎ.పి.మల్లవరం, ఎ.కె.మల్లవరం గ్రామాల్లో బుధవారం జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభల్లో ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనూ జరగని విధంగా పిఠాపురం నియోజకవర్గంలో రూ. 2,500 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రజల సంక్షేమం, సంతృప్తే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ సభలకు ఎంపీపీ సత్యఅనంతలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో విజయథామస్, తహసీల్దారు వై.జయ, గృహనిర్మాణ సంస్థ డీఈఈ సత్యనారాయణ, ఎంఈవో సలాది సుధాకర్, సర్పంచులు గంపల మార్త, రాజమహేంద్రవరపు సరస్వతి, జన్మభూమికమిటీ సభ్యులు తెదేపా నేతలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



పిఠాపురంలో బాలుడికి అన్నప్రాసన చేస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లి మండలంలో...

అమరవిల్లి(కొత్తపల్లి): గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారమార్గం చూపేందుకే జన్మభూమి-మా ఊరు సభల ముఖ్యఉద్దేశమని వైస్ ఎంపీపీ సత్యానందరెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి గ్రామంలో బుధవారం జన్మభూమి గ్రామసభ నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, సర్పంచి బోరా రమణారెడ్డి, మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్, ఎంపీడీవో నారాయణమూర్తి, తహసీల్దార్ రత్నకుమారి, ఎంఈవో అబ్బులు, ఏపీఎం వీరవేణి తదితర అధికారులు హాజరయ్యారు.



ఏటీఎం కేంద్రంలో నగదు రాక నిరాశగా వెళ్లిపోతున్న ఖాతాదారులు

నగదు లేదు..ఇటురాకండోయ్

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ము ఎప్పుడైనా తీసుకునేందుకు ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇలా ప్రతి బ్యాంకు రెండు, మూడు కేంద్రాలను నెలకొల్పాయి. దీంతో బ్యాంకులకు వెళ్లి క్యూలో నిల్చుని డబ్బు డ్రాచేసుకునే శ్రమ తప్పిందని ఇన్నాళ్లు భావించిన ప్రజలకు ప్రస్తుతం ఏటీఎం కష్టాలు మొదలయ్యాయి. వంద రూపాయలు తీసుకోవాలన్నా ఊరంతా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో స్టేట్‌బ్యాంకు, ఆంధ్రాబ్యాంకు, ఐవోబీ, సెంట్రల్ బ్యాంకు, ఐసీఐసీఐ, పంజాబ్‌నేషనల్ బ్యాంకు, కరూర్‌వైశ్యా, కార్పొరేషన్ బ్యాంకులున్నాయి. పాదగయ, రైల్వేస్టేషన్, సత్యథియేటర్ సమీపం, చర్చిసెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ కేంద్రాలలో ఏటీఎంలు ఉండగా ఎక్కడా సరిగా నగదు ఉండడంలేదు. ఖాతాదారులు కేంద్రాల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోతున్నారు. నగదు కొరత కారణంగా ఏటీఎంలలో సొమ్ము పెట్టడం లేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.



చర్చిసెంటర్‌లో పనిచేయని ఏటీఎం కేంద్రం

పాఠశాల అభివృద్ధికి దాత సాయం

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: పిఠాపురం పట్టణంలోని ఏకేపీఎం పాఠశాలకు పట్టణంలోని రామకృష్ణ మెడికల్ ట్రేడర్స్ అధినేత కేదారిశెట్టి రామారావు రూ.14వేలు విలువైన ప్రింటర్, స్కానర్‌ను బహూకరించారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సెలీనా సపర్లకు ఆయన అందజేశారు. పాఠశాల అభివృద్ధికి మరింత సాయం చేస్తానని దాత రామారావు తెలిపారు.

నేడు

పట్టణంలో జన్మభూమి సభలు

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: పిఠాపురం పట్టణంలోని 18, 19 వార్డుల్లో గురువారం ఉదయం, మధ్యాహ్నం 2గంటల నుంచి 3,4 వార్డుల్లో జన్మభూమి గ్రామసభలు జరుగుతాయని, కమిషనర్ తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం పట్టణం, న్యూస్‌టుడే: కాకినాడ క్రీడామైదానంలో గురువారం రెజ్లింగ్ సబ్‌జూనియర్ స్త్రీ, పురుషుల విభాగంలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఆసక్తిగలవారు వివరాలకు 99890 01162 నంబరులో సంప్రదించాలని కోరారు.

రామాలయంలో విశేషపూజలు

పిఠాపురం పట్టణం: పిఠాపురం పట్టణంలోని పుల్లయ్యకాలువ వీధిలోనున్న కోదండ రామాలయంలో గురువారం ఉదయం ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విజయజనార్దనాచార్యులు తెలిపారు.

పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

కరప, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు పోలవరం ప్రాజెక్టు ఒక జీవధార, కలల ప్రాజెక్టును పూర్తి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, పోలవరం త్వరగా పూర్తయ్యేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందని పీసీసీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. కరపలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు పబ్బినీడి కృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 7 నుంచి ప్రారంభించే పాదయాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు నాలుగు దశాబ్దాల నుంచి కలగానే మిగిలిపోయిందని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ ప్రాజెక్టును విస్మరించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. తెదేపా, భాజపాలు పూర్తి చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును తెదేపా ముఖ్యపెట్టడంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉందని, ఇప్పుడు కేంద్రం సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వరకు పాదయాత్ర, 10న బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయి పూలె జయంతి

తాటిపర్తి (గొల్లప్రోలు), న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయిపూలె జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కడప జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్యమురళి విచ్చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తాటిపర్తి ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 12 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గ్రూప్-1 ఆఫీసర్ అయిన చైతన్యమురళి తన పిల్లలిద్దరినీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆదర్శనీయంగా నిలిచారని హెచ్ఎం సత్యనారాయణ కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచి చల్లా సత్యనారాయణమూర్తి, యూటీఎఫ్ గొల్లప్రోలు మండల గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, ప్రత్తిపాడు మండల కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

✦ గొల్లప్రోలులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సావిత్రి బాయిపూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.



తాటిపర్తి వేడుకల్లో మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ డీసీ చైతన్యమురళి

✦ మూలపేట(కొత్తపల్లి): కొత్తపల్లి మండలంలోని మూలపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో సర్పంచి సత్యవతి, జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు దుర్గాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ పిఠాపురం పట్టణం: పిఠాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీలో ఐద్వా అధ్యక్షురాలు కుంచే మణి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. బాలికలను విద్యావంతులను చేసేందుకు సావిత్రిబాయి ఎంతో కృషిచేశారని, పురుషులతో సమానంగా నేడు మహిళలు పొందుతున్న అవకాశాలు ఆమెవల్లే వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు దడాల నాగ వెంకటలక్ష్మి, సూర్యకుమారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

రౌతులపూడి, న్యూస్‌టుడే: శంఖవరం గ్రామంలో పిచ్చికుక్క దాడిలో పలువురు గాయాల పాలయ్యారు. బుధవారం సాయంత్రం వైష్ణవమాన్యం కాలనీలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి గ్రామానికి చెందిన కృష్ణ, అశ్విక, బాలు, వీరలక్ష్మి తదితరులపై దాడిచేసి గాయపరిచింది. బాధితులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందారు. పది మందికి పైగా ఈ కుక్క దాడిలో గాయపడినట్టు స్థానికులు చెబుతున్నారు.

చలనచిత్రాలు **ఏలేశ్వరం: వెంకటసూర్య** - ఎం.సి.ఎ., **జయశ్రీ** - 2 కంట్రీస్, **రౌతులపూడి - మహాలక్ష్మి** - ఎం.సి.ఎ., **కత్తిపూడి - శ్రీసత్యనారాయణ** - హలో, తుని: **వీర్రాజు** - 2 కంట్రీస్, **శ్రీనివాసా** - ఎం.సి.ఎ., పాయకరావు పేట: **గౌతమ్** - 2 కంట్రీస్, **సాయిమహల్** - హలో, **సూర్యమహల్** - ఒక్క క్షణం, **ఎస్వీసీ శ్రీలక్ష్మి** - ఎంసీఏ, కాకరాపల్లి: **శ్రీలక్ష్మి** - ఎం.సి.ఎ.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే



తూర్పులక్ష్మీపురంలో రేషన్‌కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

రౌతులపూడి, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. శంఖవరం మండలం కత్తిపూడి, వజ్రకూటం గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో ఎం.శ్రీను ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తిపూడిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుబ్బారావు, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త పర్వత రాజుబాబు, ఎంపీపీ బద్దిమణి, జడ్పీటీసీ సభ్యురాలు బచ్చులగంగ, ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అర్హులందరికీ పింఛన్లు, రుణాలు, రేషనుకార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. పేదలకు సొంత గృహాలు ఉండాలనే ఉద్దేశంతో గృహనిర్మాణ పథకం ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో సీసీరహదారులు, మురుగునీటి కాలువలు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పెద్దమొత్తంలో నిధులు విడుదల చేస్తున్నామన్నారు. అనంతరం రేషనుకార్డులు, వెలుగు ఆధ్వర్యంలోని ఉపకారవేతనాలు, చంద్రన్న సంక్రాంతి కానుకలను స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సాల్మన్‌రాజు, కీర్తిసుభాస్, వెన్నాశివ, వుల్లివీరభద్రరావు, గౌతునాగు, దొరబాబు, ఏఎంసీ ఛైర్మన్ కన్నబాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి ఎం.జ్యోతి, జన్మభూమి ప్రత్యేకాధికారి గోపీకుమార్, తహసీల్దారు సుజాత తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి మండలంలో...

రౌతులపూడి మండలంలోని రాజవరం, ఎం.కొత్తూరు గ్రామాల్లో పంచాయతీ విస్తరణాధికారి కిశోర్, తహసీల్దారు సావిత్రి ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, జడ్పీటీసీ సభ్యుడు సత్తిబాబు, జన్మభూమి ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని జన్మభూమి-మాఊరు సందేశాన్ని ప్రజలకు విన్పించారు. చంద్రన్న కానుకలు, బీమాపత్రాలు, ఉపకారవేతనాలు, రేషనుకార్డులు అందించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సర్పంచులు లక్ష్మి, నూకరత్నం, ఎంపీటీసీ అప్పతల్లి, పల్లి సూరిబాబు, రాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా పాలనలోనే అన్నివర్గాలకు మేలు

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో బుధవారం సర్పంచి గంగిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జన్మభూమి గ్రామసభ జరిగింది. ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ తెదేపా పాలనలోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు జన్మభూమి చక్కని వేదిక అన్నారు. ఈ సభలో పలువురికి రేషన్‌కార్డులను అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, ఎంపీటీసీ సభ్యురాలు రాఘవ, గ్రామ నాయకుడు నైనాలశెట్టి బాబ్జీ, సీడీవో జ్యోతి, ఎంపీడీవో రత్నకుమారి, తహసీల్దారు లక్ష్మీకల్యాణి, ఈవోపీఆర్డీ ద్విభాష్యం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు సూచించారు. మండలంలోని ఏలూరులో సర్పంచి రొంగల యమున అధ్యక్షతన బుధవారం జరిగిన జన్మభూమి గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీడీవో జ్యోతి, ఎంపీపీ బత్తుల లోవకుమారి, ఏఎంసీ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, మండల తెదేపా అధ్యక్షుడు గొంతిన సురేష్, తహసీల్దారు నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వెంకటాచలం, మాజీ సర్పంచి రొంగల సత్యనారాయణ, తెదేపా సీనియర్ నేత సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. చినశంకర్లపూడిలో సర్పంచి అమలావతి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్, ఆరోగ్యసిబ్బంది వైద్యశిబిరాలను నిర్వహించారు.

అర్హులందరికీ లబ్ధి

ఏలేశ్వరం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని ఏలేశ్వరం నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ కొప్పాడ పార్వతి, వైస్ ఛైర్మన్ పైల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 2, 10, 12, 13 వార్డులకు సంబంధించి బుధవారం జన్మభూమి - మాఊరు సభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగతానికి భిన్నంగా పారదర్శకమైన పాలనను తెదేపా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు సతివాడ కల్యాణసుందరి, సామంతుల సూర్యకుమార్, భజంతుల మణి అధ్యక్షతన జరిగిన సభల్లో 22 మందికి రేషన్ కార్డులను అందజేశారు. కోనేటి బడి ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కమిషనర్ ఎం.ఏసుబాబు, తెదేపా నాయకులు సుంకర రాంబాబు, సతివాడ రాజు, బూర్లె సత్తిబాబు, అధికారులు మేరావత్ ముని, రాంజీ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ పార్వతి

సమస్యను సచిత్రంగా పంపండి

మీ చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే...
మీ ప్రాంతాన్ని సతాయించే సమస్యను చిత్రంగా బంధించి ఈ దిగువ ఇచ్చిన వాట్సాప్ నెంబరుకు పంపండి. అధికారుల దృష్టికి 'ఈనాడు' ఈ సమస్యను తీసుకెళ్తుంది. మీరు పంపే సమస్య వ్యక్తిగతం కాకూడదు. ఫొటో దిగువన సమస్యకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా ప్రస్తావించాలి. నియోజకవర్గంలోని ఏ గ్రామం వారైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చు.

వాట్సాప్ నంబరు: 80085 65588



విద్యుత్తు వృథా

సమస్య : శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలో విద్యుత్తు వృథా అవుతోంది. ప్రధాన రహదారి వెంబడి ఉన్న వీధిదీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. పంచాయతీ సిబ్బంది స్పందించి విద్యుత్తు వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

- విజయ్, నెల్లిపూడి

సమాధానం : విద్యుత్తు వృథాను అరికట్టేందుకు చర్యలు చేపడతాం.

- అనంతలక్ష్మి, సర్పంచి, నెల్లిపూడి



ప్రమాదకరంగా వంతెన

సమస్య : రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామంలో వంతెన ప్రమాదకరంగా ఉంది. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు చెందుతున్నాం. అంతేకాకుండా రహదారి కూడా గోతులమయంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం

- శ్రీధర్, బంగారయ్యపేట

సమాధానం: రహదారి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. వంతెన అభివృద్ధికి సంబంధించి ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

- మణికుమార్, ర.భ.శాఖ, జేఈ

పింఛన్ల పంపిణీలో చేతివాటం

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరులో పింఛను బట్వాడా చేస్తున్న సిబ్బంది తమను రూ.50ల చొప్పున మామూళ్లు అడిగినట్లు కొందరు వృద్ధులు బుధవారం విలేకరులకు తెలిపారు. కొందరి వద్ద మామూళ్లు వసూలు చేసినట్లు చెబుతున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటాచలంను వివరణ కోరగా విచారణ జరిపిస్తామన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏ ఒక్క రూపాయి కోత పడకుండా పింఛను సొమ్ములు లబ్ధిదారులకు అందేలా చూస్తామన్నారు.

ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పరిశీలన

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని యర్రవరంలో ఉన్న శ్రీసూర్య జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కేవీవీ సత్యనారాయణకు, ప్రిన్సిపల్ టి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియం.. లాభదాయకం

కోటనందూరు, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక లాభాలు పొందవచ్చని శిక్షణ పాలనాధికారి ఆనంద్ అన్నారు. మండలంలోని ఇండుగపల్లిలో బుధవారం పర్యటించారు. స్థానిక మహిళలు సేంద్రియ ఎరువులతో ఆయన సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రసాయన ఎరువుల వినియోగంతో పంటలు ప్రజారోగ్యం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయడం వల్ల ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన వారవుతారని అభిప్రాయపడ్డారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు న్యూట్రీగార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికోసం ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందిస్తున్నట్లు వివరించారు. రైతులు పశువుల పేడతో పాటు జీవామృతం తయారుచేసి వాడటం వల్ల నేల సారవంతమవుతుందన్నారు. గాదెరాము, డీపీఎం అన్నపూర్ణ, ప్రాంతీయ సమన్వయకర్త హేమంత్, ఏపీఎం సూర్యకుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



పోషకాహార పంటలను పరిశీలిస్తున్న శిక్షణ పాలనాధికారి ఆనంద్

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మహిళాభ్యుదయానికి పాటుపడిన సావిత్రిబాయిపూలే ఆదర్శప్రాయురాలని మినర్వా విద్యాసంస్థల అధినేత డి.వి.ఎస్.రమేష్ అన్నారు. విద్యాసంస్థలో ఆమె జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రౌతులపూడి: శంఖవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి, ఏపీ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులంతా పని చేయాలన్నారు. తొలుత పాఠశాల సిబ్బంది పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు

విద్యార్థులకు క్రీడాపోటీలు

అన్నవరం, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని దేవస్థానం ఉన్నతపాఠశాల, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అల్లాడ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ గిరి తదితరులు పాల్గొన్నారు.



కొళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు



ఏలేశ్వరం వాసులకు తప్పని పందుల బెడద



మురుగు కాలువ వద్దే పేరుకుపోయిన చెత్త

సమస్యలు పరిష్కారమయ్యేనా?

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పట్టణవాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని 20 వార్డుల్లోనూ పారిశుద్ధ్యం, రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఆయా సమస్యలపై జన్మభూమి సభలో అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమంలోనైనా వాటికి పరిష్కారం లభిస్తుందని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

తాగునీటి ఇక్కట్లు

పట్టణంలోని ఏఎంజీ విద్యాసంస్థ పరిసర ప్రాంతాలు, లింగవరం కాలనీ, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో కొళాయిలకు మూతలు(ట్యాప్‌లు) లేవు. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. నీటి వృథా కారణంగా ట్యాంకులు త్వరగా ఖాళీ అవుతుండటంతో చాలామందికి పూర్తిస్థాయిలో నీరు అందడంలేదు. విద్యుత్తు సరఫరా సక్రమంగా లేని సమయాల్లో తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పట్టణంలోని పలు చేతి పంపులు చెడిపోయి దీర్ఘకాలమైనా మరమ్మతులకు నోచుకోవడంలేదని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని చేతి పంపులను వెంటనే బాగు చేయించి, కొళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పందుల బెడద

ఏలేశ్వరంలో పందుల బెడద పెద్ద సమస్యగా మారింది. జనావాసాలకు దూరంగా ఉండాల్సిన పందులు ఇళ్ల మధ్యే సంచరిస్తున్నాయి. పందుల సమస్య నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పందులను పట్టణానికి దూరంగా తరలించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే

పలు ప్రాంతాల్లో చెత్తను మురుగు కాలువ సమీపానే వేస్తున్నారు. దీంతో మురుగునీరు ముందుకు ప్రవహించక ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమల సమస్య పెరిగింది. దోమల నివారణ మందు పిచికారీ చేయడంలేదు. మురుగు కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించాలని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు చేపడతాం

జన్మభూమి - మాఊరు సభల్లో ప్రజల నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం. ప్రజలు కూడా పారిశుద్ధ్య సమస్యలు లేని పట్టణంగా ఏలేశ్వరాన్ని తీర్చిదిద్దేందుకు సహకరించాలి.

- ప్రసాద్, పారిశుద్ధ్య తనిఖీ అధికారి, ఏలేశ్వరం

నియోజకవర్గంలో నేడు

ఏలేశ్వరం: ఏలేశ్వరం పట్టణంలోని పల్లపు వీధి రామాలయం వద్ద గురువారం 8, 9 వార్డులకు సంబంధించిన జన్మభూమి సభలు జరుగుతాయి.

✦ ఏలేశ్వరం గ్రామీణ మండలంలోని సి.రాయవరం, సిరిపురం గ్రామాల్లో జన్మభూమి - మాఊరు గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు.

రౌతులపూడి: శంఖవరం మండలం శంఖవరం, ఎస్.జగ్గంపేట, రౌతులపూడి మండలం ములగపూడి, బలరాంపురం గ్రామాల్లో గురువారం జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.శ్రీను తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు.

'ఆరోగ్యం-ఆనందం'పై అవగాహన

రౌతులపూడి, న్యూస్‌టుడే : మండల గ్రామాల్లోని పాఠశాలల్లో జన్మభూమి-మాఊరులో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య సిబ్బంది 'ఆరోగ్యం-ఆనందం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అంశమై పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



లచ్చిరెడ్డిపాలెంలో ఆటల పోటీల ప్రారంభోత్సవంలో ఉపాధ్యాయులు, నాయకులు

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

అన్నవరం, న్యూస్‌టుడే: వాసవీ, వాసవీవనితా క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. వాసవీక్లబ్ అధ్యక్షుడిగా బొలిశెట్టి రమేష్, కార్యదర్శిగా జోన్నాడ రాజేష్, కోశాధికారిగా బోనగిరి శ్రీనివాస్‌లు, వనితాక్లబ్ అధ్యక్షురాలిగా నేతిమమ్మదేవి, కార్యదర్శిగా గ్రంధి అనురాధ, కోశాధికారిగా ఉద్దగిరి వరలక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ ద్వారా సేవాకార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ సి.వి.వి.ఎస్.ఎన్. మూర్తి, వెలగా వెంకట నగేష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్సలకు వెళ్తున్న వారితో తెదేపా నాయకులు పర్వత సురేష్, కన్నబాబు తదితరులు

ప్రత్తిపాడులో నేత్ర వైద్యసేవలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో ఎమ్మెల్యే, డీసీసీబీ ఛైర్మన్ వరుపుల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన గౌతమీ నేత్రాలయ వైద్యబృందం 486 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వీరిలో 24 మందిని గౌతమీనేత్రాలయలో శస్త్రచికిత్స చేయించేందుకు తరలించారు. 397 మందికి వారం రోజుల్లో కళ్లజోళ్లు సమకూరుస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతినెలా 2, 3 తేదీల్లో నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే, డీసీసీబీ ఛైర్మన్‌లు వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శిబిరం నిర్వహణ కమిటీ ప్రతినిధి యాళ్ల జగదీష్, దొంగబాబు, తెదేపా మండల అధ్యక్షుడు గొంతిన సురేష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సర్పంచి విశ్వేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, తెదేపా అధికార ప్రతినిధి పర్వత సురేష్, పార్టీ నాయకులు శెట్టిసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: విపణిలో లభించే నకిలీ సరకులపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం వినియోగదారుల హక్కుల వేదిక కార్యదర్శి వి.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. మండలంలోని రాజుపేట శ్రీప్రకాష్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. గ్రామీణ సీఐ చెన్నకేశవరావు మాట్లాడుతూ.. సైబర్ క్రైంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోరారు. జిల్లా ఆహార తనిఖీ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రోజువారీ వినియోగించే వంట సరకుల్లో నకిలీలను గుర్తించామని, కొనుగోలుదారులు జాగ్రత్త ఉండాలన్నారు. కళాశాల ప్రధానాచార్యులు రవికుమార్, బ్యాంకు విశ్రాంతి మేనేజర్ కె.అప్పారావు, ఎన్ఎస్ఎస్ శిబిరం అధికారి శ్రీనివాస్, అధ్యాపకుడు బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

కోటనందూరు, న్యూస్‌టుడే: స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని శిక్షణ పాలనాధికారి ఆనంద్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం వెలుగు అధికారులు, జీడిమామిడి ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్వయం ఉపాధి పథకాలను వెలుగు అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తదుపరి జీడిమామిడి ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించారు. డీపీఎంలు శ్రీనివాస్, అన్నపూర్ణ, స్త్రీనిధి మేనేజర్ సుశీ, వెలుగు ప్రతినిధులు హేమంత్, సూర్యకుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లోవలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న చిత్రం



ప్రత్తిపాడు కూడలిలో దిష్టిబొమ్మ దహనం ...

కోరెగావ్ ఘటనపై నిరసన

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు బుధవారం ఆందోళన నిర్వహించారు. మహారాష్ట్రలో జరిగిన హింసను నిరసిస్తూ పట్టణంలోని బాలాజీచౌక్ కూడలిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శాంతియుతంగా బీమా కోరెగావ్ ఘటనను స్మరించుకునేందుకు సిద్ధమైన దళితులపై సంఘ విద్రోహ శక్తులు విరుచుకుపడటం శోచనీయమని సీపీఐ(ఎంఎల్) నాయకులు ఏగుపాటి అర్జునరావు, మసకపల్లి ధనబాబు అన్నారు. శాంతి, భద్రతలను పరిరక్షించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారు. ఇకనైనా ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని కోరెగావ్‌లో జరిగిన ఘటనను నిరసిస్తూ సి.పి.ఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో బుధవారం ఆందోళన నిర్వహించారు. హింసను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మలను ప్రత్తిపాడు మూడు రోడ్ల కూడలిలో దహనం చేశారు. ప్రజాపోరాటాలు, కార్యక్రమాలను అణగదొక్కడంతోపాటు దళితులపై ప్రభుత్వ వైఖరి ఏమాత్రం సమర్థనీయంగా లేదని లిబరేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు మానుకొండ లత్సబాబు, రేచుకట్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న శ్రీశైలం

అన్నవరం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ జాతీయ అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ సత్యదేవుని బుధవారం దర్శించుకుని పూజలాచరించినట్టు ఆ పార్టీ నాయకుడు పలివెల సతీష్ తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు పలివెల సూరిబాబు, రాజాల చిట్టిబాబు తదితరులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం గ్రామంలో ఆయన పార్టీ నాయకులను కలిసి పలు విషయాలపై చర్చించినట్టు తెలిపారు.



స్వామివారి దర్శనానికి వచ్చిన తెదేపా ఎస్సీసెల్ జాతీయ అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు

రాజమహేంద్రవరం గ్రామీణం

చలనచిత్రాలు **కుమారి:** ఎంసీఏ, **అనుశ్రీ సినిమాస్:** ఒక్కక్షణం, **రంభ:** 2కంట్రీస్, **ఊర్వశి:** మళ్లీరావా, **మేనక:** జుమాంజి, **స్వామి:** హలో, **అశోక:** ఎంసీఏ, **గీతాఅప్సర:** ఎంసీఏ, **శివజ్యోతి:** 2కంట్రీస్, **నాగదేవి:** జవాన్, **సూర్యాప్యాలెస్:** ఒక్కక్షణం, **సూర్యమినీ:** జుమాంజీ, **రాజా:** ఎంసీఏ, **వీఎస్‌మహల్:** ఎంసీఏ. కడియం: **విజయ:** ఒక్క క్షణం, **వెంకట సూర్య:** ఎంసీఏ, ధవళేశ్వరం: **మురళీకృష్ణ:** 2కంట్రీస్

నిన్నటి రైతుబజారు ధరలు

దానవాయిపేట: టయోటా 10, తెల్లవంకాయలు 16, నల్లవి 16, గులాబీవి 16, దొమ్మేరువి 26, బెండకాయలు 23, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 26, బీరకాయలు 35, క్యాబేజి 15, క్యారెట్ 32 నుంచి 40, దొండకాయలు 24, బంగాళదుంపలు 10, ఉల్లిపాయలు 34 నుంచి 38, గోరుచిక్కుళ్లు 26, చిక్కుళ్లు 26, బీట్‌రూట్ 25, అల్లం 34.

ఆర్టీసీ రిజర్వేషన్ వివరాలు



దానవాయిపేట: జిల్లా మీదుగా బెంగళూరు, హైదరాబాదుకు వెళ్లే బస్సుల్లో రిజర్వేషన్ చేసుకోవడానికి సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆర్టీసీ జిల్లా చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్, అడ్వాన్స్ టిక్కెట్ బుకింగ్, సంబంధిత రిజర్వేషన్ కౌంటర్లలో టిక్కెట్లు తీసుకోవచ్చని సూచించారు.

రూటు	4వ తేదీ	5వ తేదీ	6వ తేదీ	7వ తేదీ
బెంగళూరు ఏసీ	47	78	81	95
హైదరాబాద్ ఏసీ	204	249	246	282
హైదరాబాద్‌నాన్‌ఏసీ	870	928	931	946

క్రైం రిపోర్టు

బంగారు గొలుసు చోరీ

ప్రభుత్వ పథకంలో డబ్బులు ఇప్పిస్తానని నమ్మబలికి బంగారు గొలుసును లాక్కుని పరారైన సంఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్నీసుపేటకు చెందిన చట్ల లక్ష్మి ఇంటికి ఈనెల ఒకటిన అపరిచిత వ్యక్తి వచ్చి ప్రభుత్వం తరపున మీ కుమారుడికి చంద్రన్న పథకం కింద రూ.లక్ష బ్యాంకులో వేసే విధంగా తాను సహకరిస్తానని ఆధార్ కార్డు జిరాక్స్ అడిగి తీసుకున్నాడు. కొద్దిసమయం తరువాత మరలా వచ్చి బ్యాంకు వద్ద ఫొటో దిగాలని చెప్పి ఆమెను ఇన్నీసుపేట ఆంధ్రాబ్యాంకు వద్దకు తీసుకెళ్లాడు. ఫొటో తీస్తానని చెప్పి మెడలో బంగారు గొలుసు తీసేయమన్నాడు. ఇదే అదనుగా గొలుసును లాక్కుని పారిపోయాడు. రెండు కాసుల గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వాసుపత్రి ఎదుట బస్టాప్‌లో గుర్తుతెలియని (40) వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఏఎస్సై శాంతి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ద్విచక్ర వాహనం ఢీకొనడంతో యువకుడికి గాయాలైన సంఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నపూర్ణమ్మపేటకు చెందిన యర్రా బ్రహ్మాజీ ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై బైపాస్ రోడ్డులో వెళ్తుండగా డీఎంహెచ్ స్కూలు వద్ద వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బ్రహ్మాజీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

లారీ ఢీకొనడంతో...

లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన దివాన్‌చెరువు గామన్‌వంతెన వద్ద చోటుచేసుకుంది. పెద్దాపురానికి చెందిన అడబాల సత్యనారాయణ రాజమహేంద్రవరానికి వచ్చి బుధవారం ఉదయం 7 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. అతడిని గామన్ వంతెన కూడలి వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

–న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నేరవార్తలు

గ్రామాల్లో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే

కాతేరు(క్వారీ సెంటర్), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ మండలం కాతేరు గ్రామంలో అయిదో విడత జన్మభూమి కార్యక్రమం దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. అనంతరం మండల విద్యాశాఖ అధికారి కె.నరసింహారెడ్డి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. గంగిన వీర హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి ఎ.రామసాయి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి అనంత శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఇదివరకే చాలావరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మిగతా పనుల కోసం రూ.5.38 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని, కాతేరులో తాగునీరు ప్రధాన సమస్య కావడంతో ట్యాంకర్లు పంపిస్తున్నామని, పూర్తి స్థాయిలో రూ.20 కోట్లతో కాతేరు, కొంతమూరు, వెంకటనగరం పంచాయతీలకు తాగునీరందించేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయని వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ ఆలోచన మేరకు ఇంటింటికీ పైపులైను ద్వారా నీరందిస్తామని చెప్పారు. లంక భూముల సమస్యను పరిష్కరించాలని, అధికారులు కాలయాపనతోనే గడుపుతున్నారని దళితులు ఎమ్మెల్యేకు విన్నవించారు. మీ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు ఉపకారవేతనాలు, గ్రామస్థులకు మంజూరైన పింఛన్లు, రేషన్ కార్డులు,చంద్రన్న బీమా చెక్కులు, సంక్రాంతి కానుకలను ప్రజలకు అందజేశారు. అనంతరం తహసీల్దారు కె.పోసియ్య మాట్లాడుతూ ప్రజలంతా ఏ శాఖకు సంబంధించిన సేవలనైనా మీ సేవ ద్వారా వినియోగించుకోవచ్చునని, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి కాలాన్ని, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. మీ సేవల్లో అధిక మొత్తంలో రుసుము కట్టించుకుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని, ప్రతి శాఖకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజలంతా దరఖాస్తులు అక్కడే ఇచ్చి రసీదు పొందాలని చెప్పారు. అనంతరం విద్య, వైద్యం, వ్యవసాయ, జలవనరులు, గృహనిర్మాణ, పశువైద్యం,రెవెన్యూ, వెలుగు డీఆర్‌డీఏ,ఐసీడీఎస్,ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ అధికారులు ఈ మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సేవల గురించి ప్రసంగించారు. ఈ సమావేశంలో మండల తెదేపా అధ్యక్షుడు మార్ని వాసుదేవరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సుబ్బారావు, గృహనిర్మాణ శాఖ డీఈ రామ్మోహనరావు, ఈఈ సోములు,వైద్యాధికారి సుధాకర్,పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ వర్మ,గ్రామ కమిటీ అధ్యక్షుడు బిక్కిన సాంబశివరావు,జన్మభూమి కమిటీ సభ్యులు ఎలిపే బాబూరావు,మోతా పాపాయమ్మ,అచ్చుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



వెంకటనగరంలో మాట్లాడుతున్న మండల తెదేపా అధ్యక్షుడు మార్ని వాసుదేవరావు

వెంకటనగరం: గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో అధికారులంతా గత మూడున్నర సంవత్సరాల్లో ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. పశువులకు సకాలంలో వైద్యం అందడం లేదని, తామంతా పశువులపైనే ఆధారపడి బతుకుతున్నందువల్ల అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. కొత్తగా మంజూరైన పింఛన్లు,రేషన్ కార్డులను గ్రామస్థులకు అందజేశారు. మండల తెదేపా అధ్యక్షుడు మార్ని వాసుదేవరావు మాట్లాడుతూ మహిళలంతా స్వయం ఉపాధి పొందేందుకు ముఖ్యమంత్రి బ్యాంకు రుణ సదుపాయం కల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.స్టీఫెన్, జన్మభూమి కమిటీ సభ్యుడు ఏ.శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శ్యామల సెంటర్ (కడియం), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి 'జన్మభూమి-మాఊరు' గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జేగురుపాడు సర్పంచి రావూరి నాగమణి సూచించారు. మండలంలోని జేగురుపాడు గ్రామంలో బుధవారం ఉదయం జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ అధికారులు, నాయకులు నేరుగా ప్రజలవద్దకు వచ్చి వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నారన్నారు. మండల ప్రత్యేక అధికారి కాశీ విశ్వనాథ్ చౌదరి మాట్లాడుతూ రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలకు అర్హులైన వారు జన్మభూమి గ్రామసభలో దరఖాస్తు చేసుకుని రసీదు పొందాలని చెప్పారు. ఎంపీపీ మార్గాని లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటింటా గ్యాస్‌కనెక్షన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విద్యార్థినులకు సైకిళ్లు, వ్యవసాయానికి రాయితీపై ట్రాక్టర్లు అందించారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులు, పింఛన్లు, బాలికా సంరక్షణ బాండ్లు, చంద్రన్న బీమా బాండ్లు, చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్ధిదారులకు అందజేశారు. ఉపాధిహామీ ఏపీవో మణికుమారి పనిముట్లు, గునపాలు, పారలు అందజేశారు. ఈ గ్రామసభల్లో ఉపసర్పంచి గారపాటి అమరనాథ్, తుర్లపాటి చిట్టిపాప, నాగిరెడ్డి వీరశివాజీ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మాధవరాయుడుపాలెంలో సర్పంచి గొల్లపల్లి కల్యాణి అధ్యక్షతన జరిగిన జన్మభూమి సభలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎంపీడీవో కె.రత్నకుమారి మాట్లాడుతూ ప్రజాసాధికార సర్వేలో కుటుంబ వివరాలు నమోదైన వారికి మాత్రమే కొత్తపింఛన్లు వర్తిస్తాయని తెలిపారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పాలపర్తి రోజా, ఎంపీపీ మార్గాని లక్ష్మి, ఉపాధ్యక్షుడు నాని, తహసీల్దారు కె.రాజ్యలక్ష్మి, ఎంఈవో వి.లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ మార్గాని లక్ష్మి

ఉత్సాహంగా క్రీడా పోటీలు

మోరంపూడి, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని పాఠశాలల్లో ఆటల పోటీలు రెండోరోజూ బుధవారం ఉత్సాహంగా సాగాయి. శాటిలైట్‌సిటీలోని జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. హుకుంపేటలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో సరస్వతి విద్యానికేతన్, హుకుంపేట జడ్పీ పాఠశాల విద్యార్థినులకు కబడ్డీ పోటీలు జరిగాయి. కబడ్డీలో సరస్వతీ విద్యానికేతన్, వాలీబాల్ పోటీలో హుకుంపేట జడ్పీ పాఠశాల, ఖోఖో పోటీల్లో కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు గెలుపొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు.

బొమ్మూరు: అయిదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యువతకు కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని రాజవోలు, బొమ్మూరులలోని క్రీడా మైదానాల్లో ఈ పోటీలు నిర్వహించామని రాజవోలు ప్రధానోపాధ్యాయుడు పి.సుజాత, వై. నాగేశ్వరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువకులకు పాఠశాలల్లోని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గ్రామసభలో బహుమతులిస్తారని పేర్కొన్నారు. క్రీడలాడటం వల్ల చురుకుదనంతోపాటు, విద్యనభ్యసించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పోటీల్లో బొమ్మూరు యువత, ఏఎంజీ, సోషల్‌వెల్ఫేర్, గిరిజన పాఠశాల,జీపీఆర్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



హుకుంపేటలో కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

సమస్యను సచిత్రంగా పంపండి

మీ చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే...
మీ ప్రాంతాన్ని సతాయించే సమస్యను చిత్రంగా బంధించి ఈ దిగువ ఇచ్చిన వాట్సప్ నంబరుకు పంపండి. అధికారుల దృష్టికి 'ఈనాడు' ఈ సమస్యను తీసుకెళ్తుంది. మీరు పంపే సమస్య వ్యక్తిగతం కాకూడదు. ఫొటో దిగువన సమస్యకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా ప్రస్తావించాలి. నియోజకవర్గంలోని ఏ గ్రామం వారైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చు.

వాట్సప్ నంబర్లు:
ధవళేశ్వరం: 79950 67051
బొమ్మూరు: 79950 67054

రాజమహేంద్రవరం గ్రామీణం



బొమ్మూరులో చౌకదుకాణం వద్ద బారులు తీరిన జనం

సరకుల కోసం పడిగాపులు

బొమ్మూరు, న్యూస్‌టుడే: చౌకదుకాణాల కొరత వల్ల గంటల తరబడి నిత్యావసర సరకుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. పాతబొమ్మూరులో ఉన్న 19వ చౌకదుకాణంపై కేసు నమోదు చేయడంతో మూసివేశారు. దాంతో ఆ ప్రాంతంలో నివసించే తెల కార్డుదారులు సరకులు తీసుకునేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. పోర్టబులిటీ సౌకర్యం ఉండటం వల్ల పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న 18వ నంబరు చౌకదుకాణంలో సరకులు తీసుకుంటున్నారు. ఆ ప్రాంతవాసులు అధిక సంఖ్యలో రావడంతో 19వ నంబరు చౌకదుకాణం ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడు గంటలు వేచి ఉంటున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి క్యూలో ఉంటున్నారు. ఈ సమస్యపై తహసీల్దారు పోసియ్య వివరణ ఇస్తూ వచ్చే నెల్లో కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు సబ్‌కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాస్త ఇబ్బందులు ఉన్నప్పటికీ ఫిబ్రవరి నుంచి ఈ సమస్య తలెత్తదని ఆయన చెప్పారు.



గ్రామపెద్దలతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీలో వీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ సాయికాంత్ వర్మ

సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ధవళేశ్వరం, (రాజమహేంద్రవరం నగరం): జన్మభూమి-మాఊరుపై ముఖ్యమంత్రి సందేశం ప్రత్యక్ష ప్రసారాన్ని టెలివిజన్‌లో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ సాయికాంత్ వర్మ ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామస్థులతో కలిసి వీక్షించారు. జన్మభూమి కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా ఆయన ఆకస్మికంగా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు 2014 నుంచి అసంపూర్తిగా వదిలేసిన ఊర కాలువల సమస్యను సబ్‌కలెక్టరు దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ ఆవరణలోని ఖాళీ స్థలంలో మరిన్ని కూరగాయలు, ఆకుకూర మొక్కలు పండించాలని కార్యదర్శి ఎ.వి.వి.రమణకు సూచించారు. జన్మభూమి కమిటీ సభ్యులు ఆళ్ల ఆనందరావు, పుక్కెళ్ల సత్తిబాబు, శీలంశెట్టి శ్రీనివాసరావు, యర్రమోతు ధర్మరాజు, కట్టాశ్రీనివాసు, బర్రిసుబ్బారావు తదితరులతోపాటు అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తొర్రేడు (క్వారీసెంటర్): తొర్రేడులో మంగళవారం జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమానికి వచ్చిన సబ్ కలెక్టరు సాయికాంత్ వర్మ గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటాన్ని గమనించారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి స్టీఫెన్‌కు సూచించారు. తిరిగి ఇక్కడి పరిస్థితిని గమనించేందుకు బుధవారం ఉదయం 5 గంటలకు తొర్రేడుకు ఆయన వచ్చారు. ఇంకా అలానే ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. పారిశుద్ధ్యం ఇలానే ఉంటే క్షమించేది లేదన్నారు. కాతేరులో కూడా ఇలా ఉండటంతో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ వర్మకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని అధికారులు శ్రద్ధతో పనిచేయాలన్నారు.

ఇందిరాకాలనీలో ప్రేమ విందు

ధవళేశ్వరం (రాజమహేంద్రవరం నగరం), న్యూస్‌టుడే: ధవళేశ్వరంలోని ఇందిరాకాలనీ క్రైస్ట్‌యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం ప్రేమవిందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయులకు ఆదర్శం

బొమ్మూరు, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే పట్టుదలను విద్యార్థులు అలవాటు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపల్ జయప్రకాశరావు సూచించారు. బుధవారం బొమ్మూరు డైట్‌లో ఆమె జయంతి వేడుకలను జరిపారు. తొలుత ప్రిన్సిపల్ జ్యోతివెలిగించి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యావ్యాప్తికి ఎనలేని కృషిచేసిన సావిత్రిబాయి సేవలను ప్రతి ఉపాధ్యాయురాలు గుర్తుచేసుకోవాలన్నారు. అధ్యాపకులు రాముడు,దుర్గ మాట్లాడుతూ మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచి తొలి ఉపాధ్యాయినిగా మనదేశానికి సేవలందించిన ఆమె అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి కష్టాన్ని ఒకసాధనగా మలిచి చదువుకుని జాతి గర్వించేలా తయారుకావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు విద్య అవసరమని, ఆ రోజుల్లో గుర్తించి ఆమె శ్రమించడం వల్లే నేడు మహిళలు వివిధ శాఖల్లో ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుడు నానాజీ కూడా మాట్లాడారు. అనంతరం పాఠశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులను సన్మానించారు.



బొమ్మూరు జీపీఆర్ పాఠశాల్లో ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



డైట్‌లో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ జయప్రకాశరావు

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

ఆనందనగర్, న్యూస్‌టుడే: చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆల్‌ఇండియా గ్రానైట్ క్రూసిబుల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాకా దొరబాబు, మేయరు పంతం రజనీశేషసాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2016 జూన్ నెల తరువాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం అంకుర పరిశ్రమలను ప్రోత్సహిస్తోందన్నారు. కొత్త పారిశ్రామిక వేత్తలకు అందిస్తున్న సహాయం, సింగిల్ డెస్క్ విధానం, 21 రోజుల్లో అనుమతులు, రాయితీలు, విధివిధానాలను వివరించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం ద్వారా నిరుద్యోగ యువతకు అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. పరిశ్రమల శాఖ ఉపసంచాలకుడు పాకా దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ఆన్‌లైన్ సింగిల్ విండో విధానాలు, పటిష్టమైన మౌలిక వ్యవస్థ, ప్రాధాన్య రంగాలు, రాష్ట్రంలో వ్యాపార అనుకూల వాతావరణాన్ని బలోపేతం చేసే చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, ఏపీఐఐసీ డీజెడ్‌ఎం లక్ష్మీ ఆండాలమ్మ, ఏపీ ఎస్‌ఎఫ్‌సీ సీనియర్ బ్రాంచి మేనేజరు విశ్వనాథం, ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ రెడ్డి, శివాజీ, ఏబీఐఆర్‌డీ డైరెక్టర్ శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు

ఎమ్మార్పీఎస్ ఉపవాస దీక్షలు

కాతేరు(క్వారీసెంటర్): ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో మంద కృష్ణమాదిగ చేపట్టిన ఉపవాస దీక్షకు మద్దతుగా కాతేరు పంచాయతీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంటులో ఆమోదింపజేయాలని వారన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. అనంతరం వినతి పత్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అందజేశారు. ఈ దీక్షల్లో కొల్లి గణేష్, టి.సతీష్ పాల్గొన్నారు.

6న జన్మభూమి - మాఊరు గ్రామసభ

ధవళేశ్వరం (రాజమహేంద్రవరం నగరం): ధవళేశ్వరం గ్రామంలో జన్మభూమి-మాఊరు గ్రామసభను ఈనెల 6వతేదీ ఉదయం 9.30గంటలకు ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఏవీవీ. రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొనాలని కోరారు.

వైకాపా పల్లెనిద్ర

హుకుంపేట(మోరంపూడి): వైకాపా నేత గిరిజాల వీర్రాజు(బాబు) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి హుకుంపేట డి' బ్లాకు లో 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించి రచ్చబండ కార్యక్రమం చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్లు బాగాలేవని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోటిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పంతం సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్, సీసీసీ ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. దానవాయిపేటలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, రాజ్యలక్ష్మి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో ఈ వేడుకలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో హాజరై ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యం, ర్యాంప్ వాక్‌లు ఆకట్టుకున్నాయి. సీసీసీ ఎండీ పంతం కొండలరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.



కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలలో ర్యాంప్ వాక్ చేస్తున్న విద్యార్థినులు

7న 5కె రన్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 7న రాజమహేంద్రవరంలో 5కె రన్ నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. స్థానిక అటానమస్ కళాశాల నుంచి ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభమవుతుందన్నారు. దీనిపై బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, వైద్య, క్రీడలు, విద్యాశాఖల అధికారులతో మాట్లాడారు. 2 వేల మంది ఈ రన్‌లో పాల్గొంటారని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అవసరమైన చోట్ల ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రన్‌లో పాల్గొనే వారికి మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కళా వెంకట్రావు, ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, ఆర్థికశాఖ మంత్రి యనమల, కలెక్టర్ కార్తికేయమిశ్రా ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

రాజమహేంద్రవరం నగరం

చలనచిత్రాలు కుమారి: ఎంసీఏ, **అనుశ్రీ సినిమాస్:** ఒక్కక్షణం, **రంభ:** 2 కంట్రీస్, **ఊర్వశి:** మళ్లీరావా, **మేనక:** జుమాంజి, **స్వామి:** హలో, **అశోక:** ఎంసీఏ, **గీతాఅప్సర:** ఎంసీఏ, **శివజ్యోతి:** 2 కంట్రీస్, **నాగదేవి:** జవాన్, **సూర్యాప్యాలెస్:** ఒక్కక్షణం, **సూర్యమినీ:** జుమాంజి, **రాజా:** ఎంసీఏ, **వీఎస్‌మహల్:** ఎంసీఏ.

నిన్నటి రైతుబజారు ధరలు

దానవాయిపేట: టమోటా 10, తెల్లవంకాయలు 16, నల్లవి 16, గులాబీవి 16, దొమ్మేరువి 26, బెండకాయలు 23, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 26, బీరకాయలు 35, క్యాబేజీ 15, క్యారెట్ 32 నుంచి 40, దొండకాయలు 24, బంగాళదుంపలు 10, ఉల్లిపాయలు 34 నుంచి 38, గోరుచిక్కుళ్లు 26, చిక్కుళ్లు 26, బీట్‌రూట్ 25, అల్లం 34.

ఆర్టీసీ రిజర్వేషన్ వివరాలు



దానవాయిపేట: జిల్లా మీదుగా బెంగళూరు, హైదరాబాదుకు వెళ్లే బస్సుల్లో రిజర్వేషన్ చేసుకోవడానికి సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆర్టీసీ జిల్లా చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆర్‌వీఎస్. నాగేశ్వరరావు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్, అడ్వాన్స్ టిక్కెట్ బుకింగ్, సంబంధిత రిజర్వేషన్ కౌంటర్లలో టిక్కెట్లు తీసుకోవచ్చని సూచించారు.

రూటు	4వ తేదీ	5వ తేదీ	6వ తేదీ	7వ తేదీ
బెంగళూరు ఏసీ	47	78	81	95
హైదరాబాద్ ఏసీ	204	249	246	282
హైదరాబాద్ నాన్‌ఏసీ	870	928	931	946

బంగారు గొలుసు చోరీ

క్రైం రిపోర్టు

ప్రభుత్వ పథకంలో డబ్బులు ఇప్పిస్తానని నమ్మబలికి బంగారు గొలుసును లాక్కుని పరారైన సంఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్నీసుపేటకు చెందిన చల్లా లక్ష్మి ఇంటికి ఈనెల ఒకటిన అపరిచిత వ్యక్తి వచ్చి ప్రభుత్వం తరపున మీ కుమారుడికి చంద్రన్న పథకం కింద రూ.లక్ష బ్యాంకులో వేసే విధంగా తాను సహకరిస్తానని ఆధార్ కార్డు జిరాక్స్ అడిగి తీసుకున్నాడు. కొద్దిసమయం తరువాత మరలా వచ్చి బ్యాంకు వద్ద ఫొటో దిగాలని చెప్పి ఆమెను ఇన్నీసుపేట ఆంధ్రాబ్యాంకు వద్దకు తీసుకెళ్లాడు. ఫొటో తీస్తానని చెప్పి మెడలో బంగారు గొలుసు తీసేయమన్నాడు. ఇదే అదనుగా గొలుసును లాక్కుని పారిపోయాడు. రెండు కాసుల గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వాసుపత్రి ఎదుట బస్టాప్‌లో గుర్తుతెలియని (40) వ్యక్తి మృతిచెందిఉండటాన్ని స్థానికులు గమనించారు. ఏఎస్సై శాంతి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ద్విచక్ర వాహనం ఢీకొనడంతో యువకుడికి గాయాలైన సంఘటనపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నపూర్ణమ్మపేటకు చెందిన యర్రా బ్రహ్మాజీ ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై బైపాస్ రోడ్డులో వెళ్తుండగా డీఎం హెచ్ స్కూలు వద్ద వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బ్రహ్మాజీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

లారీ ఢీకొనడంతో...

లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన దివాన్‌చెరువు గామన్‌వంతెన వద్ద చోటుచేసుకుంది. పెద్దాపురానికి చెందిన అడబాల సత్యనారాయణ రాజమహేంద్రవరానికి వచ్చి బుధవారం ఉదయం 7 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. అతడిని గామన్ వంతెన కూడలి వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

-న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నేరవార్తలు

కొనసాగుతున్న దీక్షలు

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం దీక్షా శిబిరంలో గాంధీ, భాగ్యరాజ్, వైరాల రమేష్, రత్నకిషోర్, ఉప్పాడ అప్పారావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి తెదేపా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక 9, 11, 12, 13, 14, 15, 22వ డివిజన్లలో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ పంతం రజనీశేషసాయి, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ, అర్బన్ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, కమిషనర్ విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకపక్క రాజధాని నిర్మాణం, మరోపక్క సంక్షేమ పథకాలకు ఆటంకం లేకుండా సమర్థమంతమైన పాలనను ముఖ్యమంత్రి అందిస్తున్నారన్నారు. అనంతరం కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. జన్మభూమి వేదికపై ఆయా డివిజన్లలో సమస్యలపై ప్రజలు విన్నవించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, గృహాల కోసం పలువురు దరఖాస్తులు అందజేశారు. 14వ డివిజన్‌లో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కోసూరి చండీప్రియ, గగ్గర సత్యనారాయణ, గొర్రెల సురేష్, పాలిక శ్రీను, ఈతకోటి బాపన సుధారాణి, తంగేటి వెంకటలక్ష్మి, మాటూరి రంగారావుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణరావు, ఉప కమిషనర్ ఫణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించండి

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ: నగర పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మేయర్ పంతం రజనీశేషసాయి పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఫస్ట్ రివర్ యూనిట్‌లో మేయర్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేకంగా రూపొందించిన దుస్తులను మేయర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తంగెళ్ల బాబీ, వైద్యులు మోహన్‌వంశీ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పండ్లు తదితరాలు అందిస్తున్న మేయర్

7న 5కె రన్

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: జన్మభూమి మా- ఊరు కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 7న రాజమహేంద్రవరంలో 5కె రన్ నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. స్థానిక ఆటానమస్ కళాశాల నుంచి ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభమవుతుందన్నారు. దీనిపై బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, వైద్య, క్రీడలు, విద్యాశాఖల అధికారులతో మాట్లాడారు. 2 వేల మంది ఈ రన్‌లో పాల్గొంటారని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అవసరమైన చోట్ల ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రన్‌లో పాల్గొనే వారికి మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కళా వెంకట్రావు, ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, ఆర్థికశాఖ మంత్రి యనమల, కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.



సోమసుందరరావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

ఆనందనగర్, న్యూస్‌టుడే: చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆల్ ఇండియా గ్రానైట్ క్రూసిబుల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సును నిర్వహించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాకా దొరబాబు, మేయరు పంతం రజనీశేషసాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2016 జూన్ నెల తరువాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం అంకుర పరిశ్రమలను ప్రోత్సహిస్తోందన్నారు. కొత్త పారిశ్రామిక వేత్తలకు అందిస్తున్న సహాయం, సింగిల్ డెస్క్ విధానం, 21 రోజుల్లో అనుమతులు, రాయితీలు, వివిధవిధానాలను వివరించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం ద్వారా నిరుద్యోగ యువతకు అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. పరిశ్రమల శాఖ ఉపసంచాలకుడు పాకా దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ఆన్‌లైన్ సింగిల్ విండో విధానాలు, పటిష్టమైన మౌలిక వ్యవస్థ, ప్రాధాన్య రంగాలు, రాష్ట్రంలో వ్యాపార అనుకూల వాతావరణాన్ని బలోపేతం చేసే చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, ఏపీఐఐసీ డీజెడ్ఎం లక్ష్మీ ఆండాలమ్మ, ఏపీ ఎస్ఎఫ్‌సీ సీనియర్ బ్రాంచి మేనేజరు విశ్వనాథం, ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ రెడ్డి, శివాజీ, ఏబీఐఆర్‌డీ డైరెక్టర్ శుభదాస్ పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ

'ఉద్యోగుల సహకారం మరువలేనిది'

దానవాయిపేట: సహ ఉద్యోగుల సహకారం మరువలేనిదని ప్రాజెక్టు పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.సోమసుందరరావు (శ్యామ్) పేర్కొన్నారు. బుధవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా రాజమహేంద్రరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న పంచాయతీరాజ్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సోమసుందరరావు, రమా దంపతులను ఆ శాఖ ఉన్నతాధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చిరంజీవి మాట్లాడుతూ విధి నిర్వహణలో శ్యామ్ అంకితభావంతో పనిచేసేవారన్నారు. ఉద్యోగులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు జి.సత్యనారాయణ, వి.విద్యాసాగర్, డీఈవో నందిక మహలక్ష్మీకుమార్, డీఈలు ఎన్.నారాయణరెడ్డి, భాస్కరకుమార్, రమేష్, సూర్యనారాయణ, వై.సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలని వి.టి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సానబోయిన రామారావు అన్నారు. బుధవారం ఉదయం ఇన్నీస్‌పేటలోని వీటీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ ఆనాటి సాంఘిక పరిస్థితులను ఎదిరించి ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి అందించిన సేవలు అమూల్యమైనవన్నారు. అనంతరం వీటీ పాఠశాలలో పది మంది ఉపాధ్యాయినులను సత్కరించారు.

✦ జనవరి 3వ తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని మూల్‌నివాసీ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి నయనాల కృష్ణారావు అన్నారు. గణేష్‌చౌక్‌లోని బాలికల వసతి గృహంలో సావిత్రిబాయి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.కోమలి మాట్లాడుతూ విద్యార్థినులు సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేకును కోసి విద్యార్థినులకు పంచారు. ఈ కార్యక్రమంలో బుద్ధ రాము, మార్గాని చంటిబాబు, కొంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీసాల గోవిందరావు, పి.శ్రీను, నల్లా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేవీచౌక్: బీఎస్ఎన్ఎల్ మహిళా ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు ఇ.వి.లక్ష్మీభవానీ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అనంతరం కస్తూరిబా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు ఎ.వి.కృష్ణారావు, ఇ.ఎల్.నారాయణ, ఏజీఎంలు సి.హెచ్.సుబ్బారావు, సి.హెచ్.శివభాస్కర్, జి.శారదాదేవి, బి.అవంతి తదితరులు పాల్గొన్నారు.



వీటీ పాఠశాలలో ఉపాధ్యాయినులకు సత్కారం

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి హారిక అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం బీసీ బాలికల వసతి గృహంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతలక్ష్మి, వెంకటలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం నగరం



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన గాజులను పరిశీలిస్తున్న వినియోగదారులు

లేపాక్షి హస్తకళల ప్రదర్శన ప్రారంభం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: స్థానిక దానవాయిపేటలోని తితిదే కల్యాణ మండపంలో లేపాక్షి హస్తకళల ప్రదర్శనను బుధవారం ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈనెల 13వ తేదీ వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. గృహోపకరణాలు, కలంకారీ, ఏటికొప్పాక బొమ్మలు, కోల్‌కతా, బొబ్బిలి హేండ్‌లూమ్ చీరలు, యువతులకు ఇమిటేషన్ జ్యూయలరీ, జూట్ బ్యాగ్స్ ప్రదర్శనలో ఉంటారు.



కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలలో ర్యాంప్ వాక్ చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పంతం సత్యనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్, సీసీసీ ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. దానవాయిపేటలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, రాజ్యలక్ష్మి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో ఈ వేడుకలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో హాజరై ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యం, ర్యాంప్ వాక్‌లు ఆకట్టుకున్నాయి. సీసీసీ ఎండీ పంతం కొండలరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

ఆనంద్‌నగర్, న్యూస్‌టుడే: పేదల వైద్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌కిషోర్ సూచించారు. జన్మభూమి- మావూరు కార్యక్రమంలో భాగంగా స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం వద్ద ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు మత్తు పానియాలకు దూరంగా ఉండాలన్నారు. వీటివల్ల అనేక అనర్థాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవలు, 102 ఉచిత కాల్ సెంటరు, ఆసుపత్రి పరికరాలు నిర్వహణ, తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్, చంద్రన్న సంచార చికిత్స, ఉచిత డయాలసిస్ సేవలు, ఆరోగ్యరక్ష, జనని సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృత్వ యోజన, పల్స్‌పోలియో కార్యక్రమాలపై వివరించారు. ఈ సదస్సులో డాక్టర్ కోమలి, లక్ష్మీపతి, ఆశవర్కర్లు, ఎ.ఎన్.ఎమ్‌లు, హెల్త్‌విజిటర్లు నర్సింగ్ విద్యార్థులు, ఫార్మశీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు చూడాలి... పరిష్కారం చూపాలి



మురుగు వీడదు

సమస్య: లాలాచెరువు వద్ద స్వరూప్‌నగర్‌లో సరైన మురుగు కాలువల వ్యవస్థ లేదు. ఇళ్ల నుంచి వాడకం నీరు పోయేందుకు ఆస్కారం కనిపించడం లేదు. ఎక్కడికక్కడే మురుగు నిలిచిపోతోంది. దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇబ్బంది పడుతున్నాం. అధికారులు తమ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.
–పంపినవారు: ఆనంద్, స్థానికుడు

బాబోయ్ కుక్కలు

సమస్య: రామాలయం కూడలి వద్ద నుంచి జె.ఎన్.రోడ్డుకు వెళ్లే మార్గంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రిళ్లు అవి వాహనదారులపై దాడులకు దిగుతున్నాయి. అటుగా వెళ్లాలంటే భయపడుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటి సంతతి నివారణకు అధికారులు చొరవ చూపాలి. సమస్యను పరిష్కరించాలి. –పంపినవారు: శ్రీధర్, స్థానికుడు



పేరుకుపోతున్న చెత్త

సమస్య: స్థానిక నెహ్రూనగర్ నగరపాలక సంస్థ పాఠశాల వెనుక రోడ్డులో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం లేదు. రెండు రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది రాలేదు. అధికమొత్తంలో చెత్త తిష్ఠ వేసింది. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి. రోజూ సిబ్బంది వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలి.



–పంపినవారు: విగ్నేష్, స్థానికుడు

పందులు... ఇబ్బందులు

సమస్య: మల్లయ్యపేటలోని పలు వీధుల్లో పందులు అధికమయ్యాయి. ఈ ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చెత్తలో ఇవి చేరి చిందరవందర చేస్తున్నాయి. అధికారులు వీటి విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలి.
–పంపినవారు: సురేష్, స్థానికుడు



వాట్సాప్ నంబర్లు:
80086 22144
79950 67051

మీ ప్రాంతంలో మురుగునీరు సక్రమంగా పారడం లేదా.. అపరిశుభ్రత ఎక్కువగా ఉందా.. తాగునీటి ఇబ్బందులు పడుతున్నారా.. ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారా.. రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయా.. తదితర సమస్యలపై మీరూ స్పందించండి. అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్య ఫొటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపించడమే.. –న్యూస్‌టుడే, దానవాయిపేట

సమాధానం: వెంటనే సిబ్బందిని పంపి రోడ్లపై చెత్తను శుభ్రం చేయిస్తాం. కుక్కలు, పందుల విషయంలో తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. వెంటనే వీటిని పరిష్కరిస్తాం.
–డాక్టర్ ఎం.వి.ఆర్.మూర్తి, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ

ఇందిరాకాలనీలో ప్రేమ విందు

ధవళేశ్వరం (రాజమహేంద్రవరం నగరం), న్యూస్‌టుడే: ధవళేశ్వరంలోని ఇందిరాకాలనీ క్రైస్ట్‌యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం ప్రేమవిందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా పోటీలు

మోరంపూడి, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని పాఠశాలల్లో ఆటల పోటీలు రెండోరోజూ ఉత్సాహంగా సాగాయి. శాటిలైట్‌సిటీలోని జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. హుకుంపేటలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో సరస్వతి విద్యానికేతన్, హుకుంపేట జడ్పీ పాఠశాల విద్యార్థినులకు కబడ్డీ పోటీలు జరిగాయి. కబడ్డీలో సరస్వతి విద్యానికేతన్, వాలీబాల్ పోటీలో హుకుంపేట జడ్పీ పాఠశాల, ఖోఖో పోటీల్లో కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు గెలుపొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు.



హుకుంపేటలో కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

బొమ్మూరు: అయిదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యువతకు కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని రాజవోలు, బొమ్మూరులలోని క్రీడా మైదానాల్లో ఈ పోటీలు నిర్వహించామని రాజవోలు ప్రధానోపాధ్యాయుడు పి.సుజాత, వై.నాగేశ్వరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువకులకు పాఠశాలల్లోని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గ్రామసభలో బహుమతులిస్తారని పేర్కొన్నారు. క్రీడలాడటం వల్ల చురుకుదనంతోపాటు, విద్యనభ్యసించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

6న సాంస్కృతిక ప్రదర్శనలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: స్థానిక ఆనం కళాకేంద్రంలో ఈనెల 6వ తేదీ సాయంత్రం అలయన్స్ క్లబ్ సహేలి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ బృందంచే సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని క్లబ్ ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికాలో తాన్‌సేన్, త్యాగరాజస్వామి సంస్థల ద్వారా కూచిపూడి, సంగీతం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తూ ఏటా దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో క్లబ్ ప్రతినిధులు టి.ఎస్.ఎన్.రెడ్డి, కొయ్యాన కుమారి, సీతా మాడభూషి, సుధామణి, మాధవి, కె.బుచ్చిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ధవళేశ్వరం, (రాజమహేంద్రవరం నగరం): జన్మభూమి-మాఊరుపై ముఖ్యమంత్రి సందేశం ప్రత్యక్ష ప్రసారాన్ని టెలివిజన్‌లో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ సాయి కాంత్‌వర్మ ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామస్థులతో కలిసి వీక్షించారు. జన్మభూమి కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా ఆయన ఆకస్మికంగా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు 2014 నుంచి అసంపూర్తిగా వదిలేసిన ఊర కాలువల సమస్యను సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఆవరణలోని ఖాళీ స్థలంలో మరిన్ని కూరగాయలు, ఆకుకూర మొక్కలు పండించాలని కార్యదర్శి ఎ.వి.వి.రమణకు సూచించారు. జన్మభూమి కమిటీ సభ్యులు ఆళ్ల ఆనందరావు, పుక్కెళ్ల సత్తిబాబు, శీలంశెట్టి శ్రీనివాసరావు, యర్రమోతు ధర్మరాజు, కట్టాశ్రీనివాసు, బర్రిసుబ్బారావు తదితరులతోపాటు అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

తొర్రేడు (క్వారీసెంటర్): తొర్రేడులో మంగళవారం జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమానికి వచ్చిన సబ్ కలెక్టరు సాయికాంత్ వర్మ గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటాన్ని గమనించారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి స్టీఫెన్‌కు సూచించారు. తిరిగి ఇక్కడి పరిస్థితిని గమనించేందుకు బుధవారం ఉదయం 5 గంటలకు తొర్రేడుకు ఆయన వచ్చారు. ఇంకా అలానే ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. పారిశుద్ధ్యం ఇలానే ఉంటే క్షమించేది లేదన్నారు.

తుని

చలనచిత్రాలు తుని: **వీర్రాజు** - 2 కంట్రీస్, **శ్రీనివాసా** - ఎంసీఏ, పాయకరావుపేట: **గౌతమ్** - 2 కంట్రీస్, **సాయిమహల్** - హలో, **సూర్యమహల్** - ఒక్క క్షణం, **ఎస్వీసీ శ్రీలక్ష్మి** - ఎంసీఏ, కాకరాపల్లి: **శ్రీలక్ష్మి** - ఎంసీఏ.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

తుని, న్యూస్‌టుడే: స్థానిక కొట్టాం ప్రాంత సమీపంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణమందిరంలో బుధవారం మృత్యుంజయ హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ధనుర్మాస పూజల్లో భాగంగా రోజూ ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న జిల్లా స్కౌట్ విభాగం కార్యదర్శి కృష్ణమూర్తి

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజ సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని జిల్లా స్కౌట్ కార్యదర్శి నిల్లు కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని హంసవరం ఆదర్శ పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి స్కౌట్ విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకుసాగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణ, స్కౌట్ పాఠ్యాంశాలు, సమాజ సేవ తదితర అంశాలపై శిక్షణనిస్తున్నట్లు వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాణాప్రతాప్‌సింగ్, స్కౌట్ శిబిర అధికారి డి.ఎల్.నారాయణ, అదనపు శిబిర లీడర్లు సాంబశివారెడ్డి, జగదీశ్, అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించండి

తుని, న్యూస్‌టుడే: చిన్నారులకు రోజూ పౌష్టికాహారం అందేలా చూడాలని పురపాలక సంఘ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎనిమిదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. తక్కువ బరువున్న పిల్లల గురించి ఆరా తీశారు. నలుగురు వివిధ కారణాలతో తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించారు. వారికి సరైన పౌష్టికాహారం అందించాలని రూ.3 వేలు ఆర్థికసాయం చేశారు. సీడీపీవో జె.అమ్మాజీ మాట్లాడుతూ.. పట్టణంలో 24 మంది పిల్లలు తక్కువ బరువుతో ఉన్నట్లు చెప్పారు. వీరికి రోజూ ప్రభుత్వం తరఫున గుడ్డు, పాలు ఇతర ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో మరింత బలవర్థక ఆహారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. నాయకులు ఏనుగుల నారాయణరావు, శిల్పారశెట్టి మోహన్, చొప్పా సత్యనారాయణ, పాలిక శ్రీనివాసరావు, అల్లు రాజు, సాపిరెడ్డి రాంబాబు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే జన్మభూమి లక్ష్యం

తుని, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పురపాలక సంఘ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని సీతారామపురం రామాలయ ఆవరణలో బుధవారం 5, 6, 10 వార్డులు, అమ్మాజీపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 7, 8, 9 వార్డుల జన్మభూమి సభలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను దశలవారీగా పరిష్కరిస్తామని హామీఇచ్చారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. పార్టీలకతీతంగా పురపాలక సంఘాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వివిధ అంశాలపై అర్జీలు సమర్పించారు. ప్రత్యేక అధికారి డాక్టర్ ఎన్.సుబ్బారావు, కమిషనర్ ఎ.వెంకట్రావు, డీటీ షరీఫ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు మర్రా సత్యవతి, సాపిరెడ్డి దేవి, చొప్పా అనురాధ, అల్లు సత్య, మంతెన రాజు, రేలంగి విజయ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి

తుని గ్రామీణం: ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు పోల్నాటి శేషగిరిరావు అన్నారు. మండలంలోని వల్లూరు, తాళ్లూరు, కొలిమేరు గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగ పాఠం సారాంశాన్ని చదివి వినిపించారు. రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకుంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. చంద్రన్న బీమా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తాండవ షుగర్స్ ఛైర్మన్ సుర్ల లోవరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్నివర్గాల ప్రగతికి కృషి చేస్తోందన్నారు. నాయకులు జువ్వల వెంకటలక్ష్మి, చోడిశెట్టి త్రిమూర్తిస్వామి, గాది వరహాలబాబు, నడిగట్ల సూరిబాబు, చొక్కా రామారావు వంగలపూడి బుజ్జి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలి

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలని, ఇందుకోసం అధికారులు కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. మండలంలోని టీజేనగరం, బొద్దవరం, అల్లిపూడి గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు జరిగాయి. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను జన్మభూమిలో అధికారుల దృష్టికి తీసుకొస్తే.. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

తొండంగి: ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తుని మార్కెట్‌యార్డు అధ్యక్షుడు యనమల కృష్ణుడు అన్నారు. మండలంలోని జీఎంపేట, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లిలో బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే అధికార యంత్రాంగమే గ్రామాల్లో పర్యటిస్తోందని చెప్పారు. గ్రామీణులు తమ ఇబ్బందులను అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నూతన లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఉపకార వేతనాలు, చంద్రన్న కానుకలు అందించారు. విద్యార్థుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తహసీల్దారు అప్పారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో భమేశ్వర్, మండల వ్యవసాయాధికారి అరుణ్‌కుమార్, వైద్యాధికారులు రవికుమార్, నాగభూషణం, పశువైద్యాధికారులు శ్యాంకుమార్, రెడ్డి, నాయకులు మడదా చిట్టిబాబు, తాటిపర్తి శ్రీను, యడ్ల బేతాళుడు, తారకేశ్వరరావు, హైమావతి, కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తుని: జన్మభూమిలో మాట్లాడుతున్న పురపాలక అధ్యక్షుడు సత్యనారాయణ



తొండంగి: జీఎంపేటలో మాట్లాడుతున్న కృష్ణుడు



తుని గ్రామీణం: గ్రామసభలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



కోటనందూరు: సభలో ప్రసంగిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న మాలమహానాడు నాయకులు

కేంద్రానిది రెండునాలుకల ధోరణి

తొండంగి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి అవలంబిస్తోందని రాష్ట్ర మాలమహానాడు ప్రధాన కార్యదర్శి తంతటి కిరణ్‌కుమార్ విమర్శించారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టొద్దని డిమాండ్ చేస్తూ.. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఒంటెత్తు వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. దేశంలోని దళితులను విభజించేందుకు మోదీ సర్కారు యత్నిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కేంద్రం అడుగులు వేస్తోందన్నారు. దళితుల అభివృద్ధికి కృషి చేయాలే తప్ప వారి మధ్య చిచ్చుపెట్టడం సరికాదని హితవు పలికారు. నాయకులు పెయ్యల సూర్యారావు, శివకోటి ప్రకాష్, పిల్లి బాబ్జి, వడ్డి సత్తిబాబు, మడికి సోమరాజు, మాసా రాందాసు, సారిక నానిబాబు, బూర్తి విక్టర్, బోడపాటి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివి

తుని, న్యూస్‌టుడే: దేశ తొలి మహిళా ఉపాధ్యాయినిగా బాలికా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే ఎనలేని కృషిచేశారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక యూటీఎఫ్ హోంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా హక్కుల పరిరక్షణ, బాలికా విద్య, సామాజిక దురాచారాలపై ఆమె చేసిన పోరాటాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఉపాధ్యాయులు జి.అమ్మతల్లి, పి.కృష్ణవేణి, జి.ధనలక్ష్మి, కమలప్రియ, వై.ధనలక్ష్మి, జి.సత్యనారాయణ, బి.రామకృష్ణ, జి.అప్పలనాయుడు, భారతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

కోటనందూరు: సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంఈవో ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగవాక ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయిని మధులతను సత్కరించారు.

నర్సిపేట ఉపాధ్యాయుల నివాళి

తొండంగి: మండలంలోని నర్సిపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె సేవలను యూటీఎఫ్ జిల్లా డైరెక్టర్ టి. సత్తిబాబు కొనియాడారు. ఉపాధ్యాయులు లోవరాజు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



తుని.. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయినులు

పిల్లల చదువుతోనే దేశ ప్రగతి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లలందరూ వందశాతం చదవడం ద్వారా దేశ ప్రగతి సాధ్యమని జడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని హెచ్.కొత్తూరులో నూతనంగా నిర్మించిన అదనపు వసతి గృహాన్ని బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వలస కార్మికుల పిల్లలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక వసతిగృహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలాభివృద్ధి కమిటీ ఛైర్మన్ పి.శేషగిరిరావు, తెదేపా జిల్లా కార్యదర్శి త్రిమూర్తిస్వామి, పార్టీ మండలాధ్యక్షుడు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



హెచ్.కొత్తూరులో వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

తుని

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోటనందూరు, న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'ఆరోగ్యం- ఆనందం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, పోషకాహారం తదితర విషయాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజేతలకు జన్మభూమి చివర్లో బహుమతులు ప్రదానం చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

కోటనందూరు: స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని శిక్షణ పాలనాధికారి ఆనంద్ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం వెలుగు అధికారులు, జీడిమామిడి ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్వయం ఉపాధి పథకాలను వెలుగు అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తదుపరి జీడిమామిడి ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులలో ముఖాముఖి నిర్వహించారు. డీపీఎంలు శ్రీనివాస్, అన్నపూర్ణ, స్త్రీనిధి మేనేజర్ సుశీల, వెలుగు ప్రతినిధులు హేమంత్, సూర్యకుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లోవలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

బెండపూడి.. తీరనున్న నీటి ఎద్దడి

రూ.అయిదు కోట్లు మంజూరు ✦ చురుగ్గా తాగునీటి పథకం పనులు ✦ మే నెలాఖరుకి పథకం పూర్తి

న్యూస్‌టుడే, తొండంగి

మండలంలోని బెండపూడి పంచాయతీ ప్రజల దాహార్తి ఎట్టకేలకు తీరనుంది. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. వేసవిలోనూ పంచాయతీ ప్రజలకు సమృద్ధిగా నీరందించే ఉద్దేశంతో నిర్మిస్తున్న సమగ్ర తాగునీటి సరఫరా పథకం(సీపీడబ్ల్యూఎస్) పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మే నెలాఖరుకు పనులు పూర్తిచేస్తామని అధికారులు ఉద్ఘాటిస్తున్నారు.

ఏడాదంతా ఇక్కట్లే

ఏడాది పొడవునా బెండపూడి గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. గుక్కెడు నీటికి బోరుబావులను ఆశ్రయించాల్సిందే. ఇక్కడంతా రాతినేల కావడంతో.. నీటిజాడ కనిపించేది కాదు. వందల అడుగుల బోర్లు తవ్వినా.. మట్టి తప్ప నీరు కరవే. పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తూ వచ్చారు. పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగకపోవడంతో.. గ్రామస్థులు శివారు ప్రాంతంలోని బావి వద్దకెళ్లి నీరు తెచ్చుకునేవారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అధికారులు పలుదఫాలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో గతేడాది బెండపూడిలో జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పాల్గొనగా.. సర్పంచి సాధనాల వీర్రాఘవ తాగునీటి సమస్యను యనమల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇటీవల సమగ్ర తాగునీటి సరఫరా పథకానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారు.


తమ్మయ్యపేటలో నిర్మిస్తున్న సమగ్ర తాగునీటి సరఫరా పథకం

శాశ్వత పరిష్కారం

పంచాయతీలో తమ్మయ్యపేట, తారకరామారావుకాలనీ, బెండపూడి గ్రామాలున్నాయి. తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మే నెలాఖరుకు పనులు పూర్తి చేసి తాగునీటిని విడుదల చేస్తాం.

-అప్పలరాజు, జేఈ, గ్రామీణ నీటిసరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్)

అందరికీ తాగునీరు



ఏళ్ల తరబడి పంచాయతీ వాసులు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. విషయాన్ని గతేడాది ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయితే తాగునీటి ఇబ్బంది తీరుతుంది.

-సాధనాల నూకరాజు, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్, బెండపూడి

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: విపణిలో లభించే నకిలీ సరకులపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం వినియోగదారుల హక్కుల వేదిక కార్యదర్శి వి.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. మండలంలోని రాజుపేట శ్రీప్రకాష్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. గ్రామీణ సీఐ చెన్నకేశవరావు మాట్లాడుతూ.. సైబర్ క్రైంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోరారు. జిల్లా ఆహార తనిఖీ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రోజువారీ వినియోగించే వంట సరకుల్లో నకిలీలను గుర్తించామని, కొనుగోలుదారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కళాశాల ప్రధానాచార్యులు రవికుమార్, బ్యాంకు విశ్రాంత మేనేజర్ కె.అప్పారావు, ఎన్ఎస్ఎస్ శిబిరం అధికారి శ్రీనివాస్, అధ్యాపకుడు బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వడివడిగా.. వసతులు సమకూరగా..!

తొండంగి, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాలకు వడివడిగా మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి. మనబడి బృందం ఆధ్వర్యంలో ఇప్పటికే హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాసామగ్రి, గ్రంథాలయం, తాగునీటి సౌకర్యాలు ఒనగూరాయి. ఈ క్రమంలోనే బుధవారం క్రికెట్ పిచ్ ఏర్పాటు చేయగా.. ప్రధానోపాధ్యాయుడు నారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిదశ నుంచే సేవా గుణం అలవర్చుకోవాలని సూచించారు. దాలినాయుడు, శ్రీనివాస్, నాగమోహనరావు, శ్రీనివాసరావు, బృంద సభ్యులు పాల్గొన్నారు.

సారా విక్రయాలపై ఉక్కుపాదం

తొండంగి, న్యూస్‌టుడే: మండలంలోని కోదాడలో నాటుసారా విక్రయాలపై గ్రామస్థులు ఉక్కుపాదం మోపారు. బుధవారం రాత్రి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని తగలబెట్టారు. అబ్కారీ అధికారులను సమాచారం కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సేంద్రియం.. లాభదాయకం

శిక్షణ పాలనాధికారి ఆనంద్

కోటనందూరు, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక లాభాలు పొందవచ్చని శిక్షణ పాలనాధికారి ఆనంద్ అన్నారు. మండలంలోని ఇండుగపల్లిలో బుధవారం పర్యటించారు. స్థానిక మహిళలు సేంద్రియ ఎరువులతో సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రసాయన ఎరువుల వినియోగంతో పంటలు, ప్రజారోగ్యం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయడం వల్ల ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన వారవుతారని అభిప్రాయపడ్డారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు న్యూట్రీగార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికోసం ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందిస్తున్నట్లు వివరించారు. రైతులు పశువుల పేడతో పాటు జీవామృతం తయారుచేసి వాడటం వల్ల నేల సారవంతమవుతుందన్నారు. గాదెరాము, డీపీఎం అన్నపూర్ణ, ప్రాంతీయ సమన్వయకర్త హేమంత్, ఏపీఎం సూర్యకుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


ఇండుగపల్లిలో పోషకాహార పంటలను పరిశీలిస్తున్న శిక్షణ పాలనాధికారి ఆనంద్

తెదేపా నేత కుటుంబానికి ఆర్థికసాయం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హెచ్.కొత్తూరుకు చెందిన తెదేపా కార్యకర్త ఇళ్ల చిన్నబ్బాయి ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, త్రిమూర్తిస్వామి తదితరులు బుధవారం పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. చిన్నబ్బాయి సేవలను గుర్తుచేసుకున్నారు.

సంక్రాంతి సంబరం.. ఆనంద తీరం

వి.కొత్తూరు గురుకులంలో వేడుకలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలంలోని వి.కొత్తూరు బాలయోగి గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం జరిగిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగిమంట చుట్టూ విద్యార్థినులు గొబ్బియలాడారు. హరిదాసు వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ఉపాధ్యాయులు హరిదాసులకు బియ్యం వేశారు. కొందరు విద్యార్థినులు గాలిపటాలు ఎగురవేసి ఉల్లాసంగా గడిపారు. తెలుగు పండుగల్లో సంక్రాంతి ముఖ్యమైందని, దీని ప్రాముఖ్యత తెలిపేందుకు పాఠశాలలో సంబరాలు చేసుకున్నట్లు ప్రధానాచార్యులు ప్రసన్నరాణి తెలిపారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గురుకులం ఉపాధ్యాయినులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణంలో ముగ్గులు వేస్తున్న గురుకుల విద్యార్థినులు


భోగి మంట వద్ద విద్యార్థినుల సందడి

సమస్యను సచిత్రంగా పంపండి

మీ చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే...
మీ ప్రాంతాన్ని సతాయించే సమస్యను చిత్రంగా బంధించి ఈ దిగువ ఇచ్చిన వాట్సప్ నెంబరుకు పంపండి. అధికారుల దృష్టికి 'ఈనాడు' ఈ సమస్యను తీసుకెళ్తుంది. మీరు పంపేసమస్య వ్యక్తిగతం కాకూడదు. ఫొటో దిగువన సమస్యకు సంబంధించిన వివరాలను క్లుప్తంగా ప్రస్తావించాలి. నియోజకవర్గంలోని ఏ గ్రామం వారైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చు.

వాట్సాప్ నంబర్లు:
80085 74231
91000 20946
80085 74209